నాకు తోచినమాట

ఉపన్యాసకులు:

బ్ర॥ వే॥ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు

సంకలనం:

శ్రీ నెమ్మాని సీతారామయ్య, ఎం. ఏ.,

ద్వితీయ ముద్రణ : 1982.

కాపీలు 1000

మూల్యం : రు. 10-00

పబ్లిషర్స్ :
రామకథాఉమృత గ్రంథమాల, చందవోలు
పినపాడు, తెనాలి - 2
గుంటూరు జిల్లా

ప్రతులకు :
కంభంపాటి పురుషోత్తమశర్మ
పినపాడు, తెనాలి - 2

ముద్రణ :
శ్రీ రమణ ప్రింటర్స్, తెనాలి - 1

శ్రీ శివాయ గురవేనమః

ఉ దా హా ర ము

మహాశయులకు విజ్ఞప్తి !

నేను డెబ్బదియాఱేండ్లవాడను. చిన్నప్పటినుండి యభ్యాసమగు కవిత్వ పురాణాది ధోరణుల చాలించి నా నమశ్శివాయ జపముతో కాలముఁ బుచ్చుచున్నాడను. ఇట్లుండ బాపట్ల పటేల్ నగరమునుండి ఒక బ్రహ్మ సంఘము వచ్చి నన్ను రెండు రోజులు బాపట్లలో నుండిపొమ్మని యాహ్వానించిరి. మొదట ఆహ్వానములో గమనాగమన భోజనములు మాత్రమే యిమిడియున్నవి. అచ్చట చేరుసమయమునకు పూర్ణకుంభాదులతో వేద విజ్ఞానుల వేదపాఠాది మేళనములతో నెదుర్కొని స్వాగతాదులతో నొక వసతిలో ప్రవేశపెట్టిరి.

మరునాటినుండి యేదియో చెప్పుమనిరి. పై సందర్భముతో నుప క్రమోపసంహారముగ నుపన్యసించుటకు నలవాటు తప్పియుండుటవలన నాకు తోచినమాట చెప్పెదనంటిని. దానికి వా రంగీకరించి తగినయేర్పాట్లు చేసిరి. ప్రతిదినము ఉపన్యాసమందిరమునకుం బోవువేళకు నా దేవతార్చన సమయమున వేదపారాయణ చేయించుచు, సభకు ముందు కొంత స్వస్తి చెప్పించుచు వేదవిద్యాప్రధానముగ నీ యుపన్యాసములు నడిపించిరి. ఇట్లు ఇరువదియైదు రోజులు జరిగినవి.

అనుకొనకుండ జరిగిన యుపన్యాసములు గాలికి పోకుండ శ్రీ నెమ్మాని సీతారామయ్యగారు, శ్రీ ఇనుపకుతిక వీరరాఘవశాస్త్రిగారు, శ్రీ కోటంరాజు సత్యనారాయణశర్మగారు వ్రాయ మొదలిడిరి. ఆ విధమున గ్రంథస్థము కావలసివచ్చిన ఈ యుపన్యాసములను శ్రీ నెమ్మాని సీతారామయ్యగారు ముగ్గురు వ్రాసిన ప్రతులను ఏకముచేసి హెచ్చుతగ్గుల సవరించి యేకముఖముగ ముద్రణార్హ మొనరించి, అందు తప్పొప్పుల సవరించి యత్యాసక్తితో నేతద్రూపమును సంపాదించిరి.

ప్రతిదినము ఈ పేటలోనివారు గాక, ఊరిలోని వారుకూడ చాల మంది వచ్చి మువ్మాటు తీర్థప్రసాదములఁ బుచ్చుకొనుట, శ్రద్ధగ ఉపన్యాసాదుల వినుటలతో నా హృదయ మానందతుందిల మొనరించిరి. అందరు అట్టివార లగుటచే పేరెత్తి చెప్పుటకును చెప్పకుండుటకును వీలులేకుండ నున్నది. విషయము విశదమగుటకు కొన్నిపేర్లు మాత్రము గ్రహింపవలసి వచ్చెను.

వెనుక చెప్పిన వసతిగృహము శ్రీ జమ్మలమడక వేంకటేశ్వర శర్మగారిది. శ్రీ దుడ్డు దక్షిణామూర్తి శాస్త్రిగారు ప్రతిదినము ఆరోగ్య విషయములో నా పరివారమునకు ఆయుర్వేద వైద్యము చేయుచూవచ్చిరి. దేవతార్చనవద్ద భక్తితో పాటలు పాడుచుండెడివారు. శ్రీ చింతలపాటి మహాదేవశాస్త్రి, మరికొందరు తమ ఆప్తిని వెల్లడించుచు నీ కార్యమున మిక్కిలి పాల్గొనిరి.

ఇఁక నేమియు తోచక ఒకమాట చెప్పుచున్నాను. ఇది యంతయు బ్రహ్మ నిర్మాణము.

నా దౌహిత్రుఁడు చి॥ చెరువు సత్యనారాయణశాస్త్రి పై సంఘము కోరికపై జీవితచరిత్రను వ్రాసియిచ్చినాడు. అదియును నిందు పొందు కూర్చబడినది.

దీనిలో పాల్గొనినవారినెల్ల పరమేశ్వరుఁడు దీర్ఘాయురారోగ్యైశ్వర్య సంపన్నులుగా చేసి, నాకన్న నుత్తములైన పండితోత్తముల వాగ్ధోరణుల నెల్లకాలము వినుచు, విన్నదాని ననుష్ఠించుచు నైహికాముష్మిక సౌఖ్య సంపన్ను లయ్యెదరుగాక ! అని దీవించుచు ఇంతతో ముగించుచున్నాను

దోషజ్ఞులకు వందనములు.

చందోలు, 13—2—72

ఇట్లు,
తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి.

అభివందనము

ఆనాడొక పర్వదినము. ప్రతివారి హృదయము భక్తి తరంగితమై పరవశించిన పవిత్రదినము. అంతియగాదు పునీతమై పులకించిన పుణ్య దినము. ఏ మహాత్ముని రాకకో, వేదగానములతో, పూర్ణకుంభముతో పురజను లెదురేగిన పవిత్ర పర్వదినము!

ఆనాడే బ్రహ్మశ్రీ వేదమూర్తులు తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రి గారు ధర్మపత్నీసమేతులై భావపురికి విచ్చేసిన భవ్యదినము. పార్వతీపర మేశ్వరులే సాక్షాత్కరించినట్లు సంతసించిన నాటిదినము పర్వదినమేగదా!

నేటి మానవలోకమునకు శ్రీ శాస్త్రిగారివంటి మహోదయులు మణిదీపములవంటివారని భావింపవలయును. ఇట్టివారు జూపు వెల్గుబాట లలో పయనించి తమ జీవితముల ధన్యము లొనర్చుకొనుట అత్యం తావశ్యకము.

శ్రీరామకథా౽మృతముచే సాహిత్యపిపాసువుల చిత్తము అలరిం చిన కీ. శే. తాడేపల్లి వేంకటప్పయ్య శాస్త్రిగారి కుమారులు శ్రీ రాఘవ నారాయణశాస్త్రిగారు. వీరు సనాతన ధర్మపరాయణులు, సదాచార సంప న్నులు, తపోనిష్ఠాగరిష్ఠులు, పరమ నైష్ఠికులు, తేజశ్శాలులు, సాహిత్య వేత్తలు, సమస్త శాస్త్రపారంగతులు మీదుమిక్కిలి సహృదయులు.

వీరు భక్తులకోరిక ననుసరించి భావపురి విచ్చేసిరి. ప్రతిదినము "నాకు తోచిన మాట" యని ఉపన్యసించుచు శ్రోతల హృదయముల నుఱ్ఱూతలూగించిరి. ఇక నీ యుపన్యాసము లన్నియు వినుటయేగాక, వీని కొక రూపముదెచ్చుట ఆవశ్యకమని సంకల్పమొకటి జనించినది. తదను గుణముగ వారు ప్రసంగించునపుడు శ్రీ ఇనుపకుతిక వీరరాఘవశాస్త్రిగారు శ్రీ కోటంరాజు సత్యనారాయణ శర్మగారు, నేనును ఆ యుపన్యాసకుసుమ ముల సేకరింప మొదలిడితిమి. పిమ్మట నా యోపినకొలఁది, యివి యన్నియు నొకచోఁజేర్చి, ఒక రూపముదెచ్చి శ్రీ శాస్త్రిగారికి నివేదించి

తిని. వారును భారమనక వ్రాతప్రతిని ఆసాంతము చదివి, అచ్చటచ్చట మార్పులు, చేర్పులు కావించిరి. అంతియగాదు భారతవిషయమును గొంత వారే స్వయముగా వ్రాసియిచ్చిరి. దీనికంతయు మరల నొక శుద్ధప్రతిని తయారుచేయ నిట్టిరూపము ధరించినది.

ఇఁక స్వవిషయము, ఎందఱో వేదాంతతత్త్వవేత్తలగు విద్వాంసు లుండగ నాబోటి యల్పజ్ఞుడు ఇందులకు సాహసించుట హాస్యాస్పదమనక తప్పదు. ఈ విషయములలో నా యనుభవ మత్యల్పము. ఇక వయ స్సన్నచో నందుల కంగీకరింపనిది. అయినను అంతయో, ఇంతయో ఆ సికుడనుగాన ఇందులకు సాహసించితిని. కాని "ప్రాంశులభ్యే ఫలే లోభాదుద్బాహు రివ వామనః" అని కాళిదాసు డన్నట్లున్నది నా పని. బ్రహ్మదేవు డెవరినెట్లు ఏపనులయందు వినియోగించునో యెవరికెఱుక ? ఆ బ్రహ్మచేష్టితములు ఆశ్చర్యజనకములుగదా! ఏమైనను యేనాటి పూ కృత పుణ్యవిశేషలేశమో నన్నిట్లు ప్రేరేచినదని వినయముగా విన్న వించుచున్నాను.

"పిఠాపుర కవి చరిత్రము" వ్రాసియిచ్చి ప్రోత్సాహమునకు దీప్తి నింపిన శ్రీ చెరువు సత్యనారాయణశాస్త్రిగారికి నమస్కృతులు.

ఈ గ్రంథప్రచురణలో నాతోగలసి ప్రూఫులు చూచియు, చక్కని సలహాలనిచ్చి సహకరించిన సహృదయులు ప్రియమిత్రులు శ్రీ బి. రాజేశ్వరరావుగారికి కృతజ్ఞతలు.

ఈ గ్రంథమున నెచ్చటేని దోషములున్న నవి నానిగా భావించి, మన్నించెదరని మనవి. ఇక ఒప్పులన్నియు శ్రీ శాస్త్రిగారికే చెందును.

ఇట్టి ది వెలుగుచూచుటకు మాతో సహకరించిన మహానుభావు లెందరో, అందరికి వందనములు.

ఇట్లు,

బాపట్ల } నేమాని సీతారామయ్య, ఎం. ఏ,
16–2–72 } ఆంధ్రోపన్యాసకులు - ఆర్ట్సు కళాశాల,

శ్రీ శివాయ గురవే నమః

పితాపుత్ర కవి చరిత్రము

సీ॥ తనుఁ బరీక్షింపఁ బూనిన త్రిమూర్తుల నర్భ
కులఁ జేసె నెవ్వాని కులపురంధ్రి
శాపోక్తి శతఖైశ్వర్య గర్వస్ఫూర్తి
వనరాశిఁ గలిసె నెవ్వాని సుతుఁడు
నిఖిలజగత్ప్రీతి నెఱపు వెన్నెలతేని
గనియె నెవ్వాని దృక్కంజ లక్ష్మి
స్వతపః ప్రభావ మోహితముక్తి కుచతటా
వరణోత్తరీయ మెవ్వాని సుయశ

గీ॥ మా సుగుణ రాజధాని మహావధాని
వేదవేద్యైక సన్మాని వినతమాని
హర్షవేణీ స్నపితమౌని యత్రిమౌని
పొసఁగు కారుణ్యము మమ్ముఁ బ్రోచు నెపుడు

ఆ॥ ఆ త్రిమూర్తి కీర్తు లడియాలములుగఁద
ద్దత్తమూర్తి యగుచు తాన తోచె
నత్రిమౌని కనఘ కనసూయ కెమ్మహా
త్రేయ యోగివరు స్మరింతు నెపుడు.

ఆ॥ అమ్మనేంద్ర గోత్రమందు జన్మించి బ్ర
హ్మాత్మ కేవలత్వ మవధరించి
ప్రథితిఁ గన్న రామభట్టారకు మదన్వ
య్యప్రధాన పురుషు నభినుతింతు.

సీ॥ అఖిల వేదాంగ విద్యావదాన్యుడు సింగ
ధన్యుఁ డేకృతి ప్రపితామహుండు
శ్రుతి చయోచ్చారణారూఢతా బ్రహ్మ సు
బ్రహ్మణ్యుఁడే భవ్యభావు తాత
యాగమరత్న రత్నాకరుండల బుచ్చ
యార్యుఁడే సత్కలాధుర్య తండ్రి
లలితలక్షణ యక్కలక్ష్మాంబ తులితాంబ
కడుపారనేయన్నఁ గన్నతల్లి

ఆ॥ శ్రీ పదాంతరోప జీవితా నారాయ
ణాహ్వఁడేయుదారు నన్నగారు
హర్షమూర్తి నమ్మహామహా మాతండ్రి
హనుమదాఖ్యు సంస్తవన మొనర్తు ;

ఆ॥ కన్నతండ్రియయ్యెఁ గరుణాబ్ధి నామన్నెఁ
గలఁ బెన్నె బోధ ఘటనఁ దేర్చె
నట్టి ప్రవరు లక్ష్మమాంబికేశ్వరు గురు
నలవి యగునె పొగడ హనుమదార్యు.

కం॥ తులనా విరహిత విద్యా
నిలయుం గారుణ్యమూర్తి నిర్మలు మనాత్మ
తులునిం బ్రథమాచార్యునిఁ
దలతున్ లక్ష్మీనృసింహుఁ దనరు ప్రవర్తిన్

— శ్రీరామకథా ఽమృతము



కైలాసవాసి కీ॥ శే॥ బ్రహ్మశ్రీ వేదమూర్తులు

తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రులవారు

శ్రీరామకథాఽమృత గ్రంథకర్త



కవికుమారులు

బ్ర॥ వే॥ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రులవారు

వారి ధర్మపత్ని శ్రీ దేవి గారు

ఈ మహాకవి యాత్రేయస గోత్రుఁడు. దత్తదేవుడు స్వీయుఁడు. ఆ వంశమున రామభట్టారకుడని చదుర్దశవిద్యా ప్రవీణుఁడు గోదావరీతీరము నుండి కృష్ణాతీరమందలి మునిపల్లె యను గ్రామమునకు వచ్చెనని వాడుక కలదు. తరువాత సింగభట్టను మహితుడు ఆరుశాస్త్రములు, మూడు వేదములు చదివి, చదివించి కీర్తినొందెను. వానికి సుబ్రహ్మణ్యావధాని యన జనించెను. ఆయన కుమారుఁడు బుచ్చయార్యుండన శాస్త్రజ్ఞుడు. వానిభార్య యక్కలక్ష్మాంబ. ఆ దంపతులకు హనుమదాచార్యుఁడన జనించెను. వాని యన్న లక్ష్మినారాయణుఁడు. ఆ హనుమదార్యుని భార్య లక్ష్మాంబ. వారి కుమారు లిరువురు. శ్రీ వేంకటప్పయ్యశాస్త్రి, శ్రీ సీతారామావధాని యను వారు. బాలాత్రిపురసుందరి యను నొక పుత్రికయుఁ గలదు. ఈ సీతా రామావధానిని పెదతండ్రి యగు లక్ష్మినారాయణుడు పెంచుకొనెను. ఆయన కుఁ బుత్ర పుత్రికా సంతానము కలదు అందు ప్రసిద్ధుడగు సాంబమూర్తి శాస్త్రి మహాపండితుడు, మహాకవి యని ప్రథితి నొంది ముందుగానే కీర్తి శేషుఁడయ్యెను. ఇఁకఁ బ్రస్తుతుఁడగు వేంకటప్పయ్యశాస్త్రికిఁ బత్నియగు హనుమాంబ యందు మువ్వురు పుత్రులు, పుత్రిక లైదుగురు వొడమిరి. 1. రాఘవనారాయణశాస్త్రి. ఈయన పత్ని శ్రీదేవి. పార్వతి యని తలి దండ్రులు బెట్టిన పేరు. వీరి పుత్రుడు లక్ష్మినారాయణశాస్త్రి. పది పదా రేండ్లలో విజ్ఞుడనిపించుకొని కీర్తి నిలుపుకొని చనియెను. కూతురు శ్రీ లక్ష్మి యనే చెరువు శేషయ్యశాస్త్రి పత్నియై సత్యనారాయణశాస్త్రి యను కొడుకునుగని గౌరియయ్యెను. వానిభార్య లక్ష్మి. వారు పుత్రవంతులు

ఇక రెండవవారు హనుమచ్ఛాస్త్రి, ఈయన చదువుసంధ్యలలో నారితేరి 20 సంవత్సరములకే స్వర్గతుడయ్యెను.

మూడవవారు బాలకోటీశ్వరశాస్త్రి ఈయనకు ముగ్గురు కొడుకులు నల్వురు కూతుండ్రు కలరు. 1. లక్ష్మీధరశాస్త్రి. పత్ని రుక్మిణి. పుత్ర వంతులు 2. హంపత్తశాస్త్రి, పత్ని ఆదిలక్ష్మి కామేశ్వరి. 3. గురు దత్తశాస్త్రి పత్ని శారద. ఇఁక కూతులు. 1. సుశీల. పతి జానకిరామశర్మ

2. లలిత; పతి ధూళిపాళ రామారాయ. 3. అనసూయ; పతి పేర్కచెరువు సుబ్రహ్మణ్యశాస్త్రి. 4 ప్రియంవద; పతి దెందుకూరి చినహనుమచ్ఛాస్త్రి.

ఇది యౌన వంశము. ఇఁక విద్యావంశము. ఈ వేంకటప్పయ్య శాస్త్రిగారు చిన్నతనమున నుపనీతుఁడై వ్రాయ చదువ నేర్చి యూరక తిరుగుచుండ నప్పటికాలమున చందోలులో పోష్టుమాష్టరుగా నున్న కొల్లచిన యజ్ఞనారాయణశాస్త్రిగారు దీక్షాపరులు; కల్యాణానంద నాథులని వారి దీక్షానామము. ఈమహాసిద్ధ పురుషుఁడు వీరితండ్రితో చెప్పి, తనవద్దకు రప్పించుకొని, ఒకనాడు శివపూజకుఁ దుమ్మిపూలు తెచ్చిపెట్టుమని చిన్న పూలపాత్రము నిచ్చి, ఒక్కొక్క పూవున కొక్కొక్కపరి ఓంనమశ్శివాయ యని యుచ్చరించుచు పూలు కోయుమని పంపిరి. అంతతో నాటలు మాని ప్రతిదినము పూలుదెచ్చి యిచ్చుటయేగాక ఆ మహాత్ముని వీడలేక వెంటనంటి యుండ నా మహాత్ముఁడు తన మంత్రగ్రంథములు శిథిలమైనవని, వీరిచేత తాను చెప్పుచు వ్రాయించుచు, ఒక్కొక్క మంత్రము, మహిమము చెప్పుచు, కాలామృతాది గ్రంథములచెప్పుచు, నింతలో వారు చందోలునుండి బందరు పోవుచు వెంటపంపవచ్చిన శిష్యునిఁగని, ఒకసారి బందరు రమ్ము, నీకు దీక్ష నిచ్చెదనని చెప్పి, యంతలో తమకు స్ఫురించిన భావిగతిఁ దలంచి బిడ్డా! నేను నీకు దీక్ష నీనక్కఱలేదు. పరాశక్తి నిన్ను స్వయముగా నను గ్రహించెద ననుచున్నది. నీవు కృతార్థుఁడవు. నన్ను మరువకుమని దీవించి పోయిరి.

అప్పుడు చదువుకొనవలెనని వీరికి బుద్ధిపుట్టినది. దూరదేశ మేగుటకు తలిదండ్రులొప్పలేదు. వివాహమయినది. గృహిణి కాపురమునకు వచ్చు దినములు. ఈ పరిస్థితులలో చందోలునకు పరిసరమందు నున్న పొన్నూరు గ్రామము నందున్న పాతూరి కోటయ్యశాస్త్రిగారి వద్దకుపోయి పరిస్థితులు చెప్పగా నిప్పుడింక నీకేమి చదువు వచ్చును అని వీరి తీవ్రత గుర్తించి, రఘువంశము చతుర్థసర్గము ప్రారంభించి చెప్పుచుండ నొక నాడు గురువుగారు బజారులో చెప్పవలసిన సంస్కృత కాశిఖండము పురా

ణము వారికి నాశౌచము వచ్చినదని చాలింపనెంచిన శ్రోతల నిర్బంధము ననుసరించి గురువుగారి సెలవు తీసికొని ఈ శిష్యుఁడు చెప్పెను. శ్రోతలట్లుండ శ్రీగురువే వారి మెచ్చుకొని వెంటనే కుమారసంభవము పంచమ సర్గము నారంభించిరి. అది పూర్తి కాకముందే సంస్కృతమున కవిత్వము ప్రారంభించి గురుస్తుతి శతశ్లోకి వ్రాసిరి. గురుని సంతస మింతింత యన రాని దయ్యెను. అప్పుడా గురువు శిష్యునకు వైయాకరణ సిద్ధాంత కౌముది నుపదేశించి నేను ప్రస్తుతము కాశికి పోవుచున్నాను. నీ వెక్కడనైన చదివిన సరే, అట్టి సందర్భము కుదురకున్నను వ్యాకరణశాస్త్రమున నీకన్ని గ్రంథములు సమన్వయించు నన్ను తలఁచుకొని చదువుకొనుమని దీవించి పోయిరి. ఆ శాస్త్రమాయాచార్యు నాశీశ్శుతోనే స్వాధీనమైనది.

తరువాత కృష్ణాతీరమున కళ్ళేపల్లి యను గ్రామమున నున్న అద్దేపల్లి సోమనాధశాస్త్రిగారికి తర్కము చదువుకొన మీవద్దకు వచ్చెదనని వీరు గీర్వాణభాషలో వ్రాసినలేఖ వారి శిష్యుల కర్థము కాకపోయిన, వారు పర్యాలోచించి చెప్పవలసి వచ్చినది. తరువాత దర్శనము చేసికొనిన యీ శిష్యుని మెచ్చుకొని 45 రోజులు మాత్రమే వారు తర్కము పాఠము చెప్పి, భాష నీస్వాధీనములో నున్నది. నీవు తీవ్రప్రజ్ఞుఁడవు. ఈశాస్త్రము నీకన్వయించును. చూచుకొనుమని చెప్పిపుచ్చిరి. ఆ శాస్త్ర మా విధమున కైవసమైనది.

పిదప శ్రీ కోట నరశింహశాస్త్రిగారు అను నాచార్యునివద్ద శాంకర శారీరక మీమాంసాభాష్యము శాంతిచేయుచుండ నా మహాత్ముడు-నాకన్న నీయందే శంకరానుగ్రహము కలదు. నేను దేశించితినను గౌరవముంచి, సంప్రదాయవిశేషము లున్న నేను చెప్పెదను, నీవే భాష్యము ననువదింపు మని సెలవిచ్చిరి. ఇట్లు వారి విద్యాభ్యాస కాలము 11 మాసములు మాత్రమే యని వాడుక. కొంఁది దినములు తురగా వెంకంరాజుగారు అని అప్పటి కాలములో ప్రసిద్ధుఁడగు కవివరునితో గలసి సంచారము చేసిరి. వారితో

కలియుటవలన కవితాధార పరిశుద్ధమైనది కాన, యాయన కూడ నొక గురువే యని తమ పొత్తముల యందు వర్ణించుచుందురు.

ఉభయశాస్త్రంబులని కాక యుపరిశాస్త్ర మింకొకండు గూడ నుపదేశమాత్రముననే గ్రహించు తెలివి గలిగియు, గురువుల ననాదరింపసని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగా రడుగ-నాకు ఓనమాలు చెప్పిన దండయ్య పంతులు వద్దనుంచి ఈనాటివరకు నొకయక్షరము చెప్పిన గురువైన వీడక కొలుచుచు వారికెల్ల నిత్యము తర్పణము చేయుచుందును, నా గురుభక్తియే నాకు సర్వము కరతలామలకము చేయగలదు, అని వాక్రుచ్చిరి.

ఇక వీరి జన్మపత్రిక

స్వస్తిశ్రీ విభవనామ సంవత్సర ఆశ్వయుజ శు ౨ లు చిత్తా నక్షత్రయుక్త మకర లగ్నమున జననము, జననకాల కుజమహాదశ.

గు			
కే			కుశు
ల			రా
	శ		రచ బు

భావనామసం॥ ఆశ్వయుజబ॥ ౩లు కైలాసము నలంకరించిరి.

వీరు వ్రాసిన గ్రంథములు

సంస్కృతము : శ్రీశైల తీర్థసారము. 2. హరిశ్చంద్ర సుకృత కావ్యము 3. గురుస్తుతి 4. అంబాసహస్రము.

తెనుగు :- 1. శ్రీరామకథామృతము ?4 వేలు పద్యములు. [illegible] కథావ- తమ అధ్యాత్మతత్వము విడువక వ్రాయబడెను.

2. శ్రీకృష్ణ విలాసము 3. శ్రీ కాకాని మల్లీశ్వర మాహాత్మ్యము 4. వృద్ధాయురుపాఖ్యానము (నాటకము) 5. త్రిశంకుస్వర్గము (నాటకము) 6. శ్రీ శంకరవిజయ కథాసార సంగ్రహ స్తోత్రము 7. చలపాదులత 8. మందగ్రహ నిగ్రహము 9. ప్రహ్లాదసుహ్లాదము 10. సీమంతినీ చరిత్రము 11. తుకారామ్ ప్రవృత్తి 12 సావిత్రీ చరిత్రము 13. పుష్ప మంజరి 14. వాస్తుసర్వస్వము* 15. స్మృతి సమాహృతి* 16. ప్రాస్తావిక పద్య గద్యాణములు, ఇంతవరకు నా యెఱిఁగినవి. 17. బాలకోటీశ్వర శతకము 18 హేమ దుర్గాంబశతకము 19. శ్రీ వేంకటేశ్వర త్రిశతి 20. కావ్యకన్యాతారావళి.

వీరు నలుబది సంవత్సరములు సంస్కృతపాఠశాల సాగించిరి. పదిపదియేగురు విద్యార్థులకు నిత్యము తమ యింటిలో భోజనము పెట్టి చదువులు చెప్పుచు తమ జీవితమెల్ల సార్థకమొనరించుకొని, షుమారు 400 లకు తక్కువ లేకుండ వారివలనఁ గవితయందును, శాస్త్రముల యందును, పురాణ దోరణుల యందును, పండితులైన విద్యార్థులే సచేతన ధ్వజములై వారి కీర్తి స్ఫూర్తికి నిమిత్తమైరి. వీరికిఁ బూర్వప్రారబ్ధమునఁ గడుపులో శూలనొప్పి కలదు. దానికి నోర్చుకొనుచు నొకచేతితోఁ గడుపుపట్టుకొని రేయుఁబవళులు విద్యార్థులకు విసువులేకుండ విద్యాదానము చేయుచుండెడివారు మొదట శివాలయమున బాలురకు పాఠములు చెప్పుచుండెడివారు. తరువాత నిడుబ్రోలు వాస్తవ్యులు పాములపాటి సుబ్బారాయుడు చౌదరిగారి ప్రేరణతో నొక పాఠశాల కట్టించి యందు శంకర విద్యాశాల అనుపేరుతో కొంతకాలము ప్రచారము చేసిరి. దానితో గొన్ని అప్పులయి ఆస్తియంతయు బోయినను వారి యుద్యమము చాలింపక చుట్టుప్రక్కల రైతుల సహాయముతో వారి జీవితాంతము నా సంస్థ నెర;

* ఇవి రెండును కనుపించుటలేదు. 13, 14, 15, 16 ఇవి హరికథలు గేయములు.

వేర్చుచుండిరి. సర్కారు వల్ల గ్రాంటు ఇప్పించెదమని యీ దినములలో శ్రీ చావలి సూర్యప్రకాశరాయాదు లుద్యోగులు వారి వెంట తిరిగెడువారు. తికార్డు చంకన పెట్టుకొని మీ యందఱ చుట్టు త్రిప్పవలెననియా మీకోరిక. నా కట్టి ధనములు, హోదాలు అక్కర లేదనెడువారు. ఒక పర్యాయము త్రోవన పోవుచు పెదపమిడి జమిందారు వారి పాఠము చెప్పు పద్ధతికి నావర్జితుఁడై ఒకనాడు పవలు రాత్రియు వారింట భోజనముచేసి, మరు నాడు ప్రయాణమై పోవుచు వారితో—అయ్యా! నేను పెదపమడి జమిం దారును. 60 ఊళ్ల నాక్రింద కలవు. నేను బంధుగులఁ జూడఁబోవుచు మీ పాఠకశక్తి నన్నాకర్షింప నిచ్చట నిన్న నుంటిని నాకు చాల సంత సముగా నున్నది. మీ రొకసారి మాసంస్థానమునకు వచ్చిన, మీ పాఠశా లకు కొంత సాయము చేసెదనని సవినయముగఁ జెప్పెను. దానికి వారు కినిసి ఈ దొంగధర్మము నిన్నెవరు చేయమనిరి? అట్టి ధనము మాకక్కర లేదనిరి. జమీందారుగారు అయ్యా! నాది యెట్లు దొంగధర్మమో నాకు తెలియుటలేదు. మీరు చెప్పిన తెలిసికొని మార్చుకొందు ననిరి. అది విని శాస్త్రిగారు — నీవు 60 ఊళ్ళ ఏలువాడవు. నీగ్రామములో నాలుగుచోట్ల నాలుగు పాఠశాలలు పెట్టి నీ పరిసరముల బాలుర నిర్బంధించి చదివించి నచో నీ సంస్థానమెల్ల విద్యామయ మయ్యెడిది చాలమంది పండితులకు వృత్తి కల్పిత మయ్యెడిది. అట్లు చేయక నాబోటి సామాన్యుఁ డెట్లో నిర్వహించు నీ పాఠశాల కేదియో యిచ్చి నేను చందోలు పాఠశాలకు ధర్మము చేసితినని చంకలు గొట్టుకొన నెంచితివి. ఇది మంచి ధర్మమెట్ల గును? అనిరి. జమిందారుగారు అయ్యా! నాది దొంగధర్మమని యిప్పుడు తెలిసినది. మీ హితోపదేశము ననుసరింప యత్నించెదను. అది యట్లు లుంచుడు. మీరు మాత్రము తప్పక మాసంస్థానమున కొకసారి రావలయు ననిరి. శాస్త్రిగారు — మీపాఠశాలల వ్యాప్తినిబట్టి యట్టి సమయములో నది చూచి యానందించుటకు వచ్చెదను కాని మీ ధనము కోసము రానని వారిని పంపివైచిరి.

ఇట్లే వారు ధనమును లెక్కచేయక ధర్మప్రధానముగ నడిచెడి వారు. తమకు మిత్రులగు రైతుల వల్ల స్వతంత్రముగ నడిగి తెచ్చి విద్యార్థులం బోషించెడివారు. అవసరమని పిలిచిన సభలకు నరిగి సనాతన ధర్మవిషయమున నుపన్యసించుచుండెడివారు. అప్పటి కాలములో ప్రసిద్ధులవు తిరుపతి వేంకటేశ్వరకవులు మొదలగు వారు వారి నొక దైవతముగ జూచుచుండిరి. దీనికొక కథ—

నూజివీడు సంస్థానమున నొకప్పుడు శ్రీ తిరుపతి వేంకటేశ్వర కవులు నింక కొందరు ప్రముఖులుండ నా సభలో శ్రీ రాజాగారు ఇప్పుడు మన యాంధ్రదేశములో నున్న కవులలో ప్రథమగణ్యు లెవరని ప్రశ్నించిరి. దానికి చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు నా గొంతులో నూపిరియుండగా నాంధ్రదేశమున నాకన్నమిన్న కవిశ్రేయనిన నేనెట్లు లొప్పుకొందును? నేనే ప్రప్రథమకవి ననిరి. అప్పుడు చందవోలు శాస్త్రిగారు వారి త్రిశంకు స్వర్గమను పోత్తము నాసభలో చదువుచుండిరి. వారి కవితా పరిపాటిని మెచ్చుచున్న రాజాగారు వెంకటప్పశాస్త్రిగారో? అని ప్రశ్నించిరి. చెళ్ళపిళ్ళ శాస్త్రిగారు తాడేపల్లి వేంకటప్పయ్యశాస్త్రిగారు మహర్షియని సమాధానము చెప్పిరి. దానికి నెల్లరు నామోదించి వేంకటశాస్త్రిగారి వివేకశక్తిని గొనియాడిరి. ఒక సమయమున గుంటూరులో నొక సభలో వచ్చిన కవిత్వ ప్రసక్తిని గూర్చి వారి యభిప్రాయము —

చ॥ పొలుతులు లేవునీకు రసపుష్టి యెఱుంగరు లోకులియ్యెడం
గలిమికిఁ గాన్కవెట్టుదురు కాలము దుష్టము భోజరుద్ర కృ
ష్ణులు కలిథాకకుం దలఁగి చూపున కబ్బరు నీదు ముద్దు మొ
ల్కలు వనిఁగాయు వెన్నెలలుగా నొగిలించెడుఁ గావ్యకన్యకా!

ఉ॥ కొందఱు పిల్చియే ముదుకగుడ్డయొ కూడొ యొసంగి ప్రోతుమం
చందురు వారి భాగ్యమది యట్టిద యేమనవచ్చు నింక నీ
యందము చందముఁ దలఁచి హావవిశేషము లేర్పరించి యే
లందగు నాథుఁడెవ్వఁడు? కలాలలితాత్మిక! కావ్యకన్యకా!

చ॥ శివునకొ? రామకృష్ణులకొ? శీలము నెక్కొన నిన్ను భక్తి నీ
భవమున కెట్టులేనిడఁగ భారము వాయునటన్న నీ యెదన్
నవనవమౌ వికాసము గనంబడ నొండెడవార లుండ మా
యవమతి యేమనంగ నగునమ్మ దయావతి। కావ్య కన్యకా।

అని యిట్టే మఱికొన్ని పద్దెము లాశుకవితలో నొడివిరి.

ఒకప్పు డొక క్రమపాఠిగారు వారి కవిత్వము నెఱుగక ఈభట్రాజు కవిత్వముల కెమిలే యనిరి. దానికి వారు వెంటనే —

గీ॥ సర్వదోచ్ఛిష్ట పంకసంచయిన మైన
కూపమం దూకమున కెట్లు కోరవచ్చు?
భట్టరాజాంక వేంకటప్పయ కవీంద్ర
వాగ్ఝరీ జృంభణ విలాసవై భవంబు.

ఉ॥ పంచిన వేడ్కనీ నొసటఁ
బాటయె వ్రాసె విరించియైన నీ
తింబురుడించి మూలమని
తీరుగఁ జూచినఁ జూడ నీ కయి
ట్లంబరమూడ గంతులిడె
దంగములం గనలేని నీదు రా
స్యంబెవఁడింక గన్గొనున
శక్తత కూలెదు ఛాందసత్వమా।

మ॥ చయనంబుత్తది సోమమారడి విశిష్టంబైన యాధానమే
బయలెక్కెంగద వైశ్యదేవమయినం బాడాయె వేనాఁడో సం
చయనం బీహోనరించి నంతటనె శిష్టత్వంబు చేకూరెనే।
పయినంగ్రేజొక డెక్కుడాయెనటెః యోప్రాధ్యాయ భూదస్తమా॥

ఈ మూడు పద్దెములు నాళువులో చదివిరి. ఇట్టివియే అనేకములు వారి చరిత్రములో కలవు. వారివలన చరిత్రములలో పేరు నొందిన చందోలు పురము నేడు మిక్కిలి ఖ్యాతివహించినది. దినమునకు 12000 పంచాక్షరీజపము చేయకుండ పండుకొనెడివారు కారు. అఖండ శివపూజా దురంధరులు. జపమాల ఎల్ల వేళల తిరుగుచునుండెడిది. ఉపన్యాససమయ మున మాత్రమది తూష్ణీంభావము వహించును. అది యాగగనే యిది సాగుచుండెడిది; విద్యార్థుల పాఠములో, పంచాక్షరజపమో, ఉపన్యాస ములో, కవిత్వమో తప్ప మరియొక పనికి నవకాశము లేదు. వారిరోజు లలో నెలకు పదిబస్తాల ధాన్యము దంపించుచుండెడివారు. విద్యార్థులు, ఇంటిలోవారు, వచ్చుచు పోవుచుండు నతిథులు, బందుగులు గాక గ్రామ ములో నుద్యోగమునకు వచ్చినవారు కూడ వసతి కుదురువరకు నిక్క డనే యుండి వసతి కుదిరినప్పుడు చెప్పిపోవు చుండెడివారు. వారు సంచా రము చేయు గ్రామములలో బీదవారలకు ధనసహాయము చేసెదనని తీసి కొనివచ్చి వారలకెల్ల భోజనము పెట్టి వారిపని నెరవేర్చి ధర్మముగ పంపు చుండెడివారు. అట్టివార లేమైన నిచ్చెదమన్న ముట్టెడివారు కారు. అవసర మని వచ్చు శిష్యులకు వేదమంత్రములుగాని ఆగమమంత్రములు గాని పురాణమంత్రములుగాని వారివారి యధికారమునుబట్టి యుపదేశించుచుం దురు. కాని యొకకానియు వారివల్ల గ్రహించువారు కారు. ఇంతకు మూల మాతల్లి హనుమాంబ. విసుకులేకుండ వండి వడ్డించెడిది. ఆమెకు కోడలు ఆడుబిడ్డ తోడుగ నుండెడివారు ఆమె చేయి యెప్పుడు నన్నములోనె యుండెడిది.

వీరు తిర్పతి వేంకటేశ్వరులకన్న ముందుగా నవధానము లొనర్చు టయు నదివిని వీరి గురువులవు శ్రీ అద్దేపల్లి సోమనాథశాస్త్రిగారు నీ సరసకవిత్వము చెడునుగాన నాకెఱుంగరాకుండ నీవెప్పుడు నవధానము, చేయవలదని వారించిరి. ఈ విధమున నలువది సంవత్సరములు విద్యార్థుల విద్వత్తములఁ జేయుచు, సంస్కృతాంధ్ర గ్రంథరచనల దేశము నలంక

రించుచు, నుపన్యాసవిధి ధర్మప్రచారము సేయుచు, నఖండ దేవీదేవారాధనములం బ్రోద్దుపుచ్చుచు గొన్ని సాంసారికములవు చిక్కులున్నను విద్యానంద బ్రహ్మానందములతో దమ యాయువును సార్థకమొనర్చికొనిరి.

చివరిదినములలో తాము వ్రాసిన శ్రీరామకథాఽమృతము అను గ్రంథము నచ్చువేయింపఁబూని 20-00 లు చందా యిచ్చినవారికి అయిదు వాల్యూములు పొత్తము లిచ్చెదమని కొంత ద్రవ్యము సంపాదించి బాలకాండము 1000 ప్రతులు వేయించుట కదియెల్ల వ్యయముకాగా క్రొత్త చందాలతో మిగిలిన గ్రంథమును పూర్తిచేయనెంచి అయోధ్యాకాండము 17 ఫారములు ముద్రించుసరికి నతిసారరోగముతో బాధితులగుచు ముగ్గురు వైద్యులు వైద్యము చేయుచుండ వైద్యత్రయి యేమనుచున్నదని తమ కుమారు నడిగి వానివలన విధిప్రాతికూల్యము నెరింగికొని సర్వజ్ఞులు గాన చింతించి యేమి ప్రయోజనమని పై గ్రంథము నచ్చువేయించి చందాదారులకు నీవు స్వయముగా నిమ్ము, అట్లయిన వారితో నా చెప్పిన మాటలసత్యము కాకుండును అని కొమరునకుం జెప్ప నతఁడు 12000లు ఋణములు కలవు, కుటుంబపోషణము చేయవలెం గదా! ద్రవ్యసాధ్యమవు నీపనిగూడ నేనెట్లు చేయగలనన నా తదనంతరము నాకు నీచేయు నౌర్ధ్వదైహికము కొఱకైన వ్యయము చాలించి ఆ ధనము పెట్టి ప్రస్తుతము సాగుచున్న అయోధ్యాకాండ ముద్రణము నెరవేర్చి చందాదారుల కిమ్ము. నాకు కొంత బాకీ తీరగలదనిరి.

ఆ మహాగురుని మాటనుబట్టి కార్యము నావశ్యకత గమనించి కుమారుడు వారికి నమస్కరించి నాకు నప్పగించి పోవుచుంటిరి గాన మీకా ఋణము బాధకముగాదు, నేను రెండేండ్లు బ్రదికిన మీ శ్రీరామకథాఽమృతము పట్టాభిషేకాంతము నచ్చొత్తించి చందాదారుల బాకీ తీర్చెదను మీరు సంతసింపుడు అని చెప్ప నాయన సంతసించి ఉత్తరకాండములో షుమారు 1500 పద్యములు వ్రాసితిని. ఇక 6000 పద్యములు వ్రాయవలసియున్నది. అవికూడ నీవే వ్రాసి పూర్తిచేయుము అని వాక్రుచ్చి

తరువాత రెండుదినములకే అనగా భావసంవత్సర ఆశ్వయుజ బ ౩ లు నాడు భౌతికశరీరము వదలి యుపాస్యస్వరూపులైరి. ఇది శ్రీ వేంకటప్పయ్యశాస్త్రిగారి సంగ్రహ చరిత్రము. విశేషించి వ్రాయవలెనన్న నెంతయేని కాలము పట్టును.

తదనంతరము వారి కుమారుడు శ్రీ రాఘవనారాయణశాస్త్రి వారితో చెప్పినట్లు చేయవలనసి భారముతో మొదల ముద్రాశాల క్షధిపతియవు మ. రా. శ్రీ పాములపాటి వెంకటకృష్ణయ్యచౌదరి, నిడుబ్రోలు గ్రామవాస్తవ్యు నాదరము నెనసి ఎట్లెట్లో అయోధ్యాకాండము పూర్తిగా ముద్రింపించి చందాదారుల కిచ్చెను

సదరు చౌదరిగారు విశాలహృదయులు, తమ పినతండ్రికి వేంకటప్పయ శాస్త్రిగారికి స్నేహసంబంధమును, తమకు దగ్గర గ్రామమున నున్న కవికావ్యము ప్రసిద్ధికి వచ్చుట ముఖ్యమని సరసులగుట మొదటనే చాలతక్కువ రేటుతో నొప్పుకొని వారి తదనంతరము వీరు పూర్తిచేయవలసినందులకు మిక్కిలి సహాయముచేసి కీర్తిని, పున్నెమును సేకరించిరి.

గుంటూరు వాస్తవ్యులు శ్రీ మ. రా శ్రీ గోవిందరాజుల సత్యనారాయణ, వీరు వకీలు, లక్ష్మినరసింహరావుగారు డాక్టరు - వీరు సోదరులు, వీరి తల్లి శ్యామలాంబ యోగిని, తండ్రి భాగ్యవంతుడు ఈకుటుంబము శ్రీ వేంకటప్పయ్యశాస్త్రిగారిపై భక్తితో వారి కుమారుని పిలిపించి వాని స్థితిగతుల విమర్శించి మూడేండ్లు గుంటూరులో తత్కుటుంబము నునిచి కోమటిబజారున నొక పురాణము కుదిర్చి యీ పురాణముతో కుటుంబ పోషణము చేసికొనుమనియు మేము కొన్ని చందాలు వేయించెదము, వానితో తండ్రిగారి గ్రంథము పూర్తిగా నచ్చొత్తింపుమని మీ యాస్తితో వెనుకటి బాకీలు తీర్చుకొనుమనియు తగినంత సహాయము చేసిరి. వారి యండతో నీ పనులెల్ల నెరవేర్చుకొని మూడేండ్లు తెనాలిలో నుండి తరువాత పురల చందోలు చేరి యథాయథముగ నుండెను.

శ్రీ రాఘవనారాయణశాస్త్రి స్వస్తి శ్రీ దుర్ముఖినామ సం॥ర శ్రావణ బ ౨ లు మంగళవారము రాత్రి వృషభలగ్నమున జన్మించెను. జన్మస్థానము గుంటూరునకు మూడుమైళ్ళలో నున్న గోరంట్ల అది మాతామహస్థానము. మాతామహుఁడు అన్నంభొట్ల వేంకటప్పయ్యగారు మాతామహి వెంకటసుబ్బమ్మగారు. వీరికి పురుష సంతతిలేక మఱదలి కొడుకును పెంచుకొనిరి. ఆయన వేంకటరామయ్య మేనమామ. వాని భార్య ఈ శాస్త్రిగారి పినతల్లి కూతురు త్రిపురసుందరి. వీరికి సంతానము కల్గి నష్టమౌటచే నతని యన్న మనుమని పెంచుకొనిరి.

శాస్త్రిగారి జాతకచక్రము

చ	ల కు		
రా	రాశి ఉత్తరాభాద్ర		గ
			ర బు శుకే
		శ	

శని దశాశేషము షుమారు 10 సంవత్సరములు.

ఈ జాతకుడు 6 వ సంవత్సరమున బజారులో నొకడుపన్యసించు చుండుటను జూచి యింటికి వచ్చి దొడ్డిలో నున్న పేకుదూలముల మీద నెక్కి పై యుపన్యాసము ననుకరించుచు కాలుజారిపడి తద్వారముగ రుగ్ణుడై ఒక సంవత్సరము జీవిత సంశయమున నుండెను.

తరువాత మూడు సంవత్సరములు బడిచదువులో కాలము గడిచెను, నాల్గవ తరగతి చదువుచుండ నొక పరీక్ష పంతులు తుందిలుఁడు వచ్చి, కుర్చీ వేయగా గబుక్కున కూర్చుండెను. వాని బరువును భరింపలేక అది విరిగెను. దానికి నీ జాతకుడు నవ్వెనని యాయన పరీక్షఁ దప్పించినాడు. తరువాత పదియవనేట నుపనయనము జరిగినది. అయిదుగు రాడుపిల్లలలో

నొకంచె పుంస్ఫూర్తు డగుటవలన తలిదండ్రులు గారాబముగఁ బెంచిరి. సంవత్సరము లుగ్నాడని తండ్రిపై గౌరవమున మ. రా శ్రీ మాచిరాజు దండయ్య పంతులుగారు గారాబముగా మిఠాయి కొనిపెట్టుచు చదువు చెప్పెను, ఉపనయనమైన తర్వాత ప్రైవేటుగా నాంగ్లభాష చదువుమని పై పంతులుగారి అన్నకొడుకు సాంబయ్యవద్ద నప్పగించబడెను. కాని యా చదువుమీద నిష్టములేక సంవత్సరము వ్యర్థముగాఁ బుచ్చెను.

అప్పుడు యడ్వర్డు పట్టాభిషేకము. ఆ సమయమున వానలు పండయి పంటలు పైరులు కొట్టుకొనిపోయెను. ఆ యుద్రేకములో. యడ్వర్డు చక్రవర్తి ముండచక్రవర్తి-అని కొన్ని పద్దెములు వ్రాసెను. అది సహజమువు కవిత్వము.

ఉపనయనము నాటినుండి సంధ్య నేమరక రెండుపూటల నగ్ని కార్యము నొనర్చుచు నొంటినిండ రుద్రాక్షల పేరులు, నతిశయితమవు భస్మ ధారణము చూచువారలకు నడవిమానిసివలె బైరాగివలె కన్పడెడువాడు. తరువాత తండ్రి చదువుట లేదని శిక్షింప నానాదేశముల నుండి వచ్చిన విద్యార్థులు మీ వద్ద పండితులై పోయి గౌరవ మందుచుండ నాకీ యాంగ్ల విద్య యేల ; ఇది నేను చదువను. వేదముగాని శాస్త్రముగాని చెప్పిన చదివెద ననెను. అప్పుడు తండ్రిగారు కావ్యారంభము చేసి చెప్పుచుండ కావ్యనాటకా లంకారము లభ్యసించుచుండెను. ఈ లో తాడికొండ కేదార లింగముగారు పై దండయ్యపంతులుగారి యల్లుడు ఉపాసకుండు తండ్రి గారి యనుమతితో పన్నెండవయేట బాలామంత్రము నితని కుపదేశించెను. అప్పటినుండి పదియారవ వర్షము దాక బ్రహ్మచర్య వ్రతముతోచదువును గూడ మెచ్చక అధికముగా నమ్మంత్రరాజము జపించుచుండెను. రఘు వంశము పాఠము మొదలు ములుగు వీరభద్రయ్యశాస్త్రి యను పితృసఖ పుత్రుడు సహపాఠిఅయ్యెను. ఆయన చాల గురుభక్తుఁడు, మైత్రీపాత్రుఁడు వాని ప్రేరణతో నప్పుడు దేశములో జరుగుచున్న తిరుపతి వేంకటేశ్వరుల

యవధాన ప్రచారమును బట్టి మనము మాత్ర మవధాన మేల చేయరాదు అని విద్యార్థుల కూర్చుండబెట్టుకొని పదియేనవునేట చాటుగ నర్థశతావధాన మాచరించెను. అది వాటముగా కుదిరినది.

ఆ కాలమున నిజాంపట్నములో కోట రామకృష్ణశాస్త్రి యను బంధువుడు లక్ష పత్రిపూజ చేయుచు నాహ్వానించిన సహపాఠులతో నచ్చటికి పోయి వారి కోరికఁ దీర్ప నచ్చట అష్టావధానము నొనర్చెను. అప్పుడు వేమవరాగ్రహారమునఁ దిర్పతి వేఁకటేశ్వరులు శతావధానము చేయుచుండ, అవధానానంతరము కవులెల్ల పద్యములు చదువుచుండ నీ బాలుండును—

శ్లో॥ విషధిస్స శేష ఉదితః పరస్మై
రభివాదితః కపటవాన్నిషణః
కవిరవ్యయం దనుజబంధు రహో
సకణాద ఏవ మతిమాంస్తదపి ॥

శ్లో॥ వ్యాకృతి ప్రముఖశాస్త్ర వినీతౌ
తౌవిషాది రహితౌ కవిహీరౌ
శేడ పూర్వ విషపూర్వవశాం య
స్యాంశజౌ నహి మహిః పరమేతత్ ॥

అని చదివెను. వెంటనే వేంకటశాస్త్రిగారు ఈ భారవిభట్టెక్కడనుండి వచ్చెననిరి. వీరి తండ్రిగారు మాయబ్బాయి యని చెప్పగా నేమి చదువు చున్నాడనెను. భారవి కావ్యమన, నట్లయిన నైషధ కావ్యము చెప్పుము శ్రీ హర్షభట్టగు నని దీవించిరి. తరువాత కొన్ని దినములకు కుమారు డవధానము లొనర్చుచున్నాడని విని వారివద్ద నొకసారి విద్యార్థులను పృచ్ఛకులుగా బెట్టి యష్టావధానము చేయించి, సంతసించి, యభ్యనుజ్ఞ యిచ్చుచుఁ జదరంగము, చీట్లాట స్వయముగ నేర్పిరి.

ఇంతలో పదియారవనేడు వచ్చినది. చిన్ననాటనుండియు పిల్లలతో నాటలాడుటకు నీయన పోయెడివాడు గాడు. ఎప్పుడు నొంటరిగ నుండుట. చదువో, సంధ్యయో, జపమో యభ్యసించుచుండువాడు. అప్పటికి కొంత వైరాగ్యము కుదిరి తల్లికి నమస్కరించి సన్యాసమున కనుజ్ఞ నిమ్మని వేడెను. ఆయమ చాల దుఃఖించెను ఆ సందర్భము విని తండ్రిగారు బొడ్డూడని వారికెల్ల వైరాగ్యము, సన్యాసము, అంత తేలికగా నున్నదియా! యని చీవాట్లు పెట్టిరి. ఒకప్పుడు ఊరిబయట నొక్కడు పొదలలో మధ్యఁ గూర్చుండియున్న కొడుకునుచూచి తండ్రిగారు నిశ్శబ్దముగా పోయి దగ్గఱకూర్చుండి వృత్తిలయమై లోకమెఱుఁగకున్న వాని విమర్శించి, ఒడలుతెలిసి లేచిపోవుచున్న వాని చేయిబట్టుకొని సన్యాసోగ్యమమును సత్యమని నమ్మి, అది మొదలు నిత్యము ధర్మబోధ చేయ మొదలిడిరి.

తక్కినవార లాడుపిల్లలు. నీ వొక్కడవే మాకు మగపిల్లవాడవు. నీ వెట్లు సన్యసించిపోనగును! మాకు వంశము నిలువవలదా? నీకుమాత్ర మిది విధియా? ఋణత్రయము తీరనిదే సన్యసించిపోరాదుకదా! యని యనేకవిధముల ధర్మబోధ చేయుచుండెడివారు. ఇట్లుండ నొకనాడు రాత్రి స్వప్నములో పిన్నతల్లివలె నుపాస్యదేవత కనబడి, ఒక పటమునుజూపి దీని నాకిమ్మని యడుగ, నిచ్చుటకే దెచ్చితినని, నీకు గజాంతైశ్వర్యము నిచ్చెదను. త్యాగము నభ్యసింపుము. ప్రత్యక్షసన్యాస మిప్పుడు కాదులే యని యంతర్థివహించెను.

ఆ మరునాడే బందరు పోవుచున్న తండ్రికి కృష్ణానది రేవులో కుంకుమ భరిణెయు, కాటుకకాయయు దొరకెను. వాని గ్రహించి యానాడు చల్లపల్లిలో నున్న శ్రీ అద్దేపల్లి సోమనాథశాస్త్రిని స్వగురువరుఁ జూడ బోవుటయు నాగురుమూర్తి యీ శిష్యుని సంసారవిషయమై ప్రశ్నించి కొడుకునకు పెండ్లిచేయలేదేమని యడిగి, సంబంధములు వచ్చుచున్నవి

ఇంటికి వెళ్ళగానే ఏదియో నొకటి నిశ్చయము చేయవలెనను శిష్యునితో నాకు చెప్పకుండ నీ వట్టి నిశ్చయము చేయకు మనెను. అది యేమన నా వద్ద నా తమ్ముని కూతురు పెరుగుచున్నది. దానికి వివాహము చేయవలెను ఆ సన్నాహమెల్ల నే నొనరించెదనన్న గురుని మాటకు నొడంబడి బందరు పోయివచ్చిరి. ఇంతలో వారి తరపువారు వచ్చి చూచి నిశ్చయించుకొని పోయిన తరువాత, కొందఱు విభూతి రుద్రాక్షలు ధరించును. ఆకాలము వాడుకాదు, వాని కిచ్చుటకన్న ఈ పిల్లకు పెండ్లి చేయకుండుట మంచిది, అని శ్రీ శాస్త్రులవారికి చెప్పుటయు నాయోగి - నేను విభూతి పూసు కొనుట లేదా ! నాకు రుద్రాక్షలు లేవా ! నాయల్లుడు నాయట్టివా డగుట మరియు మంచిది యని వివాహ ప్రయత్న మొనరించెను. 9 వ యేట వివాహము జరిగినది. ఇకసన్యాసము పోయినది. సంసారము ప్రారంభమైనది.

కాని యీ యాటకు తగినవేసము, బాస గ్రహింపవలెనని తండ్రి గారితో చెప్పకుండగనే తెనాలివెళ్ళి శాస్త్రాభ్యాసము చేయవలెనని ప్రయత్నింపగా నచ్చట పాఠశాలలోఁ జేరియు సనువుపడక విచారించుచు, నీ లోపల శ్రీ పీసపాటి మృత్యుంజయ అయ్యావార్ల కొడుకు వీరభద్ర శాస్త్రి తోడుగా నాయనవలన నేత్రావధాన మభ్యసించి అదివర కాయనతో నవధానముచేయు యేల్వేశ్వరపు పురుషోత్తమశాస్త్రి, రాఘవయ్య అను వారలతో సఖ్యము కుదిరి తన కవిత్వాదుల వారి కభ్యసింపఁ జేయుచు, వారితో నభ్యసించిన నేత్రవధానమును నిత్యము సభలలో ప్రదర్శించుచు నుద్యోగి ప్రవరులతో పరిచయము కలిగి వారలవల్ల షుమారు 400 సర్టి ఫికెట్టుల సంపాదించి గవర్నరవు పెంగ్లెంకు అనువాని సఖ్యము సంపాదించి తిరుగుచు నిది శాశ్వతముకాదు. ఈనాటి గౌరవము రేపుండదు. శాస్త్రసరణమే ముఖ్యమనితోచి వెంటనే తాడికొండ యనుగ్రామమునకుఁ బోయి తన గురువవు కేదారలింగముగారి యింటనుండి తత్పురవాస్తవ్యులవు శ్రీ ముదిగొండ నాగలింగశాస్త్రుల వారిని ప్రదోషానంతరము దర్శింప

బోయెను. గురువర్యులకు నమస్కరించిన వెంటనే యాయన శిష్యుని యుదంతము నారసి చదువుకొన వచ్చితినన నిప్పుడే మొదలు పెట్టుమనెను. పుస్తకము కేదారలింగము వారింటివద్ద నున్నది మీ దర్శనముచేసి యాజ్ఞ తీసికొనుటకు వచ్చితిని. రేపు పాఠము మొదలుపెట్టెదనన నా కారుణ్య నిధి నా పుస్తకమిచ్చెదను, ఇప్పుడే మొదలుపెట్టుమని వైయాకరణ సిద్ధాన్తకౌముది నొసగి యప్పుడే పాఠము చెప్పిరి. అట్లు నాలుగువత్సరము లా గురుదేవు నాశ్రయించి తాడికొండ గ్రామమున విద్యాభ్యాసము చేయు చుండెను. ఈయన పితృసఖుఁడవు నాయూరి రెండవకరణము బ॥ వెంకట చలం పంతులుగారు అంతకుముందు శ్రీ శాస్త్రిలవారివద్ద కావ్యపాఠ మొనర్చు వంగల వెంకటరామశాస్త్రి ద్వారా వాని తలిదండ్రులు, సుబ్బయ్య శాస్త్రిగారు మొదలైన గృహస్థులు పరిచయమై తమ బిడ్డకన్న నెక్కు డుగా చూచుచుండ దివ్యముగా నచ్చట విద్యాభ్యాసము కుదిరినది.

శ్రీ ముడిగొండ నాగలింగశాస్త్రిగారు వీరు ఆరాధ్యులు. భార ద్వాజస గోత్రము. శ్రీ కుంభఘోరాం శ్రీనివాసశాస్త్రివారి శిష్యులు. అనేక శాస్త్ర సంప్రదాయములు వారివల్ల గడించినవారు. నైక గ్రంథ కర్తలు. ఇవి యన్నియు నిట్లుండ శ్రీ నీలకంఠభాష్యానుసారం, వ్యాస పథము, బ్రహ్మపథము మొదలవు గ్రంథములు వ్రాసి శివ విశిష్టాద్వైత మును ప్రచారము చేసిన ప్రసిద్ధులు. చాలమంది వారిని ఋషియని ప్రశం సింతురు. అట్టివారు వీరికి వ్యాకరణశాస్త్రము పాఠము చెప్పుటయకాక వేదాంతశాస్త్రమునఁ గూడ పరిచయము కలిగించిరి. శాంకర రామానుజీయ మధ్వ భాష్యములలో నున్న విశేషములు చదివిచెప్పుచు వారి భక్తి విని పించి వ్యాఖ్యానము చేయుచుండెడివారు వారితో గొన్నిదినములు సంచా రము చేయుచు నెడనెడ శతావధానాష్టావధానములు చేయుచు కేవల విద్యా ప్రసంగముతో కాలము గడిపిరి. అచ్చట వీరికి శ్రీ గురువుగారిమేనయల్లుడు, అల్లుడునవు శ్రీ మల్లంపల్లి జ్వాలావీరభద్రశాస్త్రి సహపాఠిగ నుండెను.

అప్పటి సమయమున వినుకొండ తాలూకాలో సంచారము చేయుచున్న శ్రీశ్రీశ్రీ పుష్పగిరి పీఠాధినాథ శ్రీ చంద్రశేఖర భారతీస్వామివారి వద్ద నొకసారి యష్టావధానము కావించిరి. వీరిని చూడగనే వారు "అహమేవా శ్రమాంతరేణాగతః" అనిరట. అక్కడ విద్వాంసులుగా నున్న వారెల్ల చిన్నతనములోనున్న వీరిని గట్టిగ బరీక్షించిరి. అప్పుడు 20 వ సంవత్సరము, ఒక యుదాహరణము.

ఒక విద్వాంసుడు కంకంటి పాపరాజుగారి యుత్తరరామాయణము బురాణముగా చదువుచు పది కాగితములుతీసి ఒక పద్దెము, మరి యొక బొత్తితీసి అక్కడ నొక పద్దెముగా చదువుచుండ బురాణమునకది పద్ధతిగాదని యవధానిగా రనిన నది లెక్కసేయకపోగా శ్రీ స్వామివారు చెప్పినను వినక అవధానమున నిట్లే పరీక్షచేయవలెనని చెప్పెను. దానికి నవధానిగారు చిన్నతనముగుటవలన నతిక్రమించి నీ వవధానముల మొగ మెపుడైన జూచితివా ? యనెను. దానికి నా ప్రముఖుడు నే నీ పురాణము చదువనని పుస్తకము విసరిగొట్టెను. అప్పుడు ఇంద్రగంటి శ్రీరాములుగారు అనే ఫారెస్టు ఆఫీసరు, వృద్ధుడ నేను చదువవచ్చునా ? యని యడిగెను అక్షరములు వచ్చినవారెల్ల చదువవచ్చునని యవధాని యనెను. ఆఫీసరుగారు షష్ఠాశ్వాసమున సీతారామ వనవిహారమున వర్ణనము చదువ నారంభించెను. అవధానిగారి కీ తగాదాతో మనసు చికాకయి "వసుధా జంబు లగంబులౌట" అను పద్దెము అర్థముకాలేదు. ఇంకొక పర్యాయము చదువుమన అవధానములో నట్లు చదువవచ్చునా ? యనిరి. అంత నవధాని గారు తనకు తోచినమాట లర్థముగా నుడివిరి. ఆఫీసరుగారు దీని కిది యేనా యర్థమనిరి. ఇప్పుడు నీ కడుగు నధికారములేదు. అవధానానంతర మడుగుమని యవధానిగా రనిరి. ప్రత్యక్షర నిషేధాక్షరి – మల్లాది ఆంజ

నేయశాస్త్రిగారు రెండుమూడక్షరములు నిషేధించుచు, నదియేమనిన నివి కాక మరియెక వర్ణము లేదా ? యనిరి. వేదములో నొక ఋక్కు వ్యస్తాక్షరిగా పెట్టి దానిలో నక్కడక్కడ నక్కరముల లోపింపఁజేసి స్వరములోఁ జెప్పు మనిరి. ఇవ్విధమున నవధానము నెరవేరినది. గంటలుకొట్టు ఘనుడుగాక శ్రీ స్వామివారు నొక కాగితముమీద గూఢముగా లెక్కవేసి యుంచిరి. అది తెలియక పృచ్ఛకు డది తప్పెననెను. స్వామివారి లెక్కకు సరిపోయినది. అప్పుడు అవధాని అరాగా మ్రోగిన గంటల చెప్పెదమని చెప్పఁ జొచ్చిన నది సరిపోయె ననెను. అది సరిపోతే నిదియు సరిపోవును కూడికరాని వాడవధానిని ప్రశ్నించిన నతడేమిచేయు ననెను.

ఈ విధమున నెనిమిదిరకముల పృచ్ఛకులును నిందేమియు లోపము లేదనిరి. అనంతర మాఫీసరుగారు నా పురాణము మాత్రమే అవధానిగారు చెరచిరనిరి. అవధాని మరల నాపద్దెము చదువు మని పదస్వారస్యములతో గూడ దాని యర్థము నొడివిరి. ఆఫీసరుగారు ఇందాక యిట్లు చెప్పలేదనిరి. అవధాని-ఇందాక చెప్పిన దేదియో మీరు చెప్పిన నిప్పుడు చెప్పినదానికి, దానికి భేదమేమో యాలోచింతు మనిరి. శ్రీ స్వామివారు మెచ్చుకొనుచు సభ ముగించిరి. ప్రొద్దుకుంకుసరికి వీరికి నపరిమితమవు జ్వరము వచ్చి ఒడలు తెలియకుండఁ బోయినది. శ్రీ వల్లాది అంజనేయశాస్త్రిగారు చెప్పగా శ్రీ స్వామివారు విభూతి మంత్రించి పంపిరి. అది ధరింపగానే తగ్గిపోయినది మరునాడు స్వామివారు నవ్వుచు దృష్టి మంత్రమైనను రాని వాడవేమని యాస్థానులకు వచ్చితి వనిరి. గురుస్వామిని దర్శించుటకు మంత్రము లేల ? మందులేటికి నని వీరనిరి. ఇంతలో తొలినాడు పురాణము చాలించిన విద్వాంసుడు వచ్చి ఈయన మంచి సంప్రదాయము వాడని మీరు చాల అభిమానించుచుంటిరి. ఏమి సంప్రదాయము ? వీనికి మీస మేటికి యని యాక్షేపించెను. శ్రీవారు సమాధానింపు మనిరి. అప్పుడుశాస్త్రి:

సీ॥ ఆవస్పృశంబు దివ్యాకృతి వ్యాకృతి
వరియించి మించె సద్గురుని యుక్తి
కష్టభాషా కవితాంగనామణి తనం
తన చేరెఁ బూర్వజన్మంపుఁ జెలిమి
నష్టావధాన నేత్రావధాన శతావ
ధాన విధాతృత ధాత గూర్చె
వచ్చును ద్వ్యద్వయః ప్రౌఢిఁ బాణిగృహీతి
కాపురం బొనరింప రేపొ, మాపొ,

గీ॥ తల్లి దండ్రి సజీవులై తవిలి తనదు
సేమ మారయుచుండి రాశీస్సు లిడుచు
నెన్ననగు ప్రాయమందుంటి నిపుడు గాక
మీస ముంచెడు సమయంబుమీద గలదె ?

అని నొడువ శ్రీ స్వామివారు "శోభతే చాస్త్యేవ" అనిరి.

తరువాత ప్రసక్తాను ప్రసక్తంబుగా తామరయను పొడను గూర్చి ప్రసంగము రాగా

గీ॥ బొడ్డుతామరవానికిఁ బుట్టినాఁడు
ముడ్డితామరవాఁడు సముద్వహించె
కేలి తామరదానిఁ దత్కృత జగములఁ
దామరల కేమి ? తామరతంపరయ్యె ॥

అని శాస్త్రిగారు చెప్ప సదస్సు చమత్కృతమైనది. శ్రీ స్వామివారు ఉభయ శ్లేషాలంకారమునకు లక్ష్యముగ నేవిషయమున నైన నొక శ్లోకము చెప్పుమనిరి.

శ్లో॥ యస్యాష్ట భాషాకవితా లతాంగీ
జాయేవ సీతా ప్రణయేన శయ్యాం
మనోహరంతీ ఖలు హావభావైః
కీర్తిం ప్రసూతే భువనాభి వంద్యాం ॥

అని వ్రాసి వచించిన స్వామివారు సెజ్జయందు పరివర్తన మొనర్చుచు—స్త్రీ సంతత్యై వాస్య ప్రతిష్ఠేతి స్ఫురతి—అనిరి. వారి సంస్థానమున నుండు మనిన చదువుకొను రోజులలో నిది కుదరదని వారి యాశీస్సులతో ఫల మంత్రాక్షతాదులం గొనివచ్చిరి

ఈ విధమున వెల్లటూరు, వేట్పూరు మొదలైన గ్రామముల యందు నవధానము లొనర్చుచు దిరిగిరి. ఇట్లు కాలము పుచ్చుచు నింటికి, జూచిపోరాగా సంసారము బహుఋణములతోం బైబడెను. అప్పుపుట్టదు. నిలవ ధాన్యములేదు. అట్టితరి మూడుదినములు ఉపవసింపవలసి వచ్చెను. మూడవ దినమున ౧౧ పర్యాయములు సహస్రనామార్చనము చేసి దేవి మందిరమునొద్ద పండుకొన, కలలో గలగలమని వచ్చి పదియేండ్ల బాల ఓరీ ! ముష్టి పెట్టెదనని ఈయన పైకొంగు జాచగా దోసెడు బియ్యము తెఱుక్కుమనం బెట్టినది. బండి వచ్చును దానిపై నేగుము. మేలగుననెను. మేలకువ వచ్చినది. మరికొంతసేపునకు ఖాజీపాలెమునుండి బండి వచ్చి నది దానిపై నేగ వారు పురాణము గోరిరి. అడుగకుండగనే రాత్రి కి షష్టెడు వడ్లు పంపిరి. అది మొదలు దారిద్ర్యము నెఱుగకుండ నెవ్వరు దైన్యములేని జీవనము నింతదనుక యాదేవి కనిపెట్టియే నడుపుచున్నది

పై చిక్కుల దినములలో కలలో నొక యుత్తమపుడు బాధింపగా నిసువతో

శా॥ కావ్యశ్రీ : పసుమా, త్వదేకరతునిం గామింతు వస్తావథా
నావ్యాజ ప్రతిభా : యొనర్తు వెది ? నిర్వ్యాపారునిం గూడి ది
వ్యావ్యాహార సతీమణీ తొలఁగు మెఁ ద్దైన న్గలుండీ ఋణా
ర్ణ వ్యాపారయురీ భమిభ్రమరుఁడేనా మిమ్ముఁ బోషించుటల్ :

అను పద్యము చెప్పబడెను. ఆ సమయములో నొక యుద్యోగితో సంబం ధము కలిగి ఆయన తన కవిత్వము వినిపించి యడుగగా మీ కవిత్వము చూచిన మీమీద కవిత్వము చెప్పవలె ననిపించుచున్నది అన నైన చెప్పు మని యాయన నొడువగా —

శ్లో॥ విద్యానందిత సత్కవీశ హృదయా భోజాది భూమీ భుజః
ప్రాగాసన్నితి విశ్రుతిం కలియుగే శాబ్దాత్ప్రతీమఃకథం
అప్రమాణ్య మతిస్ఫుటం హ్యుపమితేః కృష్ణార్య ప్రత్యక్షత
స్త్వాం కృత్వాద్య సపక్ష మేతదఖిలం బుద్ధాను మాయామహే ।

అని చెప్పిన శ్లోకమును విని యా యుద్యోగి సంతసించి యాదరముతో నొకఁడు ప్లయింటు చేయఁబోయిన చందోలు శాస్త్రులవారిమీద ప్లయింటు నీకోర్టులో పట్టుము అనెను ప్లీడరు-పార్టీ నష్టపడునన నా యధికారి ఆ తరు వాత నేను నష్టపడినను సరే అనెను తరువాత దేవతానుగ్రహమున స్థిరాస్తి యెల్ల ఖర్చుపెట్టి బాకీలు తీర్చిరి.

తరువాత మన శాస్త్రిగారు తండ్రిగారి గ్రంథముద్రణమునకు పూను కొని యయోధ్య కాండములో గాయత్రి యందలి భవర్ణముతో పద్యము వ్రాయనెంచిన మూడురోజు లొక కందపద్యము కుదురలేదు. దానికి నాశ్చర్యపడి యుపాస్య దేవతా ప్రార్థన మొనర్చి నిద్రించుచుండఁ గలలో నొక బీబీ ఎఱ్ఱని గుడ్డకట్టి, కుంకుమాక్తమవు బొక్కాయి తొడిగి ఒక

వేదికమీద పండుకొనెను. ఆమెవద్ద షుమారు 30 ఏడుల యీడు గలిగి పెద్ద బారయిన గడ్డముగల యొక పురుషుఁడు చొక్కాయి పైకెత్తి పాలు త్రాగుచుండెను. శ్రీ శాస్త్రిగారిది దారినపోవుచు జూచి నిలువనాపె యర్ధనిమీలితాక్షసమీక్షణమున తృణీకృత బ్రహ్మేంద్రపురందరాదికమగు విభవమున గాంచుచు నేల నిలచితి వనెను. శాస్త్రిగారు నాకుగూడ కొంచెము పాలిచ్చెదవేమో ? అని యడిగెను. అప్పటి యనుభవము నీరీతిగా కలలోనే పద్దెము చెప్పిరి.

చ॥ ఎగఁబడి త్రాగు కావలసె
నేనని త్రాగుచుఁ బాలు లేవు పూ
ర్తిగ నొక గ్రుక్క కేనని స
ప్రీతి మెయింగని కందపద్దె మ
ల్లగ నవి చాలు పొమ్మని య
లక్ష్యతకై స్వకవిత్వధార సా
ధ్యిగఁ బెనుపొందఁ జేసిన స
తిన్ యవనిం దలతుం దదాస్తికిన్ ॥

ఆ వెంటనే "కం॥ భస్మము యస్య మాహాత్మ్యము"లను పద్దెము తుదివినది అప్పటినుండి యుత్తరకాండమున రేపు అచ్చునకుఁ గావలసినంతకుఁ బైగా పద్దెము తీరాత్రి వ్రాయుచు పనలెల్ల ప్రూఫులు దిద్దుచు గ్రంథము పూర్తిచేసిరి.

ఒకనాడు వేకువజామున బెజవాడ రైలుదిగి కృష్ణాస్నానమునకేగుచున్న శాస్త్రిగారికి బందరుకాల్వ వంతెనమీద కూర్చున్న యనిరూపణీయమగు నొకవ్యక్తి రమ్మని పిలచి ఆ వంతెనమీద తూర్పుగాఁ గూర్చుండుమని నేను మొగము కూడ కడుగుకొనలేదనుచున్నను నా మాట

లెక్కసేయక గణపతి మంత్ర ముపదేశించి జపించుమం జూమసరికి నదృశ్యమై చనెనట.

బ్ర. వే పొంపలె సీతారామయజ్వశాస్త్రిగారు మహాతిమగు విద్యా నాదరమున నుపదేశించి శ్రీ విద్యారహస్యము ల నిర్దేశించి శాస్త్రిగారి హృదయమున గురుపీఠ మధిష్ఠించిరి మాచిరాజు దండయ్య పంతులుగారు వర్ణగురువులు వారి యన్నకొడుకు సాంబయ్య చిన్ననాటి నుండి యాసనములు వేయించుచు చిన్నప్పుడు వ్రాయ, జదువనేర్చి పెద్దయయు కవితాది రచనల నలంకరించు వీరినిం జూచి యనంతానందము నందువారిలో నతి ముఖ్యుడు మరియు మాచిరాజు రామమూర్తి (కరణము) చిన్ననాటి సఖుడు సర్వ వ్యవహారసహాయుడు వేదాంతం కృష్ణమాచార్యులు అను వైఖానసులు, వైద్యులు నేతత్పిత్రు సఖులు వారి వైద్య విద్యా ప్రావీణ్యమున నే బ్రదికితినని శాస్త్రిగారు చెప్పుచుందురు. వీరి యన్నకొడుకు శ్రీ జగన్నాథాచార్యులు, నేడు పెద్ద పండితపదవి నుండుటవలన, వేంకటేశ్వరస్వామి వద్ద నధికారియగుట వలన, చిహ్నభేదములచే కొంచెము దసకినను, చిన్ననాటి మిత్రుండనక తప్పదు. చింతలపాటి వేంకటసుబ్బయ్య గారు బ్రహ్మోపదేశ గురువు. పరిమి నరసింహావధాని యత్కించిద్వేద గురువు.

ఈయనకు 40వ సంవత్సరమున తండ్రియు, 43వ సంవత్సరమున తల్లియు కీర్తిశేషులైరి. తత్కర్మానుష్ఠానానంతరమున యథావకాశముగం గాశ్యాది క్షేత్రతీర్థమూర్తి రాజముల సేవించుకొని వచ్చి వైశ్వదేవమొనర్చి స్మార్తాగ్ని నుపాశించుచు చేతనయినంత వరకు స్నానసంధ్యాదుల ననుష్ఠించుచు చందోలు గ్రామములో తమ తండ్రిగారు కట్టిన పాఠశాలలో రెండుగదులు గోడపెట్టి పరిమి రంగరాయునకు శాశ్వతముగ నిచ్చి మూడు గదులు తన తమ్ముని బిడ్డల స్వాధీనములో నుండ, అల్ల డాబామీద స్వంత

ఖర్చుతో నొక పూరిల్లు వేసికొని యందు నివసించుచు భగవంతుడను గ్రహించిన మంచిది, లేకున్న నుపాదానమున కేగుదునని దీక్షవహించి విద్యావ్యాసంగముతో కాలము గడుపుచుండిరి షుమారు 30 సంవత్సరముల నుండి యుపాదానమున కేగకుండనే దైవము కాలక్షేపము జరుపుచుండెను.

వీరు కొంచెము జ్యోతిషము, కొంచెము వాస్తువు తెలిసినను వానిని జీవికకు నుపయోగింపక యయాచితముగ లభ్యమవు ధనమున తృప్తి నొందుచు తనకు తెలిసిన విద్యాదులు లోకులకు ఫలాపేక్ష లేకుండ నుపయోగించుచు నుండిరి వీరికి కాలమున నరసాపురము నుండి వచ్చుచుండ చోరప్రమాద మొకటి తటస్థించినట్లు పూర్వాశ్రమమున గట్టి నరసింహశాస్త్రి యను పండితకవి అగ్నిపరీక్ష యని యొక పొత్తము వ్రాసినాడు విశేష మాగ్రంథమువల్ల నెఱుఁగునది ఈ శాస్త్రిగారు తండ్రిగారి శ్రీరామ కథాఽమృతమందు 6000 పద్యములు వ్రాసిరి. అది ప్రసిద్ధమే. దత్తభాగవతము మొదలవు కొన్ని పొత్తములు వ్రాసిరి. యామావికలో —

సీ॥ మధురావిజయకృతి మాలిమి నొసఁగితి
గురుఁడైన నాగలింగునకుఁ గవికి
హనుమకిచ్చితిని సీతమ్మకోర్కికి "సత్య
నారాయణ మహత్త్వ" నామగాథ
కళ్యాణ కైవర్తకము సతీర్థ్యుండని
పిళుపాటి కులున కర్పించితి రతి
"రామకథాఽమృతార్థము" పితృపాదుల
తోఁ బరతత్త్వమందు నిడఁగంటి

గీ॥ దత్తభాగవతమను గ్రంథంబు నిన్న
మొన్న లింగోద్భవస్వామి కెన్నఁగూర్చి
నేఁడు నీకిడుచుంటి ననింద్య! దీని
నాడ నున్నాడ వీవు నావాడవనుచు -॥

అని వ్రాసికొనిరి. ఇటీవల తిరుపతి వేంకటేశ్వరు నుద్దేశించి యుపశత కము మొదలవు చిన్నపోత్రముల వ్రాసిరి. అన్నియు పరమేశ్వరార్పిత ములే. తండ్రిగారివలెనే వీరును కైత నమ్ముకొనని దీక్ష సాగించిరి. కల్యాణకైవర్తకము కృతిపతిమాత్రము అప్పుడొక రు 1,600 లు బహు మతిగా వలదన్నకొలఁది నిచ్చిన, దానిఁ బదిలముగాఁ దాచి వారి వైశ్వ దేవసమయమున బ్రాహ్మణ సత్కారము గావించిరి.

ప్రస్తుతము పూర్వాశ్రమమున మల్లాది దక్షిణామూర్తి శాస్త్రీ యని ప్రసిద్ధులగు శ్రీశ్రీశ్రీ బ్రహ్మానందతీర్థ స్వామివారి ప్రేరణలో వ్రాయు చున్న "దత్త భాగవతము" రెండవశాఖయందుఁ గృతిపతిని గూర్చి యిట్లు ముచ్చటించిరి

సీ॥ అలకాపురరాజు లాశ్రయింత్రు నిను నా
కలకాపురంపు రాజు లాశ్రయంబు
చందవోలు కుబేర సదృశార్యతతి వీడి
చనలేవు నీవు నా చనవు నదియే
పెట్టిపోయంగలేని పేదలకాదు వీ
వట్టి వారల నొకండైన గాఁడ
నాది భిక్షుఁడవని యందురు నిన్ను నే
జ్ఞానభిక్షకుఁ జేయి సాచుచుంటి

గీ. సామ్యమటులుంచు మెంచి నీసాప్యముఁ గృతి
నొసగు నన్నృతిఁ జేయు మన్యునిగఁ గొనకు
మిందుపురనాథ ! లింగోద్భవేశ ! ప్రణతు
లందుకొను మభిముఖుండవై యాలకించి ॥

మ॥ వ్యవసాయంబునరాదు లేదు భృతికిం బాటించు నుద్యోగమం
సంవిధంబౌ పనిలేదు వృత్తియును నన్యంబేదియు న్లేదు మా
ధవ ! నీ సేవమును త్తుండన్ గొనుము క్షుద్బాధానివృత్త్యర్థమా!
యవలో? ప్రీహులో! బాలముష్టియిదెం జాలాభూతి యీ జాతికిన్

దీనినిబట్టి వారి ప్రవృత్తియెల్ల విశదముగా దెలియుచున్నది. ఇప్పటికి వారికి దెబ్బదియారు వత్సరముల యీడు దినచర్య యంతయు వ్రాయవలెనన్న నెంతయో పట్టును నా కవకాశములేక తోచినంతవరకు సంగ్రహించితిని. వీరింకను గొన్ని వత్సరము లిప్పుడు సన్మతిఁ జననిచ్చిన ముందటి చరిత్రాంశ మవసరమైనప్పు డింకను విశేషించి వ్రాయందలంచి యిప్పటి కింతటితో ముగించుచుంటిని.

పాఠకులు క్షమింతురుగాక.

ఇట్లు,

శాస్త్రిగారి దౌహిత్రుఁడు,

చెఱువు సత్యనారాయణశాస్త్రి

శ్లో॥ మాత్రాపియుక్త శ్చతురబ్ధిమాత్రే
మాతామహాభ్యాముపివిముక్తసేవి
గర్భాష్టమే ప్రాక్తన కర్మయోగా
దుర్బుద్ధ బుద్ధిః కవయామ్యహం త్వాం ॥

అని మదీయ లింగోద్భవవృత్త మాలికా స్తవము

శ్లో॥ నారాయణం నమస్కృత్య
నరంచైవ నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం
తతో జయముదీరయేత్ ॥

నాకు తోచిన మాట

శ్లో॥ శివః శక్త్యా యుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితు మపి,
అత స్త్వామారాధ్యాం హరిహరవిరించాదిభి రపి
ప్రణంతుం స్తోతుం వా కథ మకృతపుణ్యః ప్రభవతి ॥

"ఏకమేవా ద్వితీయం బ్రహ్మ" అని ఉపనిషత్తులు చెప్పుచున్నవి. మనము వేదములనుండియు, ఉపనిషత్తులనుండియు తత్త్వరహస్యమును గ్రహింపవలసియున్నది. కాని వేదవిద్యలు రానివారు పెద్దలనుండి ఆ రహస్యమును గ్రహింపవలయును. వేదములుకాని, పురాణములుకాని, పెద్దలుకాని చెప్పినది సత్యజ్ఞానలక్షణమేయని తెలిసికొనవలయును. లోకాతీతమైన వస్తువును సామాన్యమైన మాటలతో వర్ణింప శక్యముకాదు. కాని మహిమాన్వితులైన మహర్షులు బ్రహ్మోపదేశమును సామాన్యమైన మాటల్లో కావించిరి. యాజ్ఞవల్క్యుడు తన భార్య మైత్రేయికి సులభగ్రాహ్యమైన భాషలో బ్రహ్మోపదేశమును గావించినాడని వేదాంతమే చెప్పుచున్నది. ఈ అనంతమైన సృష్టికి బ్రహ్మవస్తువు సర్వాధారత్వము పొందియున్నది. ఈ బ్రహ్మవస్తువు నిత్యమైనది గాన సత్యమైనది. ఈ సత్యమునకే సత్ అని పేరు. జ్ఞాన స్వరూపమైనది బ్రహ్మము. ఇది అనంతము

దేశ కాలములచే పరిచ్ఛిన్నముకానిది ఆనందస్వరూపము. గౌతముడు దుఃఖాభావమే మోక్షమని నుడివియున్నాడు. కనుక సత్యజ్ఞానానంద రూపమైనది బ్రహ్మవస్తువనియు, అది అంతట నిండియున్నదనియు తెలియుట ఆవశ్యకమైయున్నది. బ్రహ్మవస్తువునకు లక్షణములుగ చెప్పబడినవానిలో మొదటిది సత్యము సత్యమనగా సర్వకాల సర్వావస్థలయందుండునదని అర్థము. అట్టిది బ్రహ్మస్వరూపము "యన్నిత్యం తత్ సత్యం" అనుటచే నెల్లప్పుడు నుండునదని భావము. ఇక లక్షణములలో రెండవది, జ్ఞానము ముఖ్యమైనది. అనగా ఇది సంవిద్రూపమైనది. నిత్యము చైతన్యమయమై ప్రకాశించుచు జడముగాక యుండు స్వభావమని తెలిసికొనవలయును. ఇక మూడవది ఆనందస్వరూపమై వెలయుచున్నది పై చెప్పిన గౌతముని దుఃఖాభావమే మోక్షమను మాట నిచ్చట సమన్వయించుకొనవచ్చును. మొత్తముమీద పై చెప్పిన సత్యజ్ఞానానందరూపమగు బ్రహ్మవస్తువు సర్వాధారమై యున్నదని తెలిసికొంటిమి. అనంతమైన ఈ సృష్టియందు ఆకాశమే విశాలమైనదని చెప్పబడుచున్నది. కాబట్టి అన్నిటికంటె ఆకాశము పెద్దదని తేలుచున్నది. మరియు అన్నిటికంటె చిన్నదైనది భూమియని తెలిసికొనవలసి యున్నది తర్కము—"శబ్ద గుణకమాకాశమ్" అని ఆకాశ లక్షణమును తెల్పుచున్నది. అనగా శబ్దమే గుణముగా గలది యని భావము. కాని శ్రుతిమాత్రము ఎక్కడ సందున్నదో—అది ఆకాశమని చెప్పుచున్నది. భూమ్యాకాశములకన్నను బ్రహ్మవస్తువు పెద్దదని తెలియుచున్నది. ఏలన "బృహత్వాత్ బ్రహ్మ" అని ఆ శబ్ద లక్షణమే చెప్పుచున్నది కనుక అన్నిటికన్న పెద్దదైనది బ్రహ్మస్వరూపమని తేలుచున్నది. ఈ బ్రహ్మ స్వరూపమునకు రూపముగాని, గుణములుగాని లేవు కావున నిర్గుణమైనది బ్రహ్మ కాని "యా మా సా మాయా" అనుటచే లేనిది ఉన్నట్లు కన్పట్టుటయే మాయాలక్షణము. అనగా ఇది భ్రాంతి, భ్రాంతి అనునది అధిష్ఠానపూర్వకమేగాని, నిరధిష్ఠానమైనది కాదని శంకరులు చెప్పుచున్నారు. కావున మాయ కధిష్ఠానమైనది బ్రహ్మ

మని తెలియవలెను. ఈ బ్రహ్మవస్తువే — జగత్తు అని భ్రమింపట జరుగుచున్నది. త్రాటిని చూచి పామనుకొనినట్లు బ్రహ్మమును చూచి జగమనుకొనుచున్నారు. పై చెప్పిన మాయలోనే ప్రపంచము ప్రారంభమగుచున్నది. అనగా సృష్టికి మూలము బ్రహ్మము. దాని నుండి మాయ స్ఫురించుచున్నది. దానినుండి సృష్టికర్మములు ప్రారంభ మగుచున్నవని తెలియవలెను.

ఈ బ్రహ్మవస్తువునుగూర్చి చెప్పుచున్న శ్రుతులుగాని, స్మృతులుగాని అనేకములున్నవి. శ్రుతి యనగా వేదము. దాని యర్థ మెచ్చట స్మరింపబడునో దానికి స్మృతి యని పేరు "శ్రుత్యర్థో యత్ర స్మర్యతే సాస్మృతి రిత్యర్థః" అని లక్షణము చెప్పబడినది. "శ్రుతిశ్చ భిన్నాస్మృత యశ్చ భిన్నాః" అన్నట్లు వీనియందనేక భిన్న దృక్పథములు కనుపట్టుచున్నవి. అయినప్పటికి అన్ని మతములు ఇందే గలవు ఇది విశాలమైనది. కావుననే శంకరులు శ్రుతి స్మృత్యాదులకు ఏక వాక్యత వాక్రుచ్చిరి. అది వాక్యావాంతరవాక్య భేదములచే సాధింపబడినది. ఎట్లన ఒకడు తన స్నేహితుని దగ్గఱకు కొంత ధనమును అప్పు అడుగుటకు వెళ్ళినాడు. వెళ్ళినవాడు మొదట అందఱు బాగుగనున్నారా అని యడుగును. పిమ్మట కొంత సంలాపములు జరిపి, ప్రసంగవశమున నతని నుపలక్షించి, నీవు విసుగుకొను చుంటివేమి? అని యడుగును. ఇట్టి యోగక్షేమపరామర్శతో - వాడు పదుల కప్పులిచ్చి బాధపడుచుంటుఱ యెఱింగి యట్టివాని కేల అప్పులిచ్చితివి? ఇంటనేదాచుకొనరాదా? అని విరుద్ధవాక్యములుపలికి, తనసంగతి చెప్పక బయలుదేరును. పోవువాడు పోక అల్లంతదూరమునుండి వాని ప్రశ్నము మీద నాకొక పదిరూపాయలీయగలవా? అని అడిగి అత డీయ తిరిగివచ్చి తీసికొని వెళ్ళినాడు. ఈ విధముగా వాడు అప్పు పుట్టించుకొనుటయందలి విరుద్ధవాక్యములకు స్వార్థమం దెట్లు సమన్వయమో, అట్లే శ్రుతి స్మృతులయందలి అన్నివాక్యములకు నేకవాక్యత కుదిరియేయున్నది.

కావున శ్రుతి స్మృతులలో భేదములు లేవని - అవాంతర వాక్యముల ద్వారమున ప్రధాన వాక్యాన్వయముచేసినను వానికి భేదముమాత్రములోక దృష్టిచే గన్పట్టుచున్నదని తెలియవలెను. ఈ విధముగనే అద్వైతమును బోధింపదలచి ద్వైతమును, సృష్టిని, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలను, ఉపాధులయందు ప్రాణప్రవేశము, ప్రాణవిభాగము, ప్రాణోత్క్రాంతి,కర్మములు, ఉపాసనలు. పుణ్యపాపములు,స్వర్గనరకములు మొదలైనవన్నియు బోధించి ప్రస్తావన రూపముగ వేదములలో, ఉపనిషత్తులలో, పురాణములలో నిక్షిప్తములు చేయబడినవని సమన్వయపరచి యేకవాక్యతను జగద్గురువులు శ్రీ శంకరాచార్యస్వామివారు సమర్థించిరి.

ఇఁక మాయ కధిష్ఠానమైన బ్రహ్మము నుండి సర్వపదార్థములు ఆభాసించుచున్నవని తెలిసికొంటిమి. బ్రహ్మము నుండి మాయ, మాయ నుండి మహత్తు, మహత్తునుండి అహంకారము, దానినుండి సూక్ష్మభూతములు, వానినుండి పంచభూతములు—ప్రపంచము సృజింపబడుచున్నవి. ప్రపంచ నిర్మాణమునుగూర్చి నేటి సైన్సు చెప్పు విషయమును, ఏనాడో తర్కశాస్త్రము విపులీకరించినది. మానవుడు నిద్రించునపుడు లేచునపుడు దైనందిన సృష్టియొక్క పర్యాలోకన చేయనగునని పెద్దలు సెలవిచ్చిరి. నిద్ర యనునది కన్నులను మూసివేయును. ఆ క్షణముననే క్రమముగ సర్వేంద్రియముల వృత్తులు ఆగిపోవును. అపుడు సూక్ష్మభూతములు అహంకారమున—మహత్తున లయమగును. అపుడు దాని మాయారూపముగు చీకటి ఆవరించును. నిద్రనుండి లేచునపుడు మాయనుండి వెలుగు ప్రభవించును. దీనికే మహత్తత్త్వమని పేరు. దీనినే మెలకువ నొందుట అందురు. మెలకువ వచ్చిన తర్వాత అహంకారము ప్రారంభమగును. "నేను" అనబడునదే అహంకారము. దీనినుండియే తన్మాత్రల యనుభవము జరుగుచున్నది. కావున నిద్రపోవునపుడు, నిద్రలేచునపుడు, మానవుడు సృష్టిని, లయమును అనుభవరూపముగ తెలియవలయునని సారాంశము.

ఒకసారి శ్రీరాయడు శాస్త్రిగారికి మా తండ్రిగారు వ్రాసిన రామ కథామృతమును వినిపించుట జరిగినది. అపుడు, రాయడు శాస్త్రిగారు— మీ రామరావణులకు భేదమేమి ? అని నన్ను ప్రశ్నించిరి. అపుడు నేను మా రాముడు అటు ఇటు కానివాడు. కాని రావణుడు మాత్రము మూలము నందలి వాడేనని అంటిని. ఏలన సామాన్యముగ లోకమున రావణుడు పది తలలు, ఇరువది చేతులు కలిగియుండునను వాడుక ప్రబలమైయున్నది. రావణునకు దశగ్రీవుడని పేరుకదా ! ఇట్లుండ సుందరకాండమున — సీతను వెదుకబోయిన హనుమంతుడు అంతఃపురమున నిద్రించు రావణుని చూచి —"బాహూ" – అని (రెండు బాహువులు గల వాడని) వర్ణించి నట్లు కలదు. ఇది వాల్మీకి ప్రయోగము. అనగా రావణుడు కామరూపుడు గాన వ్యవహారమున నట్లున్నను నిద్రయందు తన ప్రకృతి రూపమున నున్నాడనియు, అదియే సత్యరూపమని యొప్పుకొనవలెననియు వారి యభిప్రాయము. ద్విత్వ విశిష్టజాతినిబట్టి ఈ ఒకచోటి ప్రయోగము లోకానుసారముగ సాధువుగ సమన్వయించుట సమంజసమని నేను చెప్పి తిని కామరూపులు రతియందు, నిద్రయందు, మృతియందు తమ స్వ స్వరూపములతో నుందురని శాస్త్రము. ఈ రహస్యమెఱిగిన వ్యాస వాల్మీ కులు యథాతథముగా వారివారి నాయకులను, పాత్రలను తీర్చిదిద్దిరి కాని సామాన్య కవులవలె కల్పనా భూయిష్ఠముగ రచింపలేదు. భారతమున యుధిష్ఠిరుడు —"అశ్వత్థామా హతః కుంజరః" అన్న మాటను పాత్ర పోషణమునకుగా దీసివేయకుండ ఉన్నది యున్నట్లు వ్రాసెను. కాబట్టి సామాన్య కావ్యములదృష్టిలో పై వ్యాసవాల్మీకుల కావ్యముల చేర్పరాదు పై కవులు సృష్టించిన పాత్రలు మరే కావ్యమందున్నను, అందలి విష యమే ప్రామాణికమని బావించరాదు. అహల్యా సంక్రందనము, తారా శశాంకము, పారిజాతాపహరణము మొదలగు కావ్యములలో పౌరాణిక పాత్రలున్నవి, అందలి కవివర్ణిత విషయమే ప్రమాణమని భావించరాదు. ముక్కు తిమ్మన సాక్షాత్తు శ్రీకృష్ణదేవ రాయలై సింహాసన మధి

ష్ఠించెనని—యాదవత్వమున సింహాసనస్థుడు గామి — అను పద్యమున వర్ణించినాడు. కృష్ణుని తర్వాత మతొక యవతారము పురాణముల వర్ణితము కాదు కవిత్వమున చమత్కారకారిత్వ మపసరము. ఆ ముక్కు తిమ్మనయే అస్తపర్వతమందు తిరుగు కామదేనువు పేడ పేయగా నది యెండి అందలి దావాగ్నితో తగులబడి కల్లారి గుండ్రముగా గన్పట్టుచున్న దని చంద్రమండలమును వర్ణించెను. కావున కవులు కాలానుగుణముగ చేసిన కల్పనలన్నియు ప్రమాణములని భావింపనక్కరలేదు. మనకు వేదములు పరమప్రమాణములు. పిమ్మట ధర్మశాస్త్రములు, ఇతిహాసములు గ్రహింపదగినవి, ఇందు ధర్మములు బిన్నభిన్నములుగా నుండును ఆయా దేశములబట్టి అవి మారుచుండును. శాస్త్రము — మేనమామ కూతును వివాహమాడుట నిషేధించినది కాని ఈ సంప్రదాయము ఆంధ్రులలో నున్నది. కావుననే — "ఆంధ్రాణామయ మాచారః" అనవలసి వచ్చినది. శంకరులు భారతములోలేని ధర్మ మితర గ్రంథములలోనున్న దాని నాచరించినను విడిచినను ప్రత్యవాయము లేదనియు, భారతమందలిధర్మము ఇతర గ్రంథములయందు లేకున్నను తప్పక యాచరింపవలెనని వ్రాక్రుచ్చిరి. భారతమున సుభద్ర అర్జునునకు మేనమామ కూతురు. బలరాముడు వారి వివాహము అంగీకరింపలేదు. అపుడు శ్రీకృష్ణుడు బలరామునకు నచ్చచెప్పి వారి వివాహము జరిపించుట జరిగినది, ఈవిషయము వ్యాసుడు శ్రీకృష్ణుని ద్వారమున చెప్పించుట గమనింపదగినది. కాని ఈ యాచారము ద్రవిడులలో లేదు. కాని కృష్ణుడు చెప్పినదంతయు ప్రమాణమా? అనరాదు కృష్ణుడుకూడ వేదచోదితమే చెప్పునుగాని వ్యతిరిక్తము చెప్పడు "మాతుల స్యేవయోషా" అన్న మంత్ర లింగమునుబట్టియే శ్రీకృష్ణుడా ధర్మమును జెప్పెనని గ్రహింపవలెను.

వేదమనునది వాగ్రూపమైనది. అది ముఖతః నేర్చుకొనదగినది కాని పుస్తకరూపమున చదువరానిది. అట్లు అభ్యసింపబడకున్న నది వేదమేకాదు. బ్రహ్మనుండి మాయ, దీనినుండి సగుణ బ్రహ్మ, దీని

నుండి శ్రుత్యాది వాఙ్మయము భాసించును ఈ సగుణ బ్రహ్మ బహు రూప ములతో నుండును. నిర్గుణ బ్రహ్మకు వృత్తిలేదు. సగుణ బ్రహ్మనుండి రూపధారణములతో బ్రహ్మ విష్ణు మహేశ్వరాముల ఆవిర్భావము జరుగును నేడు చాలమంది ఆ దేవతలు కన్పించుట లేదు గనుక వారు లేరనుట వినబడుచున్నది కాని వారి దర్శనమునకు ప్రయత్నముచేయు టుచితము. కర్తలేక కార్యము లేదన్నట్లు ఈ సృష్టికంతయు కారణభూతు డొక డున్నాడనుట యుక్తముగదా ! వాని పేరే బ్రహ్మ వాడే దేవుడు. తిరుపతిలో దేవుడు తాతియందే యున్నాడు. కాని యందలి విశేషము దానిలోని దైవిక తేజస్సు లేక శక్తి అని భావించవలెను. "భక్తానాం ఆర్తినాశనః" అయినట్టి భగవంతుడు సర్వవ్యాప్తి నొందినవాడుగదా ? నేను చెన్నపట్టణము చూడలేదు కాన నది లేదన జెల్లునా ? చూచినవారు చెప్పగా గమనించి యొప్పుకొనవలెనుగదా !

ఒకసారి ఒక కలెక్టరు మా యూరికిరాగా మా నాన్నగారు కరణముగారు తమకు చేసిన అపకారము చెప్పిరి. ఆకలెక్టరు వినివిని చివరకు నాన్నగారిపై ఎదురుతిరిగి కళ్ళెఱ్ఱ జేసినాడు. అపుడు మా నాన్నగారు "తాయీ ! కావుమటన్న కళ్ళెఱ్ఱం జేయదు – శ్రీబాలకోటేశ్వరా !" అని కలెక్టరుగారిని తాయికంటే తాయివని నీకు చెప్పుకొనుటకన్న తాతితో చెప్పుకొనుట మంచిది అని ఒక పద్యము చెప్పిరి. ఇంతకు కలెక్టరుగా వచ్చిన ఆ దొరపేరు రాయ్. ఒకసారి నాకు తిరుపతిస్వామి దర్శనము దుర్లభమైనది. ధ్వజస్తంభమువద్దనే మ్రొక్కుతీర్చుకొనివచ్చితిని పిమ్మట వైకుంఠపురమువెళ్ళి అచ్చట స్వామిని దర్శించి సేవించి స్వామి కలలో కనుపించి తిరుపతిస్వామి రజోగుణ ప్రధానుడనియు, వైకుంఠపురస్వామి సత్త్వగుణ ప్రధానుడు కనుక దర్శనము కలిగినదనియు, తిరుపతి స్వామిపై కోపించుట తగదనియు చెప్పెను. ఈ భావోద్రేకముతో వేంకటేశ్వరస్వామి పై నొక శతకమును "నా యాత్ర" అని వ్రాసితిని.

ఇదికాక బ్రహ్మము నుండి భిన్నరూపములు ధరించిన శివకేశవాదులు చేయుపనులు శరీరాభిమానముతో కాదనితెలిసికొన వలయును. విష్ణునకు అచ్యుతుడని నామము. ఏ పనులు శరీరముతో చేయుచున్నను బ్రహ్మ భావమునుండి చ్యుతుడు కాడుగాన—తత్పదముసార్ధకము. బ్రహ్మరూపము నుండి యొకప్పుడు చలింపడు గాన శివునకు స్థాణువని పేరు. కావుననే శివాలయమున "హరోం హరోం హరోం" అని బిగ్గరగా పదునొకండు మార్లు కేకలువేయుట గుణాతీతుడగు నా దేవుని ప్రపంచోన్ముఖు నొనర్చి కొనుటకనీ పెద్దలు చెప్పుదురు. ఇట్లే ఇంద్ర కశ్యపాది శబ్దల కర్థము. ఋష్యాదులు దివ్యదృష్టితో దేవతల కథల సర్థము చేసికొన గలరు. కాని సామాన్యుల కది అసాధ్యము. కావున పురాణ కావ్యములు చదివి మంచి గ్రహించి, చెడును వదలుట అభ్యాసము చేయవలెను. శాస్త్రములు కేవలము జ్ఞానికి, అజ్ఞానికి అక్కరలేదు. కావున మధ్యముడైన సామాన్యు నికి కావలయును.

2

"బ్రహ్మ సత్యం జగన్మిథ్యా". అనీ పెద్దల అనుభవప్రోక్త మార్గము. బ్రహ్మ నిత్యమై వెలయుచున్నది. మనకు కనబడుచున్న చరా చర జగత్తు మిథ్యారూపమై భాసించుచున్నది. సగుణ బ్రహ్మమునకు మొదట ఇచ్ఛ ప్రారంభమై పిమ్మట సృష్టి జరుగుచున్నది. ఎవరికి తగిన బుద్ధి లేక ఇష్టమునే మతమనీ భావించవలెను. ఇది వాని మతము, అది వాని మతము అనునప్పుడు ఇష్టము అనియే భావము. అట్లే మునుల మత ములు వేదము ననుభవింపగా వారివారికి తేలిన భావములు. సృష్టియందు పంచభూతములు—వానీ నిర్మాణము—

ఆకాశాత్ వాయుః ! వాయో రగ్నిః !
అగ్నే రాపః ! అద్భ్యః పృథివీ !!
పృథివ్యా ఓషధయః ! ఓషధీభ్యోఽన్నం !
అన్నా తురుషః !

అని శ్రుతిచే చెప్పబడినది. మరియు ఓషధులవలన పురుష దేహములు, అంతఃకరణములు జనించుచున్నవి. సగుణబ్రహ్మ కారణశరీరములోనికి వచ్చినపుడు ఆనందమయకోశమనబడును. అన్నమయ కోశమున విశ్వుడు, సూక్ష్మశరీరమునందు తైజసుడు, కారణ శరీరములో ప్రాజ్ఞుడు నను పేర్లతో నుండు దేవుడే జీవుడు విరాట్ స్వరూపము సహస్ర శీర్షాద్యవయవములతో వెలయుచుండును. ఋషీశ్వరులు యోగులు దివ్యదృష్టితో విశ్వరూపమును, విరాట్టును చూడగలుగుచున్నారు. కాని యితరులకు చూపలేరు. ఆశక్తి శ్రీకృష్ణునకే కలదు. మంత్రద్రష్టలు మంత్రముల మననము చేయుదురు. శిష్యులకు చెప్పుదురు. కాని వ్రాయరు భారతమును లేఖ్యమగు నామ్నాయమని చెప్పుటచే, ఇతరామ్నాయము అలేఖ్యములు. లక్ష్మీధర పండితుడు సౌందర్యలహరి వ్యాఖ్యయందు మంత్రబీజమును పుస్తకమందు వ్రాయుచున్నాననియు, కలియుగమున సంప్రదాయము దొరకనివారలు తీవ్రభక్తులు దాని నుపయోగించుకొనుటకై దానికిగా 'శ్రీ మంత్రమును వ్రాసెను. మంత్రమనునదియుపదేశింపవలయునేగాని వ్రాయరాదు. కాని పై వ్యాఖ్యాత సంప్రదాయము దొరకనివారు తన్ను గురువుగ నెంచుకొని పుస్తకమునుచూచి అభ్యసించుమనియు, అట్లుచేసినవారికి సిద్ధి సమకూరునట్లు తాను చేయుదునని వ్రాసియున్నాడు. దానినిబట్టి తాను ఈశ్వరుడననియు తలంచినట్లే, యోగమున మణిపూరకమునందు వాయువు అగ్నిరూపము నొందునని శంకరులు చెప్పిరి. కాని స్వాధిష్ఠానమందే యిట్టిది జరుగునని లక్ష్మీధరుడు పల్కియున్నాడు. ఇట్లు ఎవరి

కైనను జరిగిన భయపడరాదని తన యనుభవమును చెప్పుట అతనిశల యము. ఇట్టి సిద్ధపురుషులెందరో గ్రంథకర్తలయందు కలరు.

భారతమున బ్రాహ్మణగీత, సనత్సుజాతగీత, హంసగీత మొదలగు పేర్లతో నూరుగీతలు కలవు. ఏ గీతల నెవ రభ్యసించినను గమ్యము మాత్ర మొక్కటే యగుచున్నది. మార్గములు శబ్దార్థ వాక్యార్థభేదములతో నారబ్ధములగుచున్నవి. ఈశ్వరతత్వము నెన్నిమార్గములతో చెప్పినను పరమార్థమొక్కటి యని తెల్పుటకే, ఎవరి యనుభవము వారు చెప్పుట మూలముగా నిన్ని గీతలు పుట్టినవని భావించవలయును "నమో వాఙ్మన సాతీత రూపా మానంత శక్తయే" అన్నచోట శబ్దశక్తులు పరమాత్మ శక్తులవలె అనంతములు. ఒక్కొక్కచోట నొక్కొక్కశక్తి ప్రకాశించు చున్నది ఈ శక్తులన్నింటికి అధికారి యుండితీరవలెనుగదా! అతడే యీశ్వరుడని విశ్వసింపవలెను. కాళిదాసు "ప్రత్యక్షోప్య పరిచ్ఛేద్యః మహ్యాది ర్మహిమాతవ" అని ప్రత్యక్ష శక్తులనుబట్టి అప్రత్యక్షు నీశ్వరు నాధికారిక పురుషునిగా నెఱుగవలెనని చెప్పెను. ప్రత్యక్ష మెట్లపరిచ్ఛేద్య మన దక్షుడు మొదట అరువదివేలమంది కుమారుల గనెనట. వీరిని వివాహము చేసికొని సంతానము గనుమనీ తండ్రిచెప్ప, వారలు కన్యలకై వెదుకుచుండిరట. ఆ సమయమున నారదుడు వచ్చి వారినీ మీ రెవరు? ఎచ్చటనుండి వచ్చితిరి? అను మొదలగు ప్రశ్నము లొనర్చి వీనికి సమాధానములు ముందు తెలిసికొమ్మని చెప్పెను. వారు అతత్త్వము నెరుగను త్తరముగ పొమ్మనెను. వారట్లే నారదవచనము తెలిసికొనుటకు ఉత్తరమునకు వెళ్ళిరట. మరొకఅరువదివేలమంది దక్షకుమారులకుకూడ నట్లే చెప్పి పంపెనట నారదుడు. తర్వాత ఆడుపిల్లలను కనగా వారివలన నీప్రపంచ సృష్టి జరిగినది అప్పుడు దక్షుడెఱిగి నారదుని ఎల్లప్పుడు దేశముమీద తిరుగుచుండుమని శాపమిచ్చెనట. ఇప్పటికిని దక్షకుమారులు భూమియొక్క అంతు తెలిసికొనుటకు తిరుగుచునే యున్నారు. కావుననే

ఈభూమి అపరిచ్ఛేద్యమైనది ఈ భూభాగము సప్తద్వీపములతో కూడి నది అందు జంబూద్వీపమున తొమ్మిది ఖండములు గలవు. ఈ భరత ఖండము జంబూద్వీపమునందలిది ఈ భరత ఖండమున నెన్నియో పర్వతములు తూర్పునుండి పడమటి వైపునకు కట్టలవలె వ్యాపించి యున్నవి. "పృథివ్యా ఇవ మాన దండః" అని కాళిదాసు వర్ణించిన దండులకే. "ఏడు కొండలవాడా వేంకటరమణా" అని నపుడు మేరు, నీల, శ్వేత, శృంగవంతాది పర్వతములన్నియు వచ్చుచున్నవి. అనగా సమస్త జగత్తునకు ప్రభువు అని అర్థమగుచున్నది. పై చెప్పిన తొమ్మిది ఖండముల లోను అర్జునుడు అయిదు ఖండముల జయించి, అచ్చటి దివ్యవస్తువుల తెచ్చినట్లుకలదు లోకాలోక పర్వతముచే చుట్టబడిన ఈ భూమి విశాలమైనది. కాని లోకాలోక పర్వతమున కావలివైపునకూడ ప్రదేశము కలదనియే చెప్పుచున్నారు. అయినను దానిని చూచినవారు లేరు ప్రత్యక్షమైన ఈ ప్రపంచమునే చూడజాలని మనము ప్రపంచాధినాథుడైన స్రష్టను-భగవంతుని చూచుటయెట్లు ? ఎట్లన ఆప్తవాక్య ప్రమాణముచే చూడవలయును. వెలుతురులేని సూర్యుడులేనట్లు నేనులేని ప్రపంచము లేదని భగవంతుని తలంపు నేను అను అహంకారము సర్వప్రాణిగతమై యున్నది కనుక నేనుకు ఆధారము నేనే అను వస్తువే యని భావించ వలసి యున్నది అదియే సద్వస్తువు. అది యొక్కటియే-"కాశ్యాంతు కాశతే కాశీ ; కాశీ సర్వప్రకాశికా ;" సర్వమును ప్రకాశింపజేయు కాశి అనగా సంవిత్తు ప్రత్యక్షమగు వస్తువునం దెల్ల ప్రకాశించుచునేయున్నది. అని శంకరులు పల్కిరి. ప్రపంచమున భోగము, మోక్షము అను రెండు విషయములు కలవు. రాజులు భోగములకు పాటుబడుదురు. బ్రాహ్మణులు మోక్షమునకు పాటుబడుదురు అట్టివారల చరిత్రము లాదర్శముగా గ్రహింపబడినవి. వైశ్య శూద్రాదులు వారిని కనుగొని భోగముగాని మోక్షముగాని సంపాదింపవలెను. పురాణములు శాస్త్రగ్రంథములు మొదలైనవి నిమ్నజాత్యుద్ధరణమునకు ద్రోవసూపెడివి. కాశీలోని తులాధరుని

ధర్మమునుగూర్చి చెప్పుకొనవలయును. అతడు సరకులను అంపట కొకే ధరకమ్ముచు, హెచ్చుతగ్గులు లేకుండ, వచ్చిన లాభమును ఆయాపనులకు సత్క్రమవినియోగము కావించుచుండెడివాడు తినుటకు కొంత, గుమాస్తాలకు కొంత, మరికొంత మూలధనముగను, కొంత పెళ్ళిళ్ళకు, కొంత ధర్మమునకు కేటాయించి ధార్మికజీవనుడై యుండెను. అతనిదగ్గర కొక మునివచ్చి, అతని సత్క్రమవినియోగ ధర్మమున కాశ్చర్యమునొంది, మూడు రోజులుండి ధర్మములన్నియు నెఱింగి వెళ్ళెను. భారతమున అరణ్యపర్వములోని ధర్మవ్యాధోపాఖ్యాన మిట్టిసూత్రమునే తెలియచేయుచున్నదికదా! కాన బ్రాహ్మణులు పురాణములలో తమ చరిత్రలు, రాజ చరిత్రలు మాత్రమే వ్రాసిరి. కాని యితరకులముల నెత్తుకొనలేదనువాక్యమ్మగ్యము అన్ని కులములకు తగిన గౌరవము శాస్త్రములలో శాసింపబడినవి. క్షౌరమునకు ముందు మంగలి మెడలో జందెమువేసి అది అయినతర్వాత దాని తీసి పంపవలెను. "రజకస్య కరా శుద్దా ! ఉత్తమా గోపనాపితా" అని యిట్లవసరములబట్టి అందఱకు గౌరవమిడిరి. మన ఋష్యాదులు దేవతల వంటివారు. వారు మంత్రద్రష్టలు. మనబోంట్లు మంత్రముల చదివికాని, విని కాని తెలిసికొనవలయును. మనోమయకోశము అందఱకు కలదుకాన, ప్రతి ప్రాణియందును వేదముగలదని వేదమునుబట్టియే తెలియనగును. ప్రాణి అంతఃకరణసహితమై యుండును. కులము అంతఃకరణమునగలదు. కులమన సమూహము, సత్త్వ రజ స్తమోగుణాదు లంతఃకరణమున నుండును. వానిబట్టి ప్రతివానిలో నింద్రియాది కులముగలదని శంకరులు చెప్పిరి. కర్మవలన ప్రతివాని హృదయమున ఉసిరిగపూతవలె సూక్ష్మముగ సంస్కారముగ అంతఃకరణములో నేర్పడును. కర్మలనుబట్టి అంతఃకరణములో గుణములయొక్క పాళ్ళు ఏర్పడును. దానిబట్టి కులమేర్పడినది. అది భ్రూమధ్యమునకు పైనలేదు. తల్లులు స్వీకరించు ఆహారములనుబట్టి గర్భమునందలి బిడ్డల యొక్క గుణగణాదులు మారుట సంభవించును

సాత్త్వికాహారమువలన బాధకలుగదు. కారము మొదలైన వానివలన గర్భమునకు బాధకలుగును కాన రజస్వలలు, గర్భిణులుండవలసిన తీరును వేదము చెప్పినది. మహమ్మదీయులకు మనకు కొన్నిటియందు భేదమున్నను, వారి వేదాంతము మనవేదాంతమునకు సమీపమునందేయున్నది. వారు మన పునర్జన్మసిద్ధాంతము నంగీకరింపగలరు. ఖురాన్‌లో చెప్పబడిన మోక్షమార్గము, వేదాంత సిద్ధాంతము మనవానితో సమానమైనవే కాని కొన్ని ఆచారములలో మాత్రము భేదమున్నది. దేవాలయమునందలి విగ్రహములలో మూడురూపములున్నవని యాచార్యులు దెల్పిరి. 1 రాతి యొక్క బాహ్యరూపము, 2. శిల్పిచే చిత్రితమైన జీవకళ, 3 వీని కాధారమైన సత్తారూపము. ఈశ్వరుడట్లు సత్తారూపముతో నిండి యున్నాడు. సూర్యభగవానునియందు నల్లరంగు, ఎఱ్ఱరంగు కననగును. గాని పచ్చరంగు కనబడుటలేదు "యచ్చంద్రమసి, యచ్చాగ్నౌ" అన్నచోట చంద్రునిలోని, అగ్నిలోని తేజస్సు నాదియేయని శ్రీకృష్ణుడు చెప్పుచున్నాడు, సూర్యకాంతి నాయది యని చెప్పలేదు. ఏలన హృదయమునందలి కాంతియే సూర్యకాంతి యని భావము. ఱాతియందే మూడురూపములున్నపుడు శరీరములో నేలయుండవు ! కావున ఉపనిషత్తుల ద్వారమున వానిని తెలిసికొనవలయును. "కర్తుం అకర్తుం, అన్యథాకర్తుం, సమర్థః ఈశ్వరః" అని ఈశ్వర స్వరూపము భాష్యములయందు నిరూపింపబడినది అదియే ఈశ్వరుని రూపము. శిరమున చంద్రమండలము, నాభికి దిగువ వగ్నిమండలమును కలవు. హృదయముననున్న నా తేజమే నగ్నిచంద్రమండలముల ద్వారమున సర్వకాల, సర్వదేశములయందు వ్యాపించి యున్నదని దేవుని—"పరోక్షప్రియా ఇవ దేవాః" ఈ సూత్రము చాల చోట్ల చూడబడుచున్నది. ఇదియే అంతరర్థము బహిరర్థము నని చెప్పబడుచున్నది. కొన్నిచోట్ల నీయంతరర్థము చెప్పకున్న మామూలుగా నుండు కథలైతిహ్యముకొఱకు తెచ్చుటనైనను చెప్పినను చెప్పినదే చెప్పుట

నిరర్థకము. అందు తారాశశాంకవిజయమును మామూలు దృష్టితో చదివిన బూతులేగదా! అది మాటిమాటికి పురాణముల నావర్తింపనేల ? అంతర దృష్టితోచూచిన అందు నీ విశేషము తోచెడు. ఆకథయందు మనస్థాని నీయుడు చంద్రుడు తార అన పెద్దది. అనగా పెద్ద తత్త్వము. మహా తత్త్వము. బుద్ధి - జీవుడు బృహస్పతి. జీవకళ లేకున్న మనస్సు పని చేయదు. కావున బుద్ధికళ మనస్సులోనికి వచ్చినది. తారయే చంద్రుని ముందు ప్రేమించినది. వీరికి వచ్చిన తగాదాలో చివరకు బ్రహ్మ రాజీచేసెను. అనగా నిచ్చట బ్రహ్మోపదేశముచే రాగద్వేషములు పోయి నట్లు భావించవలెను కనుక బుద్ధి జీవునితో చేరిన మోక్షము అదియే మన స్సుతో చేరిన సంసారము ఏర్పడును తార జీవునితో కలసిన స్వభావస్థితి, మనస్సునకువచ్చి వృత్తిద్వారా విషయముల నావరించుట వ్యభిచారము. తారకు బుట్టిన బుధుని చంద్రునకిప్పించి, తారను గురువునకిప్పించి బ్రహ్మ రాజీ చేసెను. చంద్రుడు మనస్సు, అందలి బోధలు జీవజ్ఞానము - తార వృత్తిరహితమైనచో జనకజ్ఞానము అది బుద్ధ్యాదులకు విషయముగాదు. కాన ఆశ్రయాశ్రయీ భావముతో బ్రహ్మైక్యమును భామతీకారుడుచెప్పెను. కాన మనోవృత్తిద్వారా లోకవ్యాప్తి కలిగినపుడు జీవుడు మనసుతో సంబంధింపక బుద్ధి వృత్తి ప్రత్యఙ్ముఖమైన బ్రహ్మము ఇదియే ఆకథకు సారాంశము.

నిర్గుణమైన బ్రహ్మవస్తువు మాయలో ప్రతిఫలించి సగుణ మగు చున్నది. పిమ్మట ఇచ్ఛానుసారము సృష్టి జరుగుచున్నది. ఈ సృష్టి రహస్యమును ఋష్యాదులు దివ్యదృష్టితో చెప్పగలరు. శాస్త్రాదులలో ఆకాశము తొమ్మిదిభాగములుగ విభాగింపబడినది. వీనిలో అన్నిటికంటె పైది చంద్రలోకమని తెలియుచున్నది. రావణుడు సూర్యమండలము లోనికి వెళ్ళెనట కాని, చంద్రలోకమునకు పోలేకపోయెనట. ఇక మొండి యగు రావణుడు 8 వ ఆకాశములో నుండి 9 వ ఆకాశమగు చంద్రమండ లము పైకి బాణప్రయోగము చేసెనట. అపుడు బ్రహ్మ ఆ విషయమును గ్రహించి రావణునితో—చంద్రుడు శివుని నెత్తిపై నున్నాడు, కాన అట్టి వానిపై బాణప్రయోగము కావించిన లోకప్రళయము రాగలదు. మానుము— అనెనట. ఈ విధముగ వాల్మీకములో నున్నది. కాని నేటి మానవుడు చంద్రశిలలు తేగలుగుట చూడ ఆశ్చర్య విషయము. పై విషయము (వాల్మీకము) నమ్ముటయా, మానుటయా అన్న పెద్దల వాక్యమే ప్రమాణ ముగ చూడవలయును. పూర్వము భారతదేశస్థులు యోగాది అభ్యాసము లచే సర్వ విషయములు గ్రహించెడివారు. శాస్త్ర నిర్ణయము ప్రకారము పురుషునకు ఐదవయేట ఉపనయనము జరుగవలసియున్నది. పిమ్మట 12 ఏళ్ళు యోగాభ్యాసము చేయవలయును. ఈ పదునేడు సంవత్సరములు గడిచినపిమ్మట బేసిసంవత్సరమున పెండ్లి చేయవలయును. స్త్రీకి ఎనిమి దేండ్లలోపల పెండ్లి చేయుట శాస్త్రయుక్తము. "స్త్రీణా ముపనయనస్థానే వివాహః" అని ఆపస్తంబుని ప్రవచమున్నది. స్త్రీకి ఉపనయనము వేరుగా లేదు. అందుచే వివాహానంతరము భర్తయే దానికి చదువులు, సందెలు,

యోగములు, ఉపాసనలు చెప్పి కృతార్థునుచేసి ఋతుమతియైన పిమ్మట గర్భాదానము మొదలగు తంత్రముల ప్రవర్తింపచేయవలయును స్త్రీకి భర్తయే దైవము. గురువు. ఆమె గృహకృత్యములందేకాక, భర్తకు అన్ని విధముల తోడ్పడుటవలన కృతార్థురాలు కావలయును. భర్త నిర్వర్తించు అగ్ని కార్యములందలి అగ్నులు భార్యకొఱకే పుట్టినవి స్త్రీ భోగ్య వస్తువుగా పరిగణింపబడుటచే దానిని బజారుకెక్కింపగూడదు. జ్ఞాన విజ్ఞానము లన్నియు సమకూర్చుటకే దానికి భర్త ప్రాపు కావున మొత్తము మీద స్త్రీ రజస్వలకాకముందే యోగసిద్ధి నొందవలసియున్నది. స్త్రీకి వివాహము సత్కర్మల యందు అర్హురాలిని చేయుటకే యుద్దేశింపబడినది. "ఆవాభ్యాం కర్మాణి కర్తవ్యాని" అని ప్రధానముగా చెప్పి "ప్రజా చోత్పాదయితవ్యా" అని రెండవది ఆనుషంగికముగ చెప్పబడినది. అప్పుడే వరుడు వధువునకు నాది నుపదేశించుచున్నాడు. దాని కొఱకే 8 ఏండ్ల లోనె స్త్రీకి వివాహము విధింపబడినది. ఇప్పటికాలమువారు ఆనుషంగికమును ప్రధానము చేసికొని మగవారు ఆడవారుకూడ పెండ్లికి మా కప్పుడే ఏమి తొందర అనుచున్నారు పెండ్లి అయినతర్వాత పిల్లలు పుట్టలేదని పుట్టలకు రాళ్ళకు మ్రొక్కుచు, ఒకరిద్దఱు పుట్టగనే, ఇక పుట్టకుండుపాట్లు పడుచున్నారు. వీరు చచ్చిన చీకుపడుచున్నారు. ఈ దృష్టితోనైన నెవ్వరికి తొందరలేదు ఈ పెండ్లి అయినను కాకపోయినను కూడ చింతలేదు. "జ్ఞానేన హీనః పశుభిస్సమానః" ఈ లౌకిక మార్గమునిటుంచి పురాణ మార్గము ననుసరింపుదము.

లోపాముద్ర రాజకన్య. 8 ఏండ్లకే అగస్త్యుని వివాహమాడినది. ఆమె పిమ్మట పర్ణశాలలో 10 వేల యేండ్లు లలితోపాసనా సమాధిలో నుండి విడుదల నొంది ఋతుమతియైనది అపుడు అగస్త్యుడు సంతానమునకై ఆమె యొద్దకు వెళ్ళినాడు ఆమె వెంటనే - మిమ్మే భర్తగా గురువుగా కాంచి మీ మంత్రోపదేశముచే దేవినైతిని. కావున మీరు సాక్షాత్తు శివ

స్వరూపులైనచో నన్ను ముట్టుకొనుడు. లేకున్న మీతల వ్రక్కలగునని పల్కినది అప్పుడు అగస్త్యుడు హయగ్రీవు నాశ్రయించినాడు. ఆ సమయమున హయగ్రీవుడు అగస్త్యునకు శ్రీ విద్యాతంత్రమెల్ల నుపదేశమాత్రమున సిద్ధిపజేసి పంపెను. అపుడు శివుడనైన నేను ముట్టుకొనెదనని ఆమెతో అగస్త్యుడు పల్కెను. కాని రాజకన్యయగు నామె విలాసమునకు రాజభోగములు కావలయును, లేకున్న మీతో కలియుటచే నసత్సంతానము కలుగునుగాన కుదదని పల్కినది. కావున రాజవేషముతో నన్ను గలయుమనినది. అప్పుడాతడు నా దగ్గర భోగములకు ధనములేదనెను. లేకున్న సృష్టింపుమని యామె కోరినది. కాని అతడు తన తపశ్శక్తిచే ధనమును సృష్టించుట కిచ్ఛగింపలేదు. అయినచో మీ వీలునుబట్టి ధనార్జనము చేయుమని ఆమె బదులు పల్కినది.

అగస్త్యుడు ధర్మ్యమగు పత్నిసలహాకు చేయునదిలేక సమ్మతించి ఒక రాజుదగ్గరకుపోయి ఆదాయవ్యయపట్టిక చూపుమనగా, అందు ఆదాయమునకన్న వ్యయమెక్కువయుండుటచే వాని నర్థించుట కూడదని మరియొక రాజును సమీపించెను. అతడును పైవానివలెనే యుండెను. చివరకు మూడవరాజుకూడ అట్లేయుండెను. ఇక చేయునదిలేక అగస్త్యుడుముమ్మరు రాజులను వెంటనిడుకొని, ధన మిప్పించెద రండని, వాతాపి ఇల్వలుల దగ్గరకు పోయెను వాతాపి ఇల్వలులు బ్రాహ్మణ నాశనము చేయుటలో వాసిగాంచియుండిరి. ఇల్వలుడు వాతాపిని మేకనుచేసి, కోసి వండి భోజనము పెట్టుట, పిమ్మట వాతాపిని కేకవేయగనె, తిన్నవాని కడుపు చీల్చుకొని వాడు వెలునడుట జరుగుచుండెడిది, ఇట్టివారికి రాజులు వద్దన్నను, అగస్తుడు బ్రాహ్మణార్థము ఒప్పుకొని కూర్చుండెను. ఇక మామూలుగ వారి తంతువు ప్రారంభమైనది. వాడు తమ్ముని కేకవేయబోగా, అగస్త్యుడు – "జీర్ణం జీర్ణం వాతాపి జీర్ణం" అని పల్కెను. ఈ విధముగ వాతాపి జీర్ణమైనపిమ్మట ఇల్వలుడు కాళ్ళపైబడి క్షమాపణ కోరెను. అపుడు అగ

అనగా ఎల్లప్పుడు సంధ్యావందన మాచరించుటయే. అది మంచిది సంధ్యావందన మంత్రమును ప్రత్యక్షరము ప్రఖ్యాతి గలది. మనవర్ణసమామ్నాయమందున్న 53 అక్షరములు దేవతారూపములు. అ – అనగా అరుణాదేవి. ఈ విధముగ నాయా అక్షరములకు ఆయా దేవతలపేర్లు గలవు. కాబట్టి అక్షరోపాసనచే దేవతోపాసనకూడ జరుగుచున్నది. ఈ దేవతలందఱు ఆయా అక్షర జన్మస్థానముల యందావేశించి యుందురు. చక్రదళముల యందు 53 అక్షరములలో ఆ దేవతలు గలరు. కావున చిన్నపిల్లలకు అక్షరాభ్యాసము చేయునపుడు అ-ఆ లతో ప్రారంభము చేయవలయును గాని, "ఓం నమశ్శివాయ" అను మహామంత్రముతో గాను ఏలన సులభముగ దగ్గరలో [illegible] అక్షరములు ముందుండగా, మహామంత్రములతో ప్రారంభించుట యేల ? ఇది యెట్లున్నదనగా, దగ్గరనున్న నదిలో అస్థికలు కలపక, గంగకే పోవుటవంటిది. దీనివలన నష్టమేమనగా దారిలోని నదులన్నియు పోవువానిని నిందించుట జరుగును. దీనినే–"ఆత్మాసన్నం పరిత్యజ్య మనేస్థత్ర చ నిష్ఫలం," అని ధర్మశాస్త్రములు చెప్పుచున్నవి. దగ్గరివారిని వదలి దూరమువారికి ఏమిచేసిన నేమి ప్రయోజనము?

ఇవ షట్చక్రములలో కంఠస్థానమున 16 దళముల చక్రమున్నది అనగా నిందు 16 అక్షరములు పుట్టుచున్నవి. ఈ చక్ర మధ్యస్థానమున జీవతత్త్వమైన ఈశ్వరుడు గలడు. ఇతనికి ప్రాణశక్తి భార్యారూపమున నున్నది. ఇక క్రింద హృదయమున అనాహత చక్రమున్నది. దీనికి 12 దళములు (12 అక్షరములు) ఉన్నవి. పిమ్మట బొడ్డుదగ్గర మణిపూరకమను చక్రమున్నది. దీనికి 10 దళములు (10 అక్షరములు) ఉన్నవి. దీని మధ్యస్థానమున విష్ణువు లక్ష్మితో నుండును. తర్వాత స్వాధిష్ఠానమందు 6 దళముల చక్రమున్నది. ఇచట బ్రహ్మ సరస్వతితో నుండును. ఇక పృష్ఠమునకు నాలుగు అంగుళములకుపైన మూలాధార చక్రమున్నది. ఇందు ప్రాణశక్తితో గణాధిపు డుండును. భ్రూమధ్యమందలి ఆజ్ఞాచక్రము

రెండుదళములు (రెంతు అక్షరములు) గలది యున్నది. ఇట్లు అక్షరము లన్నియు దేవతలరూపమున ప్రతివానియందున్నవి. కాబట్టి యుపాసన అ-అలలో ప్రారంభమగుట మంచిది. శాస్త్రములలో చక్రవివరణ యున్నది. శ్రీశ్రీశ్రీ బకస్వామి చక్రము లాయాస్థానములలో మాంస రూపమున నుండునని చెప్పిరి. నరశింహయోగి అనునతడు వెన్నెముకలో చక్రములుండునని తెల్పెను. శ్రీ విద్యారణ్యస్వామి సూతసంహితాభాష్య ములో పారమార్థిక శరీరములో సుషుమ్నయందు ప్రవేశించి వాయువహ్ని రూపములనొంది పోవునపుడాయా ప్రదేశముల నాయాచక్రములు "నరేంద్ర మార్గాట్ట ఇవప్రదీపః" అన్నట్టు లావిర్భవించుచుండునని, అది సుషుమ్న నడకయంనలి స్వభావమని యనుగ్రహించిరి. ఇక శరీరమున వెనుక భాగము వీపు) మఱ్ఱియాకువలె గన్పట్టుచుండును. మఱ్ఱిని తెల్పు శబ్దము వటమనియు, రావిని అశ్వత్థమనియు యుపయోగించుట గమనింపతగినది. వటమనగా సన్నగానుండి వ్యాప్తినొందునదని యర్థము. అశ్వత్థమనగా రేపుకూడ నుండనిదని భావము. కనుక వీపునందలి వెన్నెముక – దాని నుండి వ్యాపించిననాడులు మఱ్ఱియాకును బోలియుండుట తెలియదగినది. ఈ చెట్టు మూలభాగమున – దక్షిణామూర్తి యుండును. యోగి వాయు ధారణలో గాలి పీల్చినపుడు ఇడపింగళనాడులు గాలితో నిండును. బొడ్డు దగ్గర గుంటగా నున్ననాడి సుషుమ్న యనబడును. అపానమునుండి గాలి పోకుండ నిరోధించిన ఆ గాలి సుషుమ్న నాడియందు నిండియుండును. ఈ సుషుమ్నయందు 6 చక్రము లున్నవి. పారమార్థిక శరీరమునందు వాయువు అగ్నిరూపముననుండి, పోవునపుడు చుట్టునున్న దళముల ఆకార ములు కన్పట్టును. కావున వ్యావహారిక శరీరములో చక్రములు మాకు శవశరీరములయందు కన్పించుటలేదని డాక్టరు లనుచున్నారు. పారిమార్థికము నందే చక్రములు భాసించును.

ప్రహ్లాదుని కథలో - ప్రహ్లాదుడు అనగా ప్రకృష్టమైన హ్లాదము. నిరుపాధికమైన ఆనందము అని అర్థము. చక్రి యనగా చక్రములయందు (షట్చక్రములు) అభిమానము కలవాడు. వీడే సగుణబ్రహ్మము. గిక్రి యనగా చక్రికి వ్యతిరేకి. అనగా అభిమానము లేనివాడు, అనగా సాక్షి భగవంతుడు అని భావము, "హన హింసా గత్యోః", అనుటచే హింస-సింహ శబ్దము లొక్కటియే. ఇవి సగుణరూపమైనవి. నరీయత ఇతి నరః - నశింపనివాడు - నిర్గుణ బ్రహ్మరూపము. కావున నృశింహ అనగా సగము సగుణము, సగము నిర్గుణమునైన రూపముగలవాడు. అకారాది 16 అక్షరములు ప్రాణవర్ణములు. విశుద్ధస్థానము నుండి కకారాదులకు ప్రాణము రావలెను. ఈ స్థానము తామరమొగ్గవలె హృదయమున తల క్రిందులుగ నుండును. దీనిలోని సందు - ఆకాశము దహరాకాశ మనబడు చున్నది. చంద్రమండలము శిరస్సునందు గలదు. అగ్నిమండలము బొడ్డునందు గలదు. పై చెప్పిన దహరాకాశమే సూర్యమండలము. ఇందే బ్రహ్మమును తెలిసి కొనవలెను. కనుక హృద యాకాశమున బ్రహ్మ తత్త్వము తేజస్సుతో వెల్గుచుండును. కృష్ణపరమాత్మ గీతలో చందాగ్ని తేజస్సు తానేయని చెప్పుకొనెను. అనగా తాను దహరాకాశ మందలి సూర్యరూపుడనని భావము. తనను కొల్చిన వానికే మోక్షమని చెప్పెను. కనుక ధూర్జటి "ఏ వేదమ్ము పఠించె లూత" అని చదువులలో మోక్షము లేదనెను. భగవత్పాదసేవతో మోక్షప్రాప్తి కలుగును. భగవంతుడు తేజోమయుడు. అందులో నాల్గవవంతు ప్రపంచరూపమైనది ఆ పాద మును విస్మరించుటతో మోక్షమని, భగవత్పాదసేవ యన నర్థము, ఇట్లు కాక ఒక భగవంతుడు దొరకి ఆయన పాదము దొరకిన తర్వాత సేవ నాదేశింప నక్కరలేదు. సేవ చేసెదననువాని కది యెక్కడ దొరకును? కాన శ్రీకృష్ణుడు - శ్లో॥ : "యద్యద్విభూతి మత్సత్త్వం శ్రీమదూర్జిత మేవవా ! తత్తదేవావగచ్ఛత్వం; మమతేజోంశ సంభవం" - అని తన

ధర్మమునుగూర్చి చెప్పుకొనవలయును. అతడు సరకులను అంపట కొకే ధరకమ్ముచు, హెచ్చుతగ్గులు లేకుండ, వచ్చిన లాభమును ఆయాపనులకు సక్రమవినియోగము కావించుచుండెడివాడు తినుటకు కొంత, గుమాస్తాలకు కొంత, మరికొంత మూలధనముగను, కొంత పెళ్ళిళ్ళకు, కొంత ధర్మమునకు కేటాయించి ధార్మికజీవనుడై యుండెను. అతనిదగ్గర కొక మునివచ్చి, అతని సక్రమవినియోగ ధర్మమున కాశ్చర్యమునొంది, మూడు రోజులుండి ధర్మములన్నియు నెఱింగి వెళ్ళెను. భారతమున అరణ్యపర్వములోని ధర్మవ్యాధోపాఖ్యాన మిట్టిసూత్రమునే తెలియచేయుచున్నదికదా! కాన బ్రాహ్మణులు పురాణములలో తమ చరిత్రలు, రాజ చరిత్రలు మాత్రమే వ్రాసిరి. కాని యితరకులముల నెత్తుకొనలేదనువాక్య మ్మగ్యము అన్ని కులములకు తగిన గౌరవము శాస్త్రములలో శాసించబడినవి. క్షౌరమునకు ముందు మంగలి మెడలో జందెమువేసి అది అయినతర్వాత దాని తీసి వంపవలెను. "రజకస్య కరౌ శుద్ధౌ : ఉత్తమౌ గోపనాపితౌ" అని యిట్టవసరములబట్టి అందఱకు గౌరవమిడిరి. మన ఋష్యాదులు దేవతల వంటివారు. వారు మంత్రద్రష్టలు. మనబోంట్లు మంత్రముల చదివికాని, విని కాని తెలిసికొనవలయును. మనోమయకోశము అందఱకు కలదుకాన, ప్రతి ప్రాణియందును వేదముగలదని వేదమునుబట్టియే తెలియనగును. ప్రాణి అంతఃకరణసహితమై యుండును. కులము అంతఃకరణమునగలదు. కులమన సమూహము, సత్వ రజ స్తమోగుణాదు లంతఃకరణమున నుండును. వానిబట్టి ప్రతివానిలో నింద్రియాది కులముగలదని శంకరులు చెప్పిరి. కర్మవలన ప్రతివాని హృదయమున ఉసిరిగపూతవలె సూక్ష్మముగ సంస్కారముగ అంతఃకరణములో నేర్పడును. కర్మలనుబట్టి అంతఃకరణములో గుణములయొక్క పాళ్ళు ఏర్పడును. దానిబట్టి కులమేర్పడినది. అది భ్రూమధ్యమునకు పైనలేదు. తల్లులు స్వీకరించు ఆహారములనుబట్టి గర్భమునందలి బిడ్డల యొక్క గుణగణాదులు మారుట సంభవించును

వు. వారి వారి శక్త్యనుసారము ఏదో ఒక విద్య నాశ్రయించుట మేలు. అన్నియు నొక్కనికి నుపాస్యములు కావు. భిన్నభిన్న మార్గములు విద్య లొకరికి నెట్లు సాధ్యములగును, అని శంకరులు వాక్రుచ్చిరి. మాంస నివేదనతో కూడిన శక్తి ఉపాసన ఎంతమాత్రము కూడదని ర్యస్వామివారు వచించిరి కానివిద్యారణ్యులు ఉపాసనప్రధానముకాన శంకరులు చెప్పిన సమయాచారము దొరకనిచో కౌలాచారమైన నాశ్రయించి వినిభజించుట యవసర మనిరి.

4

శైవ వైష్ణవతములలో క్రమముగ శివుడు, విష్ణువు ప్రాముఖ్యము వహించి యున్నారు. వారిని సేవింప కైలాసమునకుగాని వైకుంఠము నకుగాని పోవలెను. అద్వైతమునందు నీవే బ్రహ్మవు (తత్త్వమసి) అనుమాటతో బోధ పూర్తియగుచున్నది. కాబట్టి ఈ "నేను" అను వస్తువు అహంకారాశ్రితమై వెలయుచున్నదిగాన దీనిని బ్రహ్మస్వరూప ముగా సులువుగా నిరూపణము చేయవచ్చును – అనుభవింపవచ్చును. సామాన్యముగ బ్రహ్మవస్తువును రెండువిధములుగ చెప్పుచుందురు, 1.నాద బ్రహ్మ 2 పరబ్రహ్మ. నాదబ్రహ్మోపాసన 6 నెలలుచేసిన పరబ్రహ్మ స్వరూపము సాక్షాత్కరింపనగును. నాదమనునది ప్రకృతి పురుషులమధ్య పుట్టుచున్నది, నాదోదయ, పూర్వ – నాద విరామాంతముల యందు బ్రహ్మము తోచుచున్నది. ఈ నాదమునకు అధిదేవత అగ్ని. ఇదిలేకున్న నాదము పుట్టజాలదు అగ్న్యధిదేవతా కమనః ప్రేరిత ప్రాణాహత మూలా ధారావిర్భూత పరాదివాగ్రూపమునాదము కనుక ప్రాణశక్తి దానిని ప్రేరేచి నపుడు నాదోత్పత్తి ప్రకృతి – పురుషులమధ్య పుట్టుచున్నది. ఈ నాదము నాల్గువిధము లగుచున్నది. 1. పరా ఇది సూక్ష్మరూపమైనది. ఇది మూలధారమునుండి బొడ్డువరకు నుండు రూపము 2. పశ్యంతి. ఇది

బొడ్డుదగ్గఱనుండి హృదయమువరకు నుండు రూపము. 3. మధ్యమ ఇది హృదయమునుండి కంఠము వరకు వ్యాపించురూపము. ఇది శ్రుతిగోచర మైన వాక్కు. 4. వైఖరీ. ఇది కంఠమునుండి నోటివరకు వ్యాపించి శబ్దనిష్పత్తిని కలిగించునది. వైఖరీ వాక్కు షట్చక్రాది స్థానములందలి కోణముల నున్న సందులనుండి అక్షరముల స్వరూపనాదముతో చేరి మనః ప్రేరణతో కంఠ్యాది శబ్దములన్నియు పుట్టుచున్నవి. కనుక నాదోత్పత్తికి అధిదేవతయగు అగ్నియొక్క ప్రాముఖ్యము గమనింపదగియున్నది. పశు పక్ష్యాది మనుష్యభాషలన్నియు నిట్లే బయలుదేరినవి. కాని ఇవి పలుకు నప్పుడు అపానమునుండి గాలి పోకుండుట అనుభవము. అట్లుపోయినచో నాదముండదు. అందులకే మనవారు మాటాడునప్పుడు - రెండు మూసికొని పొమ్మని - వ్యవహారము కల్పించిరి. అట్లు వాయు స్తంభనము సూచించు టకే మనవారు విక్కగోచిపెట్టి పంచెకట్టుట. మొత్తము మీద వాయువు అపానమునుండి పోకున్నచో - నోటనుండి శబ్దరూపమున వెలువడుట గమనింపనగు. కాని ఋష్యాదులు మౌనవ్రతధారులై వాయుపూరకముచేసి గొప్ప మహత్తును సాధించుచున్నారు, "మౌనం సర్వార్థ సాధకం" అని కదా పెద్దలు చెప్పిరి. యజ్ఞముచేయునప్పుడు యజమానియు నోరుమూసి కొని మౌనవ్రతము పాటింపవలయును. ఒకసారి పిఠపాటి సీతారామశాస్త్రి అను నాతనికి యోగాభ్యాసమునందు శంకరాభరణరాగము తనంతట తాను మనోహరముగ జనించి యోగపర్యంత ముండెకిది. ఇందులకు కారణ మేమన అతడు యోగమునందున్న సమయమున నోరు తెరిచికొని యుండెను. కాని యోగము నందిది పనికి రాదు. సర్వేంద్రియములు మూసియుండి వాయుపూరణము చేయుట మంచిది. మనము రోజు తిట్టు చున్న తిట్లయందును వేదాంతమున్నది. దుంపతెగ లేక త్రాడుతెగ అను చున్నారు. దుంప అనగా అజ్ఞానము. త్రాడు అనగా కర్మసూత్రము. ఇవి వశింపటయే వేదాంత పరమార్థము. కనుక నాదాభ్యాసమున నెన్నియో నియమము లుండుట గమనింపనగును.

భారతమున కృష్ణుని దగ్గఱకు సంజయునిరాక గమనించినచో ఆశ్చర్యము గొల్పును. సంజయుడు వచ్చినప్పుడు - కృష్ణునకు తెలియజేయబడు సందర్భమున కృష్ణుడు పండుకొనియుండెను. అర్జునుడు పాదసేవ చేయుచుండెను. ద్రౌపది, సత్యభామ కూర్చుండియుండిరి. అపుడు సంజయుడు కృష్ణుడు అంతఃపురమున నుండుటగమనించి వేషము మార్చుకొని వెళ్ళినాడట. అపుడు కృష్ణుని కనుసంజ్ఞతో అర్జునుడు పాదపీఠినుండి కాళ్ళు తీయగా, ఆ పీఠమును దాసీలు సంజయునకు కూర్చుండుటకు ఉంచిరి. అప్పుడు సంజయుడు ఆ పీఠముపై చేతులుంచి నమస్కరించి తాను అనుకొని క్రింద కూర్చుండెనట. ఆ భగవంతునంతవాని పాదపీఠమున తాను పృష్ఠము చేర్చరాదని భావము. ఎచట కెట్టి వేషము చితమో అది వేయవలెను అట్లుకాక ఒక్క లాగుతో చరించుట ధర్మమా ?

శిరస్సు పై భాగమునందు సహస్రారమను చక్రమున్నది. ఇదియే చంద్రమండలము. యోగులకు మాత్రమిది అమృతమును ప్రసవించును. లౌకికులకు వీర్యమును ప్రసాదించును. "అష్టాచక్రా నవద్వారా" అని వేదము చెప్పుచున్నది. బ్రహ్మరంధ్రమునకుపైన నాలుగంగుళములలో పీఠకచక్రమున్నది. ఇది బ్రహ్మస్థానము. కనుకనే వైదికులగువారు శిరస్సుపై చిన్నజుట్టు ముడినుంచి దానియందొక పుష్పము నుంచెదరు. అనగా బ్రహ్మస్థానమున కది యొక పూజగ మనము గుర్తింపవలయును. మన అలంకారము లన్నియు పరమార్థసాధనకేగాని కేవలము భోగచిహ్నములు కావని గుర్తింపవలయును. శాస్త్రమున మానవులకు ఒకజడ మాత్రమే విహితము. ఇక మూడునుండి పైన రాక్షసులకు నిబంధింపబడినవి. కాబట్టి రెండు జడలవారు రాక్షసులయందు సైతము కానరారు. అందువలన మానవులు రెండు జడలు వేయరాదు. అట్లు జడను రెండు పాయలుగ చీల్చుట యమునవి తల్లిదండ్రులు పోయినప్పుడు మాత్రమే జరుగవలసిన క్రియ.

కావున ఈ యాచారములన్నియు నశ్లీలములని గమనించి వర్తించుట ఆవశ్యకము. జుట్టు లేకున్నను నది ముకువకున్నను ఎనిమిదవ చక్ర మందలి తేజము క్షరించును దానిచే వారు దుర్బలులగుదురు ఏ మంచి వైదికకార్యములకు పనికిరారు అని ఆగమములు, సైన్సు చెప్పుచున్నవి. కాబట్టి భారతీయులు బ్రహ్మతేజస్సును క్షరింపనీరాదు. వీడినచో దయ్యములు, భూతములు పట్టుటలో ఆశ్చర్యమేమున్నది? ప్రస్తుతము నాద బ్రహ్మోపాసనమనగ తారకమంత్రమగు ఓంకారము నుపాసించుట. ఇది అ+ఉ+మ ల కలయికవలన నేర్పడుచున్నది. ఈ నాదబ్రహ్మోపాసన వలన బ్రహ్మసాక్షాత్కారము కలుగగలదు. గాని యిది సంగీత సాహిత్యముల వలనకూడ సాధ్యమగుచున్నది.

శ్లో॥ సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం।
ఏకమాపాత మధురం అన్యదాలోచనామృతం ॥

అని పెద్దలు చెప్పిరి. ఈ నాదమునుగూర్చి తర్వాత చెప్పెదను.

నేను మొదట అప్పులబాధతో జీవితము గడుపుచుంటిని. ఒకరోజు నేను కలలో ఏదో పద్యము వ్రాయుచుండగా - అప్పిచ్చినవాడు వచ్చి నా చేయిపట్టుకొని అప్పుచెల్లించుమని కోరెను. అప్పుడు నేను—

శా॥ కావ్యశ్రీ చనుమా త్వదేకశతునిం గామింతు వక్ష్యావ ధా
నావ్యాజ ప్రతిభా యొనర్చునెది నిర్వ్యాపారుసింగూడి ది
వ్యవ్యాహార సతీమణీ తొలగు మెూదైన్యలుండీ ఋణా
ర్ణవ్యాపార ఝురీభ్రమిభ్రమరుడేనా మిమ్ము పోషించుటల్।

అను పద్యమును కామ్యలక్ష్మి నుద్దేశించి నిర్వ్యాపారుడైన నావద్ద నుండక పొమ్మని విసుపుతో వ్రాసితిని. మా తండ్రిగారు పోవునప్పటికి

రామాయణమున 6 వేల పద్యములు వ్రాయవలసి యున్నది. గాయత్రీ మంత్ర బంధముతో పద్యరచన నీవే చేయవలసినదని తండ్రిగారు నన్ను ఆదేశించిరి. అట్లు నేను పూర్తిచేయనెంచి ఎప్పుడు పూనినను పద్యము తోచక కాలము వ్యర్థముగా గడచెడిది. ఒకరోజు కలవచ్చినది. నేను ఎచటనుండియో ఇంటికి వచ్చుచుండగానొక తురకబూబు వాకిటి అరుగుపై పరుండియున్నది. ఆమె చొక్కాయెత్తి ఒక తరుణవయస్కుడు పాలు త్రావుచున్నాడు. నేనట్లే నిర్ఘాంతపోయి చూచుచుండగా నామె యేల అట్లు చూచెదవనినది. నాకుకూడ కొంచెము పాలిచ్చెదవేమో యని యంటిని. ఆమె వెంటనే కావలసినచో నెగబడి త్రాగుమన్నది. ఆ మరుసటిరోజుననే

కం॥ భర్మమయ రమ్యహర్మ్యము
లర్మిలి ప్రియురాలిఁగూడి యలరించెడి నీ
శర్మద పదయుగ మస్మ
త్కర్మములు దొలంచు పనికిఁ గానవమనసెన్॥

అని భకారముతో పద్యము ప్రారంభము చేయుచుండగనే ముగిసినది. తర్వాత రేపు అచ్చునకు గావలసిన పద్దెము లీరాత్రి వ్రాయుచు వారి కృతి పూర్తిచేయ బూనితిని. ఆ బూబురూప మిప్పటికిని కనుల గట్టినట్లు కన్పడెడిది.

చం॥ ఎగబడిత్రావు కావలసెనేనని చన్నిడి త్రావువేళఁ బూ
ర్తిగ నొక గ్రుక్కకేనియు భరింపగరావని లేదొ యన్న న
న్నగబడిగచూచి చిన్న నగవిమ్మగు సొమ్ముగఁ గందపద్దె మ
ల్లగ నవి చాలుఁబొమ్మని యతక్షితయౌ యవనిం దలంచెదన్॥

అనివినుతించి గ్రంథము వ్రాయుచుంటిను కాబట్టినాకు మోక్షము లేక స్వర్గము లేక వ్యావహారికమైన వనులు కావలసియున్నచో దేవతాను

గ్రహామవసరమై యున్నది. అందులకు ముందు పారమార్థిక శరీరము నందలి దేవతలను గుర్తింపవలసియున్నది.

కర్మజ్ఞాన ఉపాసనా కాండలని మూడువిధములుగ వేదోదితము విభాగింపబడినది. "ఆచారహీనం నపునంతి వేదాః" అన్నట్లు కర్మకు ఆచారము ప్రధానము. వేదోక్తమైనది ఆచారము. ఇట్టి ఆచారవంతుని ఏదియు ఏమియు చేయజాలదు. ఇందులకు నిదర్శనమైన కథ చూడుడు. ఒక ఋషికుమారుడు కృష్ణాజినము కప్పుకొని ఊయలనూగుచు చదువు కొనుచుండెను. అది గమనింపక వేటకువచ్చిన రాజకుమారుడు మృగ మనుకొని విషదిగ్ధబాణముతో కొట్టగా నాతడు క్రిందబడెను. అంత రాజ కుమారుడు భయపడి రాజధానిచేరి తన పెద్దలను కొందఱ గైకొని ఆ మునిపల్లెకుబోయి. ఆ కులపతి మర్యాద చేయదానికి మేము అనర్హులమని రాకుమారుడు బ్రహ్మహత్య చేసెనని దాని బోగొట్టుకొనునుపాయ మడుగ వచ్చితి మనిరి. ఇది యంతయువిని యా కులపతి మీ రెక్కడ బ్రహ్మ హత్యచేసితిరని అడిగెను. వారీ యాశ్రమముననే చదువుకొను కుఱ్ఱవానిని మావాడు మృగమను భ్రాంతితో గొట్టెననిరి. ఆ ముని తన విద్యార్థులనెల్ల జూపి వీరిలో మీ వాడు చంపిన దెవరినని యడిగెను. ఆ కొట్టినవాడు గుర్తించి ఈ పిల్లవాని కొట్టితిని, పడిపోయెను. ఎట్లు బ్రతికెనేని దిగ్భ్రాంతుడై యడుగ ఆ కులపతి చెప్పిన సమాధానము.

శా॥ ఆలస్యం బొకయింతలేదు శుచి యాహారంబు ధర్మక్రియా.... (భార)

అను పద్యమున ఆమునిబాలకుని శుచిత్వము నిరూపించెను. ఆచార మిట్టిది కావున ఇట్టివారిని ఎవ్వరు ఏమియు చేయజాలరు. దినమున కొక పారి సమృద్ధిగాగాని తేలికగా రెండు మార్లుగాని తినుమని ఆపస్తంభుల వారు చెప్పిరి. భారతమున భీష్ముడును - ఇరుమారు గుడుచుచు నెడనెడ

గుణవకయుంతు నాతండు సదోపవాసి - అని చెప్పెను. ఆ పక్షములో కొంద ఱొక పర్యాయము నిరుత్తావుదురు. కొంద రదియు సమ్మతింపరు. అట్టి నియమముగలవారి తపము సాగును, మితిమీరి తిన్నవారి తిండి వైశ్వానరు డెంతయని జీర్ణము చేయగలడు ? అనగా అగ్నిమాంద్యము కలిగి అజీర్ణరోగము పుట్టును. కాబట్టి వేళదాటక ఇట్టి సత్కార్యాచరణ సంపన్నులు ఉత్తము లగుచున్నారు. నేడు ఇవన్నియు తారుమారైనవి. "అలస్యా దన్నదోషాచ్చ మృత్యు ర్విప్రాన్జిఘాంసతి" అనిపరాశర మహా ముని చెప్పెను. ఈ అన్నియు దోషములు నేడు మనల హింసింప కలుగు చున్నవి. ఇట్లే ఈకాలమెల్ల చెడుననరాదు. వ్యాసుడు అర్గురు శక పురు షుల పేర్కొనెను. అందు విజయాభినంధనుడు అను వాని శకమున యంత్రముక్త ప్రేలదని పేర్కొనెను. అనగా గరిక మంత్రించివేసి శత్రువుల నాతడు జయించును. ఇతడు కలియుగమున కృతయుగ లక్ష ణము నడుపగలడని తెలియుచున్నది. కావున కులమత భేదము లంత రించవు. వేదాదులుపోవు. కావున ఈశ్వరశక్తి మిక్కిలి ఉన్నతమైనది, చిత్రమైనదికదా !

5

విద్యలన్నియు కాండత్రయరూపకముగ నున్నవి. కాని విమర్శించి చూచినచో రెండేకాండలు : కర్మ - జ్ఞానకాండలు తేలుచున్నవి. పూర్వ జన్మలో చేసిన కర్మనుబట్టి బోధప్రాప్తి కలుగుచుండును. జ్ఞానులకు కర్మ అక్కరలేదని లోకమున వాడుకకలదు. కాని యది యవిమృష్టము. "నిత్యా న్యధిగతాని కర్మాణి" అని ఉపనిషద్వాక్యములో శంకరులు నిత్యకర్మలు మా వారలు బాగుగా వ్రాసిరి కాన, అవి మేము వ్రాయుటలేదు. అవితప్పక ఆచరింపదగినవని వాక్రుచ్చిరి. "ప్రయోజన మనుద్దిశ్య న మందోపి ప్రవర్తతే" అన్నట్లు ఫలము నపేక్షింపక ముందు అనుకొనక యెట్టి పనియు జరుగదుగదా! "ఉపాత్త దురితక్షయార్థములు కర్మలు" అని శంకరులు నిత్యములకును ఫలమును జెప్పిరి. మరి కామ్యకర్మలు అవసరము వచ్చినపుడు చేయవలసియే యున్నది. "కామ్యాని చ ఫలార్థినాం" అని కామ్య కర్మలు చేయుటకూడ గృహస్థులకు నావశ్యకములని చెప్పిరి. నిత్యనైమిత్తిక కర్మవలన పాపక్షయము జరుగుచున్నది. శంకరుల భాష్యముతో కర్మలేదని బ్రహ్మమేనని లోకము భావించి చెడుచున్నది. కాననదియే పరమార్థమవరాదని రామానుజులు సగుణబ్రహ్మోపాసనమైన విశిష్టాద్వైతమును నిరూపించెను.

"అద్వైత మాగమ శిరోభి రుపాసనాయముక్తం, తదేవ పరమార్థతయా న వాచ్యం" అని సీల కంఠుడనెను. అద్వైతోపాసనతో విశిష్టాద్వైతము ముక్తి యని వారి భావము. ఉపాసన సోఽహంభావముతో నుండవలెనని శ్రుతి చెప్పుచున్నది. కాని అదియే పరమార్థముకాదని వారి అభిప్రాయము. అందు నేనే దేవతనని యుపాసించిన దేవతవంటివాడగు

నని తేలుచున్నది. ఉపాసన యన నూరకుండుటయని యర్థము సాక్షి రూపసంస్థానము. ఇదియే అద్వైతము. అద్వైతానుభవము లేక కర్మోపాసుల విడుచుటవలన కొందఱు చెడుచున్నారని వారి నుద్ధరింప విశిష్టాద్వైతము బయలుదేరినది. నాల్గువేదములు చెప్పుచున్న మహావాక్యములు 1. ప్రజ్ఞానం బ్రహ్మ, 2, అహంబ్రహ్మాస్మి, 3. తత్త్వమసి, 4. అయమాత్మా బ్రహ్మ. వీని కర్థమొక్కటియే అగుచున్నది. ప్రతివాక్యమునందు జీవ-బ్రహ్మల కేకత్వము బోధింపబడుచున్నది. పరోక్ష ప్రత్యక్షములగు బ్రహ్మ జీవులకు ఏకత్వ మెట్లు కుదురును ? అన్నచో అర్థము కుదరని చోట లక్షణావృత్తితో కుదుర్చుకొనవచ్చునని తర్కాదిశాస్త్రములు చెప్పుచున్నవి. ఆ శాస్త్రములలో జహల్లక్షణ యని, అజహల్లక్షణయనీ రెంటి నొప్పుకొనిరి. మూడవదియగు జహదజహల్లక్షణ జీవబ్రహ్మైక్యమునుచెప్పు వేదాంతుల మతమునందేగాని మా కవసరములేదనిరి. ఏ శాస్త్రములు నొప్పుకొనని జహదజహల్లక్షణతో మీరెట్లు పక్షమును సాధించుకొనెదరన, వేదాంతులు ఈ మూడవ లక్షణము మీకును కావలసినదియే, అది ప్రత్యభిజ్ఞ యని పదాంతరముతో సాధించుకొని ఇది కలదనిరి. వారి ప్రత్యభిజ్ఞయే మాకు మూడవలక్షణమని వేదాంతు లనెదరు. సుబ్బయ్య అనబడు ఒక వ్యక్తిని ఒకచోట ఒకరకముగను, మరియొకచోట మరియొక రకముగను చూచినను కాలభేద, వేషభేదమేతప్ప అసలు సుబ్బయ్య మారుటలేదుకదా ! కనుక దీనికి జహదజహల్లక్షణలు పనికిరావు. కనుక దీనికి సమన్వయము కుదుర్చుటకు తార్కికులు, "ప్రత్యభిజ్ఞ" అనుదానిని కల్పించిరి. ఇది వేదాంతుల జహదజహల్లక్షణము తోనే చేరుచున్నది. దీనికి ఉదాహరణ ఒక కథ చూడుడు.

దేవతలు, రాక్షసులు కలసి ఇంద్రుని - విరోచనుని బ్రహ్మదగ్గర తత్త్వోపదేశమునకు పంపిరి. అంత బ్రహ్మ ఒకతొట్టిలో నీరుపోసి వారిని తొంగిచూడు మనెనట. వారికి వారి ప్రతిబింబమే కన్పించినదట. ఆ

పిమ్మట వారి నింక్తను బాగుగ అలంకరించి మరల చూడుమనెనట. ఇప్పు డింకను వారి ప్రతిబింబము బాగున్నదట. ఇదే తత్త్వము బొమ్మని బ్రహ్మ చెప్పెనట. అంత విరోచనుడు "అర్ధకామౌ పురుషార్ధౌ" - అని భావించి సొమ్ములతో అలంకరణముతో భోగసాధనములతో నుత్తములుగ నుండు టయే తత్త్వార్థమని రాక్షసులకు బోధచేసెనట. కాని ఇంద్రుడు మాత్రము ఆలోచనలో పడెనట. వట్టిముఖము-అలంకరించిన ముఖము తేడా చూచి బ్రహ్మవస్తువు ఒకటేననియు, ఉపాధియందు భేదమున్నదనియు గ్రహించి అయినను బ్రహ్మనడుగుదమని పోయెనట. "చతుర్వ్యాకం గురుర్వ్యయా" అని నాలుగుసార్లు పోయి సందేహములన్నియు నివృత్తి చేసికొనెనట. కనుక నిట్టి అర్థముల ముడివిప్పుటకే జహదజహల్లక్షణ మేర్పడినది.

భారతమున భీష్ముడు - 24 వది మాయ. 25వది జీవుడు. 26వది ఈశ్వరత్వము. ఇరువదియైదవతత్త్వము ఇరువది యారవ తత్త్వము నెరిగిన నిరువదియేడవ తత్త్వమగును అని చెప్పెను. 25వ తత్త్వము నల్పజ్ఞత్వా దులు, 26వ తత్త్వము సర్వజ్ఞత్వాదులు వదలిన శుద్ధచైతన్యమున కాయన 27వ తత్త్వమని పేరుపెట్టెను. ఆస్థితి ననుభవించువరకు కర్మములు, ప్రారబ్ధములు విడనేరవు. "ప్రారబ్ధం భోగతో నశ్యేత్" అని పురాణములు చెప్పుచున్నవి. జ్ఞానియైనను శరీర ప్రారబ్ధము తప్పదని, అది మనకువలె జ్ఞానికి బాధకముకాదని ప్రాజ్ఞులు చెప్పుచున్నారు. యముని రావణు డొక సారి - "పురుషుడు కర్తయే దురితపుంజ మొనర్ప" అని ప్రశ్నించెనట. మరి దోషమునకు కర్త కాకున్న, పుణ్యమునకు కర్త యగుచున్నాడా? అను ప్రశ్నములేదా? పుణ్యమునకుకూడ కర్త కాదనియే సారాంశము. ఏలన-

శ్లో॥ జానామి ధర్మం నచ మే ప్రవృత్తిః
జానామ్యధర్మం నచమే నివృత్తిః ॥

కేనాఽపి దేవేన హృది స్థితేన
యథా నియుక్తోఽస్మి తథా కరోమి ॥

అని యభియుక్తులు భావింపమనుచున్నారు. సాంఖ్యమున 25 తత్వములు చెప్పబడినవి అందు 24 వది మాయ, 25వది పురుషుడు. మాయతో కలసిన బంధము—సంసారమునకు దారితీయును. మాయతో కలియకున్న ముక్తి లభించును ఈ సాంఖ్యమతము వారు సుఖదుఃఖములు అంతఃకరణ ధర్మములని నిరూపించగా శంకరులు వారిని "సాంఖ్యా వివేకినః" అని మెచ్చిరి. ఇవి జీవుని లక్షణములని తర్కాదుల మతము. కాబట్టి జీవుడు సాంఖ్యులప్రకారము జ్ఞానియై మాయను వదలుటయే మోక్షము. అనగా బౌద్ధాదులు. అంతకు మనుపును శుద్ధుడగు జీవుని మాయ యెట్లు సంసారమునకు దిగిచినదో - అట్లే ఇపుడును శుద్ధుడవు నా జీవుని మాయ సంసరణమున దిగిచిన జీవుడు మరల సాధనచేసి మోక్షము సంపాదింపవలసి వచ్చునుగదా ! ఈ నిత్యముకాని మోక్షమునకు మాటిమాటి కాసించి శ్రమ మెనయుటకన్న జీవు డిప్పుడున్నట్లే యుండుట మంచిది-అని పూర్వపక్షము చేసిరి. దీనికిపైన యోగమతమువారు 26 తత్వములని నిరూపించిరి. ఒకసారి ముక్తుడగు జీవుని మాయ లోబరచుకొనకుండ 26 వ తత్త్వమగు ఈశ్వరుడు నియమించునని వారి మతము. సజాతీయ, విజాతీయ, స్వగత భేదరహితమైనది బ్రహ్మస్వరూపము. మరియు సచ్చిదానందరూపమైనది బ్రహ్మ స్వరూపము. మన మేదేని వస్తువు ననుభవించునపుడు వచ్చిన యానందము, మనోవృత్తి అగిసపిమ్మట వచ్చిన అనందమని గ్రహింపవలెను. కాని ఆవస్తువునుండియే అట్టి యానందము లభ్యమగుటలేదు. కుక్క ఎముక కొరికి కొరికి చిగుళ్ళు నొప్పిపుట్టి అందునుండి స్రవించిన రక్తమునే బహురుచ్యముగానున్నది, ఎముక యని తినుట వంటిది. కనుక అంతఃకరణము మనస్సు మొదలైన దానివలన మనకు వస్తువిషయక జ్ఞానము కలుగును. ఇంద్రియముల ద్వారమున కలిగిన జన్యజ్ఞానమును

ఆపినపుడు ప్రజ్ఞానమాభాసించును. ఇది ఎట్లున్నదన పిల్లకాల్వల కట్టివేసి నపుడు ఆనకట్టలోని నీరు భాసించినట్లు. ఇక యోగమతమే విశిష్టాద్వైత మని భావింపవచ్చును. "ఏతేన యోగః ప్రత్యాఖ్యాతః" అని వ్యాసులు నుడివిరి. అద్వైతమతమునుగూర్చి చెప్పునపుడు ఇతరులతు - గొంగళిలో వేసికట్టి ఏటిలో పడవేసినట్లుండునని గౌడపాదాచార్యులు సెలవిచ్చిరి. యోగులు అనుభవమునుగూర్చి -"ప్రకాశమానే పరమాత్మభానౌ। నశ్యత్య విద్యాతిమిరే సమస్తే॥ అహో బుధా నిర్మల దృష్టయోపి। కించిన్న పశ్యంతి జగత్సమగ్రం॥" సమాధిలో సత్య దృష్టికి ననుభవములో లేని జగము లోకుల యజ్ఞాన దృష్టిలో నున్న దాని వారు చెప్పనేల? అని యాక్షేపించిరి. కాబట్టి యోగ సమాధి యందు తా మనుభవించు బ్రహ్మముతప్ప ఇతర ప్రపంచ మేమియు కానరాదు. సత్యం తీర్థం, క్షమాతీర్థం, తీర్థమింద్రియ నిగ్రహః" — అని వ్యాసభట్టారకు లంత స్తీర్థములను పురాణములందు గొనియాడిరి. దానివలన అంతఃకరణ శుద్ధి యగును. బహి స్తీర్థములవలన శరీరశుద్ధి కలుగుచున్నది. ఆ రెండు శుద్ధులు యోగికి యోగసాధనములు. అంతస్తీర్థముల గొప్ప తనమును జెప్పుటకు నది యున్నవారికి బహి స్తీర్థము లక్కార్లేదని కూడననిరి.

6

శ్రీ భగవద్గీత యందు చరమశ్లోకము ప్రధానమని - "సర్వ ధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" - అని వైష్ణవులు భగవంతుడు చెప్పిన సూక్తిని ప్రధానముగ భావించుచున్నారు. "తదా స్తిమితం గంభీరం న తేజో న తమ స్తతం - అవాఖ్య మవభివ్రత్యం సత్కించి దవశిష్యతే"-అని భగవంతుడు స్వరూపస్థితిని వర్ణించెను. అట్టిదియే బ్రహ్మమని అద్వైతులు. దీని యర్థమును స్వయముగ ననుభవింపనగును. కాని తాను పుణ్యముసేయక దేవుడు సా కీయలేదని దరిద్రుడై దేవుని నిందింప రాదు. "అవశ్య మనుభో క్తవ్యం కృతం కర్మ శుభాశుభమ్" మంచిగాని చెడుగాని చేసిన దనుభవింపక తీరదుగదా: భగవంతుడు వెలుతురు కాని వాడు, చీకటి కానివాడు. ప్రపంచమంతయు నిండియున్నాడు. అనభి వ్రఖ్యము అన స్పష్టముగ నిరూపించుటకు శక్యముకానివాడు. అనాఖ్యుడు, స్తిమితుడు, గంభీరుడు - ఇట్లు చెప్పుచున్న నాస్తికుల మతమే యన వలసి వచ్చుచున్నది అను శంక నిరాసించుచు "సత్కించ మవశిష్యతే" అని సిద్ధాంతమును చెప్పిరి. సత్ అనగా ఇట్లు విమర్శించి మీ రేమియు లేధను వస్తువు. అది లేనిదే లేనిదాని ననుభవించునది ఏది? అదియే బ్రహ్మమని స్వామి యభిప్రాయము. గీతయందు భగవంతుడు, జ్ఞాని నాయొక్క స్వరూపమే యనెను. అట్టి జ్ఞానికాని వానికి తన్ను గొల్చి కృతార్థుడగుటకు భగవంతుడు కొన్ని మతములు చెప్పెను. మొదటిది కైంకర్యమతము ఇందు భక్తుడు భగవంతునికి జీతగానివంటి వాడు. తన కృత్యమంతయు భగవంతునికి చేయవలసిన దనియే భక్తుడు నిర్వర్తించిన, భక్తునకు కావలసిన వన్నియు భగవంతుడు ఇవ్వ

గలడు. ఇదియే - "యోగక్షేమం వహామ్యహం" అను భగవంతునిమాట కర్థము. ఒకరిపని యొకరు చేయుట కుదర దనువారు కర్మముల నుపాసనల తనపని యనియే చేసి ఓం తత్సత్ అని బ్రహ్మార్పణము చేయవలెను. అట్లు చేయుట తన ధనమును బ్యాంకులో నుంచుకొన్నట్లు. భగవంతుని యధికారములోనుండు ధనాగారమునుండి ధనము స్వీకరించునట్లు మనకు కావలసినప్పుడు వానినుండి స్వీకరింపవచ్చును. ఆ నమ్మకము లేనివాడు తాను సత్కార్మము చేసి దాని ఫలము అని కర్మమతసిద్ధాంతము చేయును. అపాయములేని యుపాయముల నెఱిగిన జ్ఞాని యీ కర్మముల బెడబాచు కొను నుపాయమును దేవుడే చెప్పియున్నాడు.

శ్లో॥ అధిష్ఠానం తథాకర్తా కరణంచ పృథగ్విధం
విశిధాచ పృథక్చేష్టా దైవం చైవాత్ర పంచమం॥

అని మంచిపనికాని, చెడుపనికాని చేయుటకు ఐదు కలవవలెను. కావున నేపనియైనను అయిదింటి కలయికవలననే జరుగుచున్నది అధిష్ఠానమనగా శరీరము కర్త యనగా జీవుడు. కరణములు ఇంద్రియములు. ఇక చేష్టలు వేఱు. అవి వాయువీయములు కర్మేంద్రియ చేష్టలు. ఈ నాలుగు కాక దైవము మరొకటి యున్నది. మన సర్వేంద్రియములకు అధిదేవతలు గలరు. వీరి ప్రేరణచే పని జరుగుచున్నది. కంటికి సూర్యుడు, చేతికి ఇంద్రుడు, కాళ్ళకు విష్ణువు, ఇట్లు అధిపతులను చెప్పియుండిరి. కనుక ఈ ఐదింటి కలయికవలన పనులు జరుగుచున్నవి. తప్పుకాని ఒప్పుకాని ఈ ఐదింటివలన జరిగినచో - ఆయా తప్పొప్పులు ఎవరివని నిర్ణయింపనగును ఇది జాయింటు వ్యాపారమువంటిది. జాయింటుదారెల్ల లెక్కసిలేనివారైనచో దండుగ కెవడు బాధ్యుడు ? కాన నేను చేసితినని ఒకరు ఒప్పుకొనుటయే తప్పు. ఈ యుపాయము గీతలో భగవంతుడు బోధించియే యున్నాడు. ఎవరు జీవుడు వేఱు, శరీరము వేఱు అని

భావింపగలరో వారు యమునిదగ్గర తప్పులన్నింటికి తప్పించుకొనవచ్చు నట. అనగా జీవుడు జ్ఞానమున బ్రహ్మమయుడై యుండ అధిష్ఠానమను శరీరాదులు నశింప కర్మ మెవరిది ! అని అభిప్రాయము.

ఓంకారము ప్రకృతి పురుషులమధ్య ప్రారంభమై బ్రహ్మయందు లీనమగును. ఈ ఓంకారము పరాపరబ్రహ్మస్వరూపము. ఇది వ్యాకరణ ప్రకారము అవతి ధాతువుమీద ఔణాదిక ప్రత్యయము చేర్చగా నేర్పడును సోఽహం అను పదమునందలి ము వదలి ఓకారము మొదలుకొని హకారముమీద మకారముతో ప్రత్యాహారముచేయ ఓమ్ అని యేర్పడుచున్నది. యనియు పెద్దలు చెప్పుదురు. ఈ ఓకారజపము సన్యాసులకే యుక్తము. గృహస్థులు దీని నేమంత్రమునకైన నుచేర్చి జపించవలయును. సంసారులు గాయత్రిచేయుటయుక్తము. దానిచేవారు తరింపవలయును."గాతారం. త్రాయతే ఇతి గాయత్రి" కనుక వారిని తరింపజేయగలదు. ఈ గాయత్రి సూర్యుని చూచుచు చేయుటమంచిది. గాయత్రీ మంత్రమునకు సూర్యపరముగా, శివపరముగా అర్థములు చెప్పుట గమనింపదగినది. పనులయందు ప్రబోధించువారు సూర్యుడు అట్లే గాయత్రి కూడ అని సూర్యపరముగ అర్థము. "భర్గస్య దేవస్య ధీమహి" అను భర్గుడను పేరుగల శివుని-అని శివపరముగ అర్థము చెప్పుట కలదు. కాబట్టి అద్వైతులు శైవులు చెప్పుచున్న అర్థమునుబట్టి - బుద్ధిని ప్రేరేపించు ఒకడు - అనగానే ద్వైత మతము వచ్చుచున్నది. కాని ఈ మంత్రము అద్వైతులకే ముందు అన్వయించుచున్నది. కాని శాక్తేయులు గాయత్రీయని స్త్రీలింగముగ ఆ మంత్రమును భావించిరి. "ముక్తా విద్రుమ......" అని స్త్రీరూపముగ భావించుట జరిగినది. ఇచట శివస్వరూపమును ఆగమ శాస్త్రము చెప్పుచున్నది. మా బుద్ధివృత్తులను ప్రేరణముచేయు దేవుడు అన్న దేవునకు కర్తృత్వము వచ్చునుగదా ! అద్వైతులకు ఈ మంత్ర సమన్వయ మెట్లని

ప్రశ్నింపవచ్చును ? కర్తృత్వాదు లారోపితములు. దీనికి పురాణముల యందు వ్యాసులు —

"అనాపన్న వికారస్స న్నయస్కాంతవ దేవయః
బుద్ధ్యాదీం శ్చాలయేత్ప్రత్యక్సోఽహ మిత్యవధారయ"

అని చెప్పినచోట చాలయేత్తని కర్తృత్వ మారోపితము. ఇది అనాపన్న వికారుడు అను విశేషణమువలన ప్రాప్తపగుచున్న, అయస్కాంత దృష్టాంతము నట్టిదియే ! ఈ బ్రహ్మవస్తువు అయస్కాంతముతో పోల్చ చెప్పబడినది. అయస్కాంతము వికారము లేనిది. చలనము లేదు. కదలు వస్తువునకు దాని దగ్గర చలనము కలుగుచున్నది. అట్టి శక్తినిర్వికారమగు అయస్కాంతమందు కల్పించుటకన్న తత్సమీపమున గదలు శక్తియందే కల్పించుట యుక్తము. అట్లే బ్రహ్మవస్తువు సర్వగతమై యున్నది. దాని సన్నిధానమున నితర తత్వములు చలించుచున్నవి. అవి—

"యస్యసన్నిధి మాత్రేణ
దేహేంద్రియ మనోధియః
విషయేషుచ ప్రవర్తంతే
తద్బ్రహ్మే త్యవధారయ॥"

అని బ్రహ్మసాన్నిధ్యముచే అన్నియు ప్రవర్తించుచున్నవి. కాని బ్రహ్మము మాత్రము నిర్వికారమని భావించవలయును.

ఇక గాయత్రిజపము తర్వాత ఆగమశాస్త్రము అనేక మంత్రములు చూపుచున్నది. నమశ్శివాయ మొదలగునవి చేయమనుచున్నది. కాని విద్యారణ్యులు పంచాక్షరీమంత్రము నామమంత్రముకన్న వేదమంత్రము మంచిదని అభిప్రాయపడిరి. "త్రియంబకం యజామహే" అని నే జపిం

చెడ ననిరి, "నమశ్ శివాయ ఓం" అనగా మశ్ శబ్దమునకు నాది అని అర్థము. శివాయ అనగా శివః అని విభక్తి పరిణామము, మశ్=నాది న= ఏదియు లేదు. ఓం. ఆ నేను శివః శివుడనే అనుటయే నమశ్శివాయ మంత్రార్థమని శ్రీ పద్మపాదాచార్యులు నిరూపించుచున్నారు. నమోనారాయణాయ అన్నను నమశ్శివాయ అన్నను అట్లే సమన్వయించుకొన నగును. బ్రహ్మవస్తువు తాను ఒక్కటియే యని యనుభవింపవలెను. కొన్ని మంత్రములకు ఆగమశాస్త్రము ద్విముఖములు రెండేసి యర్థములు చెప్పినది. దుర్గను ధ్యానించునపుడు ఆమెను అకుపచ్చ రంగుతోను బంగారు రంగుతోడను ఉపాసించవచ్చునని రెండు ధ్యానములున్నవి. "ఉత్తిష్ఠ పురుషీ హేమప్రఖ్యాం" అని ఒక ధ్యానము "నవ దూర్వా సదృశీ" అని మరియొక మంత్రముతో కుండలిని లేపి "భయం మే సముపస్థితం, యది శక్యం అశక్యం వా।" అని జపించినచో ఘోరరూప పరాశక్తి వల్లన సంసారభయము పోగొట్టుకొనవచ్చును. దూర్వాస దృశియగు దుర్గవలన లౌకికభయము పోగొట్టుకొనవచ్చును. ఈ పరాశక్తివలన భుక్తి ముక్తి లభించునని శాక్తశాస్త్రము చెప్పుచున్నది. శంకరులు సౌందర్యలహరిలో—

శ్లో॥ సరం వర్షీయాంసం నయనవిరసం నర్మసు జడం
తవాపాంగా లోకే పతిత మనుధావంతి శతశః
గలద్వేణీబంధాః కుచకలశవిస్రస్తసిచయాః
హఠాత్త్రుట్యత్కాంచ్యో విగలిత దుకూలా యువతయః

అని వర్ణించెను. యోగమున భ్రూమధ్యమునకు దగ్గర వచ్చినపుడు సాధకునకు రుద్రకన్యలు కనబడుచున్నారు. వారికి లొంగక సాధకుడున్నచో పరాశక్తి యనుగ్రహమున శివస్థానము నెనయగలడు. లేకున్న నెత్తియడచుట సంభవించి చెడిపోగలడు. ఆ శక్తిని—

తురీయా కాపి త్వం దురధిగమన నిస్సీమ మహిమా
మహామాయావిశ్వం భ్రమయసి పరబ్రహ్మ మహిషి"

అని వర్ణించుచున్నారు. ఇదియే పరాశక్తిగ భావింపబడుచున్నది. కామేశ్వరి యనియు శాక్తేయమున గలదు. ఇట్టి పరాశక్తివలన సాధకులు మోక్షమునొందుట గలదు. భగవంతుని ధ్యానము చేయువారు వారివారి ఆశయముల ననుసరించి ఆయా దేవతల నాయా రూపములలో ధ్యానింపవలెను. అనగా ఐహిక. ఆముష్మిక లేక పరార్ధ అపార్థములకు మంత్రములు వేర్వేరుగ నున్నవి. శివుని శాంతమూర్తి పార్వతీ సహితునిగ "శాంతం పద్మాసనస్థం"-అను శ్లోకముతో ధ్యానింపవచ్చును. కైవల్యాపేక్షి ప్రపంచ మంతయు నిండియున్న స్వరూపముగ "చైతన్యం పరిపూర్ణ మేక మనిశం"— అను శ్లోకముతో ధ్యానింపవలెను. లోకమున నెన్నియో మంత్రములున్నవి. ఏ ఒకదాని తోడనైనను మోక్షము లభించగలదు. కాని బ్రహ్మచర్యమునందే ఆయా మంత్రోపాసన చేసి వివాహమాడుట మంచిది. ఏలన లౌకిక వ్యవహారములోబడి మంత్రోపాసన చేయుట కష్టమగుచున్నది. అందుకనియే బ్రహ్మచర్యమున తపము, జపము చేయుట మంచిది, మరియు 14 ఏళ్ళ లోపు పిల్లలు చేయు పాపమంతయు తల్లిదండ్రుల కంటునని మాండవ్యుడు పేర్కొనెను. కాన చిన్నతనములోనుపనయనము చేసి ఆవటువు గాయత్రీసిద్ధుడగునట్లు.ఇతరమంత్రముల జపించునట్లు యోగాభ్యాసము చేయునట్లు తల్లిదండ్రులుగాని, గురువుగాని శ్రద్ధ తీసికొనవలెను. ఏదియో ఒకచైతన్యమువలన శరీరము కదలుచున్నది.కానిశరీరము జడమని అందఱకు తెలియును శరీరమున సంవిత్తు అనగా తెలివి, అను షది యున్నది. దాని సన్నిధితో లోకవ్యవహారమంతయు జరుగుచున్నది. మన సామెతలన్నియు వేదశాస్త్ర సారములని గ్రహింపవలయును. "ఒళ్లు ఎరుగని శివం వస్తుందా" అని అనుచున్నాము. మనకు తెలియకుండ కామ క్రోధములు జనింపవు. అంతఃకరణ మున్నపుడు కామక్రోధాది భావములు

పుట్టక మానవు. వీటిని పుట్టుచుండగనె తెలిసికొని నిరోధించుట పెద్దల గొప్పతనము కాన నన్నయభట్టు—

కం. అవశగతి కామరోషా
దివికారము లొందవినను మదిం ధర్మగతి
ప్రవిహాతి గానీక నడచు
దివిజేంద్ర తనూజు డద్వితీయుడు పేర్మిన్॥

అని పుట్టిన కామక్రోధాదుల వలన ధర్మమును చెడకుండ కాపాడుకొను కర్తృత్వము అర్జునునియందు చిత్రించెనని గమనింపవలసియున్నది.

భారతమున కౌరవపాండవుల కథ యగుచుండగా నా గ్రంథము త్రిపురాసుర సంహారముతో నేల అంతమగుచున్నదని సందేహము రావచ్చును. అందులకు సమాధానముగ గచ్ఛద్వ్యాఖ్యాత అందలి ఆత్మార్థము గ్రహింపవలయునని నుడివెను. ఇచట త్రిపురములనగా స్థూల—సూక్ష్మ-కారణ శరీరములని అర్థము. శివుడు మూడుసార్లు త్రిపురాసుర సంహారము గావించినట్లు అచ్చట గలదు. మొదట శివానుగ్రహము వలన శారీరక రోగములు నశించి దేహశుద్ధి కావలయును. పిమ్మట కామక్రోధాదులు నశించి మానవశుద్ధి యగుట సూచింపబడినది. మూడవసారి కారణ శరీరము నాపరించిన తమస్సు నాశనముచేయ బడుట వర్ణింపబడినది. ఇదియే త్రిపురాసుర సంహార రహస్యము.

ధర్మరాజు జూదమున నోడిపోవునపుడు దుర్యోధనుడు పైపుట్టముల పెట్టిపొమ్మన నట్లుచేసి కట్టుపుట్టములతో పోయినట్లు కలదుగదా! పాచికల నెట్లు దె కొని పోగలిగెను? పాచికల నిక్కడనే వైచిపోయిన విరాటునకు వెండిపాచికలు, రత్నమయములు బంగారుపాచికలు చూపించినట్లు కలదుగదా! ఆ సందర్భమెట్లు కుదురునని సందేహము కల్గుచున్నది. కాని వ్యాసుని బ్రహ్మసూత్రములయందలి భావమును చూచినచో జీవుడు

శరీరమువదలి పోవునపుడు 17 తత్త్వముల మూట తీసికొని పోవునట. ఈ వేదాంత అర్థమే యిచ్చట నున్నది. 17 తత్త్వములనగా జ్ఞానేంద్రియములు, కర్మేంద్రియములు, ప్రాణపంచకములు, మనస్సు, బుద్ధులు.

ఒక బ్రాహ్మణుడు దారింబోవుచు మధ్యమందున్న ఒక గాడిద పిల్లను గొట్టగా, అది తల్లితో నీ బ్రాహ్మణుడు నన్ను కొట్టెనని చెప్పుకొన, ఆ తల్లి వాడు బ్రాహ్మణుడైన నిన్నేల కొట్టును ? వాడు చండాలుడు అనెను. అది విని సర్వభాషావిజ్ఞానము గల బ్రాహ్మణుడు ఆతని తండ్రి వద్దకుబోయి యా కథ చెప్పి నేనెట్లు చండాలుడ నైతినని అడుగ నాతడు నీ తల్లి నడుగుమనెను. వాడట్లు చేయ వానితల్లి ఒకప్పుడు తానొక మంగలితో కలిసినట్లు సూచించెను. దానివలన నతడు ఖిన్నుడై విలోమజాతి జాతుడగుటవలన చండాలత్వము నిర్ణయించుకొని తండ్రి నడుగగ, ఆతడొక శ్లోకము చెప్పి ఇంద్రు నుపాసింపుమనెను. ఆతడట్లు జపింపగా ఇంద్రుడువచ్చి ఏమికావలయునని యడుగ, వాడు నేనుశుద్ధబ్రాహ్మణుడగునట్లు వరమిమ్మనెను. అంత ఇంద్రుడు ఈ తపమునకు నూరురెట్లు తపము చేసిన శూద్రుడవయ్యెదవు. దానికి పదిరెట్లు చేసిన సచ్ఛూద్రుడవగుదువు దానికి పదిరెట్లుచేసిన వైశ్యుడ వయ్యెదవు. దానికి పదిరెట్లు తపించి క్షత్రియుడవు కాగలవు. దానికి పదిరెట్లయిన దుర్బ్రాహ్మణుడ వయ్యెదవు. దానికి నూరురెట్లయిన సద్బ్రాహ్మణుడ వయ్యెదవు. అంతదాక శరీరమిది నిలువదు. ఏవియేని భోగ్యములు కోరుకొమ్ము, ఇచ్చెదననిన వా డందుల కొప్పక ఎన్నిమార్లు దేవేంద్రుడు వచ్చినను తక్కు వరముల నిరసించి చివరకు శరీరము నిలువక పడిపోవుచుండ, ఇంద్రుడువచ్చి దయతో నిడు వరప్రసాదము నంగీకరించి యిప్పటికి త్రిశంకు మండలమున చండదేవుడను పేరుతోనుండి భోగముల ననుభవించుచు పూర్ణిమనాడు చంద్రదర్శనము చేయని స్త్రీల పున్నెముల ప్రోవుచేసికొను చున్నాడని భారతమున గలదు. కావున పంచాంగములలో "స్త్రీణాం చంద్రదర్శనమ్" అనివ్రాయు చున్నారు. అది యెవరు పరిగణించుటలేదు. అట్టు లుండనిండడి. ఈ

కథవలన బ్రాహ్మణత్వ మెంత కష్టపడిన వచ్చినదో తెలియుచున్నది. దాని మనము లెక్కచేయక వట్టిభోగభాగ్యములతో పోగొట్టుకొనుట చింత్యము. కావున భారతము సర్వము నొక అక్షరమైనను తీసివేయరాని సత్యేతిహాసము. ఈ భారతము వ్యాసుడు చెప్పుచుండగా వినాయకుడు వ్రాసినట్లు చెప్పుచుందురు. వినాయకుడు ఆపకుండ చెప్పిననె వ్రాయుదుననెనట. అంత వ్యాసుడు—అర్థముచేసికొని మాత్రమే వ్రాయవలెను గాని లేకున్న తలపగులునని శాపమిచ్చెనట. కావున వినాయకుడు అర్థముచేసికొని వ్రాయులోపల వ్యాసుడు తర్వాతి ఘట్టము నూహించుకొని యుంచుకొనెడివాడట. ఇట్టి ఘట్టములకే వ్యాసఘట్టములని పేరు. ఇది "లేఖ్యంబైన ఆమ్నాయము" అని తిక్కనగారు వచించిరి. ఆయా కవులు రచించిన గ్రంథములయందు రసానుసారముగ పాత్రపోషణము సేయబడును. పురాణములు, ఇతిహాసములు సత్యములు. ఆయా పాత్రల యందలి మంచితనమునే ఆదర్శముగనుంచుకొని నడువవలసియున్నది. కవులలో కల్పనలుండును. పురాణములలోని వర్ణనములున్ను సత్యములని చెప్పనగును.

భారతములోని చివరికథ—సర్పయాగ మెందులకు? అను ప్రశ్నకు సమాధానమం దున్నది. సర్పయాగము చేయగా జనమేజయునకు శరీరమంతయు బొల్లి మచ్చలు ఏర్పడినవట. అవి భారతము విన్నచో పోవునని చెప్పగా వినుట ప్రారంభించెను. అన్ని మచ్చలు పోయినవిగాని మూడు మాత్రము మిగిలినవి. అందులకు కారణ మేమని జనమే జయుడువ్యాసుని అడుగగ— నీకు భారతమున మూడు సందేహములు మిగిలినట్లున్నవి. వానిని చెప్పుమనెను. అంత జనమేజయుడు తన మూడు సందేహములు వరుసగా నిట్లు చెప్పెను.

1. సైంధవవధ రోజున భీముడు పదివేల ఏనుగులను ఆకాశమున కెగురవేయుట అతిశయోక్తి అనుకొంటిననెను. వ్యాసుడు వాని నన్నిటిని జనమేజయునకు ప్రత్యక్షముగ నేటికిని కలవని దివ్యదృష్టిచూపి యొప్పించెను. 2. ఆశ్రమవాసపర్వమున 18 ఏళ్ళకు మును చనిపోయిన వారిని

అంపజీకి చూపుట అసాధ్యమని సంశయము. వ్యాసుడు వారిని జనమేజయునకు మరల చూపి, వారి యింట నొకరోజుంపునట్లు చేసి యొప్పించెను. ఈ రెంటిలో రెండు మచ్చలు పోయినవి. 3. కృష్ణరాయబారమున కౌరవులకు అందఱు చెప్పిచూచిరి కాని, వ్యాసుడు చెప్పిన వినకుందురా ? అని సందేహము వచ్చినది. దానికి వ్యాసుడు నేను చెప్పినమాత్రము వినదరా ? అట్లు నీవు విననవా ! అని ప్రశ్నించి, అందులకు కలియుగమున అశ్వమేధయాగము చేయరాదని నిషేధమున్నది అని జనమేజయునకు చెప్పెను. నా మాట నీవు నమ్మినచో నీ వశ్వమేధము చేయవలదని చెప్పి పోయెను.

తర్వాత మూడేండ్లకు ఒక దివ్యాశ్వము లభింపగ జనమేజయుడు ఉత్సాహముకలవాడై దాని నారంభించెను. గాయత్రీమంత్ర మంత్రితమగు నశ్వమును వదలిరి. అది దిగ్విజయముగ తిరిగిరాగ దానిని శ్రపణము చేసిరి. అపుడు రాణిని దాని వద్ద పండుకొన బెట్టుట అచారము. అంత అందలి గాయత్రిశక్తి రాణిలోనికి ప్రవేశించి వీర్యవంతులైన కుమారులు కల్గుదురు అని శాస్త్రము. కాని ప్రస్తుతము శ్రపణముచేసిన, ఆ మాంస ఖండములలో ఇంద్రుడు ఆవేశించి యుండెను. అవి కదలుట కదియే కారణమని బ్రాహ్మణులు చెప్పిరి. అంత జనమేజయుడు కోపోద్రిక్తుడై భార్యను, బ్రాహ్మణులను త్యజించెను. అపుడు వ్యాసుడువచ్చిచూచి కారణమేమని అడిగెను. జరిగినది జనమేజయుడు చెప్పి వ్యాసునిమాట నమ్మితిననగా ఆ మచ్చపోయినది వ్యాసముని రాణిని పుట్టింటినుండి తిరిగిరప్పించి బ్రాహ్మణుల బిలిపించి వారలనెల్ల సమాధానపరచి, పిమ్మట పిష్టపశువుతో మరల యాగముచేయించి అశ్వమేధ ఫలమును జనమేజయుడు పొందునట్లు చేసెను, అని భారతమున నున్నది. కాబట్టి భారతమును ప్రత్యక్ష ప్రమాణముగ భావింపవలయును. అట్లు నమ్మినవారికే దాని యందలి ఫలశ్రుతుల యుపయోగము కలుగును.

7

శ్లో॥ అకృశం కుచయోః, కృశ్నంవలగ్నే
విపులం చక్షుషి విస్తృతం నితంబే
అధరేఽరుణ మావిరస్తు చిత్తే
కరుణాశాలి కపాలి భాగధేయం॥

అని పార్వతిని ఒక కవి వర్ణించెను. కవిత్వము వ్యంగ్యప్రధాన ముగ నుండును. వేదములు శబ్దప్రధానములు. అందు ఒక శబ్దమున కొక యర్థమే చెప్పవలెను, కవిత్వముననో ? అనేకార్థములు వచ్చునట్లు చెప్ప వచ్చును. ఇక శక్తి స్వరూపము భ్రూమధ్యమున అర్ధనారీ శ్వరత్వముతో నుండును. అనాహతము నందు శివపార్వతుల వర్ణ నము జరుగును. సహస్రారముపైన దృశ్యాదృశ్యపీఠము కలదు. ఇది యోగిజనవేద్యమైనది. ఋషులుమాత్రమే చూడగలరు. మనలో అనేక మతములు పురుషప్రధానమైనవి కలవు. స్త్రీ ప్రధానమైన దొక్క శాక్తేయ మతము మాత్రమే కలదు. "ప్రకృతి అలింగ తజ్జనిత భంగులు లింగ ములు"—అన్నట్లు ప్రకృతికి లింగము లేదు. అట్లే బ్రహ్మస్వరూపము నకు వికారములేదు. అది అష్టమచక్రమందలి స్వరూపము. శివకేశవాభేదము ఇది "తదభిన్నా భిన్నస్య తదభిన్నత్వం"— అను న్యాయము ననుస రించి ఇద్దఱు ఒక్కటియే, అని అప్పయ్యదీక్షితులు నుడివిరి. బ్రహ్మాండ పురాణమున దేవి— భోగే భవాని పురుషేషు విష్ణుః క్రోధే చ కాళీ సమ రే చ దుర్గా— అని నాల్గుభాగములుగ చెప్పబడినది. శివునకు, శక్తికి భేదము లేదు. అందునుండి వచ్చినభాగము విష్ణువు. కావున శివకేశవా

భేదము సూచితమగుచునే యున్నది. త్రిమూర్తులలో నెక్కువ తక్కువలు లేవు. ఒకేమూర్తి మూడుభాగములుగ భాగింపబడినది. "ఏకైవ మూర్తిర్బిభిదే త్రిధాసా" యని కాళిదాసు నుడివెను.

సూతసంహితయందు జగద్విలక్షణస్థితి చాల గొప్పది. అది కలవారు గొప్పవారని చెప్పబడినది ఈ దృష్టితో ఋషులు గొప్పవా రగుచున్నారు వారికంటె దేవతలు, వీరిలో అష్టదిక్పాలకులు, వీరియందును ఇంద్రుడు, ఇంద్రునికంటెను బృహస్పతి, వీనికంటెను బ్రహ్మ, బ్రహ్మకంటెను విష్ణువు, విష్ణువుకంటె శివుడు గొప్పవాడుగ చెప్పబడుచున్నారు. కారణము పూర్వులకంటె ఉత్తరోత్తరులు ఎక్కువకాలము బ్రహ్మమయులుగ (జగద్విలక్షణస్థితి) నుండుటయే. శివుడు ఎల్లప్పుడు పార్వతిని తొడపై కూర్చుండబెట్టుకొని వేదాంతబోధ చేయుచుండును. అది లోకము బోధముకొఱకు తాను బ్రహ్మమయుడై బయట తద్వివరణ మొనర్చునని భావము. కనుకనే శివుడు బాహ్యాభ్యంతరములతో బ్రహ్మమయు డగుచున్నాడు. అందువలననే శివునకు స్థాణువని పేరు వచ్చినది. అందులకే శివుని "హరోం హరహర" అని కేకపెట్టవలసివచ్చినది. కావున సూతసంహిత శివప్రాముఖ్యము నుగ్గడించి చెప్పుచున్నది. మన సర్వశరీరమున ఇంద్రుడు బలాధికారి. ఆతని తిరస్కరించిన బలమంతరించును. నే నొకపరి ఇంద్రమంత్రమును జపించుచుండగ ఒకడు తిరస్కరించి జబ్బుపడి చివరకు ఇంద్రమంత్రోపాసనచే బలమునొంది బాగుపడెను. రాక్షసేంద్రుడైన బలి ఇంద్రుని జయించెను. కాని ఇంద్రాసనముపై కూర్చుండుటకు సంశయించియు రాక్షసప్రేరణచే నిది నాదికాదు, ఎప్పుడు దిగవలసి వచ్చిన నప్పుడే దిగిపోయెదనని దాని నెక్కెను, వామనుడు దానమడుగుటకు వచ్చినపుడు బలి — మీదై నా కరంబుంట మేల్గాదే — అని గర్వించెను. బలి కోరిక ననుసరించి శ్రీకృష్ణుడు వానికి ఇంద్రత్వము నొసగుటకుగా పాతాళమున కంపెను. కాని ఇంద్రుని బ్రహ్మజ్ఞానము బలికి లేదు

అందుచే వాసుదుడు వానిని పాతాళమునకు త్రొక్కి తన గురుత్వముతో తత్త్వోపదేశము చేయ సమకట్టెను. కాని బలి ఒకప్పుడు భగవదాదేశమున గాడిదయై తిరుగుచుండెను. ఇంద్రుడు బలిని కనిపెట్టజాలక పోయెను. పాతాళమున లేడు. ఎక్కడచూచినను కన్పింపలేదు. ఇంద్రుడు బలివిష యమై కనబడలేదని బ్రహ్మ కెఱింగించెను. బ్రహ్మ ఈ విషయము నెఱిం గియు ఇంద్రునికి చెప్పక పొమ్మనగా ఇంద్రుడు ప్రార్థించి యడిగెను. అప్పుడు బ్రహ్మ ఫలానా చోటునం దున్నాడని చెప్పగా ఇంద్రుడు బలి దగ్గరకు పోయెను. ఇంద్రుడు బలిని గాడిదవై తివని ఆక్షేపించెను. అపుడు బలి నేను తెలిసిన గాడిదనే యని తన శాంతగుణ ప్రాధాన్యమునుచూపెను వారిద్దరికి పరస్పర వాగ్వివాదము రెచ్చిపోయినది. కాని బలి సత్త్వగుణ మున నున్నాడు కావట్టి ఏమిచేయక మిన్నకుండెను. అపుడు ఇంద్రుడు వాని నేమిచేయక మూడుసార్లు ప్రదక్షిణించి తన దారిని తాను పోయెను. ఇట్లు బలికి నారాయణుడు జ్ఞాన మభ్యసింపచేయుట పురాణములలో నగ పడుచున్నది.

రామాయణమున అహల్యా వృత్తాంతము రెండుచోట్ల వచ్చు చున్నది. ఈ రెండింటిలో ఐక్యతలేదు. మొదట విశ్వామిత్రుడు రాము నికి చెప్పిన కథ లోకమున వాడుకలోనున్న కథ. అసలు కథ ఉత్తర కాండలో బ్రహ్మ చెప్పినది. గౌతముడు రాజస తపస్సు చేయుచుండగా ఒకసారి పితృలోకము లన్నియు మండిపోచొచ్చెను. అపుడు బ్రహ్మ అహల్యను సృష్టించి యుంచగా అందఱు ఆమెకై తహతహలాడిరి. కాని ఎవ్వరికిని బ్రహ్మ ఆ కన్య నివ్వలేదు. ఇంద్రుడు మాత్రము ఆ కన్నెను తనకిమ్మని అడుగడాయెను. గౌతముడును ఆ అతిలోకసుందరిని అడుగ లేదు. అపుడు బ్రహ్మ చేయునదిలేక అహల్యతో సంచారముగా వచ్చి ఆమెను కొన్నాళ్ళపాటు ఆశ్రమమున నుంచుకొనవలసినదిగా గౌతముని కోరి అచ్చటనుంచి పోయెను. కాని లోకోత్తర సౌందర్యవతి యగు

నామెను. చూచినను గౌతమునకు కామాపేక్ష కలుగలేదు. బ్రహ్మ మిక్కిలి నిరాశుడై పోయెను. పితృలోకజ్వాలలు ఆరుటలేదు. గౌతముడు తపస్సును విడుచుటలేదు. కాని 1000 సంవత్సరములకు పిమ్మట గౌతముడే స్వయముగ అహల్యను బ్రహ్మ కర్పించుటకు తెచ్చెను. బ్రహ్మ గౌతముని ఆమెను వివాహము చేసికొమ్మని చెప్పెను. కాని గౌతముడు ఆమెను వివాహమాడియు తపస్సు మానలేదు. అపుడు ఇంద్రుడు ఒక పన్నాగము పన్నెను. స్త్రీ విషయకోపముగాని తపస్సు మాన్పలేదని భావించి, గౌతముడు స్నానమునకు పోవునట్లు కోడియై కూసెను. కాని గౌతముడు స్నానమునకు పోగా గంగ నిద్రలో నున్నది కాబట్టి, ఇది వేళగాదని గౌతముడు తిరిగి రాబోవుచున్నాడు. ఈ లోపల ఇంద్రుడు గౌతముడై అహల్యను తాకి నేను ఇంద్రుడననియు చెప్పెను. అపుడహల్య భర్తయొక్క కోపతాపము లసాధ్యమని హెచ్చరించినది. భర్తకు కోపము వచ్చిన నేమి చేసెదవని అడిగినది. అంతలో గౌతముడు వచ్చుచుండగా ఇంద్రుడై ఎదురు వచ్చెను. గౌతముని కోపము ఇంద్రుని శపించినది. ఈ కోపములో పితృలోకము చల్లారినది. అహల్యను రాయిగమ్మనియు శపించెను. అహల్య ఎంతయో తనతప్పులేదని ప్రాధేయపడినది. అపుడు గౌతముడు దివ్యదృష్టిలో చూడగ ఇంద్రుడు కామముతో గాక, తనపై కోపముతో తపస్సు చెరచుటకు వచ్చినట్లు తెలిసికొనగల్గెను. మరియు అహల్యకు శాపవిమోచనము రామపాద రజస్పర్శమనియు వివరించెను.

పిమ్మట ఇంద్రుడు తానుచేసిన పనిని దేవసభకు తెలియబరచెను తనపని లోకోపకారమునకేగాని, కామమునకు కాదని వివరించెను. పితృదేవతలును అట్లేయని తమకిడు పశువృషణభాగ మింద్రునకు సమర్పించెదమనిరి. "గౌరావస్కందిన్ అహల్యాయై జార" అను వేదమును, గౌ—గౌతమ, రా — రాజ యని గౌతమదార నమస్కందించిన వాడా !

అని ఇంద్రుని పిలుచునపుడు, అహల్యాయై జార అనుట పునరుక్తిగా నర్థము పోలుచుండగ, విద్యారణ్యస్వామి హల్య కానిది అహల్య అనగా బీటిభూమి. దానిని వర్షముచే మెత్తపఱచి సస్యయోగ్యముగ చేయువాడా అని వ్యాఖ్యానించిరి.

ఉత్తర రామాయణములో ఇంద్రజిత్తు ఇంద్రుని ధ్వజస్తంభమునకు కట్టి తీసికొనిపోవుచుండును. అపుడు దేవతలు బ్రహ్మతో మొరబెట్టుకొనిరి. బ్రహ్మ ఇంద్రుని విడిపించుకొని వచ్చుచు గౌతమశాపము గుర్తుకు తెచ్చెను. బ్రహ్మ ఇంద్రునిచే మరల అశ్వమేధయాగము చేయించి యింద్రత్వ మిచ్చెను కాబట్టి ఇంద్రుడు జ్ఞాని, బలాధిపతి. కామాపేక్ష లేనివాడు. అట్టి కథలలో వ్యభిచారియైన ఇంద్రున కావదవి నిలుచునా? బ్రహ్మదులతని సామ్రాజ్య మప్రతిహతముగ సాగింతురా? కాన ఇట్టి కథలనుబట్టి కూడ ఇంద్రాదుల నిందించిన పాపముల పాలగుదుము. కావున మానవులును "యాన్యస్మాకం సుచరితాని తానిత్వయోపాస్యాని" అని శిక్ష చెప్పినరీతిగా వారుచేసిన మంచిపనులే చేయవలయును. గాని చెడ్డపనుల వలె నున్న పనులు చేయరాదు. కృష్ణుడు పదియవనెలయందే వ్యభిచారము ప్రారంభించెనని గలదు. అది అందఱకు సాధ్యమా? కాన వారిని మనకు సామ్యముగ తెచ్చుకొనరాదు

ఒకసారి శంకరులు కాశ్మీరదేశముపోయి అచటి పండితుల గెల్చి శారదాపీఠము నెక్కబోయెనట. కాని వాణి శంకరుని ఆచారము చెడిపోయినది కనుక ఎక్కరాదని నిషేధించినది. అపుడు శంకరుడు "ముండా! నీకు తత్త్వము తెలియ" దని ఆక్షేపించెనట. తాను పరకాయ ప్రవేశము చేసినను జీవుడు వేఱు, శరీరము వేఱు, ఆ శరీరము మున్నె వారల చేకొన్నది అనియు, తాను సర్వసాక్షియై యంతట నిండియున్నాననియు, శంకరులు చెప్పిరి కావున తన ఆచారమేమియు చెడలేదనగా ఆమె "ఈశానః సర్వవిద్యానామ్" అని నమస్కరించినదట

8

ఉ. శక్తి విహీనుఁడే పనికిఁ జాలఁడు శక్తియె సర్వభూత సం
సక్తతఁ గాంచి సర్వకృతి సాధనమై తనరారుచుండు నా
శక్తియె ముక్తికారణము శక్తియె సర్వము శక్తిలేమిచో
శక్తులు గారు విష్ణుహర సారస సంభవ ముఖ్యనిర్జరుల్ ॥

ఇట్టి శక్తిని గూర్చి చెప్పుటకే దేవీభాగవతాది గ్రంథములు పుట్టినవి. శక్తివిహీను డేపనికి పనికిరాడు. శక్తిలేకున్న బ్రహ్మాదులు సైతము అశక్తులే యగుదురు — అని దేవీభాగవతము చెప్పినది. కాబట్టి శక్తి యనున దొకటి యున్నదనుట సత్యము. ఇది యెనిమిదవ చక్రమున నున్నది. ఇది పురుషుడన్నను, స్త్రీ యన్నను అనుకొనవచ్చును. దీని నుండి సహస్రారము ప్రారంభమగుచున్నది. ఊర్ధ్వమూలమధశ్శాఖమ్– అన్నట్లు బ్రహ్మవస్తువు మూలమునందును, దానినుండి శాఖలు విస్తరించినవి. శంకరులు ఒకప్పుడు శక్తివాదమును నిరసించగా వారికి ఒకనాడు సమాధి కుదరకపోగా ఇందులకు కారణము శక్తివాద నిరసనయే యని భావించి ఆ దేవిని ప్రార్థించి–సౌందర్యలహరి శ్లోకములను రచించిరి. అపుడాదేవి వారికి ప్రసన్నయై దారి సూపెనని ప్రవాదము కలదు.

పరమేశ్వరుడు ౬౪ తంత్రములు వ్రాసి ఒక్కొక్కదాని వలన ఒక్కొక్క సిద్ధి సాధకులకు లభింపచేసెను. ఆ సిద్ధులన్నియు భక్తులకు రావలయునని లోకము కొఱకు దేవతంత్ర మేర్పడినదని శంకరులు కొనియాడిరి. శాక్తేయ ఉపాసన అందఱకు నున్నదని భావించవలయును. "అంతశ్శాక్తం బహిశ్శైవం సభామధ్యేచ వైష్ణవమ్" - అని స్మార్తుల

వైష్ణవులు ఆక్షేపించుట కలదు. ఏది ఏమైనను దేవి అనుగ్రహము మాత్రము కావలసియున్నది.

కాశీఖండమున వ్యాసనిష్కాసఘట్ట మిందులకు నిదర్శనము. వ్యాసుడు కాశియందు పండితుల వాదనలో–నదేవః కేశవాత్పరః–అని విష్ణువే దేవుడను సిద్ధాంతము చేసెను. అంత నందికి కోపము వచ్చి అతని చేతిని స్తంభింపచేసెను. దేవీ అనుగ్రహముతో వ్యాసుడు తన చేతిని స్వాధీనమునకు తెచ్చుకొని, కాశిని వదలిపోయి, మరియొక వ్యాస కాశిని నిర్మించెను. ఇది రెండవకాశి యన్నమాట. శివుడు ఈ విషయ మెరింగి విఘ్నేశ్వరుని ఆ పట్టణముసంగతి చూచిరమ్మనెను. ఇక వినా యకుడు చిన్నవేషమును ధరించివచ్చి వ్యాసునిదగ్గర శిష్యుడుగా చేరి విద్యాభ్యాసము చేయుచుండెను. వాని భక్తిశ్రద్ధలకు, తెలివికి వ్యాసుడు అభిమానించెను. ఒకనాడు శిష్యుని వెంటబెట్టుకొని తన కాశీయందలి విశేషముల చెప్పదొడంగెను. వినాయకుడు ఆయాస్థలముల చూచుచు విశేషముల నెఱుంగుచు, ఒకచో వ్యాసునకు ద్వారమువలన దెబ్బతగిలి రక్తము కారగా, నా ద్వారమువద్ద చచ్చినవా రేమగుదురని ప్రశ్నించెను. వ్యాసుడు కోపము, విసుగుకలిగి ఇక్కడ చచ్చినవారు గాడిదయై పుట్టుదు రని చెప్పగా, వెంటనే వినాయకుడు–తథాస్తు–అని తాను వచ్చినపని అయి నదికనుక వెళ్ళిపోయెను. అపుడు వ్యాసుడు తన గర్వమణచుటకు వినా యకుడు వచ్చెనని తెలిసికొని, ఎవ్వరును వ్యాసకాశీయందు చావరాదని శాసించెను. ఇక వ్యాసుడు కాశికిపోయి బ్రతుకుచుండగా, శివుడు పార్వ తిని, కాశీయందు వ్యాసునికి అన్నముపుట్టకుండ చేయుమని చెప్పెను. అట్లేయని అన్నపూర్ణ మాధుకరమును పుట్టకుండ చేయగ వ్యాసుడు శిష్యులతో 7 రోజులు అన్నములేక అలమటించి, ఆనాడు గంగలో మునిగివచ్చి కాశీపై కోపించి శాపమివ్వబోయెను.

మా భూత్ త్రైపూరుషీ విద్యా
మా భూత్ త్రైపూరుషం ధనం
మా భూత్ త్రైపూరుషీ భక్తిః
కాశ్యాం నివసితాం సదా !!

అని శపించబోగా ఇంతలో—వేద పురాణశాస్త్ర పదవీ నదవీయసి యైన పెద్దముత్తైదువ ఒకామె వ్యాసుని పిలిచి అన్నము పెట్టెదను, స్నానముచేసి రమ్మనినది వారందఱు స్నానముచేసివచ్చి భోజనమునకు కూర్చుండిరి. వారందఱినీ, సంధ్యావందనాది క్రియలు నిర్వర్తించుమని నది. వారు కన్నులుమూసి తెరచులోపల ఆమె వారిముందు షడ్రసోపేత భోజనము నుంచునట్లు రుద్రకన్యల నాహ్వానించి పెట్టించినది. పిమ్మట గృహస్థువచ్చి కూర్చున్న తర్వాత వారు భోజనముచేసి లేచిరి. ఇక అన్న పూర్ణ వ్యాసుని కోపించుచున్న శివునిగుర్తెఱింగి, తాను వ్యాసుని పూర్తిగ కరుణించి శివుని ముందునకు పంపినది. ఇట్లు ముందుగా అమ్మవారి చంద్రదృష్టి ప్రసరించిన తర్వాత, శివునకు నమస్కారము చేయుమన్నది. శివుడు కోపముతో మూడవకంటితో చూచినను వ్యాసుడు చెడిపోవలేదు. అపుడు శివుడు మరల కోపముతో వ్యాసుని కాలితోతన్ని కాశీనుండి పొమ్మ నెను. అమ్మవారును పొమ్మనగా వ్యాసుడు దక్షారామముపోయి, అగస్త్యుల వారిచేతను, సనత్కుమారినిచేతను తత్త్వోపదేశము నొందెను. తర్వాత కాశికి వచ్చెను. కాబట్టి మొత్తముమీద అద్వైతులేకాక అందఱు దేవీ ఉపాసకులు. అన్ని తంత్రములకన్నను దేవీతంత్రమే సర్వసిద్ధిప్రదమని సౌందర్యలహరిలో శ్రీశంకరులు చెప్పుచున్నారు.

ఇట్లే రామాయణమున—తతో రావణ నీతాయా స్సీతాయాశ్శత్రుకర్శనః—అని సుందరకాండమును ముని రావణుడు తీసికొనివెళ్ళిన సీత యొక్క అడుగుజాడను పాదచారులు నడువనిదారియందు శత్రుకర్శను

డవు వాయుపుత్రుడు వెదుకనెంచెనని మొదలిడెను. సుందరకాండను తత్త్వ దృష్టితో చూచిన వాయువహ్నిరూపమునొంది శరీరమందు తిరుగుటయును యోగముగా తోచుచున్నది సీత అన నాగటిచాలు. "సీతా లాంగలిపద్ధతిః" అని నిఘంటువు చెప్పుచున్నది రావణుడన రవణము పుట్టించువాడు. దశ విధ ధ్వానములతో మూడు వంకలతో సీతవలె నున్న కుండలిని వెంట పోవుసాధకుని వర్ణించినట్లున్నది. శత్రు కర్శనః అన్న విశేషణమున్ను అంతశ్శత్రువుల జయించిన సాధకునకే యదిసాధ్యమని సూచించుచున్నది ఇట్లే సుందరకాండయెల్లను యోగమును వ్యక్తీకరించుచున్నదని పెద్దలు చెప్పుదురు. సహస్రారమునకు పైన పీఠికమను చక్రమున నఖండబ్రహ్మ రూపమది శివశక్త్యైక రూప మనిపించుకొనును. సహస్రారమున విశ్వ రూపము, భ్రూమధ్యమున అర్ధనారీశ్వరస్వరూపము, హృదయమున విశ్వ రాంత స్థితేశ్వరీ రూపము ఉండును. సహస్రారమునకు పై చక్రమునందే మహామాయారూపము.

శ్లో॥ సుధాసింధో ర్మధ్యే సురవిటపి వాటీ పరివృతే
మణిద్వీపే నీపోపవనవతి చిన్తామణిగృహే
శివాకారే మంచే పరమశివ పర్యంక నిలయాం
భజన్తి త్వాంధన్యాః కతిచన చిదానన్ద లహరీం॥

అని శంకరులు చెప్పుటగమనింపదగినది. పూర్వము భండాసురుడను రాక్షసుడు దేవతలవేధించుచుండెను. వానికి విశుక్రాసురుడు-అనగాలోకములో నెవ్వరికి వీర్యము లేకుండ జేయువాడు. విషంగుడు అనగా ఒకరొకరిని కలవకుండ చేయువాడు – ఇట్టివార లనేకులు మంత్రులుండిరి. వైకుంఠ మున కేగిన నేమియగునో యని విశుక్రుడును, వైకుంఠమును వదలి వచ్చిన నేమగునోయని విష్ణుడును నున్నట్లు లుండిరి. అప్పుడు వాని యంతమునకు విష్ణువు నారదునితో దేవతలను హిమాలయము నందు

యజ్ఞముచేయుమని ఆదేశించి పంపెను. వారట్లు బహిర్యాగము చేయుచుండ విష్ణువు ఇద్దఱు సౌందర్యవతులైన స్త్రీలను సృష్టించి వారిని భండాసురుని కోటలో సంగీతము పాడుచుండుమనియు బెట్టుసరితో భండవిశుక్రాసురుల పెండ్లాడుమనిచెప్పి, తాము చెప్పినట్లు భర్తలు వినవలయుననియొప్పందము కుదుర్చుకొనుమనియు బోధించెను. సరేనని వారు నట్లే పెండ్లాడి మొదటనే వారిరువురిని స్త్రీలిరువురు స్వాధీనము చేసికొనియుండిరి.

ఇట్లు ఐదువందల సంవత్సరములకాలము దేవతలు యజ్ఞముచేయుట జరిగినది. కొంతకాలము పోవ హోమధూమము లోకమంతయు వ్యాపించి భండాసురుని అంతఃపురమున ప్రవేశింపగా వాడు ఇదియేమని యదరిపడి దేవతలు యజ్ఞము చేయుచున్నారని తెలిసికొని కోపించి యుద్ధమునకు బయలుదేరెను భార్య వద్దన్నను వినలేదు. వీడు పోవుసరికి యజ్ఞ గుండము చుట్టు పెద్ద కంచుకోట బయలుదేఱి, నక్షత్రమండలము వఱకు వ్యాపించియున్నది. అంత భండాసురుడు కోపోద్రిక్తుడై దానిని విఱుగ దన్నెను. మరల మరియొక్కటి పుట్టినది ఇట్లు 189 కోటలు విఱిగిపోయి నవి. చాల అలసిపోయి ఇప్పుడింత కష్టమేల? ఈ దేవతలు యజ్ఞము చేసి నామీదికి వచ్చినప్పుడే హింసింపవచ్చును, భార్య యెట్లుండెనోయని తిరిగి పోయెను. పోగా భార్యలిద్దఱిని చీవాట్లు పెట్టుట జరిగినది. దేవతలు వేయి సంవత్సరములు యజ్ఞముచేయగా అందునుండి బాలాత్రిపురసుందరి ఆవిర్భ వించినది. దుర్బలులైనవారిని యజ్ఞకుండమున దూకుమని ఆదేశించినది. కాని ఆమె ఆవిర్భావమువలన అందఱకు తేజస్సువచ్చి ప్రకాశించిరి. ఇచట బాల అనగా పరోక్షబ్రహ్మవిద్య. ఆమె అందఱిని తనవెంట తీసికొనిచక్ర మార్గమున తాను దేవతలను గొనిపోయినది. బ్రహ్మరంధ్రము వఱకు పోయి బాల ఈశ్వరధ్యానము చేయగా ఈశ్వరుడు కనిపించెను. ఆమె అత నిని అంతర్యాగము చేయుమని ఆదేశింపగా ఈశ్వరుడు అంతర్యాగము చేయ మొదలుపెట్టెను. ఆ దేవుడు చిత్తి యను స్రుక్కుతో చిత్తాజ్య

మును చిదగ్నికుండమున హోమము చేయగా అమనస్కయై నిష్ప్రపంచమైన తటి అరూపశక్తి సరూపయై సగుణయైచిదగ్నిగుండము నుండి లలితాత్రిపురసుందరి యని ఆవిర్భవించినది. అచటనున్న ఆ దేవతలనందఱిని ఆదేవి ఆ యగ్నిగుండమున వైచినది. అపుడు వారిచిత్తమాలిన్యము పోయినది. అపుడు దేవతలు చిద్భావభావితులు, జ్ఞానబల క్రియాన్వితులైరి, అపుడు దేవతలందఱు దేవిని ప్రార్థించి, ఆమెను నీ యిష్టమైనవాని వివాహము చేసికొనుమని యుభయులను సేవించుకొని మఱియు కృతార్థులమగుదుమని స్త్రీ స్వాతంత్ర్యము లోకమున విరుద్ధమని ప్రార్థించిరి.దేవియు తన కట్టిస్థితి మంచిదనితోచి కడగంట నీక్షింప పరమేశ్వరుడు కామేశ్వరావతారము వహింప నా దేవి వానిని శాస్త్రోక్తముగా వివాహము చేసికొనెను.

శ్లో॥ ధ్యాయేత్కామేశ్వరాంకస్థాం కురువిందమణిప్రభాం।
శోణాంబరస్రగాలేపాం ! సర్వాంగీణ విలేపనాం !
సౌందర్య శేవధించేషు చాపపాశాంకుశోజ్వలాం !
స్వభాభిరణి మాద్యాభిస్సేవ్యాం సర్వనియామికాం ।
సచ్చిదానంద వపుషం। సదయాపాంగ విభ్రమాం
సర్వలోకైక జననీం స్మేరాస్యాం లలితాంబికాం

అని యామె స్వరూపస్థితిని వేల్పులు, మునులు గొనియాడిరి త్వష్ట వారికై శ్రీపురమును నిర్మించెను. అందు చింతామణిమయ గృహమున శివాకారమగు రత్నపర్యంకముపై నున్న కామేశ్వరు నంకమునుండి కామేశ్వరి నానాశక్తిపరివార సహితయై వేల్పులతో కొలువుదీర్చి, దేవకార్యసముద్యత యయ్యెను, ఇక నామె భండాసురుని దగ్గఱకు శివుని దూతగా పంపెను. శివుడు పోయి దేవతలు జన్మముచేసిరి. కామేశ్వరి ఆవిర్భవించినది. ఇక నీకు సురలు, మునులు, అసాధ్యులు, ఆ దేవిని శరణని బ్రదికె

దవా? యుద్ధముచేసి చచ్చెదవా! అని చెప్పగా భండాసురుడు ఎగిరిపడెనట. యుద్ధమునకువచ్చి యెత్తులకు పై యెత్తులువేసి చివరకు విఘ్నయంత్రము ప్రయోగించెను.

ఆ యంత్రము ఎదుటివారిని స్తంభింపచేసినది. అపుడు దేవతలు కామేశ్వరిని ప్రార్థించగా ఆమె భర్తృముఖాలోకనము నుండి విఘ్నేశ్వరు బుట్టించెను. అతడు విఘ్నయంత్రమును తన్నగా భండాసురుడు రాక్షసులను సృష్టించి వారి ముందుంచెను. మరల దేవతలు కామేశ్వరితో మొర పెట్టుకొనిరి. ఆమె పదిగోళ్లనుండి పది విష్ణు అవతారములు సృజింపగా వారి నవి చంపినవి. ఇది దేవీ భండాసురుల యుద్ధము. శుక్రాసురుడు అనువాడు యుద్ధమునకు వచ్చెను. కాని వానిని వారాహి అను శక్తి చంపి వైచెను. మరల రక్తబీజాసురుడు రాగా, దుర్గ వానిని రక్తము క్రింద పడకుండ చంపినది. భండాసురుని కొడుకులు యుద్ధమునకు రాగా, బాల వారిని చంపెదనని లలితాదేవి సెలవుగైకొని తన విక్రమమున వారిని చంపినది. చివరకు భండాసురుడు. వాని కొడుకు శూన్యకుడు మిగిలిరి. అపుడు కామేశ్వరి కామేశ్వరుని వారిపై త్రిప్పికొట్టగా వారు మరణించిరి. ఇక భండాసురుడు అనగా మనకున్న మోహము. శూన్యకాసురుడనగా శూన్యవాదము.

కనుక మోహము,శూన్యము,రెండును నశించినవి. కావున బహిర్యాగమున, అంతర్యాగమున దేవీ అనుగ్రహము పొందినవారు మోక్షమును పొందగలరు. లలిత అపరోక్ష బ్రహ్మవిద్య. బాల పరోక్షబ్రహ్మవిద్య. నానారూప సమష్టిరూపము దుర్గ. కాబట్టి వీరికి భేదములేదు. శక్తి సమష్టి రూపమే మహిషాసురుని చంపినది. సహస్రారముపైన శ్రీనగరమున కామేశ్వరి యుండును. బాల హృదయమున నుండును. ఐం - క్లీం - సౌ బీజములు మూడును ఆమెకు ఒక మంత్రముగ ఉపాసన జరుగును.

ఉమామహేశ్వరోపనిషత్తు ఉమయే లక్ష్మి, శివుడే విష్ణువు, ఇట్లే స్త్రీలెల్లరు శక్తిరూపములు, పురుషులెల్లను శివులు కాన ఉమామహేశ్వర రూపులగు స్త్రీ పురుషజాతులకెల్ల నమస్కారమని ముగించినది. స్త్రీపురుషుల వివాహ సంగమాదులెల్ల విసదృశములగు శరీరమందలి ఏకాకారమగు బ్రహ్మము నెఱిగికొనుటకు. యోగమందలి పదారవు కళనెఱుగుటకు 15 కళల వాత్స్యాయనుడు కామశాస్త్రమున నిరూపించెనని పెద్దలు చెప్పుచున్నారు. స్త్రీ పురుషుల వివాహ మందలి యపూర్వ ఫలము నాలోచించిన శాస్త్రిను సారముగ దాని ననుభవింపవలెను. కేవల కామమునకైన శాస్త్ర మక్కర లేదు. పశువులకు శునకమునకు, వరాహములకు కామసుఖమునే శాస్త్రము చెప్పుచున్నది? అయినచో ఈ మంత్ర తంత్రముల యందు స్త్రీలకధికార మున్నదా లేదా? అను ప్రశ్న యొకటి లోకమును బీడించుచున్నది. వివాహ మంత్రసంస్కారముతో వధూవరు లేక రూపులగుచున్నారు. శరీరభేదము న్నను నవకోణాత్మక శ్రీచక్రము ఇరువురి యందు స్ఫురించుచున్నది. కాన పురుషుని బట్టి స్త్రీ యధికారము పురుషుడు సోమయాజి యయినచో స్త్రీ సోమిదమ్మ యగును. పురుషు డుపాసకుడైన స్త్రీ యుపాసకురాలగును. కాన పురుషునకు స్త్రీ సాహచర్యమన్నిట నుండదగును. అది వదలిన సన్యాసమే - ఇది పరువరాదు.

9

బ్రహ్మములో మాయ స్ఫురించుచున్నది. అదియే పరాశక్తి. ఈశ్వరుడు సర్వజ్ఞుడు కాని జీవుడుమాత్రము అల్పజ్ఞుడు జీవుని ఆవరించి యున్న అవిద్యయను బురదను తొలగించినచో - ఆ జీవుడు ఈశ్వరుడగు చున్నాడు. ఈ అవిద్యను తొలగించుటకే విద్యలు, పురాణములు, కర్మలు, ఉపాసనలు, మొదలగునవి యేర్పడినవి. మాయాశక్తి నుండి కామేశ్వరీ కామేశ్వరులు ఆవిర్భవించిరి. వీరే ప్రకృతి - పురుషులు. లోకమునందు వీరి యుపాసనయే పరాకాష్ఠ నొందినది. కాని నిర్గుణోపాసన కూడ ఒకటి యున్నది. శివుని 64 తంత్రముల ఫలము నిచ్చు శాక్తేయము ఉపాస్యము- అందు కామేశ్వరియే ప్రధానయగుచున్నది దీనికి అధిష్ఠానము కామేశ్వరుడు. కామేశ్వరీ సంకల్పశక్తితో కామేశ్వరు డావిర్భవించెననియు, త్వష్టచే నిర్మాణము చేయబడిన శ్రీనగరమున నామె కామేశ్వరాంకస్థితయై యున్నదనియు ఇదివరకే చెప్పబడినది. ఆ స్థానము బ్రహ్మరంధ్రమునకు పైన నున్నది. శరీరమునకు తొమ్మిది రంధ్రములున్నవి. పదియవది బ్రహ్మరంధ్రము. ఆదారిన బ్రహ్మమీ జీవరూపమున శరీరమున ప్రవేశించుట వలన దానికాపేరు వచ్చినది, అది మొదట వలుచగా నుండును దానినాముదముపెట్టి మెల్లమెల్లగా గట్టిపరచుచున్నారు. అది జీవుని రాజద్వారము. దానినుండి జీవుడు ఎప్పుడిష్టమైన నప్పుడు పోకుండ ఉపనయన వివాహాదులందు జీలకఱ్ఱ బెల్లము పెట్టి ఆ రంధ్రమును పూడ్చుచున్నారు. ఆయుష్యమునందు నాల్గవవంతు బ్రహ్మచర్యములో వేదాధ్యయనము చేసి ఋషి ఋణము తీర్చుకొనవలయును. ఇంకను నాల్గవవంతు గృహస్థాశ్రమము స్వీకరించి పితృఋణము, దేవఋణము తీర్చుకొనవలయును. మూడవ నాల్గవవంతు వానప్రస్థమున తపముచేసి, మిగిలిన నాల్గవవంతు సన్యాసాశ్రమమును స్వీకరించవలయును.

మొదట సృష్టికర్తయగు బ్రహ్మ సనకసనందనాదులను మనస్సుతో సృష్టించి, సంతానము కనుమని చెప్పగా వా రెందుకని ? ప్రశ్నించిరి. వారికి బ్రహ్మ ముదుసలితనమున పిల్ల లుపయోగించెదరు. తదనంతరము శ్రాద్ధాదులు జరిపి పరలోకముల సుఖమును సంపాదించెదరు. మరియు "పుత్రేణ లోకాన్జయతి" అని శ్రుతి చెప్పుచున్నదనియు చెప్పెను. దానికి వారు మాకిదియే ఆత్మ, ఇదియే లోకము, మాకి ప్రజలతో చేయవలసిన పనిలేదు గాన నీ సృష్టితో నవసరములేదు — అని బ్రహ్మమయులై యుండిరి. తరువాత ఆ స్రష్ట వశిష్ఠాదుల సృష్టించెను. వారలునట్లే మాటలాడ బ్రహ్మ కోపించెను. విసుగుకొనెను. అంత వశిష్ఠాదులు తండ్రిమాట వినెదమనియు, పిల్లలను కన్నందువలన మన ఆత్మస్థితికి భంగము లేదనియు మిగిలినవారిని కలుపుకొని చెప్పగా, బ్రహ్మ ఇది లోకమున అందఱకు బోధచేయుమనెను. ఆ విధముగనే వశిష్ఠుడు చేయుచుండెను కావుననే ఇప్పటి పురోహితులే వశిష్ఠులని భావింపవలయును. ఇప్పటికిని వశిష్ఠాంశగల యాజ్ఞికుడు వటువునకు బ్రహ్మోపదేశము చేయుచున్నాడు. దానిలో పిల్లలను గని సుప్రజుడ నయ్యెదననియు సుమేధుడ నయ్యెదననియు వటువుచే ననిపించి ప్రతిజ్ఞ చేయించుచున్నాడు అందులకే వారిచే విస్తళ్ళు కుట్టించుట, గంధము తీయుట మొదలగు పనులు చేయింపరాదు. ఇక స్త్రీకి వివాహము చేయుట ఎనిమిదవయేటనే జరుగవలయును. ఆనాడు శిరస్సుపై జీలకఱ్ఱ బెల్లము పెట్టి, తెల్లని వస్త్రములు దీక్షకుగానిచ్చి దర్భత్రాడుచుట్టి బ్రహ్మచారికివలె నుపాసనార్హత్వము సంపాదించుచున్నారు. "ఏతద్వైపత్న్యా వ్రతోపనయనం" — అని ప్రమాణము చెప్పుచున్నది. గృహస్థధర్మమున భర్తసంపాదించినధనము భార్యకు ఇవ్వవలయును. భార్య గృహోపకరణము లన్నియు భర్తసలహాపై అమర్చుచుండవలయును. ఈ కార్యనిర్వహణమున భార్య ఆయవ్యయముల భర్తకు నెఱిగింపవలయును.

పూర్వము ముద్గలు డనువానికి ఇద్దరు భార్యలుండిరి. భర్తకు చెప్పియే ఒక భార్య అన్నిపనులు చేయుచుండెను. కాని రెండవయామె జ్ఞానవతి యగుటచే ప్రతిపని భర్తకు చెప్పనక్కర లేదని తలంచెను. ముద్గలుడు బ్రహ్మలోకమునకు పోవుచుండ పెద్దభార్య వెంటనంటిపోయెను రెండవ భార్య వచ్చులోపల తలుపువేసిరి. ఈమె నరకమునకు పోయినదట పతివ్రతను, జ్ఞానవతిని యగు నాకిట్టి స్థితి యేల వచ్చెనని యేడ్చుచుండగా యముడు చూచి మరొకజన్మ నిచ్చి, భర్తకు చెప్పుచు, అన్ని పనులు చేయుచు, ఈ కొలది లోపము నందు తీర్చుకొనుమని చెప్పి పోయెను. ఆమె అట్లే చేసి ఆ జన్మయందు తరించెను — అని ఇతిహాసములందు భార్యా భర్తృధర్మములు అను శాసింపబడినవి. అట్టి స్త్రీపురుషులు కామేశ్వరీ కామేశ్వరుల నుపాసింప నర్హులు. కామేశ్వరీ కామేశ్వరులు స్త్రీపురుషరూపములో భావించి, పంచప్రేతమంచము మీద నున్నట్లుగా ధ్యానించుట ఒక పద్ధతి. కామేశ్వరీ కామేశ్వరుల అవయవములు వీరి అవయవములందే యున్నట్లు భావించుట మరియొక పద్ధతి. అరుణాది వాగ్దేవతా స్తోత్రమే మన లలితా సహస్రనామము. శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ శ్రీమత్సింహాసనేశ్వరీ—అని ప్రారంభింపబడెను. మంగళప్రదమైన శ్రీయనునది శాక్తేయులబీజము. శ్రీబీజమునకు వాచ్యము లేక లక్ష్యమైన మాతా—తల్లి పెద్దరాణి. మామూలు తల్లులు మామూలు రాణులు కారని తెల్పుటకై శ్రీమాతా, శ్రీమహారాజ్ఞీ అని చెప్పబడెనని తెలియవలెను. హన హింసాగత్యోః అను ధాతువునుండి సింహశబ్దము పుట్టినది. శ్రీమంత మగు సింహాసనమున కధీశ్వరిగాన, శ్రీమత్సింహాసనేశ్వరి యనబడు చున్నది. అంతర్యాగమున చిదగ్నియందు చిత్తాజ్యమును హోమము చేయగా అమనస్కదశయందు ఆవిర్భవించుటచే చిదగ్నిసంభూత యనిపేరు.

దేవకార్య సముద్యతా
ఉద్యద్భాను సహస్రాభా

చతుర్బాహు సమన్వితా
రాగస్వరూప పాశాఢ్యా
క్రోధాకారాంకుశోజ్జ్వలా॥

అని ఇంద్రియముల పనులు చేయుటకై దేవకార్యమునకై ఆవిర్భవించినది. ఉదయించు సూర్యునివలె ఎఱ్ఱని శరీరతేజస్సు కలదియు, నాల్గు చేతులు కలదియు నగు దేవి, నాల్గు ఆయుధములు నాల్గు చేతుల యందు కలదియునగు దేవి అనగా మనస్సును ఇక్షుకోదండ మొకచేత గలది, శబ్ద స్పర్శ రూపరస గంధములను తన్మాత్రలైదు బాణముల నొకచేతధరించినది. రాగమను పాశమొకచేత ధరించినది క్రోధమను నంకుశ మొకచేత దాల్చినది. విష్ణువు దేవీ ఉపాసన వలన మోహినియై శివుని మోహింపచేసెను.

స్మరోపిత్వాం నత్వారతి నయన లేహ్యేనవపుషా
మునీనామప్యంతః ప్రభవతిహి మోహాయమహతాం॥

అని శంకరులు ఆగమానుసారము గొనియాడిరి. మన్మధునకు - భక్తునకు దేవి తన బాణకోదండ పాశాంకుశముల నిచ్చి యంతవానిచేసెనని భావించవలయును. నిజారుణ ప్రభాపూరమజ్జ బ్రహ్మాండ కుండము మునిగి ఎఱ్ఱనగుచున్నదనగా రజోగుణములో నిండియున్నదని భావము. "అష్టమీచంద్ర విభ్రాజ దలికస్థల శోభితా" అన అష్టమినాటి చంద్రవంక వంటి ఫాలముకలదియు, "ముఖచంద్రకలంకాభ మృగనాభి విశేషణ" యన చంద్ర కళంకమువంటి కస్తూరిబొట్టు గలది, "వదనస్మర మాంగల్య గృహ తోరణచిల్లికా" యన వదనమను మన్మధుని యింటికి తోరణముల వంటి కనుబొమ్మలు కలదియు నని భావము. ఈ బొట్టనగా ఇడ పింగలి నాడుల మధ్యనున్న సుషుమ్నవంటిది బొట్టు. ఇది వైష్ణవుల బొట్టు. గోపీచందనముతో ఊర్ధ్వపుండ్రములు - స్మార్తులును బెట్టెదరు. జలముతోనైన

మృత్తికతోనైన నూర్ధ్వపుండ్రములుబెట్టి తర్వాత వానిపై బూడిద పూయుచుందురు. కొందఱు వైష్ణవులు పచ్చనిబొట్టు, మరికొందఱు ఎఱ్ఱనిబొట్టు ధరించుచున్నారు. వానికి పేరుపేరు కారణములు గలవు. నాదబిందు కళా స్థానముల సూచించునట్లు మూడు తిర్యక్ పుండ్రములు ధరించి, బిందుస్థానమున గంధాక్షత లుంచి, బిందువునకు క్రింది భాగమున త్రికోణస్థానమున కుంకుమ అడ్డముగా బూయుచుందురు. ఇది అమ్మవారి స్థానము. ఇది ప్రాసంగికము. "వక్త్రలక్ష్మీపరీవాహచ్చలన్మీనాభ"- అను శ్లోకమున ముఖము మీద కాంతియొక్క తరంగములుగల చెఱువునుండి వచ్చు పరీవాహములవంటి కన్నులు గలదియు. ఆ కనులగుంటలు అలుగులవంటివనియు, అందలి మీనములవంటి కనుపాపలు చలించునని కలదియు, సంపెంగవంటి నాసిక, ముక్కుకు బులాకి, దానికి ముత్యము ఉండునట్లును, అది నక్షత్రకాంతిని తిరస్కరించునట్లును చెప్పబడినది.

పార్వతి యెప్పుడును కమ్మలు, బులాకి తియకుండుట చేతనే శివునకు చావులేదు. కడిమిచెట్టు పూలగుత్తి యెడమచెవియందు నలంకరించుకొనియుండును. ఇది కర్ణపూరము. స్త్రీకి ఎడమ, పురుషునకు కుడి భాగములు ముఖ్యములు. ఇట్లు స్త్రీపురుషసంయోగమే అర్ధనారీశ్వరత్వము అగుచున్నది. కావున స్త్రీలు ఎప్పుడును ఎడమనుండి అలంకరించుట ప్రారంభించవలయును. దేవి సూర్య చంద్రులు కమ్మలుగా గలది పద్మరాగపు టద్దముల కాంతిని తిరస్కరించు బుగ్గలు కలది. పగడమువంటి దొండపండువంటి పెదవి కలిగి శుద్ధ విద్యాంకురములవంటి పలువరుస గలది. ఆమె కప్పురపుతమ్మ పరిమళము దిగంతముల వ్యాపినొందునది. ఈమె పలుకుముందు సరస్వతి వీణెయు పనికిరాదు. చిరునవ్వు కాంతిపూరమున మునుగుచున్న కామేశ్వరు మనసు కలది సాటిలేని చిబుకము కలదియాయె. ఇక యజ్ఞోపవీత, మంగళసూత్రముల గురించి ఆపస్తంబుల వారేమియు చెప్పకుండుటవలన అవి అక్కరలేదని కొందఱనుచున్నారు అనుక్తం అన్యతో గ్రాహ్యం - అన్నట్లు బోధాయన సూత్రమునుబట్టి

యజ్ఞోపవీత మంగళసూత్రధారణ చేయవలయును. కామేశ్వరునిచే కట్టబడిన మంగళసూత్రము కలది. రత్నకంఠాభరణము కలది. చింతామణి పతకముగల ముత్తెముల హారముల దాల్చినది, ఆమె స్తనములు కామేశ్వరస్వామి ప్రేమరత్నములచే గొనదగినవి. పాదువలెనున్న బొడ్డునుండి తీగవంటి నూగారు బయలుదేఱును. ఆ తీగకు ఫలించిన ఫలములే ఆ స్తనము లగుచున్నవి. అనూరుని కాంతిని తిరస్కరించు కౌశుంభవస్త్ర ధారిణి యగుచున్నది. కామేశ్వరునిచేతనే తెలియబడిన తొడలమార్దవము గలది. పిక్కలు మన్మథబాణముల సంచులవంటివి. శీలమండలు కనబడ నిది. ఏలన శీలమండలు కనబడుట దరిద్రహేతువు. తాబేటి బొచ్చెలవంటి పాదములు, తమోగుణమును హరించు ఎఱ్ఱనికాంతిగల గోళ్ళుకలది. మ్రోగుచున్న కాలియందెలు కలది. మరాళములవంటి మందగమనము కలది. లావణ్యమునకు నిక్షేపమగు మేను కలదియునగు స్త్రీరూపము కామేశ్వరి. కావున సాముద్రిక శాస్త్రానుసారమైన లక్షణములుగల స్త్రీ. సమస్తాభరణ భూషితయై, శివుడైన కామేశ్వరుని తొడపై నుండునది. స్వాధీన వల్లభా=స్వాధీనపతిక, - సుమేరుశృంగమధ్యస్థా - మేరువుమధ్య శృంగమున నుండునది, సృష్టికర్త్రీ-బ్రహ్మరూపా - బ్రహ్మరూపమున నుండి జగత్సృష్టి చేయునది. గోప్త్రీ గోవిందరూపిణీ - గోవిందరూపమున పరిపాలనము చేయునది సంహారిణీ రుద్రరూపా-రుద్రరూపమున సంహరము చేయునది. తిరోధానకరీ ఈశ్వరీ - తురీయమవు ఈశ్వర రూపమున సంహృతజీవుల తిరోధానముచేసి దాచిపెట్టునది, సదాశివా అనుగ్రహదా - సదాశివరూపమున ననుగ్రహించునది. పంచకృత్య పరాయణా - ఈ ఐదు రూపములతో నైదుపనులు చేయునది. శ్రీశివా, శివశక్త్యైక్యరూపిణీ-లలితాంబికా అను నామమువరకు సహస్రనామములు వాణీశ్వరుల ముఖముల నుండి దేవియే వెలువరించినది. త్రిశతి నామములు కామేశ్వరీ కామేశ్వరులు స్వయముగా వెలువరించిరనియు కలదు. ఈ శాక్తతంత్రముల కెల్ల సారాంశమద్వైతమే ; అద్వైతము శాక్తము కలసియే యున్నవి.—

అస్యాం మునీనామపి మోహ మోహా
భృగుర్యదాస్వా స్తనశైలశీలీ
నానారదాహ్లాదముఖం
శ్రీలో రుర్వ్యాసో మహాభారత సర్గకర్తా॥

శ్రీ హర్ష నైషధమునందు దమయంతి = విద్యాశక్తి యగుచున్నది. నలుడు బ్రహ్మమూర్తి యగుచున్నాడు. దమయతీతి దమయంతీ అని అన్నింటిని అణగద్రొక్కునది విద్య. ఈ విద్యాశక్తివిషయమై మునులకును మోహమే. అనగా పూర్తిగా తెలియదని భావము. భృగువు ఈమె స్తనశైలములను విడువక అభ్యసించువాడు. అనగా మధ్యఖండోపాసనలతో ఐశ్వర్యము సంపాదించినవాడు తక్కిన రెండు ఖండములయందంత విజ్ఞాని కాడు. గాన మోహము. నారదుడు ముఖోపాసనము వలన నాహ్లాదము కలవాడు. వాగ్భవఖండములను మాత్రమే యుపాసించినవాడు. వ్యాసుడు తా విద్యాశక్తి ఊరువుల నాశ్రయించి మోక్షద మవు శక్తిఖండము నుపాసించినవాడు. ఇట్లే ఎవ్వరును పూర్తిగా నీ విద్య నెఱుగరు మోక్షవిద్యయగు శక్తిని వ్యాసుడు త్రికూటోపాసనచే తరించెను. ఇట్లు కవులు వాక్యాతిశాయి వ్యంగమున తమ భావముల వెల్లడింతురు. దేవుడు సర్వవ్యాపియై యున్నాడు, వానిని ఎవ్వరును జూచి చెప్పజాలరు. శివోపాసన చేసినవాడే శక్తిని ఉపాసించగలడు ఈ శక్తి ఉపాసనచే శివానుగ్రహమునొంది తరువాత మోక్షము నొందును, కనుక ఈశ్వరానుగ్రహముతో మోక్షము లోకమున సంభవించును. జ్ఞాన స్వాతంత్ర్యము వలన జీవన్ముక్తి లభించును. కావున - పుంలింగం సర్వ మీశానాం స్త్రీలింగం చాపి విద్ధిమామ్ - అన్నట్లు శివుడు శక్తియే సర్వలోకము కనుక లోకమున స్త్రీపురుషుల నెల్ల శక్తి శివులనుగా భావింపవలెను.

10

కడచిన ప్రకరణములో దేవీతత్త్వమును గూర్చి తోచినంత చెప్ప బడినది. ఈ దేవీ స్వరూపమును శంకరులు తురీయమైన శక్తి అని కొని యాడిరి. త్రిమూర్తులలో హెచ్చుతగ్గులు లేవనియు, కాని సూతసంహిత మాత్రము శివుని గొప్పతనమును చాటుచున్నదనియు. అందరికన్నను శివుడు ఎక్కువకాలము బ్రహ్మమయుడుగ నుండుటవలన నట్లు చెప్పవల సినదనియు నందుగలదు. శివుడు శక్తిని తొడపైనుంచుకొని తత్త్వోప దేశము చేయుచుండుననియు చెప్పియుంటిమి. పనులేమియు లేక బ్రహ్మ మనుభావముతోనుండి అదియే బయటికి చెప్పుచుండును. సగుణ బ్రహ్మము ననగా శివస్వరూపమున పార్వతిగను, విష్ణురూపమున లక్ష్మిగను, బ్రహ్మ రూపమున సరస్వతిగను, ఇంద్రరూపమున శచిగను వ్యవహరించుచున్నది స్త్రీ పతివ్రత యగుచో పురుషుని అన్నిజన్మలయందును వెన్నంటివచ్చును. భార్యాభర్తలకుమాత్రమే శరీరైక్యమున్నది, కాని పరస్త్రీలను తల్లులవలెను పురుషులను తండ్రులవలెను జూడవలయును. ప్రాసంగికము. అకృశం కుచయో, – అన్నశ్లోక మిదివరకే చెప్పబడినది. అందలి భావమేమన – బ్రహ్మరంధ్రమున నున్న తత్త్వమే కుచములయందు నకృశము, నడు మున కృశము, చక్షుస్థానమున విపులము, నితంబమున విస్తృతము, నధర మున నరుణమునై క్రిందకు వ్యాపించినది. ఒక్క తేజమే ఆయాయిభాగ ముల విభాగమునొంది ప్రకాశించుచున్నది. అదియే శక్తి. అది నా హృద యమున నావిర్భవించుగాక అని ధ్యానించెను. కపాలమునందలి పూర్ణ రూపమే ఆయా భాగములయందు భాగరూపముల నొందినదని కవిభావము.

ఇది—

ఊర్ధ్వమూల మధశ్శాఖమ్ !
అశ్వత్థం ప్రాహురవ్యయమ్!
ఛన్దాంసి యస్యపర్ణాని
యస్తం వేద స వేదవిత్ !!

అని గీతలో చెప్పబడినది. గణాధిపతికి ఈ పేరు ఏల వచ్చినది, అనగా నాడు లన్నింటిలో 101 వ నాడి బ్రహ్మరంధ్రములోనికి పోవు చున్నది రైలు ఇంజనులోని తీగల వలె నాడులన్నియు శరీరమంతట వ్యాపించి మూలాధారమున కేంద్రీకృతమై యుండును. ఇవన్నియు విఘ్న రాజు చేతిలోనుండి బ్రహ్మరంధ్రముదాక వ్యాపించుచున్నవి. కాబట్టి పుష్టి శక్తిసమేతుడైన గణపతిని పూజించవలెను "ఆదౌ పూజ్యో గణాధిపః"- అని అందుకనియే చెప్పిరి. పార్వతీపరమేశ్వరుల వివాహమునకు ముందు కూడ గణాధిపతి పూజ యున్నటుల బ్రహ్మపురాణమున గలదు. ఇచట మనకు ఒక సందేహము కలుగుచున్నది.

విఘ్నేశ్వరుడు పార్వతీ పరమేశ్వరుల కుమారుడు గదా? ఇతనికి పూజ వారి వివాహసమయమున వెట్లు కలిగినది? అని సంశయము. కాని ఈ గణపతిని భండాసురుని విఘ్నయంత్రనాశనమునకు కామేశ్వరి సృష్టిం చినదని చెప్పబడినది. మరియు శరీరనిర్మాణ మైనపుడే గణాధిపతి సృష్టి జరిగినదని తెలిసికొనవలయును, గాని పార్వతి నలుగుపిండి బొమ్మతో కాదు. కాబట్టి మనలో పుష్టిశక్తితో గణపతిలేకున్న ఏ పనులును సాగవు. కనుక ఇది చాల ప్రధానమని భావించవలయును. షట్చక్రాధారభూతమైన బ్రహ్మతేజము కాలమునుబట్టి అప్పు డాయా అవతారముల తాల్చుచున్నది.

అనంతావై వేదాః - అన్నట్లు వేదములు అనంతము లగుచున్నవి భరద్వాజుడు అను ఋషి మూడువందల సంవత్సరములు తన ఆయుర్దాయ మున వేదాభ్యాసము చేసెనట. కాని పూర్తికాకుండుటచే తపస్సుచేసి మరి

యొక మూడువందల సంవత్సరములు ఆయుర్దాయము కోరి వేదాభ్యాసము సాగించెనట. అంతకు కాకుండుటవలన మరల పై విధముగ బ్రహ్మను ప్రార్థించెనట. అంత బ్రహ్మ వానిని పిలిచి బ్రహ్మలోకమునకు కొనిపోయి మూడు మహాపర్వతముల జూపి వానిని వేదము లనెనట. అపుడు భరద్వాజుడు ఆ పర్వతములచుట్టు తిరిగి నమస్కరించెను. అంత బ్రహ్మ ఆ మూడుపర్వతములనుండి మూడు పిడికిళ్ళు తీసి వానికి ప్రసాదించెనట. ఇవియే మనకున్న మూడు వేదములని చెప్పబడుచున్నది. కాన వేదాభ్యాసము పూర్తియగుట చాలకష్టమైన కార్యమని తోచుచున్నది. అదియు గురుభక్తితోడనె విద్యలు ప్రాప్తించునుగాని చదివి వల్లించుటవలన వచ్చునవి కావు. ఇప్పటి విద్యావిధానము వేరు. అప్పటిది వేరు.

ముగ్గురు బాలురు ఒక ఋషిదగ్గరకు విద్యాభ్యాసమునకై పోయిరి. గురువుకు శుశ్రూష చేయుచు విద్యాభ్యాసము చేయసాగిరి. విద్యాభ్యాసమనునది - గురు శుశ్రూషచేతగాని, అత్యంత ధనముచేతగాని, లేక విద్యనిచ్చి విద్య గొనుటవలన గాని లభించును బ్రాహ్మణ నియమము తప్పకుండ ఆ శిష్యులు శుశ్రూషచేయుచు డగ. ఒకనాడు గురువుభార్య-శిష్యుల గూర్చి భర్తకు హెచ్చరికచేసినది. వారి విద్యాభ్యాసమునుగూర్చి యామె హెచ్చరించిన దన్నమాట. కాని గురువుమాత్రము ఏమియు పట్టనట్టు మిన్నకుండెను. మరియు వారిశుశ్రూష భార్యను మనసునకెక్కినదాయని ప్రశ్నించెనట. అంత ఒక్కరోజు ఒక శిష్యునిపిలిచి నీవార ధాన్యముపైన చెఱువు గండిపడి యా నీట మునుగుచున్నది. కాన ప్రవాహము నిల్పుటకు కట్టవేసిరమ్మని ఆజ్ఞాపించెను. అంత శిష్యుడు బయలుదేఱి ప్రవాహము ఆపుటకు ఎంతయో ప్రయత్నము చేసెను, కాని ప్రవాహము ఆగలేదు. ఇక చేయునదిలేక తానె ఆ ప్రవాహమునకు అడ్డుకట్టగా అడ్డము పండుకొనెను. అంత జలదేవత అతని గురుభక్తికి మెచ్చి ఆగిపోయినది. ఆ శిష్యుడు ఎంతకు రాకయుండుటజూచి గురువుభార్య హెచ్చరించగా, గురువు అంద

అను వెంటనిడికొని కొంతదూరముందుండి శిష్యుని కేకవేయగా - శిష్యుడు గురువుకు అచ్చటనుండియే నమస్కారమని పల్కెను మరియు జరిగినది చెప్పగా గురువు సంతసించి వాని గురుభక్తికి మెచ్చి లేచిరమ్మని పిలిచి, వరము కోరుకొనుమనెను. వెంటనే యాతడు జ్ఞానము ప్రసాదించుమని కోరెను. అట్లేయని గురువు పల్కగనె అన్నివిద్యలు అతని హృదయమున ప్రకాశించినవి. అతడు సంతసించి వెళ్ళిపోయెను. ఇచట ముఖ్యముగ గ్రహింపదగినది యేమన దేవీ అనుగ్రహముతో (గురువుభార్య ప్రేరణవలన) ఈశ్వరునంతవాడగు గురుని యనుగ్రహమున శిష్యులకు తనలో నున్న విద్యలు ప్రకాశించినవి.

ఇక రెండవ శిష్యుడు కూడ ఇట్లే గురువుచే పరీక్షి పబడెను. ఈ శిష్యుడు ప్రతిదినము మాధుకరము తెచ్చి గురువు కర్పించుచుండెను. గురువు మాత్రము భోజనము చేసి శిష్యుని సంగతి పట్టించుకొనెడివాడు కాదు. శిష్యుడు ఆకలితో అలమటించి పోవుచుండెడివాడు. ఇతడు పశువులను మేపుటకు అరణ్యమునకు పోయి, అచట ఆకలికి బ్రతుకలేక ఆవు పాలను త్రాగి ఇంటికి వచ్చెను. గురువు శిష్యుని బాలకము విప్పారియుండుట గమనించి అడుగ నాతడు చేసినపని చెప్పెను. వెంటనే గురువు తన యాజ్ఞ లేకట్లు చేసినందుకు కోపించెను, మరునాడును శిష్యుడు ఆకలి భరింపజాలక దూడనోటినుండి వచ్చు నురగను ఆస్వాదించెను. ఇందులకు సైతము గురువు కోపించెను ఆ మరుసటిరోజు ఆవులన్నియు వచ్చినవి. కాని తాను మాత్రము ఇంటికి రాలేదు. గురువు వానిని వెదకికొనుచు రాగ, పాడుబడిన బావిలోనుండి శిష్యుని కంఠస్వరము వినిపించినది. కారణమేమని అడుగ నాతడు ఆకలికి భరింపజాలక జిల్లేడు ఆకులు తింటిననియు, తన్మూలమున కన్నులు కనబడకుండ పోవుటచే బావిలో పడితిననియు చెప్పెను. అప్పుడు గురువు అశ్వనీదేవతల నుపాసింపుమని చెప్పి వానికి దృష్టి తెప్పించెను. ఈ శిష్యుడు మొత్తముమీద అన్నము

తినకుండ గురువు నుపాసించుట ఇందుగలదు. గురువు పెట్టిన పరీక్ష కాగినందున గురువు వానికి సర్వవిద్యలు ప్రకాశించునట్లు చేసెను. ఇట్లీ కథలన్నియు గుర్వనుగ్రహమున్ననే సర్వవిద్యల జ్ఞానము కలుగుననుటకు చెప్పబడుచున్నవి.

మండన మిశ్రులు హంఫట్, హుంఫట్ అను మాటలకు అర్థము లేనట్లు, ఉపనిషత్తులనుగూడ కర్తృకర్మను గొనియాడుట కన్న నర్థము లేదని పేర్కొనిరి. కాని ఈ వాదమును శంకరులు ఖండించిరి. వారు పై శబ్దముల కర్థము లేదనరాదనియు, ఏదియో అర్థముండుటవలననే దయ్యములు పారిపోవుచున్నవనియు సమాధానించిరి. మంత్రములకు నలుపు, తెలుపు. ఎఱుపు మొదలగు రంగులు కూడ కలవని మనవారు నిర్దేశించిరి. నేడీ మంత్రములపై నమ్మకము లేకుండుటవలన మనము తలచిన పనులు కూడ అగుటలేదు. రాను రాను మంత్ర సంప్రదాయము కూడ తెలియకుండ పోవుచున్నది. మానవులు పుట్టునప్పుడు అందఱు ఒక్కటిగనె యుందురు. కాని వారివారి కర్మల ననుసరించి వారిలో నుత్తమత్వము ఏర్పడుచున్నది. ఈ భావమునే -

జన్మనా జాయతే శూద్రః
కర్మణా జాయతే ద్విజః
వేదాభ్యాసేన విప్రోఽసౌ
బ్రహ్మజ్ఞానేన బ్రాహ్మణః॥

అని చెప్పుచున్నది. కనుకవిద్యాజ్ఞానముకావలయునన్నచో గుర్వనుగ్రహము కావలయును. శ్రీకృష్ణుడు చిన్నతనమందే శత్రుసంహారకుడయ్యు, జారుడయ్యు కంసవధానంతరము చదువుకై సాందీపని వద్ద విద్య లభ్యసించెను. సర్వమెఱిగిన పరమాత్మ గురువుదగ్గఱ చేరవల

యునా? అనిన ఇది సంప్రదాయమని చెప్పుటకే యని తెలియపరిచెను. అంతియ కాని ఆ పరమాత్మకు తెలియని విషయము లోకమున లేదు.

పూర్వము యవక్రీతు డనువాడు గురువుదగ్గర చదువకుండ విద్య రావలయునని తపస్సు చేసెను. వానికి ఇంద్రుడు ప్రత్యక్షమై, ఇది సంప్రదాయ విరుద్ధముగా నున్నదని చివాట్లు పెట్టెను. కాని వాడు మానక తపస్సు చేయుచునే యుండెను. చేయునది లేక ఇంద్రుడు అట్లే పొమ్మని వరమిచ్చెను. ఇక యవక్రీతుని తండ్రి కుమారునకు గర్వము పెరిగి పోవునని భావించి వినయము నేర్చుకొనుమని బోధించెను. మరియు వారి ఆశ్రమమునకు సమీపమందున్న పరావసు, విశ్వావసు అను మునులజోలికి మాత్రము ఎట్టి పరిస్థితుల యందైన పోవద్దని, రైభ్యుని ఆశ్రమమునకే అసలు పోవద్దని కట్టడిచేసెను. కాని యవక్రీతుడు మాత్రము వాని కోడలిని చూచి మోహించెను. ఈమె మామగారు రైభ్యుడు అభిచారిక హోమము గావించి కృత్యను బుట్టించి వానిపైకి పంపెను. అది పోయి యవక్రీతుని చంపివేసినది. వానివద్ద జలపాత్ర యున్న నేమియు చేయజాలనని కృత్య వాని జల కమండలమును కాలితో తన్నెను. తర్వాత వానిని చంపెను. ఆ యవక్రీతుని తండ్రి భరద్వాజుడు దుఃఖించుచుండెను. ఇట్లుండ రైభ్యుని కొడుకులు విశ్వావసు పరావసు లోకరాజు యజ్ఞము చేయించుచుండిరి. చాలకాలమునకు తండ్రిని, యిల్లు, చూచిరావలయునని పరావసువు బయలుదేరెను. ఇతడు రాత్రివేళ ఒక అడవినబడి యింటికేగుచుండెను. ఆ రాత్రియే తండ్రియగు రైభ్యుడును కొడుకుల జూచి రావలయునని యా దారినే పోవుచుండెను. ఇద్దరు మార్గమధ్యమున చీకటిలో కలియగా తెలిసికొనలేక కుమారుడు తండ్రిని దొంగయని భావించి చంపెను. తర్వాత తమ్మునియొద్దకు పోయి తాను చేసిన పితృహత్యను తమ్మునితో జెప్పి తనకు బదులు వానిని తత్ప్రాయశ్చిత్తము నడుపుమని పంపెను. ఆ తమ్ముడట్లే పోయి పన్నెండేళ్ళు చేయవలసిన ప్రాయశ్చిత్త

మును పన్నెండురోజులలో తీవ్రనియమమున పాపుకొని వచ్చెను. ఇక అన్నగారు ఇదే సమయమని భావించి రాజుగారితో తమ్ముడు వచ్చినచో యజ్ఞము నాశనమగునని యెక్కులు చెప్పెను. తమ్ముడు రాజువద్దకువచ్చి తండ్రిని చంపినది తానుకాదనియు. అన్నగారు చంపిరనియు, వాని పాపమునకు తాను ప్రాయశ్చిత్తము నాచరించితిననియు చెప్పెను. ఎంత చెప్పినను రాజు వినక వానిని వెడలగొట్టెను. ఇక అన్నగారు యజ్ఞమును జేయించి రాజువలన అనేక భూరిదక్షిణలు గైకొని పోవు చుండెను. మార్గ మధ్యమున తమ్ముడు అన్నను జూచి జరిగినదానికి చింతిల్లుచుండగా, అన్న వానిని పాడు బావిలో పడద్రోసి పోయెను. కానీఅతడు పాడుబావిలో నుండి మానసిక యజ్ఞము చేయ సరస్వతి నది యుద్భవించి వానిని పైకితెచ్చి యుంచెను. ఈతని గొప్పతనమునకు ఇంద్రాదులందరు వరము లీయగా నితడు వారిని మూడు వరములు కోరెను. మొదట యువక్రీతుని బ్రతి కించుట, రెండవది తండ్రిని బ్రతికించుట, మూడవది అన్నగారిపాపములు పరిహృతములగుట, కోరగా దేవతలాతని మంచితనమునకు ఆశ్చర్యపడి వరములిచ్చుటయే గాక, అక్షయధనము నిచ్చియు పోయిరి. కాబట్టి గురు శుశ్రూష లేని విద్య గర్వకారణము కాగలదని తెలియువలెను. యువక్రీతుని గర్వము ఇంతపనిచేసినదికదా! గర్వకారణమైన విద్య దుష్ఫలితమే ఇవ్వగలది. తన కపకారి యగు యవక్రీతుని తన తండ్రిని బ్రతికింప కోరుటయేగాక ధనాశతో తన్ను బావి త్రోసిన అన్నకు పాపము లేకుండ చూచెను.

ఈకథలో విశ్వావసుని ఎవ్వరైన గొనియాడవలెను. "గురువులేని విద్య కూడదెవ్వరికైన"—అని పెద్దలు చెప్పిరి. ఈవిషయమునే శ్రీనాథుడు - శాస్త్ర మాచార్య సన్నిధిఁజదువదేని-అను పద్యమున విశదీకరించెను. సకల జీవులకు మనోమయకోశము, వేదశాస్త్రాది విద్యలున్న వనియు నవి గురుప్రబోధము వలన భాసించుననియు సంప్రదాయము.

అట్టి సంప్రదాయమునకు మూలము వ్యాసభట్టారకుడు వేదములనేకాండ మున శాకాండము విభాగము చేయుట వలన నాపేరాయనకు వచ్చినది. ఇతడు ద్వాపరమున నవతరించెగదా? అదివరకీ విద్యా విభాగములేదా యని ప్రశ్నింపరాదు. సృష్టికి ప్రారంభమందు విష్ణుదేవుడు తనయందలి నగభాగముతో నొక పురుషుని సృష్టించి, వానిచే వేదవిభాగము చేయించి వేదవ్యాసుడని, అపాంతరతముడని వానికి పేర్లు పెట్టెను. అపాంతరతము డనగా హృదయ తమస్సును పోగొట్టువాడని యర్థము. వ్యాసుడు తన పని కాగనె విష్ణువు నందు లీనమగుదునని యనగా విష్ణువు ద్వాపరమున కృష్ణ ద్వైపాయనుడవై పుట్టుమనెను. వ్యాసుడు పురాణముల నన్నింటిని మనోమయ కోశము నుండి వెల్వరించెను కాని వ్రాయుటకాదని తెలియవలెను. ద్వాపరయుగమున వ్యాసుడు ఇతిహాసపురాణములు వెల్వరింపగా తత్పూర్వమవి లేవను వారికి పై సమాధానము చెప్పవలసియున్నది. మనోమయ కోశమునకు యజుర్వేదము శిరస్సని ఋగ్వేదము కుడిరెక్కయని సామ వేదము ఎడమ రెక్కయని ఆదేశము పురాణము మాంసపిండమని బ్రహ్మ పుచ్ఛమని పక్షిరూపముగ రూపించి వేదమే చెప్పుచున్నది. ఇతిహాస పురాణాదులన్నియు వేదములతోబాటు మనోమయకోశముననున్నవె కాని క్రొత్తగా పుట్టినవికావు. ఉన్నవానినే ప్రకాశింపచేయువారు వ్యాసాదులగు మౌనివరేణ్యులు. అట్టి మహాత్ములకెల్ల నిత్యము ప్రణతులమైయుండి తదనుగ్రహముతో మనము విద్వాంసులము కావలయును.

11

సగుణబ్రహ్మమునుండి ఇచ్ఛామాత్రముతో శరీరమును ధరించి త్రిమూర్తులు శివ, బ్రహ్మ కేశవులు వచ్చుచున్నారు. దేవతలు మానవుల కంటె గుణగరిష్ఠులై జ్ఞానులై సత్వగుణ ప్రధానులగుచున్నారు. మానవులు వారి వారి మనస్తత్వములను బట్టి ఆయా దేవతలను పూజించుదురు. శాబర ఆగమ వైదికాది మంత్రములెన్నియో గలవు. ఆయా మంత్రము లచే నాయాదేవతలను ఆరాదించి యిష్టసిద్ధిని బడయవచ్చును మంత్ర స్రష్ట స్వతంత్రుడై యుండును. వర్ణమాతృకోపాసన చేయువానికి మాట లన్నియు మంత్రములై వెలయును. రామాయణమునందలి ఇంద్రజిత్తునకు మంత్ర నిర్మాణశక్తి యున్నదని తెలియుచున్నది. కాబట్టియే ఆతడుమంత్ర సమ్మేళన శక్తిచే అస్త్రనిర్మాణముగావించి రౌద్ర, బ్రహ్మ, నాగాస్త్రము లను మేళవించి ప్రయోగించినట్లు తెలియుచున్నది.

ఆగమ శాస్త్రముననుసరించి శివ, విష్ణువులకు గుళ్ళుగలవు. కాని బ్రహ్మకు మాత్రము ఆలయము లేదు. అందులకు కారణముగా స్కాంద పురాణమున నొక కథ కలదు. ఒకప్పుడు బ్రహ్మ విష్ణువులకు కలహము వచ్చినది. వారి మధ్య శివుడు లింగరూపమున తుదిమొదలు తెలియకుండు నట్లు ఆవిర్భవించెను. అపుడు శివుడు వారిద్దరిని పిలిచి తన పాదముగాని, తలగాని ఎవరైనను ముందు తెలిసికొనిరమ్మనెను. ఈ కార్యక్రమము నందు హంస వాహనమెక్కి బ్రహ్మ ఊర్ధ్వభాగమున తల కనుగొనుటకు పోయెను విష్ణువు పాదములకనుగొన వరాహరూపమున భూమిత్రొవ్వుచు క్రిందకు బోయెను. కాని విష్ణువు మాత్రము వెదకి వెదకి వేసారి శివుని పాదములు తెలియక తిరిగివచ్చి శివుని తమ పాదములు తెలిసికొనలేక

పోయితినని చెప్పుకొనెను. ఇట్లే బ్రహ్మకు కూడ శివుని శిరస్సు అగపడ లేదు అపుడు బ్రహ్మ అటు ఇటు చూడగ ఒకఆవు కన్పించినది. బ్రహ్మ ఆ ఆవును చూచి శివునితల నేను చూచివచ్చితినని సాక్ష్యము చెప్పుమని అడిగెను. ఇంతలో శివుని శిరస్సునుండి జారివచ్చిన మొగలిరేకును పట్టుకొని బ్రహ్మ దానిని కూడ శివునితల చూచెనని చెప్పుమని అడిగెను. వారిద్దరు తాను శివుని తల చూచినట్లు సాక్ష్యము చెప్ప నొప్పించుకొని శివుని దగ్గరకు వెంటనిడుకొని పోయెను. అపుడు శివుడు వారిని సాక్ష్యమడుగు చుండగా— ఆవు బ్రహ్మ శివుని చూచినన్నట్లు తలఆడించెను కాని చూడ లేదన్నట్లు మరల తోకనాడించెను. అపుడే శివుడు ఆవు అసత్యమాడు చున్నదని గ్రహించి— ఆవు ముఖము అసత్యమాడుటవలన ఉదయమే చూడరాదనియు, తోక సత్యముచెప్పుటవలన నది చూచినవారలకు పున్నె మబ్బునవనియు చెప్పెను. ఇట్లే మొగలిరేకునుగూడ తన పూజకు పనికి రాకుండునట్లు శపించెను. ఇట్లే బ్రహ్మ సైతము శివుని చూడలేకయు చూచినట్లు అశత్యమువల్కెను. కాబట్టి వానికిగుడియు, పూజయు లేకుండు నట్లు శపించెను.

సూత సంహిత సత్వగుణ ప్రధాన దేవతలు పూజించుట యుక్త మని బోధించుచున్నది. శివకేశవులకు మాత్రము పూజ శాస్త్రాచారముల యందు నిర్ణయింపబడినది. శివుడు తెల్లని రూపముగలవాడు సత్వగుణ సంపన్నుడు కానిఅతడు లయకారుడు కాబట్టి తమోగుణ వ్యవహారము గలవాడగుచున్నాడు. విష్ణువనల్లనిరూపముగలవాడు. కాబట్టి తమోగుణ ప్రధానుడు కాని ఇతడు పాలనకర్త యగుటచే సత్వగుణమున వ్యవహారము కలవాడగు చున్నాడు. బ్రహ్మఎఱ్ఱనిశరీరము కలవాడు కాబట్టి రజోగుణ ప్రధానుడగుచున్నాడు. సృష్టి రజోగుణ ప్రధానమగుట బ్రహ్మకు సత్వ సంబంధము లేమి లేకుండ పోయినదని తెలిసికొన వలెను. ఈ విషయము సూతసంహిత నొక్కి వక్కాణించు చున్నది.

దేవతలకు చేయు పూజను మూడు విధములుగ చేయవచ్చును. దేవతను విగ్రహరూపముగ ఆరాధించుట - కాయికము, ఒక మార్గము. లేక మంత్రోచ్చారణముతో నమస్కరించుట వాచికము మరియొక మార్గము. లేక మనస్సునందే ధ్యానించుట మానసికము మరియొక మార్గము. పూజాది కలాపమునందును, ధ్యానాది సమాధిస్థితియందు నున్నవారికి ఇతరులు నమస్కరింపరాదు. ఏలన, నమస్కారమునకు ప్రత్యభివాదనము చేయవలసియున్నది. అట్లు చేసినచో వారి ధ్యానాదులకు విఘ్నము వాటిల్లచేసినవారగుదురు. ఎవరైనను నమస్కారముచేయునపుడు కుడిచెవి మూసికొని, ప్రవరచెప్పి—కులగోత్రాదుల నెఱింగించి నమస్కరింపవలసి యున్నది. అదియు తనకంటె గొప్పవాడైన శుచియగువానికి తాను శుచియైచేయుట శ్రేయస్కరము. ఇంటికి అతిథివచ్చినపుడు భోజనసమయమున మొదట యజమానునకు హస్తోదకము వేయవలెను తర్వాతనే అతిధికి వేయవలయును. కాని అతిథి స్వీకరించిన పిమ్మటనే యజమానుడు ఆ జలమును పుచ్చుకొనవలసియుంటుట గమనింపవలయును. భర్త అనుజ్ఞపై భార్య అతిథిసేవ చేయవలసియున్నది. కేశవనామములు చెప్పునపుడు పుచ్చుకొను ఉదకము (మూడుసార్లు) ఒకదాని పిమ్మట మరియొకటి కలవకుండ పుచ్చుకొనవలయునే గాని, వెంట వెంటనే మూడు నేకమగునట్లు తీసికొనరాదు. అట్లే ప్రాణాహుతులు వేసికొనునపుడు విడివిడిగా స్వీకరించుట యుక్తము. 6—3 ఒకటైన బ్రాహ్మణుడు అని తెనాలి రామకృష్ణుడు ఆక్షేపించినాడు. స్త్రీ వాసస్సుతో సత్కర్మలేవియు చేయరాదు. ఆ వస్త్ర మాచమనమునకు పనికిరాదు. స్త్రీ వాసస్సు అనగా స్త్రీ కొఱకు కట్టిన వస్త్రము. అది ఉదికినను అందులకుదప్ప మఱి ఎందులకు నుపయోగింపదు. పై చెప్పిన విషయము లన్నియు ఆచారకాండకు సంబంధించినవి. ఇట్టి వనేకములు గలవు.

ఆచారహీనుడైన వాని వేదములుకూడ బాగుచేయచాలవు. పితృదేవతలు దేవతల కుమారులుగ గ్రహింపవలసి యున్నది. ఒకప్పుడు దేవ

తలు బ్రహ్మను తత్త్వము చెప్పుమనిరి. అపుడు బ్రహ్మ వారి కుమారుల నడిగి తెలిసికొమ్మనెనట. వారలట్లు పుత్రుల తత్త్వమడుగ వారు తండ్రులను బిడ్డలారా! అని సంబోధించిరట. దానివలన వారలు పితృదేవతలైరి. పితృదేవతలు మూర్తులు, అమూర్తులు నని రెండు విధము లగుచున్నారు.

"సోమః పితృమాన్ యమోంఽగిరస్వా నగ్ని ష్వా
త్తోఽగ్నిః కవ్యవాహన ఇత్యాదయో యేపితరః"—

అని తర్పణ మొనర్చుచున్నారు. ఈ ఏడింటిలో మూడు మూర్తకులములు, నాలుగు అమూర్తకులములున్నవి. కాన ఈ ఏడుగురు దేవతలకు దేవతలగుచున్నారు. వీరు పితృలోక ప్రధానులు. వీరుకాక మన వంశమున పోయినవారు స్వపితరులు అనబడుచున్నారు. అమూర్తులకు, సూక్ష్మశరీరము మాత్రము కలదు. మూర్తులకు స్థూలశరీరము కూడ నుండును. పితృలోకము వేఱుగానుండి, వారు జ్ఞానులుగకూడ నుండెదరు. వీరిని తృప్తిపరచుటకు శ్రాద్ధములు పెట్టవలయును కాని నేడు చచ్చిన వారికి శ్రాద్ధములేల! ఈ బ్రాహ్మణులుతిన్న వారికితృప్తియెట్లుకలుగును? అని మనవారు శ్రాద్ధముల నిరసించుట మనము చూచుచునే యున్నాము. శ్రాద్ధము పెట్టనివానికి ఏ పుణ్యము చేసినను అక్కరకురాకుండ పోవును. కాబట్టి శ్రాద్ధనియమము లెట్టివో కొన్ని తెలిసికొనుట అవశ్యకమైయున్నవి.

"కర్తుం పూర్వేఽహ్ని నియమో!
భోక్తుశ్చైవ వరేహని"—

అని మొదటి నియమము శ్రాద్ధకర్తకు కలదు. రేపు శ్రాద్ధమన తొలినాడు బ్రహ్మచర్య - ఏకవార భోజనాది నియమము ఉండవలయును. శ్రాద్ధమునాడు కర్తకు భోక్తకు నియమము లుండుట చూచుచున్నాముగదా? అయినచో మనవారు శ్రాద్ధమునాడు మఱికొన్ని గారెలు వగైరా వండు

కొని రాత్రికూడా ఫలహారమని తినుచున్నారు. కొందరు బుద్ధిమంతులు భోక్తనుగూడ బిలచి ఆ అల్పాహారము బెట్టుచున్నారు. ఇది యంతయు లౌకికము శాస్త్రమొప్పదు. భోక్తుశ్చైవ అను చకారమువలన తద్దినము రోజున, మరుసటిరోజున కర్త భోక్త ఇద్దరును నియమముగా నుండ వలెను. ముందురోజుననే బ్రాహ్మణులకు నియామకము జరుగవలయును. శ్రాద్ధమునాడు కర్త శ్రాద్ధవిధి నిర్వర్తించినట్లు తెలియచేయుటకు విశ్వే దేవతలు ఏర్పడియున్నారు.

వీరు శ్రాద్ధవిధికి సాక్షులు. మంత్రమున - వసురుద్రాదిత్య రూపాణామ్ —— అన్నపుడు తండ్రి - తాత - ముత్తాతలకు శ్రాద్ధవిధి గలదు. ఇందు తండ్రి వసురూపుడని, తాతరుద్రరూపుడని, ముత్తాత ఆదిత్యరూపుడని చెప్పబడుచున్నారు. వీరు క్రమముగ వసు - రుద్ర ఆదిత్య లోకములందుండెదరు. వారు లేకున్నను. వారు ఎక్కడ నున్నది వారి రికార్డు ఆ లోకములందుండును. శ్రాద్ధమునందు ఆరుగురు బ్రాహ్మణులకు తప్పక పెట్టవలయునని శాస్త్రము చెప్పుచున్నది. పితృస్థానమునందు ముగ్గురు, విశ్వేదేవతలస్థానమునందు ఇద్దరు, విష్ణుస్థానమున నొకడుగా బ్రాహ్మణులుండవలయును. ఆరుగురకు పెట్టలేకున్న పక్షమున ముగ్గురికైనను పెట్టవలయును. ముగ్గురకు పెట్టలేకున్న ఇద్దరికి పెట్టవలయును. ఆ యిద్దరకు పెట్టలేకున్న ఒకరికైనను, ఆ ఒక్కరికి పెట్టలేకున్న ఆ కర్త అడవికేగి పితృదేవతలను గూర్చి పెద్దగ నేడ్వవలయునని కలదు. దానితో పితృదేవతలు దయదలచిపోదురు. ఇక శ్రాద్ధమునందు భోక్తలు కావలసినవెల్ల అడిగి పెట్టించుకొని తినవలయును. లేకున్న వారి నాలుక కోయబడును. ఇక పెట్టువారును చక్కగ వారికి కావలసినది పెట్టవలయును. లేకున్న వారి చేతులు కోయబడునని చెప్పబడియున్నది. చేయబడు పదార్థములు సైతము - "శ్రాద్ధే శాక చతుష్టయం" నాలుగుకూరలు, భక్ష్యభోజ్యములు మొదలైనవి చక్కగ చేయవలసి యున్నది. శ్రాద్ధకల్పమునందు విష్ణువు

పెత్తనదారుగ నుండును. శ్రాద్ధమునందు ఆయా బ్రాహ్మణుల నాయా దేవతలుగ భావించవలయును. ఆయా దేవతలను వారి రూపమున తృప్తి నొందించుచున్నాము కాబట్టి, ఆయా లోకములందలి పితృదేవతలుకూడ తృప్తి నొందుచున్నారు. విశ్వేదేవతలు ఆయా లోకములకు ఈ శ్రాద్ధ విషయమును తెలియజేయుచుందురు. ఆయా లోకములందలి అధికారులగు వసువులు, రుద్రులు, ఆదిత్యులు. విశ్వేదేవతలుచెప్పగానే వారి పితృదేవత లెక్కడ నెట్లున్నది విచారించి వారికి దగిన యాహార మిచ్చుచుందురు. వారు దేవలోకమున నున్న అమృతాహారము, రాక్షసాది రూపముననున్న మాంసశోణితాదికము, పశువుగ నున్నగడ్డి – ఇట్లు వారి వారి ఆహారములుగ మార్చి చెందచేయుదురని శ్రాద్ధకల్పమున నున్నది. ఈ వ్యవహారము సరిగా జరుగుచున్నదా ? లేదా ? అని విష్ణుదేవు డేపేట విమర్శించుచుండును కాన నిది తప్పింప నెవరి శక్యముకాదు. దీనికి మన మనియార్డరు వ్యవహారమే దృష్టాంతము.

పితృపూజలు చేయువారికి హరివంశము నందలి కథ మార్గదర్శకముగ నున్నది. భరద్వాజుని కొడుకులు ఏడ్వురు విద్యాభ్యాసమునకై గురుకులమున కేగిరి ఈ ఏడుగురు గురుధనమైన ఆవును, దూడను, అడవికి మేపుటకు తోలుకొని పోయిరి. అక్కడ వారికి మిక్కుటముగ ఆకలి అయినది. వారిలో నల్వురు మాత్రము గోవును తిందమని పలికిరి. కాని వారిలో ముగ్గురు మాత్రము అందులకు ఒప్పుకొనలేదు. కాని పై నల్వురును తినుటకే నిశ్చయించిరి. వారిలో చివరివాడు మాత్రము మాంసము ఊరకతినుట ధర్మముగాదని చెప్పి మూడు మాంసపు పిండములను పితృదేవతల కర్పించునట్లు చేసెను. మిగిలినది వారు ఏడ్వురు ఆరగించిరి. ఇక సాయంకాలమున ఆ దూడను మాత్రమే ఆశ్రమమునకు చేర్చిరి. గురువు ధేనువును గూర్చి యడుగగా నా యందరు గోవును పులి చంపి తినెనని జవాబిచ్చిరి. గురువు నమ్మి ఆవు పోయినను శిష్యులింటికి

వచ్చిరని సంతసించెను. ఈపాపమునకుగా ఏడ్వురును ఒక్కసారి చని పోయిరి. అదియుగాక వారిలో ఏది చేసినను అందరును కలసియే చేయ వలయునని నియమమున్నది. వీరు చనిపోయి మరు జన్మమందు దశార్ణ దేశమున నొక బోయవాని కడుపున పుట్టిరి. వీరుపూర్వజన్మమందు గురుని ఆవు మాంసమైనను పితృదేవతలకు అర్పించి తినిరి గనుక తత్పుణ్య ఫలముచే వారికి ఈజన్మమందు పూర్వజన్మజ్ఞానమున్నది. కానబోయలైనను హింసాదికము చేయక తల్లిదండ్రుల సేవించుకొనుచు జ్ఞానముతో కాలము గడుపుకొని, ఈజన్మమంతరించిన పిమ్మట వారు కాలాంజనగిరియందు మృగములై జన్మించిరి. అపుడు కూడ వారికి పూర్వవృత్తాంత జ్ఞానమున్నది. దానివలన నప్పుడును దపించిరి. మరల వారు చక్రవాకములై శరద్వీపమున బుట్టిరి. తర్వాత మానససరోవరమున వీడు హంసములై జన్మించిరి. ఇపుడు కూడ వారికి పూర్వవృత్తాంత స్మృతి యున్నది. ఇన్ని జన్మములు చేసిన పాపమునకు పశ్చాత్తాపము నందుచు ధ్యానయోగముతో కాలము గడుపుచుండిరి.

ఇట్లుండగా భ్రాభవృద్ధుడు అను రాజు భార్యలతో జలక్రీడలాడుటకు ఆ సరస్సునకు వచ్చెను. అందు విహరించుచున్న ఆపక్షులలో ఏడవపక్షి రాజుతోకూడ జలక్రీడలాడు రాణిని చూచి - ఇట్టిభోగమింకొక జన్మమున నుండదుగాన-పుట్టినచో రాజై పుట్టవలయునని పల్కెను. అంత మిగిలిన పక్షులన్నియు ఆ యేడవ పక్షిని అట్లే పుట్టుమని శాపమిచ్చినవి. అంత ఆ యేడవపక్షి వానిని విడిచి యుండలేననియు, సామాన్యముగా నంటినిగాని ఈ భోగాపేక్షతో చెడిపోదునుగదాయని యేడ్చెను, అందులకు మొదట నల్వురు - మిగిలిన ముగ్గురితో ఇద్దరిని (రెండుపక్షులను) మంత్రిపురోహితుల కడుపున బుట్టి, ఏడవవానికి మంత్రి పురోహితులై యుండుడని శపించిరి. ఈ విషయమును ఆ నల్వురు వారినిఅనుగ్రహించి చెప్పితిమనియు, భోగములనుభవించి సుఖమునొందుడనియు జెప్పిరి.

ఆ శాపముతో నామగ్గురకు పూర్వజన్మజ్ఞానముకూడ పోయినది. ఇది కూత గోవధము మాంసభక్షణము సమానమైనను - పిత్రూద్దేశముతో చేయుమని చెప్పిన విశేషమున నా ముప్వురు విశేషభోగము ననుభవింపనైరి.

జలక్రీడలాడుచున్న రాజదంపతులు ఏడవపక్షి అందమునకు ఆశ్చర్యము నొంది చూచుచుండగా, నది వారి కడుపునబిడ్డయై పుట్టినది. ఇట్లే ఆరవది పురోహితుని కడుపున, ఐదవది మంత్రి కడుపున బుట్టెను. మిగిలిన నాలుగు పక్షులు కురుక్షేత్రమున నొక బ్రాహ్మణుని కడుపున జన్మించినవి. వీరు పుట్టుటతోడనే పూర్వజన్మ జ్ఞానము కలిగి వేదవేదాంగముల కొలది కాలముననే చదివి సంసారమున విసుగుకలిగి తల్లిదండ్రులను మహాప్రస్థానమునకై సెలవిండని కోరిరి. వీరికి మాత్రము పూర్వజన్మ జ్ఞానమున్నది. వీరి తల్లిదండ్రులు మాత్రము పోషణ, శ్రాద్ధాదులు ఎట్లని భావించి కుమారుల పోకకు సమ్మతింపరైరి. కాని వీరు మాత్రము మేము మామూలు కుమారులవంటివారము కామనియు, కుమారుల వలన సేవ మీకు జరుగదనియు, అందులకు ధనమవసరమై యున్నదనియు, కావలసినచో ధనమిప్పించెదమనియు పల్కిరి. అంతవారు-

శ్లో॥ సప్త వ్యాధా దశార్ణేషు మృగాః కాలాంజనేగిరౌ
చక్రవాకాశ్శరద్వీపే హంసాస్సరసి మానసే
యేస్మజాతాః కురుక్షేత్రే బ్రాహ్మణా వేదపారగాః
ప్రస్థితా దూరమధ్వానం యూయం తేభ్యోఽవసీదత ॥

అను శ్లోకమును తల్లిదండ్రులకు వ్రాసియిచ్చి, ఆశ్లోకమును రాజు దగ్గర చదివి వినిపించిన కావలసిన ధనము లభింపగలదని చెప్పి వారు మహాప్రస్థానమునకై సాగిపోయిరి. వీరిలో మిగిలిన ముప్వురు - రాజు మంత్రి పురోహితులై జన్మించి భోగముల ననుభవించుచుండిరి. ఇక పై

చెప్పిన తల్లిదండ్రులు ఆ శ్లోకమును ఈ రాజు దగ్గరకు తీసికొని రాగా ఆ సమయమున రాజుగారు వనవిహారము వెళ్ళియుండిరి. అతడు భార్యకు కోపము వచ్చినదని విహారమునకు పోయి రెండు రోజులుండి మూడవ నాడు నిద్రయందు కలలో గురువు కనబడి ఆకలియయి ఆవును తింటిరి, సరే! ఆ మాట సత్యము చెప్పక అబద్ధము కూడ నాడి పడరాని పాట్లు పడుచుంటిరి గదా! నాయనలారా! ఆ పాపము శమించినది అని చెప్పెను. దానికి నాశ్చర్యపడుచు తరువాత ఊరియందు ప్రవేశించు సందర్భమున పై బ్రాహ్మణుడు కనిపించి పై శ్లోకము చదువగనే, ఆతనికి పూర్వజన్మ జ్ఞానము కలిగినది. బ్రాహ్మణునకు కావలసినంత ధనమిచ్చి పంపి, బిడ్డలకు రాజ్యాదులర్పించి మహాప్రస్థాన మాచరించి, బ్రహ్మలోకమునకు పోయిరి.

కావున శ్రాద్ధవిధి నిర్వర్తించిన వారు జ్ఞానవంతులై తరించెదరు. అంతియగాదు పూర్వజన్మ స్మృతియు వారికి లభించును. ఇక పితృదేవత లన్నినో దేవతలకు కూడ పూజ్యులగుచున్నారు. వారి లోకమునకు సంబంధము లేకున్న ఆలమటించి పోవుదురు. కావున మన పితరులు శ్రద్ధతో నెల్లవారు వారివారి కులాచార ధర్మములను బట్టి తప్పక శ్రాద్ధ విధి నడుపవలెను. కావున మానవులు వేదవేదాంగాది విద్యాభ్యాస యుక్త బ్రహ్మచర్యముతో ఋషులను, యజ్ఞయాగాది క్రతువులతో దేవతలను. శ్రాద్ధములతో పితృదేవతలను ఉపాసింపవలయును. ఈ ఉపాసనతో ఋణత్రయము తీరిన తర్వాత యోగముతో గాని, సాంఖ్యముతో గాని, ముక్తినొంద యత్నింపవలెను ఈ యోగమున అష్టాంగము లున్నవి. అవి యమనియమాసన ప్రాణాయామ ప్రత్యాహార ధారణ ధ్యాన సమాధులు అనునవి. ఇచట చెప్పబడిన యమనియమాది ఆసనములు కార్మకాండ యందు చెప్పబడినవి. కాన యోగమునకు నైదు మాత్రమే యంగము లందురు. సమాధి ఫలముగాన యోగము చతురంగమే యందురు కొందరు.

ఉపాజ్ పూర్వకమైన అస్ ధాతువునకు ఊరకుండుట యని యర్థము వేమన చెప్పిన—

ఆ.వె. మాటలుడుగకున్న మంత్రంబు నిలువదు
మంత్రముడుగకున్న మనసు నిలదు
మనసు నిలువకున్న మరిముక్తి లేదయా
విశ్వదాభిరామ వినురవేమ॥

అను పద్యమున కదియే అర్థము. ఆ స్థితి చేకూరుటకే సంధ్యావందనము ఏర్పడినది. అచట గోచరమగునది బ్రహ్మవస్తువు. దానిపై మనస్సు ఉండుట సంధ్య యగుచున్నది. ఒకప్పుడు పరశురాముని యజ్ఞము చేయించిన దత్తాత్రేయస్వామి యజ్ఞాంతమందు నీ పరశురాముని యాగముతో నా సంధ్య పోయినది అని విసుగుకొని సంధ్యావందనమును చేయబోవ సిద్ధసాధ్యాది దేవతలు దత్తదేవుని సంధ్యావందనము చూచుటకై పోగా. పరశురాముడు నదియొడ్డుననున్న వాడున్నట్లుండి యదృశ్యుడయ్యెను. చాలసేపటికి వారికి మామూలు శరీరముతో కనబడెను. ఇది యేమని ఆశ్చర్యపడుచుండగా నా దేవతల కాదత్తదేవుడు – సమష్ట్యభిమానిగ నుండుటయే సంధ్య. అట్టిస్థితి కుదిరినప్పు డీ తత్త్వములన్నియు స్థూలసూక్ష్మములతో వందుండిపోవును. మరల నిటుతిరిగిన నివియన్నియు భాసించును —అని చెప్పెను.

ఇట్టి స్థితికి మానవుడు వచ్చుటకే సంధ్యావందనము చేయుట. కావున వృత్తికి వృత్తికి మధ్యనున్న బ్రహ్మవస్తువును కనిపెట్టు తెలివియే, ఆసంవిత్తే సంధ్యాదేవి యనబడుచున్నది. అట్టి స్థితి కుదురుటకు బహిర్యాగమగు క్రియారూపమైన సంధ్యావందనము మూడుపేళల తప్పక చేయవలసి యున్నది. ఇందు సూర్యోపాసనము గాయత్రీ ఉపాసన, అర్ఘ్య ప్రధానము కలవు. ఇందును అర్ఘ్యప్రదానము ముఖ్యమని కొందఱు, గాయత్రి ముఖ్యమని కొందఱు, సూర్యోపాసన ముఖ్యమని మరికొందఱు

అనుచున్నారు. ఇచట ఆశౌచాదులు వచ్చినను విడువక నాచరించు నర్ఘ్య దానము ముఖ్యమని కొందఱు, గాయత్రీమంత్రము బ్రహ్మధ్యానము గాన నిదియే ముఖ్యమని కొందఱు, అన్నిటికి నుత్తమమైనది గాన సూర్యోప స్థానము ముఖ్యమని కొందఱు చెప్పెదరు స్త్రీ పురుష భేదము పాటింపక అందఱును సంధ్యావందనము చేయవలయును. సూర్యుని చూచుచు ప్రాతస్సాయం సమయముల నర్ఘ్యమీయవలెను. రామాయణమున హను మంతుడు లంకలో సీతను వెదకుచు విసిగి వేసారి చివరకొక సరస్సు సమీపమున వేచియుండెను. కారణమేమన సీత సంధ్యావందనము చేయు టకై సరస్సు దగ్గరకు వచ్చువేళ యిది యని ఆతడు భావించినట్లు వాల్మీకి వ్రాసిపెట్టెను. దీనినిబట్టి స్త్రీలు కూడ సంధ్యావందనము చేయుట అవశ్యకము. దానినిబట్టి శూద్రాదులును సంధ్య నుపాసింపవలెను. ద్విజులు సమంత్రకముగచేయు సంధ్యయన బహిర్యాగము ద్వారమున అంతర్యా గము సిద్ధికావలసియున్నది. అది కలుగుతఱి అందఱకు ననుభవము ఏక రూపమే. ఈ యంగత్రయముతో గూడిన సంధ్యోపాసనము తురీయము. అదియే యిందు ప్రధానమని కీ. శే. లగు మా తండ్రిగారు శ్రీరామ కథా మృత కవియగు తా. వెంకటప్పయ్యశాస్త్రిగారు తమ గురుపరంపరా ప్రాప్త మను సిద్ధాంతమున నుడివిరి.

ఇక దీని కధికారు లెవరన ? "యో దేవః సవితా అస్మాకమ్ ధియో ధర్మాది గోచరాః" అను గాయత్రీ పురాణ శ్లోకముతో అందఱును అర్ఘ్యప్రదానము చేయవచ్చును. మంత్రము మాత్రము స్వరప్రధానమై యుండును గనుక ఉచ్చారణలోప ముండరాదు. పూర్వము వృత్రాసురుడు ఈ స్వరలోపముచే చచ్చెనను ఇతిహ్యమొకటి శ్రౌతమే కలదు. కావున నెల్లజీవులకు యథావిధిగ నాచరించు సంధ్యావందనమే ముక్తినిధానమని వేరుగ చెప్పనక్కరలేదు. కాన మనవారెల్ల సంధ్యోపాస్తిచే ముక్తు లయ్యెదరు గాక !!!

12

మానవుని మనస్సు నాదమునందు సులభముగ లయమగుచున్నది. అనగా వృత్తిరహితమైన బ్రహ్మానందమును పొందుచున్నదని యర్థము. పరమాత్మ స్వరూపము బ్రహ్మానంద పర్యవసాయి అయినను లీలాస్వీకృత విగ్రహుడైన విష్ణువు బ్రహ్మమయుడై యుండియు లోకవ్యవహారము సాగించుచు, తన వ్యవహార సమయమున బ్రహ్మరూపమునుండి చ్యుతుడు గాక అచ్యుతుడై వెలయుచున్నాడు. విష్ణువు సహజమైన బ్రహ్మభావము నుండి చ్యుతుడు కాడు కావుననే అచ్యుతుడని పిలువబడుచున్నాడు. శ్రీరామునకు 11 వేల సంవత్సరములలో ఒక్కసారి దేహాభిమానము కలిగినదట. మారీచుని సంహరించివచ్చి పాడుబడిన పర్ణశాల జూచి శరీరాభిమానముతో ఓ కైక ? ఓ తల్లి ! నీ కోరిక నెరవేరినదని విలపించెను. ఇట్టి తిట్టు కైక నెప్పుడు తిట్టలేదు. కావున నిచ్చట రామునకు మానుషాభిమానము కలిగినదని వృద్ధసంవాదము కలదు. అగస్త్యుడు రాముని - రావణుడు సీతను తల్లివలె రక్షించె (మాతేవ పరిరక్షితా) నని యుండగా నేల సంహరించితివని ప్రశ్నించెనట. అసలు రావణుడు ... రాముని చేతి యందు మరణము కోరియే సీతను దీసికొనిపోయెను గాని కామముతో గాదని పెద్దల వాదము. కాన రావణుడు తెలిసిన మూర్ఖుడనబడుచున్నాడు. దుర్యోధనుడు మాత్రము తెలియని మూర్ఖుడగుచున్నాడు. రావణుడు సీత నపహరించు సందర్భము లోకమున పరిపరివిధములుగ నున్నది. అసలు సీతయే యని కొందరు, కొందరు అసలు సీత కాదనియు, మాయాసీత యనియు తెల్పుచున్నారు. ఈ మాయాసీతయే అగ్నియందుండి ద్వాపర యుగమున ద్రౌపదియై అగ్నినుండి జన్మించెనని దేవిభాగవతమున గలదు

వాల్మీకమున మాయాసీత యెక్కడ లేదని కొందరు పండితులు వాదించు చున్నారు. వాల్మీకము నాదికావ్యమని వ్యవహరింతురు. కావ్యము వ్యంగ్య ప్రధానమని లక్షణము గదా ! "జీవితం వ్యంగ్యవైభవం" ఆ వ్యంగ్యము నెల్లను కనుగొన లేరనియే దానిలోని వ్యంగ్యమంతయు అధ్యాత్మ రామాయణముగా వ్రాయబడినదని పెద్దలు అనుచున్నారు. అథవా వాల్మీకము వ్యంగ్యకావ్యము కాదనినను దానినిబట్టి మాయాసీత లేకున్నను అధ్యాత్మ రామాయణమునుబట్టి, దేవీభాగవతాది గ్రంథములనుబట్టి, లౌకిక ప్రవాద మునుబట్టి మాయాసీత వ్యవహారములో లేకపోలేదు. అంతరర్థమును ఆలో చించినచో రావణాసురుడు దేవీ అనుగ్రహము కొఱకు సీత నెత్తుకొని పోయెనని చెప్పవలయును. దీనికి రామాయణములోనే సనత్కుమార రావణసంవాద, కపిలముని సందర్శనములు నిదర్శనములు. దహరాకాశములోని బ్రహ్మతో మాయలీనమై యున్నది. లంకయనగా శరీరము క్రిందిభాగము. అందున్న తెలివియే మాయాసీత, అది నాగలిచాలువలె చక్రముద్వారా వ్యాపించియున్నదని యోగము. వాయుజుడు (హనుమంతుడు) దేవీతత్త్వమును వెదకుచున్నాడు. సీత హనుమంతునితో భాషించుచు రామునకు ఎక్కడ వలసిన నక్కడనే సీత యున్నదని పల్కెను. అనగా రావణుడు తెచ్చిన సీత మాయాసీత యని తెలియుచున్నది. రావణుడు తెచ్చినపుడు అసలుసీత అగ్నిలయందు లీనమైయుండెనట. దీనిలో వాది దౌర్బల్యమేగాని వాదదౌర్బల్యము లేదు. ప్రాసంగిక మాకథ యిట్లుండ ప్రస్తుత మనుసరింతము.

మనస్సునకు వృత్తియందే ప్రపంచము వచ్చినది. వృత్తి లయమైనచో ప్రపంచము లేదు. అది నాదమునందు సులభముగ లయము నొందును. అని శంకరులు భాషించిరి. కాని యేది యెట్లున్నను అవతార పురుషులకు కష్టసుఖము లనునవి లేవు. మనము గ్రంథములందు చదువునది యెల్ల వ్యావహారికలోకమునకు మాత్రమే యగుచున్నది. కావ్యములు

వ్యంగ్య ప్రధానముగ, కాంతాసమ్మితములై అలరారుచున్నవి. వేదములు ప్రభుసమ్మితములు. పురాణములు మిత్రసమ్మితములు. ఇక కావ్యము వ్యంగ్య ప్రధానమంటిని గనుక ఇందు వాచ్యార్థముకాక వ్యంగ్యార్థము స్ఫురించుచున్నది. శ్రీహర్షుని నైషధమునకు వ్యంగ్య వైభవములో వేదాంతపరమైన అర్థము గ్రంథమంతట తోచుచున్నది. కాని మనవారు 'కావ్యాలాపాంశ్చవర్జయేత్"-అను వాక్య ప్రమాణమున కావ్యముల చదువ రాదని నిషేధించిరి, అయినను కావ్యములందు వర్ణించిన మంచి విషయమును గ్రహించి చెడును విసర్జించవలయుననియే పై వాక్యార్థముగ సమన్వయించి చూడవలయును."సత్కావ్యకృత్యాద్యవసే చరంచ సమీరసేకాది వదీరయంత్యేత్యాది వాక్యములునుకావ్యములవలన కర్తవ్యత్వబుద్ధి నిశ్చయమగుచుండును. చమత్కారిత్వమందు నుండుటవలన మనము నాకర్షించును గాన నిట్టి కావ్యములకా నిషేధము తగులదు. అట్లు తగిలిన వాల్మీకమును కావ్యమేగదా ?

ఇక శ్రీహర్షుడు తన కావ్యమగు నైషధమును వ్యంగ్యవైభవ విలసితముగ వెలయించె నంటిమి. ఈవ్యంగ్యమనునది పదైక దేశమని వర్ణగతమని అనేకవిధములుగ నుండును. అంతియగాక ప్రబంధగతమని వాక్యగతమని గలదు. శ్రీ హర్షుడు తన కావ్యమును ప్రబంధగత వ్యంగ్యముగా రచించెను. ఇందు ప్రతిశ్లోకము వేదాంతార్థమును స్ఫురింపజేయును. రలయో రభేదః — అను సూత్రప్రమాణముచే నల శబ్దమునకు నర అని అర్థము చెప్పవచ్చును. నరుడనగా నశింపనివాడని యర్థము. క్షయించు స్వభావముగల శరీరమును కాపాడువాడని భావము. కాబట్టి శరీరాధికారి నరుడు అగుచున్నాడు. ఈభావము నాతడు మొదటి శ్లోకమునందే పొందుపరచెను. క్షితి రక్షిణః కథాః — క్షితి అన నశించునది శరీరము దాని రక్షించువాడు నరుడు. అతడు మహోజ్జ్వలమగు తేజోరాశి. సితచ్ఛత్రిత కీర్తిమండలుడు అని మొదటి శ్లోకమున నామరూప రహితః పరమాత్మా-

అని వస్తునిర్దేశముచేసి రెండవ శ్లోకమున దీనిని వివరించెను. శ్రీకృష్ణుడు గీతయందు —యచ్చంద్రమసి యచ్చాగ్నౌ తత్తేజో విద్ధిమామకం—అని చంద్రునియందలి అగ్ని యందలి తేజము నాయదిగా తెలిసికొనుమని చెప్పెను. కాని సూర్యమండలము సంగతి చెప్పలేదు. దాని కర్థము చంద్ర మండలము సహస్రారము. అగ్నిమండలము నాభిస్థానము. ఈ రెంటి యందు వ్యాపించిన తేజము దహరాకాశగతమగు సూర్యతేజము తనదిగా నిశ్చయించి నుడివెను. నైషధమునందలి —రసైః కథామస్య సుధావధీరిణీ నలస్స భూజాని రభూత్ గుణాద్భుతః …అను శ్లోకమున ఎవరికథ రసము లతో సుధను తిరస్కరించునదియో ఆ నలుడు భూమిః జాయగా గలవాడై గుణాద్భుతు డాయెను అని నిర్గుణమును సగుణముచేసి వర్ణన మొదలిడెను. వేదాంతపరముగ పరమాత్మని కథయని మరియొక అర్థము. మరియు —

సువర్ణ దండైక సితాతపత్రితజ్వల త్ప్రతాపావళి కీర్తి మండలః — మొదటి శోకమున సితాతపత్రమును మాత్రమే చెప్పి రెండవ శ్లోకమున దానికి సువర్ణ దండత్వమునుకూడ సంపాదించెను ఈ శ్లోకము వలన బంగారపు కఱ్ఱపై భాగమునగల తెల్లని గొడుగు కలవాడు నలుడని భావము. సహస్రారమునందలి పరమాత్మ స్ఫురణ మరియొక అర్థముగా తోచును. ఇట్లు ప్రతి శ్లోకమునకు వేదాంతార్థము చెప్పి తీరవలయును. ఇందలి దమయంతి విద్యాశక్తి యని ఇదివరకే చెప్పబడినది

ఒకనాడు నలుడు వనవిహారమునకై వెళ్ళెను. శరీరమే ఉద్యాన వనము. అందలి నాడులే వృక్షములు. ఆ ఉద్యానము నందొక సరస్సు. అదియే ఐరంమదీయ సరస్సు. అందు బంగారు రెక్కలుగల హంస ఒంటి కాలిమీద నిలబడి నిద్రబోవుచున్నది. మన శరీరమునందలి హంస కూడ నిద్రించుచునే యుండును. ఈ హంసను జాగ్రత్తగా పట్టుకొనవలసి యున్నది. నలుడా హంసను బట్టుకొనగా నది యాతని చాల బాధపెట్టెను.

తనను వదలుమని సామోక్తులతో పలికెను. చివరకు విడిపించుకొనలేక దుఃఖించెను.

“మదేకపుత్రా జననీ జరాతురా” ఇత్యాదిగా నెంతయో ప్రాధేయ పడినది. ఇదియంతయు మొదట హంసవిరోధము చేసినవాని సాంసారిక విస్మృతివలని బాధ. పరమార్థమునకై పాటుపడుచుండగా సంసార తాప త్రయము హెచ్చినట్లు హంస యెంతయో బ్రతిమాలెను. కాని లాభములేక రాజచేతిలో నొమ్మసిల్లెను. ఇట్లు ఆ హంస నలునకు స్వాధీనమైనది. రాజు తర్వాత దీనదయాపరుడగుటవలన నిన్ను చంపుటకు బట్టలేదు. కాని నీ రూపము చూచి యానందించుటకే పట్టుకొంటిని. రూపము చూచు పని నెరవేరినది గాన నిక నీవు యదేచ్ఛగా బొమ్మని వదలెను. కాబట్టి బ్రహ్మ సాక్షాత్కారమైన విస్మృతి హంస ఉచ్ఛ్వాస నిశ్వాసములు) ఎట్లు పోయిన నేమి? ప్రాణాయామాదికి మనవశమము. కాని రాజును వదలి పోయిన హంస మరలవచ్చి అతని భుజముపై వ్రాలినది. అనగా యోగాభ్యాసపరు లకు నిర్ణీతకాలమున యోగసమాధి దాని యంతతానె అవహించ గలదని భావము. వచ్చిన హంస రాజున కొక సందేశమిచ్చినది. ఇది హంస దౌత్యము అనగా నీహంసయే జ్ఞానమును, విద్యను ప్రకాశింపజేయునదని భావము. కథయందు దమయంతి తండ్రి భీమరాజు. అనగా నియమమని భావము. దీనికే దమయంతి రూపమైన విద్యాశక్తి పుట్టినది. ఇక దమ యంతి స్వయంవరమునకు దేవతలుకూడ వచ్చినట్లు కలదు దేవతలు కథలో కామముతో వచ్చినట్లుండిరి కాని అంతర్యమున — దేవతలు నల దమయంతులకు సంబంధము కలిగించుటకు వచ్చిరి. పైకి వారు స్వార్థ మును జూపుచున్నట్లున్నను అంతర్యమున పరోక్షప్రియులు దేవతలు. కాబట్టి నలుని ఇష్టాహారములకు సంతసించి భూమియందే స్వర్గసౌఖ్యము వానికి కావించుటకే దేవతలు వచ్చినట్లు ఊహింపవలయును కావున దమయంతిని వివాహమాడుటకు దేవతలు రాలేదు. అదియును గాక వారు

దమయంతి నలుని గుణగణములను విని, చూచి వరింపకున్న పట్టి మొద్దు. క ఎక, అట్టి అవివేకి మనకు వద్దనియు భావించిరట. మరియు దమయంతి నలునే వరించినచో పరదారపై ప్రణయము మనకేల ? అని భావించిరట. కావున దేవతలకు దమయంతిపై నిజమైన ప్రేమలేదనుట తెలియవలెను. మొత్తముమీద స్వయంవరము నాడు నల్వురు దేవతలు నలరూపధారులై రాగా భీమరాజు ప్రార్థనపై సరస్వతియే స్వయముగా వచ్చి దమయంతికి నలుని చూపి చెప్పినది. ఇందు సరస్వతి ఆయా దేవతలగూర్చి చెప్పుచు సర్వదేవతారూపుడు నలుడని ప్రశంసించి బహు చాకచక్యముగా నిరూపించి చూపినది. అయినను దమయంతి నలుని నిజరూపమెఱుగక ఒప్పుకొనలేదు. చివరకు దేవతలను ప్రార్థించి వారు ప్రసన్నులుకాగా నిజమైన నలుని వరించినది.

ఈ విధముగా విద్యాశక్తికి ఆత్మతో సంబంధము వర్ణింపబడినది. వచ్చిన దేవతలు నలదమయంతులకు వరములిచ్చి పోయిరి. ఇంద్రాగ్ని యమవరుణులచే నలుడు గొప్ప వరముల నొందెను. కావున శ్రీహర్షుని నైషధము ప్రబంధగత వ్యంగ్యమునకు చక్కనియుదాహరణముగ గైకొన వచ్చును

శ్రీ హర్షుడు తర్కమున గొప్పవాడు. ఒకప్పుడు శంకరులతో వాదించి చార్వాక మతమును స్థాపించెను. అట్టియెడ శంకరులు వానియుక్తి చాతుర్యమునకు మెచ్చుకొని మాటాడక మిన్నకుండెను. కాని శ్రీహర్షుడు భోజనమునకు కూర్చుండగా అన్నము పురుగులవలె కన్పింపసాగెను. అపుడు శ్రీహర్షుడు తల్లితో శంకరులతోడి తన వాదమును, తత్ఫలితమును గూర్చి చెప్పెను. ఆమె వెంటనే శంకరుల పాదములపైబడి పుత్రభిక్ష నర్థింపగా శంకరులు నేనేమియు ప్రయోగము చేయలేదని సమాధానమిచ్చెను. మరియు శ్రీహర్షుని వాదమునకు మాత్రము తన మనస్సు బాధ నొందినదనియు చెప్పెను. బ్రహ్మజ్ఞానియైన ఆ సిద్ధుడైన వాని మనస్సునకు బాధ నొందించిన వాడు ఏడురోజులలో స్వయముగా నశించునని శాస్త్రము

నందు గలదు. ఇట్లే రావణయుద్ధము ఏడు రోజులతోనె ముగిసినదికదా ! శ్రీహర్షుడు మరునాడుదయమున స్నానముచేసి, విభూతి పూసికొని శంకరుల దగ్గరకు వెళ్ళి మరల దేవుడు కలడని వాదించెను. ఇట్లు తన తర్కవాదముతో వేదముల కన్యార్థము కల్పించి శంకరుల వాదమును శ్రీహర్షుడు పరిహాసము కావించి పలుబాధలకు గురియయ్యెను. కాన పరిహాసమునకైనను నాస్తికవాదము గ్రహింపరాదు.

ఇట్లే రామాయణమునకు కూడ వ్యంగ్యార్థము గ్రహింపవచ్చును. ఉత్తరకాండయందు అగస్త్యుడు రాముని - సీతను తల్లివలె చూచిన రావణు నేల చంపితివని ప్రశ్నించెను. ఇచట ఒక సందేహము పొడగట్టుచున్నది. నలకూబరుని వలన రావణునకు ఇష్టము కాని స్త్రీని ముట్టరాదని, ముట్టినచో తల పగులుననియు శాపము గలదు. ఈ విషయమును నారదుడు బ్రహ్మతో చెప్పగా బ్రహ్మయు తథాస్తని దీవించెను. కాని రావణుడు సీతను మెడను తొడనుబట్టి తీసికొని వెళ్ళినట్లు రామాయణమున గలదు కాని అతని తల పగులలేదు. కారణ మాతడు సీతను మాతృభావముతో ముట్టుకొనెను గాన అని తెలియవలెను. ఒకానొకప్పుడు రావణుడు సనత్కుమారుని దగ్గరకు పోయి విష్ణువు యొక్క గొప్పతనమును గూర్చి చెప్పమనెను. అంత సనత్కుమారుడు అతని గౌరవించి విష్ణువు యొక్క గొప్పతనమును గూర్చి, అతని చేతిలో చచ్చుట పుణ్యమని బోధించెను. అంత రావణుడు అట్లు విష్ణువుచేత చచ్చు పున్నెము నాకు గలదా ? అని మనసులోపల దలచెను, సనత్కుమారుడు విష్ణువు రాముడై దశరథుని గర్భమున జన్మించి నిన్ను చంపుననెను. నాటినుండి రావణుడు రాముని రాకకు నిరీక్షించుచుండెను. అంతియగాదు. ఇక్ష్వాకు వంశీయుల నందరను సంతానవంతుల మాత్రమే యుద్ధమున నిహతుల కావించుచుండెను. ఇక్ష్వాకు వంశ నాశనము చేయుటకు ఇష్టపడలేదు. మరియు దశరథ కౌసల్యలకు రాముడు పుట్టునని తెలిసి వారిని రావణుడు పెట్టెయందు బంధించి యుంచెను. కాని ఆ పెట్టెను మొసలి ఎత్తుకొనిపోయెను. అని యేదో ఒక గాథ అన్యపురాణాంతర్గతము కలదు. ఆ కౌసల్యా దశరథులు మరొకరు

అని తెలిసికొనవలెను. తర్వాతనే ఈ దశరథునకు కౌసల్యకు రాముడు జన్మించెను దశరథుని పరాక్రమమును రావణుడు మొదటినుండియు పరీక్షించుచుండెను. 12 ఏళ్ళకే దశరథుడు రాజర్షియై సింహాసనమెక్కెను. నాడు లోకమున నొక నియమము గలదు. 12 పర్యాయములకొక్కసారి శనైశ్చరుడు రోహిణిని భేదించును. అప్పుడు కఱవుకాటకములు లోకమున నేర్పడును. దశరథుడు అది తప్పించుటకై ప్రయత్నము చేయనెంచెను. కాని వశిష్ఠుడు లాభము లేదనెను. అయినను దశరథుడు ఖగోళమున యుద్ధము చేయుటకు నిశ్చయించి సుమంత్రుని రథమాయితము చేయుమని ఆజ్ఞాపించెను. 400 గుఱ్ఱములు పూన్చిన నూరు రథములపై యుద్ధమునకు తరలెను. కాన శతరథుడు వాడు. యుద్ధమునకు పోవుచు వశిష్ఠుని సెలవడుగగా నాతడు విజయమగునని కమండలూదకము రథముపై జల్లి దీవించెను. యుద్ధమున శనికి ఎదురుగా రథము నిల్పి రోహిణిపైకి పోకుండ నిరోధించెను. శని దశరథుని నూరు రథములలో 90 రథముల విఱుగగొట్టెను పది రథములు మాత్రము మిగులుటచే దశరథుడని పేరు వచ్చెను. అపుడు దశరథుడు బ్రహ్మచర్యమున నున్నాడు గాన దీక్షతో బ్రహ్మశిరోనామకాస్త్రమును లోకోపకారమునకై శనిపై ప్రయోగించెను. అంత శని శరణు వేడెను.

అంతియగాక దశరథుని రాజ్యపాలన పర్యంతము రోహిణిని భేదింపనని పల్కెను. ఇట్లు దశరథుడు అజేయుడై ఖగోళముతో యుద్ధమొనరించెను. అరువదివేల యేండ్లు రాజ్యము నేలెను. ఇట్టి దశరథ పరాక్రమము చూచి, వీనికి తప్పక రాముడు పుట్టగలడని భావించి, ఆతనితో యుద్ధము చేయక, రాముని రాకకై రావణుడు నిరంతరము నిరీక్షించుచుండెను. కానిచో రామజన్మమునకుగా దశరథు డొనర్చిన అశ్వమేధము నందలి గుఱ్ఱమును రావణుడుగాని వాని తరపున మరొక్కడుగాని పట్టుకొనకుండ నేల వదలిరి ? పిలువని పేరంటమునకు పోవు రావణుడు పిలువుగల మేధాశ్వ విషయమగు యుద్ధమును వదలుట ? ఆలోచింపదగిన విషయము గాదా ? ఇదంతయు ధ్వనిపై భవము ... ...

13

రామాయణమునందలి రావణుడు తెలిసిన మూర్ఖుడని తెలిపి యుంటిని. ఏలన విష్ణ్వంశ సంభూతుడైన రాముని చేతిలో చావు కోరి, వాని రాకకు వేచియుండెను. మొదట సనత్కుమారుడె రాముని చేతిలో రావణునకు చావుకలదని చెప్పెను. తరువాత కపిలముని నిన్ను చంపుటకు మానుషదేహముతో వచ్చెదనని చెప్పెను. అదియుగాక ఇక్ష్వాకువంశ సంజాతుడైన అనరణ్య మహారాజు తన వంశమునందు బుట్టినవారిచే రావణునకు చావు గలదని శపించెను. కాబట్టి ఈ మూడు కారణములచే రావణుడు రామునిచేత చావవలసియున్నది ఇది తెలిపియే రావణుడు రాముని రాకకు వేచియుండెను. ఇట్టి రాము డెవరి గర్భవాసమున జన్మించునాయని ఇక్ష్వాకువంశరాజుల నందఱను విమర్శించి చూచుచునే యుండును కుమారులులేని రాజును ఇక్ష్వాకువంశమున చనిపోవుడు. చివరకు దశరధుడు 12వ యేట రాజర్షియై, ఆగోశములో శనితో యుద్ధము నొనరించి గెలుపొందుట చూడ రావణునకు ఆశ్చర్యము గొల్పెను. కావున తప్పక రాముడు దశరధునికే జన్మించునని ఆశపడియుండెను. దశరధునకు 360 మంది భార్యలు, ముగ్గురు రాణులు గలరు. వారందరిలో నంద గత్తెయును, చివరిదియును నగు రాణి కైక. ఈమె కేకయరాజు కుమార్తె. దశరధునకు కంతమంది భార్యలున్నను నాతడు—సమాధి జితేంద్రియః — అని జితేంద్రియుడుగా పొగడ్త నందియుండెను. కైకను చేసికొనిన రాజు సార్వభౌముడగునని ఆమె జాతకమునందుండుటచే రాజామెను చేసికొనెనుగాని, కేవలము అందమునకు మాత్రమె వశుడైగాదని తెలియవలెను. కేకయరాజు మాత్రము తనకూతు నిచ్చునపుడు ఆమెకు పుట్టు

బిడ్డకు రాజ్యమిచ్చునట్లు కట్టడిచేసికొనెను. దశరధు డట్లేయని అంగీకరించి తనకిష్టమైన పని నెరవేర్చుకొనుట కిది మంచిదని భావించెను. దశరధుడు అరువదివేల యేండ్లు రాజ్యము చేసెను కాని సంతానము లేకపోవుటచే పుత్రకామేష్టి చేయ మొదలిడెను.

ఈ యజ్ఞము ఋశ్యశృంగుని బ్రహ్మత్వమున వశిష్ఠుడు నిర్వర్తించెను. ఇందు అశ్వమును గాయత్రీమంత్ర మంత్రితముచేసి వదలుట శాస్త్ర సమ్మతము, ఈ గుఱ్ఱమునేరాజు పట్టినను వానిని జయించివచ్చుట, ఆ గుఱ్ఱముతోడ వెళ్ళినవారికి పనియైయున్నది. ఆ గుఱ్ఱము మొగమున నొక ఫలకముకట్టి దానిపై మేము లోకైక వీరులమై ఈ యశ్వమేధము జేయుచుంటిమి. ఎవరైన పరాక్రమశాలురున్న దీనిని బట్టుకొనుడు. మేము జయించి విడిపించుకొని పోదుము అని వ్రాయుదురట. ఇట్లు ఎవ్వరికి ఓడిపోకుండ దిగ్విజయముచేసి వచ్చిననే యజ్ఞము సాగగలదు. లేకున్న లేదు. కాని దశరధుని గుఱ్ఱము మాత్రము రావణుడు పట్టుకొనక యుపేక్షించి యుండెనుగదా ! అందులకు కారణము యజ్ఞవిఘ్నము వాటిల్లినచో తా నారంభించిన పని కాజాలదు. ఇది విఘ్నమైనచో రాముడు జన్మించడు గదా ! అందులకే యుపేక్షించెనేమో ; అంతియగాదు. అజేయపరాక్రమము డైన రావణుడు దశరధునిపై గూడ దండెత్తి చంపకున్నది. రామావ తారము కొఱకే యని తోచుచున్నది.

యజ్ఞమున యజ్ఞపురుషుడు పాయసముతెచ్చి యివ్వగా రాజు రాణులకు పంచియీయగా గర్భవతులై నల్వుర కుమారులగనిరి. రాముడు జన్మించెనన్న వార్త తెలియగనె రావణుడు ఎంతయో పరమానందభరితుడై యుండెను. ఇక రాముని బలపరాక్రమము లెట్టివో పరీక్షించి చూచుటకు సంసిద్ధుడయ్యెను. మొదట ఋషుల యజ్ఞము నాశనముచేయ సంకల్పించెను. విశ్వామిత్రుని యజ్ఞమునుమారీచాదులచే ధ్వంసముచేసెను. ఇకఅయోధ్యకు

విశ్వామిత్రుడు రామలక్ష్మణుల గొనిపోవుటకై వచ్చెను. ఒకప్పుడు విశ్వామిత్రుడు వశిష్ఠుని నిర్మూలించుటకు తపస్సు చేసెనట. శివుడు ప్రత్యక్షమై విశ్వామిత్రునకు పాశుపతమును, మహితాస్త్రముల నెన్నింటినో యొసంగెనట. ఆ యిచ్చునపుడు శివుడు ఈ అస్త్రవేదము నీకుగాకున్న నీ శిష్యునకు తప్పక పనిచేయునని శాసించెను. కాని వశిష్ఠుని బ్రహ్మదండము పాశుపతమును యుద్ధమున మ్రింగివేసినది. అపుడు విశ్వామిత్రుడు వశిష్ఠుని ప్రభావమునకు చలితుడై మరల తపమొనరించి తాను బ్రహ్మర్షియై రాణించెను. ఇట్టి విశ్వామిత్రుడు రాజుకడ కరుదెంచి రాజకుమారుల పంపుమని యర్థించెను. మొదట రాజు బిడ్డల విడువజాలకున్నను, వశిష్ఠ సనుమతితో యాగరక్షణకు అంగీకరించి పంపెను. మార్గమధ్యమున విశ్వామిత్రుడు రామలక్ష్మణులకు బల, అతిబల విద్యలను అస్త్రమంత్రోపదేశమును గావించెను. ఈ మంత్రోపదేశములచే రామునకు అస్త్రదేవతలన్నియు స్వాధీనములైనవి. రాముడు యాగరక్షణమునకుగా రాక్షస సంహారము గావింపగా రావణునకు రాముని బలము కొంత కొంత తెలిసివచ్చినది. కాని రాముని మహిమ ఎట్టిదో తెలిసికొనుటకు రావణు డెంతయో ఉబలాటపడుచుండెను. రామలక్ష్మణులు యజ్ఞరక్షణ గావించి మిధిలకు పోవుచుండగా మార్గమధ్యమున ఆశిని నాతిగా చేసెను.

ఈ విచిత్రమును విని రావణుడు—రాముడు తప్పక విష్ణువే యని భావించెను. మరియు మిధిలలోని శివధనుస్సు విరుచుటకు రావణుడు కూడ వెళ్ళెనుగాని, దానిని తనచేతితో నెత్తజాలక మై త్తబడెను. ఇక దీనిని యెత్తగలిగినవాడు దేవదేవుని భావించియుండెను. దీనినిబట్టి తన బల్లమెంతయో రావణుడు నిశ్చయించుకొనినట్లే యున్నది. ఇక రాముడు తన్నవో ప్రదక్షిణించి ధనుస్సును కుడిచేతితో నెత్తి, యెడమచేత బట్టి నారిగూర్చి లాగబోవ నది బెండువలె విరిగిపోయినది. ఈ విచిత్రము చూచిన రావణుడు ఆశ్చర్యచకితు డగుటయేగాక, తన కోరిక ఈడేరి

నంములకు ఇంతింతయనరాని సంతసము నొందెను శివధనుర్భంగముతో రామునకు సీతతో వివాహము జరిగినది. లోకకల్యాణప్రదమైన వీరి వివాహము సీతాకల్యాణ మనుపేర పాటగా ప్రసిద్ధినొందినది. ఇంతకుమున్ను మరియొకపాట గౌరీకల్యాణమనియే కలదు.

సీతాకల్యాణానంతరము మార్గమధ్యమున రామునకు పరశురాముని దర్శనమైనది. పరశురాముడు మహాబలవంతుడు. అంతియగాక శివుని శిష్యుడు ఈ పరశురాముడు క్షత్రియసంహారము గావించుచు దశరధ—జనకుల మాత్రము విడిచిపుచ్చెను. కారణమేమన జనకుడు గొప్పవేదాంతి. అట్టివానిని చంపరాదు. ఇకదశరధుడు పరశురాముడు వచ్చినప్పుడెల్ల అంతఃపురమున నుండెడివాడు. అట్టివానిని గూడ చంపరాదు. కావున వీరిద్దరిని విడిచిపెట్టెను. దశరధుని విషయమున మాత్రము చాలమంది అంతఃపురమున నుండుట పిరికితనమని భావించుచున్నారు కాని అదిమాత్రముకాదు. కారణమేమన పరశురాముడు బ్రాహ్మణుడగుటచే నట్టివానితో యుద్ధము కూడదు కావున దశరధు డట్లు చేసెను. రామునిమీదికి పరశురాముడు వచ్చినపు డెంతయో ప్రాధేయపడెను. చివరకు రాముడు వైష్ణవాస్త్రముతో పరశురాముని కొట్టబోవ వేదననొంది పరశురాముడు కాలుమాత్రము నరికి వేయుడుమని ప్రార్థించెను. తన ఊర్ధ్వలోకములకైన పున్నెపు మెట్టులమీద నా యస్త్రమును వదలుమని పరశురాముడు రాముని వేనోళ్ళ గొనియాడి వెళ్ళెను ఈ సంఘటనలన్నియు రామున కెంతయో బలము నిచ్చినవి. తర్వాత దశరధుడు పన్నెండేండ్లు కుమారులతో సర్వసౌఖ్యము లనుభవించెను. పరశురాముని గెల్చి, యాగరక్షణ గావించినవారికి, వివాహమైన పిమ్మట యువరాజ పట్టాభిషేకము చేయవలసియున్నది. కాని దశరధుడు మాత్రము ఆపని చేయక మిన్నకుండెను. అందులకు కారణము కేకయ రాజువలన తనకు మాటరాగలదని భావించెను. కాని ప్రజలు మాత్రము రాముని పట్టాభిషేకము చూడవలయునని తొందరపెట్టిరి. అపుడు దశ

రధుడు మాత్రము వంపని ప్రౌఢముగమాటాడెను. అరువదివేల సంవత్సరములనుండి రాజ్యము చేయుచున్న నన్ను వదలిపొమ్మని మీ భావమా యని గద్దించెను. కాని ప్రజలు పట్టుపట్టుటతో ఊరకుండజాలక తనకు నది యిష్టముగాన రామపట్టాభిషేకమునకు లగ్నము పెట్టుమనెను.

చిన్నతనమునుండియు రామునిపై కైకకు ప్రేమ అధికము. దశరధు డెప్పుడైనను ముద్దుకు భరతుని యెత్తుకొన్నను, కైక భర్తను నిందించి రాముని యెత్తుకొనుమని రాపిడి పెట్టెడిది. దశరథు డట్లే యని భరతుని దించి రాముని యెత్తుకొనెడివాడు. ఈ యెత్తు దశరధుడు కైకచే రాముని పట్టాభిషిక్తుని గావింపుమని పల్కించుటకు వేసినదియేగాని, రామునిపై ప్రేమలేక కాదు. కాని యెట్టకేలకు మంధర వారి మధ్య ప్రవేశించి రామపట్టాభిషేకము చెడగొట్టినది. అంతియగాక రాముని పదునాలుగేండ్లు అరణ్యవాసము గావింపుమని కోరినది. ఇక దశరథుడు చేయునది లేక రాముని పిలచి నా ధర్మము నేను నిర్వర్తించితి, ఇక నీ ధర్మము ప్రకారము నీవు చేయుమని చెప్పెను. రాముడు మాత్రము తండ్రియాజ్ఞకు లోబడి అరణ్యవాసమునకు పోయెను. పోవునపుడు తల్లియగు కౌసల్య కుమారుని యుండుమని కోరినది కాని లాభములేకపోయినది. రాముని వెంట సీతయు పోబోవగా రాముడు వద్దని నివారించెను. అపు డామె రాముని -రామజామాతరం ప్రాప్య స్త్రియం పురుషవిగ్రహమ్-అని పరిహసించినది. (రాముడు పురుషరూపమున నున్న స్త్రీయని భావము). అపుడు రామునకు సీత వాక్యమునకు కించిత్కోపము, సంతోసము, ఆశ్చర్యము కలిగినవట. బ్రహ్మాండ పురాణమున —

శ్లో॥ ద్విధాకృత త్వాత్మనో దేహ
మర్ధేన పురుషోఽభవత్
అర్ధేన నారీ తస్యాంతు
విరాజ మసృజత్ప్రభుః

అని ప్రారంభించి-ఆద్యశక్తిర్మహేశస్యచతుర్ధాభిన్న విగ్రహా-అని విభాగమున జెప్పి-భోగేభవానీ పురుషేషు విష్ణుః క్రోధేచ కాళీ సమరేచ దుర్గా అని వర్ణింపబడినది. ద్విధాకృత్వా అను శ్లోకమున పురుష - స్త్రీలు రెండు భాగములు అని చెప్పబడినది. వారే శివశక్తులని తెలియవలెను. కనుక ఇవి రెండు భాగములుగ గన్పట్టుచున్నవి. అందు ఆదిశక్తి (ఈశ్వరశక్తి) స్వరూపము నాలుగు భాగములై, ఒక భాగము పార్వతి, రెండవది విష్ణువు, మూడవది కాళి, నాల్గవది దుర్గగా నైనవని చెప్పబడుచున్నది, కావున రాముడు పురుష రూపముగనున్న శక్తిస్వరూపమని సీత గ్రహించి యున్నదనియు కాబట్టి తన సతి తత్త్వవేత్తయని భావించి రాముడు సంతసించెనట. భర్తనట్లు పలుకరాదని కోపము కూడ వచ్చెనట. ఆశ్చర్యమెందుకన నింత రహస్యము నెట్లు తెలిసికొనినది ? అని. ఉన్న ఉనికిని చెప్పుటచే నామె పాతివ్రత్యమునకు లోపము లేదనియు తోచుచున్నది.

ఇక తప్పనిసరిగ రాముడు సీతాలక్ష్మణులతో అరణ్యమునకు పోవలసివచ్చినది. ఈ జంజాటకముతో వచ్చిన రామునకు విశ్వామిత్రుడిచ్చిన అస్త్రములను పురశ్చరణము చేయుటకు సమయము చిక్కుటలేదు. ఈ అస్త్రములు రావణునిపై పనిచేయుటకు తపస్సు చేయవలసియున్నది. కాని సంసార బంధమైన సీతతో కూడ వచ్చుటచే నది సాధ్యముకాదుగదా! కాబట్టి కఠోర బ్రహ్మచర్యము అవలంబించి యుండవలెను. అయినను నిత్యము సీతారాముల వనవిహారములు, జలక్రీడలు. విలాసాదులెన్నియో జరుగుచునే యున్నవి. ఈ రీతిగా అరణ్యవాసము చేయుచున్న రాముని చూచిన దేవతలకు నిట్టి విలాసపురుషుడెట్లు రావణవధ చేయగలడను ననుమానము వచ్చినది. అపుడు దేవతలు రాముని పరీక్షించుటకు కాకాసురుని పంపిరి. ఈ కాకి వచ్చి సీత ముఖముపై తిరుగుచుండగా, సీత విసిగిపోవుచుండగా రాముడు చూచి నవ్వెను. అది కొంతసేపటికి చెట్టుపై వ్రాలినది. సీతారాముల జలక్రీడానంతరము, రాముడు నిద్ర నందెను.

అపుడు కాకి సీత స్తనాంతరము గీరిపోవుచుండెను. రాముడు నిద్ర మేల్కొని చూచి, జరిగినది విని,కోపించెను. కాని సీత మాత్రము తనకు తాను రక్షించుకొనగలదు. కామశాస్త్ర ప్రకారము మొదట స్త్రీముఖము చూచి సంతసించువాడు తండ్రియని, వక్షస్థలముగని సంతసించువాడు బిడ్డ యని, నాభి క్రింద చూచువాడు భర్త యని నిబంధింపబడినది. ఈశాస్త్రాను సారము కాకి ముక్కుతో సీత స్తనాంతరము స్పృశించెను. గాన బిడ్డతో సమానమగుచున్నది కాని రాముడు దాని పై బ్రహ్మాస్త్ర ప్రయోగము గావించెను. ఈ కాకి దేవతలచే పంపబడి రాముని బ్రహ్మచర్యమును పరీ క్షించుటకు వచ్చినది. అదియునుగాక రాముడు సైతము దానిని పరీక్షించు టకే బ్రహ్మాస్త్ర ప్రయోగము చేసెనుగాన నది కాకి వెన్నంటి ముల్లోక ముల చుట్టినది. కాని దాని సంహరింపలేదు. దివ్యాస్త్రములు అప్పుడే నిద్ర లేచినవారికి. ఉపస్పర్శనాదులులేకుండ నశుచులుగాన పలుకవు రాముడు నిద్రలేచిన వెంటనే బ్రహ్మాస్త్రము ప్రయోగించెనన నది నిద్ర కాదని, ఆత డశుచికాడని తెలియుచున్నది. ఆ కాకి తన బాధ నందర కెఱింగించినది. కాని రామునిది నిజమైన నిద్రకాదు, అది సమాధిస్థితి యని అందఱచే తెలిసికొనబడినది. ఇక దేవతాధిపతి యగు ఇంద్రుడు కాకిని రామునే శరణువేడుమనెను. ఇదియొక పరీక్ష. ఇక కాకి రాముని శరణుజొచ్చినది. కాని రాముడు నా అస్త్రము ఊరకపోవునది కాదు కనుక కాకిని ఏదేని బలియివ్వవలయునని కోరెను.

అపుడా కాకి ఒక కంటిని మాత్రము బలి యిచ్చెదనని యిచ్చి నది. నిద్ర లేచినప్పుడు అస్త్రప్రయోగోప సంహారములు మామూలుగ నడచుచున్న ఈ విచిత్రమును చూచుచున్న దేవతలు రాముడు అసిధారా వ్రతముగా బ్రహ్మచర్య మాచరించుచున్నాడని, ఆతని నిద్ర సమాధి యని సంతసించిరి. పదమూడు వత్సరము లట్లు అరణ్యవాసము సాగి నది. పదునాలుగవయేడు వచ్చినపిమ్మట రాముడుసీతతో ఆశ్రమ

దర్శనము చేయుచు వచ్చుచుండెను. అగస్త్యాశ్రమము దర్శించి, ఆ మహా ముని వలన ఇంద్రధనుస్సు సంగ్రహించెను. అత్రిమహాముని ఆశ్రమమునకేగి ఆ ముని దంపతులకు సీతారాములు నమస్కరించిరి. అంత రాముడు సీతను అనసూయ దగ్గరచేరి నీతులు నేర్చుకొనుమని చెప్పెను. అపు డనసూయ సీతను తన వృత్తాంతమంతయు చెప్పుమని కోరగా సీత కల్యాణపర్యంతము తన గాధనంతయు వివరించినది. కాని కైకనుగూర్చి పల్లెత్తుమాటనక, ఆమె వరములు మామగారి శ్రేయస్సునకే యని పల్కినది. ఆరాత్రి అనసూయ సీతను చక్కగా అలంకరించి రాముని దగ్గరకు పంపినది. ఆమె సీతకు చేసిన అలంకారము సంవత్సరమంతయు చెరిగిపోకయుండునట్టిది. మరియు నా రాత్రి మును లందఱు ఖరదూషణాదులను రాముడు చంపునట్లుగా కోర నిశ్చయించిరి. వారికి నభయమిచ్చి రాముడు ఖరదూషణాదుల నిహతుల గావించెను. అంతియగాక శూర్పణఖ ముక్కుచెవులు గోసిరి. ఈమె రావణునితో తన దైన్యమును చెప్పుకొని చింతించెను. రాముడు పదునాల్గువేల మంది రాక్షసులను రెండు గడియలలో సంహరించెను. అపుడు రావణుడు మారీచునిసహాయము కోరగా నాతడు మాయలేడియై వచ్చెను. సీత ఆ లేడిని కోరగా రాముడు దాని వెన్నంటిపోవుట, తదనంతరము లక్ష్మణుడు పోవుట జరిగినది. ఇపుడు సీత పర్ణశాలయందు ఒంటరిగా నుంట చూచి రావణుడు వచ్చి, ఆమెను మాతృభావముతో స్పృశించి తీసికొని పోయెను. అంతః పురమున సీతను గడియసేపుంచి, పిమ్మట ఉద్యానవనమునందు చెట్టుక్రింద నుంచెను. ఆమెకు నాడువారి కాపలా పెట్టెను. దేవి అనుగ్రహము లంకపై కల్గునట్లు, పవిత్రతకొఱకు సీతను ఊరంతయు త్రిప్పి చెట్టుక్రింద నుంచెను ఇక తానుకూడ సీతను చూడవచ్చినప్పుడు పరిశుద్ధుడై, చక్కని వేషము ధరించి వచ్చెడివాడు. అట్లువచ్చిన రావణుడు సీతతో తన్ననుగ్రహింపుమని కోరుచు, కోడివలె రమించెదనని పల్కెను. కోడికి క్షణక్షణము రమించు

శక్తి కలదు. ఇచట ఈరమించుశబ్దమునకు అప్పయ్యదీక్షితులు చక్కని వ్యాఖ్యానము చెప్పిరి. రమించుట యన ధ్యానమని భావముకాబట్టి వెంట వెంటనే ధ్యానింపగలనని రావణుని భావమని తెలుచున్నది. కాబట్టి రావణుడు తెలిసిన మూర్ఖుడనుటకు సందేహింప నక్కరలేదు.

ఇక రామరావణ యుద్ధము వచ్చినప్పుడు ముందుగ రావణుని తమ్ముడగు విభీషణుని పోనడిచినాడు. విభీష ణు చావని వరము కల వాడు ధర్మపరుడని పేర్పడినవాడు. ఇతడు సీతను రామున కర్పింపుమని చెప్పిన కొలదినేరమునకు నీవున్న నను లక్ష్మివరింపదు లేచిపొమ్మని చెప్పి సభలోపరాభవము చేసి వెడలనడచెను. సీతను రామున కిమ్మని మాల్యవంతుడు మున్నగువార లనేకులు చెప్పలేదా! వారినెల్ల నిట్లుపోనడచెనా! వానికి నీతితెలియదా! తనవాడు బలవంతుడు తనకు వ్యతిరేకముగా నున్న, ప్రభువు వాని బందీకృతు నొనర్చి, కార్యానంతరము విడిచిపెట్ట వలెను. తనయంత బలముగల నజనుడగు తమ్ముని బలము తనకుకాకున్న పోనీ యది పరులపాలు చేయునంతటి యజ్ఞుడా!కాకూడదు. నీతిజ్ఞులకిట్టి సందేహ మా చరిత్రమున కలుగకమానదు. అట్లు పుచ్చుచో నీ వే మను జుని గొప్పచేయుచున్నావో వాని బంటువై బ్రదుకు మనెనట ! తర్వాత యుద్ధములో సైనము తక్కినవారి గొట్టెనేగాని తన తమ్మునిమీదికి పోయి నట్లు లేదు మయశక్తి వానిపై వైచుటయందును దూరాలోచనముగలదు. రామలక్ష్మణుల సన్నిధానమున నాశక్తి తమ్మునిమీద వేయుటకు నాలోచన మున్నది. విభీషణుడు ప్రత్యస్త్రమేమియు వేయకున్నను అమోఘాయుధము వాని మీదికి వచ్చినపుడు బ్రహ్మాస్త్రము స్వయముగా వచ్చి వానిని కాపాడునట్లు వరమిచ్చెను. కాన తన శక్తితో వాడు చావడు. ఇట్టిండ శరణాగతత్రాణవ్రతముగల రాము డేమిచేయునో చూతమని వాని యాలోచనము. దానికి లక్ష్మణు డడ్డునొచ్చెను. రాముడా శక్తికి శాపమిచ్చెను.

ఇదియంతయు పర్యాలోచింపగా విభీషణుడు చావనివాడైనను తన పద్దనుండి రామునెదిర్చినవాని చేతులో, కాళ్ళో నఱికి కుంతితుని చేసి తన వనిరాముడు నెరవేర్చుకొన వచ్చును. రావణసంహారమైన తర్వాత లంకకు రాముడు తన తమ్ములలో నెవరినైన నుంచి పరిపాలింప చేయ వచ్చును. వాలినిజంపి రాముడు సుగ్రీవునకు నారాజ్య మీయలేదా? అట్లే తమ్ముజంపి తనరాజ్యము శరణుచెందిన తన తమ్మునకిచ్చిన, రాజ్యము తనవంశమందే స్థిరముగా నుండగలదు. వంశకర్త లేనిచో తనవంశము నిర్వంశమగును. కావుననే రావణుడు విభీషణుని తనపక్షమందు లేకుండ వెడల నడచెను. రావణుని ఆశయమిట్లు ధ్వనించుచున్నది. "అంగుళ్యగ్రేన తాన్హన్మి" అని రాముడు విభీషణునకు శరణమీయవలదని సుగ్రీవునితో చెప్పెను. రావణునకు సురాసురులెల్ల సహాయులై వచ్చినను అంగుళ్యగ్రముతో వారినెల్ల సంహరించుటయేకాక మరల సృజింపగలను. హంగుకొఱకు మిమ్మును దెచ్చుకొంటిని కాని రావణునకు వెఱచికాదు – అని చెప్పి నేను శరణాగత రక్షణము మరలనని చెప్పి సుగ్రీవునిచేతనే వాని బిలిపించి రాముడు రాక్షస సంహారము కాకముందే విభీషణుని లంకకు రాజుగా పట్టాభిషేకము చేసెను రావణుని యూహ అప్పటికప్పుడే ఫలవంతమైనది.

14

సంస్కృత నాటకకర్తలలో వాసికెక్కిన మురారి అనర్ఘరాఘవ మను నాటకమున రామాయణసారము ప్రస్తావనయందే చెప్పెను. —

శ్లో॥ యాన్తి న్యాయ ప్రవృత్తస్య తిర్యంచోఽపి సహాయతాం
అపంథానంతు గచ్ఛంతం సోదరోఽపి విముంచతి ॥

అని న్యాయముగా నడచు నాయకునకు తిర్యగ్జంతువులు సహాయ మగును. అన్యాయపరుని వాని తమ్ముడే విడిచిపోవును — అని ఆ శ్లోకార్థము ఇతడు రామాయణసారమును రెండు మాటలతో రమణీయముగ చెప్పెను.

శ్లో॥ యదిక్షుణ్ణం పూర్వైరితి జహతి రామస్యచరితం
గుణైరేతావద్భిర్జగతి పునరన్యోజయతి కః
స్వమాత్మానం తత్తద్గుణగరిమ గంభీర మధుర
స్ఫురద్వాగ్బ్రహ్మాణః కథ ముపకరిష్యంతి కవయః॥

అని చెప్పెను. పూర్వకవు లందఱిచేత పరిపరివిధముల వర్ణింపబడినదియే రామకథ యని దాని వదలిన నట్టి గౌనములతో పుడమిమీద మరల నంతవాడెవ డవతరింపగలడు? అందుకని యూరకున్న రామాయణమందలి ఆయా గుణాతిశయముల దలచి గంభీరముగా, మధురముగా స్ఫురించు వాగ్బ్రహ్మగల కవులు తమ హృదయముల కెట్లు తృప్తి కలిగించుగొనగలరు? అని శ్లోకాభిప్రాయము.

ఇట్లే కీ. శే. మా తండ్రిగారు తా. వేంకటప్పయ్యశాస్త్రిగారు వారి శ్రీరామకథామృతమను గ్రంథమున నిట్లు వ్రాసిరి.

ఆ॥ వె॥ చేనికాపు చెఱకుచేట్టుపెట్టి రసంబు
గాచియచ్చు పోసి ఘనతబెట్టు
బాకవిదులు దాని బహుభక్ష్య భేదాప్తి
ననుభవింప జేయుట సదు పనియె.

వాల్మీకి మహాముని చెఱకుతోటవేసి దానిరసము పాకముచేసిబెల్లపు అచ్చుపోసి సర్వమధురముగబెట్టినను, ఇతర కవులు తమ్మతమ్మ నానావిధములగు పిండికలిపి చిత్రవిచిత్రములగు రుచులూరు భక్ష్యములుబోలె ప్రతిభాప్రభావానుసారముగ కృతులు రచించుట సామాన్యపు పనియా ? అదియు విశేషమేయని భావము.

రామాదులు పుట్టిన పిమ్మట నొకనాడు దశరథుడు రాముని జాతచక్ర విశేషముల తెలియగోరి వశిష్ఠాశ్రమమునకు బోయెను. అపుడాయాశ్రమమునందు దుర్వాసమహర్షి చాతుర్మాస్యదీక్ష యందుండెను. వశిష్ఠుడు ఇది గమనించి తనకంటె పెద్దయగు దుర్వాసుని రామునిగూర్చి యడుగుమని దశరథునికి ప్రబోధించెను. అట్లేయని దశరథుడు దుర్వాసుని రామునిగూర్చి ప్రశ్నించెను. అందులకు వెంటనే దుర్వాసుడు రాముడు దరిద్రుడగునని దశరథునకు చెప్పగా నాతడు కొంచలమంది వానిగూర్చి మరల ప్రశ్నించెను. దుర్వాసుడు రాముని జీవితమున జరుగబోవు విషయములన్నియు వివరించి రామునికథ చదివిన నెంత జడులకును దుఃఖము రాకుండదు అయిన రామకథనుజదివిదుఃఖించిన వారికెల్ల మోక్షములభించునని రూఢిగ చెప్పెను. కాబట్టియె తముమీద రాముడు—సాక్షా ద్విష్ణోః చతుర్థాంశః—అని వాల్మీకి వచించెను. భగవదవతారమే యగుచున్నాడు ఆతనికి దుఃఖమెక్కడిది? వైకుంఠమునుండియెట్లు వేషమువేసికొనివచ్చెనో అట్లు నడిచెను. అచ్యుతుడగుదేవునకు లోకముకొరకు చూపు సుఖదుఃఖములు సత్యములు కావుగాన,ఆతడు దుఃఖమయుడు గాడు.రాజవంశ

మున రావణసంహారార్థము అవతరించిన రాముడు రావణునిక్కడకు పిలిచి గాని, తాను తమ్ములతో, తండ్రితో, మంత్రులతో, సామంతులతో దర్గాగా నక్కడకు పోయిగాని శత్రుసంహారము చేయక, ఒక తమ్ముని మాత్రము చేకొనిపోయి నారలుగట్టి కూరలుదినుచు భార్యతో భీదవానివలె సంచరించుచు కోతులను, కొండముచ్చులను ప్రోవుచేసికొని యిట్టినడక నడువనేల యనియు నొక సందేహము విమర్శకులకు తోచకమానదు.

అనేక వీరహోమాదుల చేసి అస్త్రశక్తులు సంపాదించి దేవతల గెలిచియున్న రావణుమీద తాను దేవుడైనను, విశ్వామిత్రు డస్త్రవేదము నుపదేశించినన్ను,పురశ్చరణము చేయక ఆయుధములు వీర్యవత్తమములు కానేరవని లోకమున విద్యాసంప్రదాయము నెలకొల్పుటకు నట్లు ప్రవర్తించెనని సమాధానించు కొనవలయును.

కానవే మనమిదివరకు చెప్పుకొన్న కాకాసుర వృత్తాంతము సార్థకమగుచున్నది. కాకున్న రామబాణ మమోఘమన్న పేరు చెడ రాముడు కాకిమీద బహ్మాస్త్రము వేసిన నది దానినప్పుడే కాల్పక మూడులోకములు కాకితిరిగివచ్చినదాక యోర్చుకొని తిరుగుచున్నదన, ఈప్రకారికా కథను బట్టి ఆతనికేమి గొప్పతనము వచ్చినది? నాయకుని గొప్పతనము చెడ గొట్టు పతాకాప్రకరుల కవులు కావ్యముల నిబంధింపవచ్చునా?

సుందర కాండమున హనుమంతుడు లంకకు పోవుటంతయు యోగానుగుణముగ చెప్పబడుచున్నది. హనుమంతుడు లంకకు పోవునప్పుడు సముద్ర లంఘనమునకు విహాయసమున కెగిరెను. విహాయసమనగా యోగమార్గము. "తతోరావణనీతాయాః సీతాయాః ——అని సీత అడుగుజాడ బట్టుటకు చక్రభేదము చేసి బ్రహ్మపదము ద్వారమున ప్రవేశించెను. కాబట్టి హనుమంతుని లంకాప్రవేశము సీతాన్వేషణము యోగమార్గమునకు సంబంధించినదై యున్నది. ప్రశస్తమైన

హనువు (బుగ్గ) గలవాడగుటచే హనుమంతుడయ్యెను. దీనికి లోకమున ఇంద్రుని వజ్రమునకు బద్దలు కాలేదుగాన ప్రశస్తములని అర్థము. అంతరార్థమున యోగధారణవలన ప్రశస్తములైన హనువులు కలవాడని భావము. తాలువుకూడ దశవిధ ధారణస్థానములలో నొకటిగా లెక్కింపబడినది కాబట్టి హనుమంతునకు హనువులలో ధారణ జరుగుచున్నది. "శత్రు సైన్యానాం నిహంతా" - అన్నచోట అంతరశత్రుసైన్య వినాశకుడు హనుమంతుడు. శత్రుసైన్యము నాతని యేమియు చేయజాలవు. "అపిమర్ద్య పురీం లంకాం। అభివాద్యచ మైథిలీం। సమృద్ధార్థోగమిష్యామి-మిషతాం సర్వరాక్షసాం-" అన్నట్లు రాక్షసుల విఘ్నములు హనుమంతుని యేమియు చేయజాలవు. రాక్షసులు గ్రుడ్లు తెరిచివైచికొని చూచుచుండగనె తాను బ్రహ్మమయుడై పోగలడు. పై శ్లోకముల వలననే సుందరకాండ పారాయణ ఫలము లభింపగలదు. హనుమంతుడు అక్షుని చంపగా ఇంద్రజిత్తు వానిపై బ్రహ్మాస్త్రము ప్రయోగించెను. కాని అది హనుమంతుని యేమి చేయజాలకుండెను. అయినను హనుమంతుడు ఇంద్రజిత్తుని మోసము చేయుటకు బ్రహ్మాస్త్రమునకు కట్టుబడినట్లు నటించెను. రాక్షసులు వానిని బంధించిరే కాని ఇంద్రజిత్తు మాత్రము తనకు, తమకులమునకు చావు తప్పదని - సంశయితాస్మ సర్వే - అని భావించెను. అయినను హనుమంతుని బంధించి తండ్రిదగ్గర అప్పగించెను. రావణుడు హనుమంతుని ప్రశ్నలు వేయగా నాతడు తోకచుట్టపై కూర్చుండి సమాధానము లిచ్చెను. అప్పుడు హనుమంతుడు రావణుని—

గీ। వాలిసందిట నొక్కి త ంగరుడక్కె
కార్తవీర్యుని కొట్టున కందు వాటె
నమ్మగటిమకి తెలిదీవి యున్నలిడ్డ
పుండుపై నేతు పోతేరు బొబ్బవోడమె.

అని యెత్తిపాడిచెను.

వాలి ఒకప్పుడు రావణుని ఆటబొమ్మగ చేసి అంగదుని ఉయ్యెల తొట్టికి కట్టెనట. అట్లే బొమ్మవలె మూడేండ్లుండెనట. మఱియు ఒకప్పుడు కార్తవీర్యునిచే పట్టుబడగా రెండువేల వత్సరములకు పులస్త్యబ్రహ్మ పోయి కార్తవీర్యుని బ్రతిమాలి తీసికొని వచ్చెనట. మరియొకసారి నారదోపదేశముచే శ్వేతద్వీపము జయింపబోయెను. అచట నున్న దండలును స్త్రీరూపులే. వారందఱు రావణుని చూచి పురుగని భావించిరి. వారిలో నొకతె పట్టుకొనగా దాని చేయి కొఱికెనట. అది విసరికొట్టగా లవణసముద్రమున బడెనట. ఇట్టి పరాక్రమవంతుడు రావణుడు. అంతియ గాక శివధనుస్సు నెత్తజాలని చేలవని కూడ హనుమంతు డాక్షేపించెను. రాక్షసులు హనుమంతుని తోకకు నిప్పంటింపగా లంకాదహనము జరిగినది. వలదని మండోదరి వాదించుచున్నను వినక రావణుడు చావు కావలయు నని కోరి తెచ్చుకొనెను.

ఒకనాడు రావణుడు పశ్చిమ సముద్రము పైకి విహారమునకై పోయెను. దారిలో నాతనికి ఆయుధముల దగ్గరనుంచుకొని తపస్సు చేయు చున్న కపిలమహాముని కనిపించెను. రావణుడా కపిలుని యుద్ధమున కాహ్వానించెను. కపిలు డా రావణు లెక్కచేయక చేయెత్తియు నంతగా నడిచిన చచ్చునేమో యని చేయియూపు తగ్గించి కొట్టెను. ఆ దెబ్బకే రావణుడు దద్దరిల్లి మూర్ఛనొందెను. మూర్ఛదేరి లేచి చూచుసరికి కపిలు డొక రంధ్రమును జొచ్చి యొకగుహయందు ప్రవేశించెను. ఈ విషయము ప్రహస్తుని వలన తెలిసికొని, కపిలుడు భగవంతుడని భావించి రావణుడు తానును తన ఆయుధముతో నాకన్నమున దూరిపోయెను. పోవుచుండగా నాతనికొక చక్కని సౌధము కన్పించెను అది సమస్త రాజభోగములతో నలరారుచుండెను దాని చుట్టును మూడుకోట్లమంది విశిష్టాద్వైత భక్తులు పారాయణలు చేయుచుండిరి రావణుడెట్లో వెళ్లగా ఆ భవనమునందు ప్రవేశించి చూచెను. అందొక హంసతూలికా తల్పమున్నది దానిపై నొక మహాపురుషుడు సన్నని వస్త్రమును గప్పుకొని శయనించి యుండెను.

ఆతని పాదములచెంత లక్ష్మీదేవి కూర్చుండి పాదసేవ చేయుచుండెను. ఆ లక్ష్మి సౌందర్యము చూచి రావణుడు ముగ్ధుడై ఆమెను గైకొని పోవుటకు చేయిచాచెను. అంత శయనించియున్న మహాపురుషుడు ముఖముపై వస్త్రము తొలగించి రావణునిచూచి ఒక్కసారి హుమ్మని కోపించెను. ఆ కోపముతో ముక్కునుండి వచ్చిన గాలికి రావణుడు అల్లంతదూరమున పడెను. ఈ మహాపురుషుని అద్భుతచర్యకు ఆశ్చర్యచకితుడై అతనిని ఎవరని ప్రశ్నించెను. అపుడాతడు నిన్ను చంపెడువాడ లెమ్మని వేషము వేసికొని వచ్చెదనని మాయమైపోయెను ఇట్లు కపిలముని ప్రవచనమువలనను, సనత్కుమారుని మాటవలనను రావణుడు తాను భగవంతుని చేతియందు చచ్చుట నిక్కమని భావించెను. రావణుడు దుర్మార్గుడైనను చాల గొప్పవాడు. తన నిర్యాణమునకే నీతివిరహితమైన పనులనెన్నింటినో చేసెను. కాబట్టి సీతను దీసికొనిపోవుట కామముకొఱకు గాక మోక్షము నొందుటకే యని తెలియవలెను. కావుననే నలకూబరు శాపమాతని నేమియు చేయలేదు.

యుద్ధ ప్రారంభమునకు ముందు హనుమంతుడు చూచి వచ్చిన తర్వాత అంగద రాయబారము జరిగినది. రావణుడు హనుమంతుని, అంగదుని కూడ ఆక్షేపించెను. రావణునకు స్వర్గజయము నాటికి నాలుగువేల అక్షౌహిణుల సేనకలదు. రామయుద్ధము నాటికి ఇంకను పెరిగినదని విభీషణుడు చెప్పెను విభీషణుని సాయముతో రావణుని రాముడు నిశ్శేషముగా వధింపకల్గెను కాని యుద్ధమున కుంభకర్ణునికి విభీషణుడు నమస్కరింపగా కుంభకర్ణుడు విభీషణుని తన యెదుట పడకుండ తప్పించుకొని యుండుమనెను. రావణుడు రామునిశక్తి పరీక్షించుటకు విభీషణునిపైశక్తి ప్రయోగము చేసెను. ఆ సమయమున లక్ష్మణుడు వానిని వెనుకకు నెట్టి తాను ముందుండి శక్తిచేమూర్ఛనొందెను. రాముడు కోపించి రావణు శక్తిని హతాశాభవ దుర్బుద్ధే - అని శపించెను. ఈ శాపముతో శక్తికి తేజస్సు తగ్గిపోయినది కాని లక్ష్మణమూర్ఛ తప్పలేదు. ఇక రాముడు ఆ శక్తిని

లక్ష్మణుని హృదయమునుండి పీకి విరువబోవ రావణుడు వానిపై కుప్పన గూరలుగ బాణములు గురిసెను. రాముడు వాని లెక్కచేయక ఆశక్తిని పీకి విరిచి పారవైచి లక్ష్మణు శరీరము గాపాడ హనుమకు నప్పగించి రావణుని శరీరము జల్లెడవలె బాణములచే తూట్లు గావించెను. ఇపుడు రావణునకు భయము వేయు[illegible]కిపోదలచిన, రాముడు వానిని యుద్ధము మాని పొమ్మనెను. తనవంటివానికి భయపడినవానితో యుద్ధము చేయుట న్యాయముకాదనికాక యుద్ధములో రావణుని లెక్కచేయక విడిచివేసెను. ఇది రామునకే చెల్లునుగాని చేతికి చిక్కిన శత్రువు నేయోద్ధయు విడిచి పుచ్చుడు. రావణుని విడిచిన నాతడింకను రాక్షసబలము దేగలడు. వాని చంపిన దుష్టులగు రాక్షసు లింకను మిగిలిపోవుదురని రాముని అభిప్రాయము. ఇట్లు గాలించి గాలించి రావణుడు పంపుచుండ క్రోతులవలన రాక్షసబలము లెల్ల నిహతములగు చుండెను. సర్వ రాక్షస హననమైన పై మూలబలము నెల్ల జక్కాడి రాముడు తుదకు రావణు జంపెను. రావణ మరణానంతరము రాముడు విభీషణుని శాస్త్రప్రకారము రావణునకు ఉత్తరక్రియలు జరుపుమని ఆజ్ఞాపించెను. "మరణాంతాని వైరాణి" — అని చెప్పి మరణముతో వైర మంతరించి పోయినదని అంత వానికి చక్కగా శ్రాద్ధాదులు జరిపించెను.

ఇక రావణ వధతో విభీషణుడు సీతను రామున కప్పగించెను. అపుడు సీతను చూచినంత రాముని ప్రకృతి మారెను. "రావణాంక పరిభ్రష్టా నమా మర్షసి మానిని" — అనుచు రావణాంక పరిభ్రష్టయని నిందించెను. అంతియగాక భరత సుగ్రీవ లక్ష్మణులలోనెవరి యొద్దనైనను కాలము గడుపుమనియు ఆజ్ఞాపించెను. ఇచట వాల్మీకి చెప్పిన మాట అనౌచిత్యముగా నున్నదని కొంద అనుచున్నారు. ఇంతియగాదు మరొకడు రామాయణము నాటికే విడాకులున్నవని భావించెను. మూలమున-భరతే లక్ష్మణే వాపి-అని సప్తమి యున్నది కాబట్టి,దానికి వృత్తిత్వ మర్థము చెప్పవలసియున్నది. అందుచే బిడ్డలవంటి భరత లక్ష్మ

ణుల దగ్గఱనుండి గాని, సామంతులైన సుగ్రీవాదుల యొద్దనుండి గాని తపోవ్రతము సాధింపుమని యర్థము గాని, ఇందు విపరీతార్థము, అనౌచిత్యము ఏమియూ లేవని భావించవలయును. రాముడు అక్కరలేదని నిందించిన సీత మాయాసీత. అసలు సీత అగ్నిలయందు దాగియున్నదని చెప్పియుంటిని. మరియు రామాయణమున "ప్రియాతు సీతా రామస్య" రామునకు సీత ప్రియమైనది, అని యున్నది గనుక తు అన్న శబ్దము వలన రామునకు చాలమంది భార్యలుండిరని భావించుచున్నారు. కాని ఇది సమంజసము కాదు. సీతను రావణుడు తీసికొనిపోయినపుడు రాముడు సీతకై మిక్కిలి విలపించెను. తర్వాత సాయములేక ఏడుగడపినను సుగ్రీవుడు తోడైన తర్వాత వెంటనే సీతను వెతకు పని బూనక రెండు నెలలు నీ యింటికిబోయి రాజ్యసుఖము లనుభవించి రమ్మనెను. సుగ్రీవుని పిలుచుకొనిరమ్మని లక్ష్మను నంపెను. 40 దినములు లక్ష్మణుడు లేకుండ ప్రస్రవణాద్రియందు నొంటరిగ రాముడు తపించినట్లు కనబడుచున్నది. ఇపుడు సీత కన్పింపగా అగ్నిప్రవేశము చేసిరమ్మనెను. అట్లే సీత పరిశుద్ధయై రాగ ఇంద్రాది దేవతలు-దశరథుడు కూడ ఆతనిని చూచి ప్రశంసించుటకు వచ్చిరి. రాముడపుడు తండ్రిని చూచి కైకను దిట్టిన విషయము స్మృతికి దెచ్చి శాపము తొలగింపుమని ప్రార్థించెను. అట్లే యని దశరథుడు తొలగించెను. రాముడుసీతతో అయోధ్యకు వచ్చుచు మార్గమధ్యమున భరద్వాజాశ్రమమున విందారగించెను. అక్కడ నుండియే భరతునకు తమ రాకను గూర్చి హనుమతో సందేశమంపెను. సీత కెట్టి లోకోపవాదము రారాదని రాముని అభిప్రాయము. ఇక అయోధ్యకు రాగనె మరల రాముడే రాజు కావలసివచ్చినది. కాని రాముడు లేనియప్పుడు భరతుడే రామపాదుకల బెట్టుకొని పాలన సాగించెను. రాముడు వచ్చినపుడు ఆ భరతుడు దాని నంగీకరింపకపోయెను. కాని రాముడిపుడును రాజగుట కంగీకరింపలేదు. తర్వాత భక్తివశ్యుడై భరతుని పేరుమీద రాముడు పదివేలయేండ్లు పరిపాలించెను. అందువలననే లోకమున-రాముని రాజ్యం భరతుని పట్టం-అను సామెత పుట్టినది.

15

ఇక ఉత్తరరామాయణపు కథకు వచ్చితిమి. శ్రీరాముడు సీతను దెచ్చిన పిమ్మట పదివేల వత్సరము లరిగిన పై పాలనను గురించి ప్రజ లేమనుకొనుచున్నారో తెలిసికొనవలయునని గూఢచారుల నియమించెను. గూఢచారు లంతఱు రాముని పాలనకు ప్రజలు రంజిల్లుచున్నారని చెప్పిరి. కాని రాముడు తనను గూర్చి నిందించువారిని తెలుపుడని కోరెను. వారిలో భద్రుడనువా డొకనాడు రావణుడు కొనిపోయిన సీతతో రాముడు కాపురము చేయుచున్నాడని ప్రజలు నిందించుచున్నారని రామునకు తెల్పెను. అంతకుముందురోజే రాముడు సీత చెవిలో నొక విషయమును గుసగుసలాడెను. అందలి రహస్య మేమన సీత నిక్క దేవతలు దేవలోకమునకు రమ్మని ఆహ్వానించిరట. అంతియగాదు. సీతకు పిమ్మట రాముని కూడ రమ్మనిరి. ఈ విషయ మిట్లుండగా మరునాడే లోకోపవాదము వచ్చినది రాము డిదే సమయమని తన తమ్ముల రావించి లోకాపవాదము తెయజేసెను. తమ్ములు వచ్చునపుడు భరతుడు కాలినడకతో బయలుదేరెనట. లక్ష్మణుడు రథమున, శత్రుఘ్నుడు అశ్వముపై బయలుదేఱిరి. కానీ అందఱికంటె భరతుడె ముందుచేరెనని లక్షణుడు చెప్పుచున్నాడు. కావున రామునిపై భరతునకుగల ప్రీతి యెట్టిదో వ్యక్తమగుచున్నది.

రాముడు సీతనుగూర్చి దుఃఖించుచు, చేయవలసినదేమి యని తమ్ముల ప్రశ్నించెను. భరతుడు మరల తన తల్లిపై ననుమానము పడెను. లక్ష్మణుడు రామునిది స్త్రీదుఃఖమే యనీ భావించి, ఈసారి సీతపని నేమియు చేయనని మదిలో దలచెను. ఇక రాముడు తమ్ములు ప్రత్య

త్తరమీయకుండుట గమనించి తానై లక్ష్మణునితో సీతను గంగ కావలి యొడ్డున విడచిరమ్మని చెప్పెను. అంతియగాక సీత తాను గంగాతీరము చూడవలయునని కోరిన కోరిక ఈరీతిగా తీర్చుమని లక్ష్మణున కాదేశించెను. సీత పోబోవునపుడు చెల్లెండ్రు అందఱు చూడవచ్చిరి. వారందఱకు పారితోషికము లర్పించి సీత తాను రేపే ఋష్యాశ్రమాదుల చూడబోవుచున్నానని పల్కెను. ఇక తప్పదనుకొని వేఱువనే లక్షణుడు రథముపై సీతను గంగాతీరమున దించి, అపుడు లోకోపవాదమును గూర్చి విన్నవించెను. అందులకు సీత తల్లడిల్లి లక్ష్మణునకు మరియొక జన్మలో రామునే భర్తనుగా చేసికొందునని చెప్పుమని కోరినది. మరియు లక్షణుకు పోబోవునపుడు సీత ముసుగు తొలగించి తనను ఒకసారి తిలకించుమని కోరినది. అందులకు కారణము తాను ఇపుడు గర్భవతిననియు దీనికై మరొక లోకోపవాదము రాకుండుటకై యని పల్కినది. అందులకు లక్ష్మణుడు మిక్కిలి దుఃఖించి, రాముడులేని సమయమున తానిట్లు చూడజాలనని పల్కి నమస్కరించెను. ఎట్టకేలకు ఆమెను వదలి రథముపై నెక్కి మూర్ఛనొందెను. కొంతసేపటికి సేదదేఱి దుఃఖించెను. సుమంత్రుడు మాత్రము లక్ష్మణుని ఆర్తిచూచి బాధపడెనే గాని తనకుమాత్రము ఇట్లు జరిగినందుకు దుఃఖములే దనెను. అందులకు కారణము సుమంత్రుడు రామునిగూర్చి దుర్వాసుడు చెప్పినదంతయు తెలిసియుండుటయే కారణము. దుర్వాసుడు రాముని గూర్చి చెప్పిన కథ యంతయు ఎవ్వరికి చెప్పక రహస్యముగా నుంచవలయునని దశరథుడు సుమంత్రునితో చేతిలో చేయి వేయించుకొనెను. ఈవిషయముకూడ లక్ష్మణునితో సుమంత్రుడు చెప్పెను. కాబట్టి జరుగనున్నది జరుగక మానదని సుమంత్రుడు లక్ష్మణుని దుఃఖించక ఊరకుండుమనెను. అంతియగాక సీత కెట్టి లోపమును రాదనియు ఇరువురు కొడుకులు పుట్టెదరనియు వారు రాముని తర్వాత నయోధ్య నేలుదురనియు పల్కెను. లక్ష్మణుడు కొంత తృప్తిపడి ఇంటికి పోయి

రామునితో సీత విషయము నివేదించెను. అరణ్యమునందు సీత లక్ష్మణుడు పోగనే బిట్టు విలపించుచుండెను. ఈరోదన ధ్వనిని వినిన మునికుమారులు పోయి వాల్మీకికి చెప్పగా నాతడు వచ్చి సీతను తన ఆశ్రమమునకు తోడ్కొని పోయెను. ఈమె ఎవరని మునిపత్నులందఱు ఆశ్చర్యము నొందగా వాల్మీకి తాను ప్రతిదినము సీతను సమాధిస్థితి యందు చూచు చుందుననియు ఈమె శ్రీరాము పత్ని సీతయనియు పల్కెను. ఇక సీత మున్యాశ్రమములందు వారిచ్చిన కందమూల ఫలాదులతో తృప్తినొంది దుఃఖము కొంత మరచిపోయినదట.

ఇదివిని ఆధ్యాత్మ రామాయణమున పార్వతి శివుని రామకథ అవకతవకలని ఆక్షేపించినదట. ఏలన ఒక మహారాణిపై అపవాదురాగా విచారింపక అడవులకంపుట అన్యాయముకాదా యనీ ఆక్షేపించెను. అంతియగాక రాముడు అవతారము చాలించదలచిన చెప్పిపోవచ్చునుగదా ఈ వాదులు, ముందొకరు వెనుక ఒకరు పోనేల ? అని ఆక్షేపించినది. అపుడు శివుడు పార్వతికి – రాముని ప్రారబ్ధములు చాల కలవనియు. అవి విష్ణ్వవతారమున ప్రాప్తించినవనియు వాని పాప ఫలితమిప్పుడు అనుభ వింపక తప్పదనియు నిరూపించెను.

ఒకప్పుడు దేవదానవులకు యుద్ధము కల్గినది దానవులు పరుగెత్తు కొని వచ్చి భృగుమహర్షి ఆశ్రమమున దాగియుండిరి. వీరిని బట్టుకొను టకు ఇంద్రుడు, విష్ణువు వెన్నంటిరి. రాక్షసులంతలో భృగ్వాశ్రమమున ప్రవేశించి, భృగుపత్నిని శరణమడిగిరి. వీరిద్దరు భృగ్వాశ్రమమున ప్రవేశించి యడుగగా భృగుపత్ని వారిపై కోపించినది. దానికి భయమంది ఇంద్రుడు మొదటనే వెనుకకు తగ్గియుండెను. కాని విష్ణువు మాత్రము అడ్డువచ్చిన భృగుపత్నిని చక్రముచే ఖండించి రాక్షసుల నంతమొందించెను. పత్నీ విరహితుడైన భృగువు విష్ణువుపై గోపించి ఆవేశముతో

నీవు నీభార్య చావగా నిట్లే యేడ్చెదవని-శపించె. కాని విష్ణువు నీ శాప శక్తి నన్నేమియు చేయజాలదని త్రోసిపుచ్చి వైకుంఠమునకు బోయెను. అట్టియెడ నా శక్తి భృగువునే బాధింప మొదలు పెట్టెను. అందులకు విష్ణువు దయామయుడు గాన భృగుశాపమును రామావతారమున ననుభవించెదనని పల్కెను. ఈ శాపఫలితము వేయివత్సరము లనుభవింపవలసి యున్నది. కావుననే రాముడు ఇన్నివత్సరములు సీతను వదలియుండవలసి వచ్చినదని పార్వతికి శివుడు బదులు పల్కెను.

వాల్మీక్యాశ్రమమున సీతకు ఇద్దరు మగబిడ్డలు జన్మించిరి. ఆ బిడ్డలలో నొకనిని కుశము (దర్భ) తోను, మరియొకనిని లవము (ఆవుతోక వెండ్రుక) తోను అభిమంత్రించుటచే వారు కుశలవులైరి. ఒకప్పుడు శత్రుఘ్నుడు లవణాసురుని చంపుటకు పోవునపుడు అప్పుడే పుట్టిన కుశలవులను చూచెను. అతడు తిరిగి వచ్చునపుడు వాల్మీకాశ్రమమున విడిది చేసెను. ఆ సమయమున శత్రుఘ్నుడు కుశలవుల రామాయణ గానమును వీనులవిందుగా వినగా, సామంతులు వారినిగూర్చి వాల్మీకిని అడుగుమనిరి. కాని శత్రుఘ్నుడందుల కంగీకరింపక మిన్నకుండెను. మరునాడు శత్రుఘ్నుడు అయోధ్యకు పోయెను. కొంతకాలమునకు రాముని అశ్వమేధమునకు వాల్మీకి కుశలవులతో పోబోయెను. కాని కుశుడు తమ జీవితము పూర్తిగా మారబోవుచున్నదని యూహించి వాల్మీకిని తత్త్వోపదేశము చేయుమని కోరెను అపుడు వాల్మీకి సంకల్పము నాపిన నున్న తత్త్వ ముండునని చెప్పెను. ఇదియే పరమవృత్తి, తుది బ్రహ్మాలో లయమగునని పల్కెను. ఇక వారు బయలుదేరి అయోధ్య చేరిరి. అచట వాల్మీకి కుశలవులను కూరలు, దుంపలు తినీ రామాయణగానము రాజవీధులందు చేయుచుండుడని ఆజ్ఞాపించెను.

శ్లో. కర్శయంత శ్శరీరస్థం భూతగ్రామ మచేతసః
మాంచైవా న్త శ్శరీరస్థం తాన్విద్ధ్యాసురనిశ్చయాన్॥

అని యుపదేశము శరీరమును శుష్కింపచేయరాదని పల్కుచున్నది. ఉపవాస మనునది అరణ్యకులకు, విధవలకు, సన్యాసులకు తప్ప వేరెవ్వరికి అకర్కలేదు. కావున గృహస్థుడు - అతిధిభ్యో అన్నంపచామి అని వంట తయారు చేయవలసినదిగా గ్రహింపవలయును. అతిథులకు పెట్టి మిగిలినది భుజించియుండుట వీరి ధర్మము.

కుశలవులగానము రామునకు వీనులవిందుకాగా వారిని పిలిపించి సవనశాలయందు పాడుమని కోరెను. వారు రామాయణగానము చేయగా విని తన కథయే యని భావించి వాల్మీకిని ఈ విషయమై అడగిరమ్మని తనవారి నంపెను. అంతియగాక సీతనుకూడ అడుగుమని చెప్పెను. వాల్మీకి ఆనతిపై సీతప్రతిజ్ఞను అందఱు వినవలయునని రామునికోరికయై యున్నది. మరునాడు రాముడు సీత పాతివ్రత్యముగూర్చి అందరినీ వినవలసినదిగా కోరి సమావేశపరచెను. ఋష్యాదులు అందఱు ఆ విశేషము చూడవచ్చిరి. వాల్మీకి, అతనివెంట సీత దోసిలియొగ్గి మూర్తీభవించిన పాతివ్రత్యమువలె వచ్చినది. వాల్మీకి జరిగినదంతయు చెప్పగా రాముడు సాంతము వినెను. ఇక సీత పాతివ్రత్యమునకు శపథముచేయుచు భూదేవిని ప్రార్థించి ఆమెయందు ప్రవేశించినది. అందులకు రాముడు కోపించి నారాయణాస్త్రమును ప్రయోగించెను. అపుడు బ్రహ్మాది దేవతలు ఉన్న సంగతి వివరించి రాముని శాంతపరచిరి. పిమ్మట రాముడు శాంతించి కుశలవులతో కాలము గడపుచు రాజ్యము చేయుచుండెను. ఇట్లు వెయ్యేండ్లు రాజ్యపాలనము సాగినది. ఇట్లు విష్ణుని భృగుశాపము తీరినది.

ఒకనాడు యముడు బ్రాహ్మణునివేషమున వచ్చి రామునితో నేకాంతముగ సంభాషించుచు, ఎవ్వరు లోనికి రారాదనియు అట్లు వచ్చినవానిని

చంపవలసినదిగా రామునివద్ద మాట తీసుకొనెను. ద్వారము నొద్ద లక్ష్మణుడు రామాజ్ఞచే కావలికాయుచుండెను. రాము డత్లియన సంభాషణ సాగుచుండెను. ఇంతలో దుర్వాసుడు రామదర్శనార్థము విచ్చేసెను. కాని లక్ష్మణుడు అంగీకరింపకయున్న, దుర్వాసుడు శాపమివ్వ నుంకించెను. అట్టియెడ చేయునదిలేక లక్ష్మణుడు లోనికేగి దుర్వాస ఆగమనవార్త తెలియబరచెను. అంతలో యముడు తన సంగతి చెప్పుచు, రాముని స్వర్గమునకు రమ్మని జ్ఞాపకముచేయుటకు బ్రహ్మ తనను బంపె ననెను. అంతరాముడు తానువచ్చినచోటుకు పోగలనని పల్కెను. ఇక తనకిచ్చినమాట వమ్ముకారాదు అని యముడు లక్ష్మణుని విషయమై అనిపోయెను. వచ్చిన దుర్వాసుడు చక్కగా భోజనముచేసి పోయెను. సంధిగ్ధావస్థయందున్న రాముడు లక్ష్మణుని చంపలేక, ఊరకుండలేక దుఃఖించెను. మరునాడు వశిష్ఠాదుల రావించి సభలో వివరించెను. ఋష్యాదులు నాగరులు లక్ష్మణుని చంపరాదని పలికిరి. చివరకు వశిష్ఠుడు ఇక్ష్వాకుల సత్యసంధత్వమును వివరించి, లక్ష్మణుని చంపుమనియే అభిప్రాయ మిచ్చెను. కాని రామునకు చేయాడ లేదు. కావున తమ్ముని పరిత్యజించెను. పరిత్యజించుట చంపుటతో సమానమే యగునుగదా!. కాన లక్ష్మణుడు మహాప్రస్థానముపోయి సరయునందు ప్రవేశించి అవతారము చాలించి ముందుగ స్వర్గమున కేగెను.

ఇక రాముడు భరతశత్రుఘ్నుల రావించి భరతుని రాజ్యముగై కొనుమని పల్కగా భరతుడు నీయదికాని రాజ్యము నాదికాదని యుగ్గడించెను. ముఖ్యముగ రాముడు ర్రాజ్యముతనదికాదని కేకయునివాక్య ప్రకారముతండ్రి భరతుని కీయవలసినది గాన ఇచ్చెదనని గట్టిగా చెప్పెను. కాని రాముని బలవంతముపై భరతుడు రాజ్యమును అన్నగారిపై నున్న భక్త్యమరాగ సూచకముగ కుశునకు పట్టాభిషేకము చేసెను. అపుడు రాముడు స్వార్జితమని కుశున కొక యుంగరము మాత్రమే ఇచ్చెను. ఈ ఉంగరము అగస్త్యునిచే దానమివ్వబడినదిగాన తనకు స్వార్జితమైన దదియే యనిభావించి

దానిని కుశునకు అప్పగించెను. ఈ ఉంగరము అగస్త్యున కెట్లు లభ్యమైన దనగా నొక యైతిహ్యమున్నది. శ్వేతుడనువాడు రాజర్షి. మూడువేలవత్స రములు తపమాచరించి శరీరపతనమై బ్రహ్మలోకమున కేగెను కాని ఆత నికి ఆకలిదప్పులు పోలేదు. అట్లగుటకు కారణమేమని బ్రహ్మనుప్రశ్నిం చెను. బ్రహ్మ శ్వేతుని తపస్సునుగూర్చి వర్ణించి, తపమువలన బ్రహ్మ లోకము వచ్చినది. అతిథిపూజలేని మహారణ్యమున వసించుటచే నాకలి దప్పులు పోలేదనెను. కావున శ్వేతుని తన పూర్వ శవ శరీరమాంసమును తినుచుండు మనెను. అట్లే ప్రతిదినము శ్వేతుడు తన శవశరీరభాగములను కోసి తినిపోవుచుండెను. కాని మరునాటికి ఆశరీర భాగము లన్నియు చక్కగా పూడియుండును. ఇట్లు జరుగుచుండగా నొకరోజు అగస్త్యముని ఆ అరణ్యమున చెఱువుగట్టుపై తపస్సుచేసికొన ప్రయత్నించి ఆ రాత్రి యక్కడ పండుకొనెను మరునాడు శ్వేతునివిమానము వచ్చినది శ్వేతుడు తన అలవాటు ప్రకారము పీనుగును కోసుకొని తినుచుండెను. ఇదిచూచిన అగస్త్యుడు అందులకు కారణమేమని ప్రశ్నించెను. శ్వేతుడు తన వృత్తాంతమెల్ల వానికిచెప్పి, బ్రహ్మ అగస్త్యుని చేతనేమైన బెట్టిన నీ అదత్త దోషము పోవునని చెప్పెను. గాన మహానుభావా! యీయుంగరము నిచ్చెదను గొనుమని ప్రార్థించెను కాని అగస్త్యుడు తనకక్కరలేదనెను. ఎట్టకేలకు వానిని యుద్ధరించుటకు ఆ యుంగరము గైకొనగా నాశవము మాయమైనది. వాడును విమానమున ఆకలి దప్పులులేని స్థితినొంది దివ్య లోకమున కేగెను. ఇట్లు అగస్త్యునకు లభించిన మణిమయమగు నుంగ రము రామున కివ్వబడినది. దీనిని రాముని ఇంద్రాంశము నీయందుగలదు గాన గ్రహింపుమని అగస్త్యుడు ప్రబోధించి ఇచ్చెను. ఈ యుంగరమునే రాముడు కుశునకు ఇచ్చెను.

మరియు రాముడు పితృవాక్య పరిపాలనయందు తనకంటె పరశు రాముడు మిన్నయని పల్కెను. కారణమేమన తండ్రియాజ్ఞాపింపగనే

తల్లిగొంతు కోసివేసెను. ఇట్టిపని మిగిలిన నల్వురు కుమారులు చేయజాల రైరి. అపుడు జమదగ్ని కుమారుని భక్తికి మెచ్చి వరమడుగు మనగా తల్లిని బ్రతికించుమనియు, అన్నల శాపము తొలగించుమనియూ ఈ ఘోరకృత్యము తల్లి మరచి యుండునట్లును చేయుమని కోరెను. కావట్టి పరశురాముడు తనకంటె మిన్నయని రాముడు పలికెను. కాని యింత కంటెను పితృవాక్యపరిపాలనయందు పూరుమహారాజు గొప్పవాడగుచున్నాడు ఏలన తండ్రి వార్ధక్యమునుబాపి, తాను స్వీకరించిన యుత్తముడు. కావట్టి పరశురామునికన్న పూరుడే గొప్పవాడని రాముడు చెప్పెను.

రాముడు తాను అవతారము చాలించునపుడు తనతో రాదలచిన వారి నందఱను రమ్మనెను. అపుడు మానవులేగాక వృక్షాదులుకూడ బయలు దేఱినవి. అంతఱు సరయువువద్ద శరీరములు వదలి దివ్యవిమాన ములలో పోగా ఇంద్రుడా హ్వానించి ప్రశంసించెను. ఇక తనతో వచ్చిన వారల నందఱను బ్రహ్మకు నప్పగించి గోలోకమున నుండుడని పంచి తాను వైకుంఠమునకు వేంచేసెను. ఇక రాజ్యపాలన చేయుచున్న కుశుడు ఎవరులేని యయోధ్యయందలి రాజ్యము నాకేలయని మఱియొకచో రాజ్య పాలన సాగించెను. అంత అయోధ్యలోని కోటశక్తి కలలోనికివచ్చి విలపించి తనదురవస్థవిన్పించినది. ఆశక్తి అయోధ్యను పాలింపు మనగా మరల కుశుడువచ్చి పాలించుచుండగా, అందలి ప్రజలు రామునే మరచి పోయిరి. ఒకరోజు కుశుని ఉంగరము సరయూనదియందు జారిపడినది. ఈవిషయము మంత్రి కెఱింగించగా, నతడు వెదికించి విసిగివేసారి దొరక లేదని విన్నవించెను. ఇక చేయునదిలేక కుశుడు తవతండ్రి యిచ్చిన ఉంగరములేనందున దుఃఖించి, కోపించి ముల్లోకములు దహించెదనని నారాయణాస్త్రమును ప్రయోగింప నెంచెను. ఆ అస్త్రప్రభావమున లోక మంతయు పొగలు క్రమ్మినవి. పాతాళమున వాసుకి ఇదిచూచి, ఆశ్చర్య చకితుడై, జరిగినది తెలిసికొని, ఆ యుంగరము పాతాళమున నుండి

యుండునని భావించి తీసినవారిని తెచ్చియిమ్మనెను. ఆ యుంగరము కుముద్వతి యను నాగకన్యకకు దొరికినది. ఈ విషయము వాసుకికి నివేదింపగా, దాని తండ్రితో నుంగరము కుశున కిచ్చివేయవలసినదిగా ఆజ్ఞాపించెను. వారి ప్రార్థనతో వాసుకి వారితో భూలోకమునకు వచ్చి ఆయుంగరమును కుశునకు సమర్పించెను. అప్పుడు కుశుడు నారాయణాస్త్రము నుప సంహరించుకొనెను. మరియు సర్పరాజుల అభ్యర్థనతో కుశుడా కుముద్వతిని పెండ్లియాడెను. వివాహానంతరము నాగులందఱు కుశునకు బంధువులైతిమి గనుక, కుశుడు మాకు వరమీవలెనని కోరిరి. కుశుని రాజ్యపాలన పర్యంతము గరుత్మంతునిబాధ లేకుండునట్లునాగకులము వరము నొందెను. మరియు మానవుల అభ్యర్థనతో తనరాజ్యపాలనయందు మానవులు పాము కాటునకు గురికారాదనియు శాసించెను.

ఇట్లు ఇక్ష్వాకురాజులు ఉత్తమోత్తములై మానవులకు మార్గదర్శకులై వెలయుచున్నారు. తరువాత కుముద్వతీకుశుల వంశవృక్షము నలుబది తరములదాక యితర పురాణములంబట్టి కాళిదాసుడు కీర్తించెను. ఇట్టి రామాయణ గేయకావ్యరూపమగు నితిహాసమును లోకవ్యవహారములు, ధర్మకర్మములు, నివృత్తమార్గములు, తత్త్వానుభవములు మున్నగునవి యెన్నియో పాఠకులు గ్రహింపవలసి యున్నది. ముందు ప్రకృతకగాథ యందలి పూర్వాపర విరోధము లేకుండ సమన్వయము కుదురుట కష్టము. తరువాత తక్కినవన్నియు గ్రహించుట అంతకన్న కష్టము. కాన ఈగ్రంథము లేకపోయిన నేమి అనకూడదు. "వ్యాఖ్యానతో విశేష ప్రతిపత్తిర్నహి సందేహా దలక్షణం" అని పరిభాష. వ్యాఖ్యానములవలన పెద్దల వాగ్ధోరణుల వలన గురువుల సంప్రదాయముల వలన రహస్యములు తెలుంగవలయును. నాకు తెలియుననువాని కేమియు తెలియదని యుపనిషత్తు తెలుపుచున్నది.

16

శ్లో॥ అవతారాస్సంత్వన్యే సరసిజనయనస్య సర్వతో
కృష్ణాదన్యఃకోవా ప్రభవతిగోగోపగోపికా ముక్త్యైభద్రా॥

మనకు భగవదవతారములు అనేకము లున్నవి. వానిలో కృష్ణావతారము చాల విశిష్టమైనదిగ వర్ణింపబడెను. ఏలన ఈ అవతారమున భగవంతుడు పెక్కుమందికి మోక్షప్రాప్తిని కల్గించుటవలన నని శ్లోక భావము. కాబట్టి కృష్ణావతారము తనంతట తాను లోకమున ప్రభవించుటచే లీలావతారమై వైశిష్ట్యము నొందుచున్నది. ఇక రామాది అవతారములు శాపగతావతారములుగా పురాణములు పేర్కొనుచున్నవి. ఇప్పుడీ కృష్ణపరమాత్మను మనము రెండు విధములుగ చూడవలయును. భాగవత కృష్ణుడని భారతకృష్ణుడని ఇరుతెఱంగుల చూడనగును. భాగవత కృష్ణునిలో వ్యభిచారము, అలౌకిక శక్తుల ప్రదర్శనము మొదలగునవి అన్నియు గలవు. ఇక భారత కృష్ణుడన్ననో మర్యాదల దాటనీని పెద్ద మనిషిగా కన్పట్టును. శ్రీకృష్ణుడు పదియవమాసమందే వ్యభిచారము చేసినట్లు—మేఘైర్మే దురమంబరమ్—అను శ్లోకము తెల్పుచున్నది. ఈ కృష్ణ పరమాత్మయందలి మణికాంతివంటి భగవత్తత్త్వము తెలిసికొని ఆనందించుటవలననే గోగోపికాముక్తి లభించినది. ఈ కృష్ణదేవుని చరితములు—పురిటిలోపలనే పూతనను జంపుట, ఆరునెలలవాడై శకటాసురుని, ఏడాదిబాలుడై తృణావర్తుని జంపిన యిట్టి అనేకాద్భుతములబట్టి వాని స్వరూప మిట్టిది యని చిత్రింపరాకున్నది. కావ నీ కథయే అసత్యమన్న ఇక మన పంట పండినట్లే. సత్యపక్షమున సమన్వయమును చేయవలయునుగదా ! ఆ

ప్రకరణములోని వర్ణనమునుబట్టి శరీరాతీతమైన అఖండతేజమా కృష్ణపర మాత్మ. శరీరమునకు తాను వేరుగానుండి శరీరకృత్యముతనదికాదని వ్యవహ రించినట్లు కనబడుచున్నది. అత్రి మొదలగు మహర్షులకే అట్టి శక్తి యుండ భగవంతుని విషయ మేమనవలెను? అందువలననే శంకరులు- ఈ శరీరముతో వ్యభిచరించినను దోషము తనకంటదని లోకము కొఱకు పరకాయప్రవేశముచేసి కామశాస్త్రము నెల్ల నెఱింగితి ననెను. కాబట్టి శరీ రము వేఱు ఆత్మ వేఱు, అనుభావముతో ననుభవించి సంచరించినవారికి పుణ్యపాపములు ఏవియును అంటవు. అట్లని అందఱు వ్యభిచార మొక పనిగా సాగింపరాదు. యోగులు వీర్యమును ఊర్ధ్వముఖము చేసి గొప్ప శక్తుల సంపాదించుచున్నారు. శ్రీకృష్ణుడు తన రూపమును రాజకన్యల యందును, గోపికల యందును విస్తరించి నారాయణాది కుమారులను యాదవులను సృష్టించెను. కురుక్షేత్ర యుద్ధము రానున్న దనుసప్పుడు తన గోపికా కుమారాదులను పంద్రెండుపేల సందిని ఒకవైపునుంచి, తానొక్క వైపుననుండి యిందులో ఎవరు ఎవరికి కావలయునో కోరుకొనుమని ముందుగా అర్జునునికి అవకాశ మొసంగెను. అప్పుడర్జునుడు శ్రీకృష్ణుని కోరుకొనెను దుర్యోధనుడు నారాయణాది గోపాలబలమును తీసికొని హృష్టుడై పోయెను.

భారత పాత్రలలో శ్రీకృష్ణ ద్రౌపదులు మిక్కిలి రాజకీయ చాతు ర్యము గలవారు. వీరిని మించినది కుంతి కుంతి యెల్లప్పుడు కుమారు లను రాజకార్యములందు ద్రౌపది సలహాను పాటించుమని చెప్పుచుండెడిది. అనగా ద్రౌపదిమాట కెంత విలువ నిచ్చినదో-కుంతి మనస్సు గుర్తింప వచ్చును.

పూర్వ మొక నవాబు తనకు తాంబూల మిచ్చుచున్న ఒక బ్రాహ్మ ణుని సలహాను రాచకార్యములందు పాటించుచుండెడివాడు. అతడునిచ

పోవుచు తన కుమారుని నిందించెను. అందులకా నవాబు కుమారుడు నీవు నాకేమియు ఉపదేశింపకయే నన్ను నిందించు కారణమేమని తండ్రిని ప్రశ్నించెను. అపుడా నవాబు తనకు నిత్యము తాంబూల మిచ్చు బ్రాహ్మణుని సలహానుతనవలెనే పాటించుచుండుమని కుమారుని కోరెను. ఇట్లుండగా నొకనాడు ఒక జమీందారు నవాబు కుమారుని తన సంస్థానమునకు వచ్చినచో నేబదిలక్షల ధనమిచ్చి సత్కరించెదనని చెప్పెను. అట్లేయని నవాబు కుమారుడు తగుపరివారముతో బయలుదేరెను. కాని తండ్రిచెప్పిన మాట మరచిపోయెను. కొంతదూరము పోయిన పిమ్మట తండ్రిమాట జ్ఞప్తికివచ్చి ఆ బ్రాహ్మణుని పిలిపించి పోవుటయా? మానుటయా? అని సలహా నడిగెను. అంత నా బ్రాహ్మణుడు ఇట్లు స్వయముగా ఒక సామంతుని దగ్గరకుపోయి ధనము తానుగా స్వీకరించుట రాజవృత్తికాదు, భోగినివృత్తి కాబట్టి తాము తిరిగిపోయి, రాజధానినుండి వానినే ధనముతెచ్చి అర్పించునట్లు వార్త నంపుమని సలహాను చెప్పెను. అంత నా నవాబుకుమారుడట్లే యని వెనుదిరిగిపోయి జమీందారునకు కబురు పెట్టెను. ఆతడును చేయునదిలేక చక్రవర్తికి ధనముతెచ్చి సమర్పించిపోయెను. కాబట్టి స్త్రీ పురుష భేదమును పాటింపక వారి యుక్తపత్వమునుబట్టి వారివారి సలహాను పాటించుట యుక్తమని తోచుచున్నది. అందువలననే కుంతి ద్రౌపది సలహాను పాటించుమని కుమారుల కోరినది.

ద్రౌపది పూర్వజన్మ వృత్తాంత మతివిచిత్రమైనది. పాండవు లైదుగురు పంచేంద్రులు. ద్రౌపది పూర్వజన్మయందు కుష్ఠరోగముతో బాధపడు నొక ఋషిభార్య ఆమె భర్తను పతియే దైవమని సేవించుచుండెను ఒకనాడు అన్నమునందు భర్త వ్రేలు ఒకటి ఊడిపడినది. దానినొక ప్రక్కకు నుంచి అన్నము దినెను. అట్టి పతిసేవాపరాయణయగు నామెను జూచి అతడు వరమేదియేని కోరుమని అడిగెను. అంతట నామె తనకుగల మన్మధతురత తీర్పుమని కోరినది. అందుల కాతడు నాకుష ఇక ఐదురోజు

లలో పోనున్నది. ఆపిమ్మట నేను నీయిష్టము తీర్చెదనని, అట్లుచేసి కొన్నివేల సంవత్సరములు తన తపశ్శక్తితో నొక విమానము సంపాదించి దానిపై పత్నినిడుకొని తానన్ని లోకముల తిరుగుచు నాయమ నన్ని విషయముల సుఖముల మాస్వించి ఇక నేను బ్రహ్మలోకమున కేగెదను. నీవు తపముచేసి నీ యభీష్టము నెరవేర్చుకొనుము అనిచెప్పి ఆ ముని బ్రహ్మలోకమునకేగెను. అంత ద్రౌపది తపస్సుచేసి శివుడు ప్రత్యక్షమై యేమికావలెనని యడుగ పతి-పతి యని ఐదుసార్లు అనెను. శివుడు ఆమె నోరుమూసెను. మరియు నీకు ఐదుగురు పతులు లభించెదరనియు పల్కెను. అందులకామె ఐదుగురువలన పతివ్రతా ధర్మము చెడునని వద్దని పల్కినది. కాని శివుడు ఐదుగురు భర్తలు లభించినను, ఆ ఐదుగురు ఒక్క ఇంద్రాంశకల వారలగుటచే పాతివ్రత్యము చెడదు అని ఆమె కన్యాత్వము చెడకుండునట్లు వరమిచ్చెను. మరియు ఇంద్రుని పిలుచుకొని వచ్చినచో తనకు రాబోవు భర్తలను చూపించెదనని ఇంద్రుని గైకొని వచ్చు నుపాయమును చెప్పెను. ఇంద్రుడు రాబోవుచుండగా ఈమె ఆకాశగంగలో శివాజ్ఞచే నేడ్చుచు కూర్చుండెను. ఆమె కన్నీటి చుక్కలన్నియు బంగారు కమలము లగుచుండెను. ఇంతలో శివుడు వరుణదేవుడై హిమాలయముపై భార్యతో జూదమాడుచుండెను. అపుడు ఇంద్రుడు తన సామంతుడగు వరుణుడు తన రాక నెదుర్కొనక యుపేక్షించుచున్నాడని భావించి వానిని కోపించెను. వెంటనే వరుణరూపముననున్న శివుడు ఇంద్రుని బట్టి తెమ్మని యాజ్ఞాపింప నా తపస్విని వానిచేయి పట్టుకొనెను. ఆ సమయమున ఇంద్రుని చింతించుచుండగనె చేయి వదలించుకొనుమాత్రము శక్తియులేక తగ్గిపోయెను. అపుడు వరుణుడైయున్న శివుడు ఇంద్రుని ఈకొండశిఖర మెత్తుమని ఆజ్ఞాపించెను. ఇంద్రుడట్లే యొనర్ప ఆకొండశిఖరము అడుగు భాగమునుండి నల్వురు ఇంద్రులు బయలు వెడలిరి. అపుడు శివుడు ఆ ఐదుగురు ఇంద్రులను

లోకోపకారము కొఱకు భూలోకమున బుట్టుడని శాశించెను. వారు నీకు భర్తలయ్యెదరని యామెకు చెప్పెను. కాబట్టి పాండవులందఱు ఇంద్రాంశ సమానముగ గలవవారె యగుచున్నారు. అయినను ఇంద్రాంశ యమాంశ లతో ధర్మరాజు మొదలగువారు ఆయాదేవతల వరములతో పుట్టిరి. ఆ చక్రవర్తిని యగు సతి రామాయణమున అగ్ని నెనసిన మాయాసీత తన్నుజేవ ద్రౌపదియై జన్మించెను.

వివాహానంతరము నారదోపదేశముతో ఒక్కొక్కరు ఒక్కొక్క సంవత్సరము ద్రౌపతితో నుండునట్లు ఒడంబడిక జరిగినది "ద్రౌపద్యాః పాండుతనయాః పతిదేవర భావుకాః నదేవరో ధర్మరాజ న్సహదేవో న భావుకః" అని కాళిదాసు చమత్కరించెను. అనగా ద్రౌపది ధర్మరాజుతో నుండగా మిగిలినవారు మరుదులు. భీమునితో నుండగా దర్మరాజు బావగారు మిగిలిరవారు మరుదులు. ఇట్లు చమత్కారముగ చెప్పబడినదిక సహదేవుడెప్పుడును బావకానేరడని ఒకారము లేంకుడ నిన్నివరుసలో శ్లోకమున వర్ణించెను.

ద్రౌపదివివాహసమయమున అర్జునుడే మత్స్యయంత్రమును కొట్టినందున ద్రుపదుడు అర్జునునకే ద్రౌపది నిచ్చెదనని పల్కెను. అపుడుధర్మ రాజు పెద్దవానికి వివాహముకాకుండ చిన్నవాడు పెండ్లాడుట నిషేధమని, కూడదని వచించెను. కాబట్టి తల్లి యనుమతిని ఐదుగురు ద్రౌపదిని వివాహమాడ నిశ్చయించితిమనెను. ఇట్లు ఒకస్త్రీ ఐదుగురుని వివాహమాడుట ఆర్యమతమందు నెందును గన్పట్టుట లేదని ద్రుపదుడన ధర్మరాజు ప్రచేతసులు పదిమంది ఒక స్త్రీని శాస్త్రవిధి వివాహమాడి నట్లును, అట్లే ఏడుగురు ఒకదానిని వివాహ మాడినట్లును వేదములయందు గలదని చెప్పెను. కాబట్టి ద్రౌపది పాండవులను వివాహమాడుట తప్పులేదు. అయినను పెద్దల సలహా ననుసరించి చేయుదమని భావించుచుండగా వ్యాసు డచ్చోటికి విజయము చేసెను. ఆ మహాత్ముని సలహా ననుసరించి

నాకు తోచినమాట

ఉపన్యాసకులు:

బ్రహ్మశ్రీ వే|| తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు

సంకలనం:

శ్రీ నెమ్మాని సీతారామయ్య, ఎం. ఏ.,

క్రిందబడిరి. గరుత్మంతునకు ఱెక్కలు పోయినవి. వారి పయనము అసాధ్యమైనది. అపుడు గాలవుడు తాను పోవుచున్నపని వివరించగా నాముని ప్రసన్నుడై గురుదక్షిణార్థము పోవుచున్న ధర్మము నెంచి ఱెక్కలు వచ్చుననెను. మరుక్షణముననే గరుత్మంతునకు ఱెక్కలు వచ్చినవి. మరల వారి ప్రయాణము సాగినది. ఇక నూర్ధ్వలోకములకు బోక భూలోకమున సంచరించుటకు వచ్చిరి. అపుడు అచటిరాజు యయాతి పరిపాలించుచుండెను. గాలవ గరుత్మంతులు పోయి రాజును అట్టి అశ్వముల నర్థించిరి. కాని యయాతి అట్టి గుఱ్ఱములు తనవద్ద లేవని పల్కి గురుదక్షిణార్థియగు యాచకుని ఊరకపంపరాదు గాన తన కుమార్తెయగు మాధవిని వారికి ఇచ్చిపంపెను. మరియు తన కూతునెవరికైన నిచ్చి గుఱ్ఱముల సంపాదించుకొమ్మని చెప్పి పంపెను. తర్వాత గరుత్మంత గాలవులు కాశీకి పోయిరి అచట దివోదాసు అనునతడు రాజ్యము చేయుచుండెను. అతని దగ్గర నున్న రెండువందల గుఱ్ఱములను, మాధవినిచ్చి గ్రహించినపుడు, వారు మాధవిని ఒక కొడుకు గనినపిమ్మట తమకు మరల ఇవ్వవలసినదిగా సమయము చేసికొనిరి. ఆ రాజట్లే యని గుఱ్ఱములిచ్చి పంపెను. ఈ దివోదాసు మాధవి అనువారలకే ప్రతర్దనుడు అనువాడు జన్మించెను. పిమ్మట రాజు అనుకొనిన మాట ప్రకారము మాధవిని గాలవాదుల కర్పించెను. పిదప మరల మాధవిని తోడ్కొని సేనజిత్తు అనువాని తండ్రికిచ్చి పైవలెనె రెండువందల గుఱ్ఱములను గ్రహించి, సేనజిత్తు జన్మింపగనే మరల మాధవిని స్వీకరించిరి. పిమ్మట శైబ్యుని నుండి మరి రెండువందల గుఱ్ఱముల స్వీకరించి శిబిచక్రవర్తి జన్మింపగనె మాధవిని మరల గ్రహించిరి. ఇట్లు గాలవునకు ఆరువందల గుఱ్ఱములు లభించినవి. మాధవి మాత్రము కన్యగానే యున్నది. కాని మిగిలిన రెండువందల గుఱ్ఱములు లభించుట దుర్లభమైనది. అందుల కాతడు ముందు లభించిన ఆరువందల గుఱ్ఱములను విశ్వామిత్రునకు సమర్పించి, మిగిలిన

రెండువందలకు గాను మాధవిని స్వీకరించి పై వానివలె నీవు నొక కొడుకును గనుమని సమర్పించెను. అపుడు విశ్వామిత్రునకు మాధవి యందు అష్టకుడు అనువాడు జన్మించెను. మొత్తముమీద మాధవికి నలుగురు ధర్మ సంతానము గలిగినది. పిమ్మట మాధవి తనకు వివాహము అక్కరలేదని తల్లి తపస్సు చేసి బ్రహ్మ లోకమునకు పోయినదని భారతమున గలదు.

పిమ్మట కొంత కాలమునకు అష్టకు డశ్వమేధయాగము ప్రారంభింపగా అన్నలు అందఱు విచ్చేసిరి. యాగాంతమున అవభృధస్నానముచేసి అష్టకుడు అన్నలతో వాహ్యాళి వెడలెను. త్రోవలో నారదమహర్షి కనబడిన-వారి రథ మెక్కించుకొనిరి. ఈ మన ఐదుగురిలో ఆకాశయానమున బ్రహ్మలోకమున కేగుచో యోగశక్తిచాలక ముందెవరు భ్రష్టులగుదురని నారదుని ప్రశ్నించిరి. నారదుడు అష్టకుడే ముందు యోగభ్రష్టుడు కాగలడని పల్కెను. కారణ మేమని నారదుని ప్రశ్నించగా ఆతడు క్రింది విధముగా సమాధానము చెప్పెను. ఒకసారి నారదుడు అష్టకునియింట ఒక్క సంవత్సరము చాతుర్మాస్యదీక్ష నిర్వర్తించెను. అనంతరము నారదుడు అష్టకునితో కలసి విహారముపోగా ఆలమందలు కన్పించినవి. వానిని గాంచి నారదుడు ఈ ఆలమంద లెవరివని ప్రశ్నింపగా అష్టకుడు నేను బ్రాహ్మణుల కిచ్చినవని అడుగనిదే తనదానమును, తన అహమును ప్రకటించుచు పల్కెనుగాని, బ్రాహ్మణుల గోవులని పల్కలేదు. కాబట్టి అష్టకునకు అహంకారము నశింపలేదు కనుక ఆతడే ముందు యోగభ్రష్టుడు కాగలడని పల్కెనట.

పిమ్మట అతనివదలి మన నలుగురమేగుచో యోగభ్రష్టు లెవరనగా కాశీరాజు కుమారుడగు ప్రతర్దనుడని నారదుడు బదులుపల్కెను. అందులకు కారణముకూడ నారదు డెఱింగించెను. ఒకసారి నారదుడు

ప్రతర్దనుని యింట చాతుర్మాస్యదీక్ష నిర్వర్తించెను. ఒకనాడు వారు గుఱ్ఱములు పూన్చిన రథముపై విహారము చేయుచుండగా బ్రాహ్మణు డొకడు వచ్చి రథాశ్వ మొకటి యిమ్మని యాచించెను. అపుడు రాజు కాదనలేక ఒక గుఱ్ఱమునిచ్చి మూడింటితో విహారము చేయుచుండెను. ఇట్లు కొంత దూరముపోగా మఱొకబ్రాహ్మణు డట్లే యాచించిన వానికి ఒక గుఱ్ఱము నిచ్చి పంపెను. అట్లే మరియొక గుఱ్ఱమునుగూడ యాచకునకు ఇచ్చి ఒక గుఱ్ఱముతో రథము తోలుకొనుచు నింటికి వచ్చుచుండ నా యొక్కటియు బ్రాహ్మణయాచకునకు ఇచ్చి పంపవలసివచ్చెను. చివరకు నాల్గుగుఱ్ఱములు పోగా ప్రయాణము దుర్లభముకాగా రాజే రథము దిగి ఆ కాడిని తన మెడపై బెట్టుకొని రథములాగ నారంభించెను లాగుచు నూరకుండక బ్రాహ్మణులకు యుక్తాయుక్తములు లేవని (విప్రాణాం సాంప్రతం నాస్తి) పల్కెను. అందువలన ప్రతర్దనుడు దానమిచ్చియు యుక్తాయుక్తములు లేవని విప్రనిందను జేసెను. అంత చేసిన వాడింత యోర్చుకొనలేక పోయెను. గాన యోగభ్రష్టుడగునని పల్కెను.

తరువాతనున్న ముగ్గురిలో నెవడు వెనుకబడునని ప్రశ్నము పుట్టెను. దానికి నారదుడు సేనజిత్తు యోగమునుండి పతితుడగునని, కారణమిట్లు తెల్పెను. నారదుడు సేనజిత్తునింట చాతుర్మాస్యము నిర్వర్తించి. ఆతడు చేయించుకొనిన అందమైన బండిని బాగుగ నున్నదని మెచ్చ నాతడివ్వగా నీతడు స్వీకరించెను. మరల నాతడు మరియొకబండిని చేయించుకొనగా, మరల నారదుడు సన్నిహితుడై ఈ శకటము నాకిచ్చిన దానికన్న బాగుగనున్నదని, అదియు నాతడిడ స్వీకరించెను. పిమ్మట మరల రాజు పై వానికంటె అందముగ నుండునట్లు మరియొక బండిని చేయించుకొని దానిపై నాసీనుడగుటకు బ్రాహ్మణులచే స్వస్తివాచనము చేయించుచుండగా నారదుడు ఎప్పటివలెవచ్చెను. నారదుడు వచ్చుచున్నాడు ఇదియు నివ్వవలసి వచ్చునేమోయని, నారదాగమనముచూచి తత్తరపడి బ్రాహ్మణుల

స్వస్తి వాచనము తొందరగా గానిమ్మనెను, గాన నితడు యోగమునుండి పతితుడు కాగలడు. శరీరముతో నెగిరిపోవు నాకు బండి ఎందులకు ? అదు గని నాకు నిడనేల ? తొందరపడనేల ? అని పల్కెను.

ఇక మిగిలినది నారదుడు శిబిమాత్రమే. మీ యిద్దఱిలో నెవరు పతితులగుదురని ప్రశ్నింపగా నారదుడు సంతప్తుడై నా తప్పు నాకు తెలియదు కాన అట్టి తప్పేదియేనున్న నేనే పడుదునేమోగాని శిబిమాత్రము పతితుడు కాడని నిశ్చయముగ చెప్పెను. అనగా నారదునికన్న శిబి చాల గొప్పవాడని భావముకదా ? అందులకు కారణమేమనగా ఒకసారి నారదుడు శిబియింట చాతుర్మాస్యముచేయుచుండెనట. ఆ సమయమున శిబి యింటికి నల్లనిబాపడువచ్చి అన్నము పెట్టుమని యడిగెను. అందులకు శిబి సరే యని పల్కగా యాచకుడు నీ యిష్టమైన భోజనముగాక నాకిష్టమైనతిండి కావలెననెను. అది శిబి కుమారుని ఖండించి వండిపెట్టుట. నల్లని బ్రాహ్మణుడు దానిని గోరెను. ఆ మాటచెప్పి తా నెచటికో పోవుచుండ రాజు మీ యిష్టమైన భోజనము పెట్టెదనుండు డనగా, నేనిక్కడనేయున్న నాపనులు చెడవా ? నీవా భోజనము నావద్దకు తెమ్మనెను. శిబిచక్రవర్తి ఆ మాటల కంగీకరించి తన కుమారుని ఖండించి వంటకముగావించి దాని పళ్ళెరము నెత్తిన పెట్టుకొని బ్రాహ్మణుని కొఱకు ఊరంతయు గాలించెను. ఈ వింతనుగాంచిన యూరిప్రజ ఈ బ్రాహ్మణుడు నీ కెక్కడ దొరకెను ? దుర్మార్గుడని బ్రాహ్మణుని అనేకవిధముల నిందించిరి. కాని శిబి మాత్రము పల్లెత్తుమాట అనలేదు. మరియు నా బ్రాహ్మణుడు శిబిచక్రవర్తి యొక్క అశ్వశాలలను, గజశాలలను తగులబెట్టుచున్నాడని ప్రజలవలన నెఱింగి అచటకు బోయెను. అంత శిబి తానుతెచ్చిన వంటకముగూర్చి నివేదించెను. అందులకా బ్రాహ్మణుడు మరి నాలుగుకొంపలు తగులబెట్టి వచ్చెదనని పల్కెను అంతియగాక తెచ్చినమాంసము కుమారునిది యగునా కాదా ? అనియు దుఃఖించుచు పెట్టిన తాను భుజింపననియు పల్కెను.

మరియు శిబిని అందలి మాంసఖండము నొకదానిని ముందు తినుమని బ్రాహ్మణుడు కోరగా శిబి యాల్లేయని నోటకరచుకొన బోయెను. వెంటనే బ్రాహ్మణుడు అతనిచేతి నెగురగొట్ట నా ముక్క పళ్ళెముతో సహా క్రింద పడినది. మరుక్షణముననే ఆ మాంసమంతయు కుమారుడై నిల్చినది.

అపుడా బ్రాహ్మణుడు శిబి ప్రార్థనముతో యథావిధి భోజనము రాజు సరసన కూర్చుండి చేసి వెడలిపోయెను. మరునాడు రాజు కచేరీకి పోగా ప్రజలు తండోపతండములుగా వచ్చిరి. వారందఱు మిన్నకుండక రాజు గావించిన పనికి ధర్మాధర్మ విచారమును గూర్చి ప్రశ్నించిరి. అందులకు రాజు అతిథి కోరికను పాపపుణ్యముల నిమిత్తములేకుండ నిర్వర్తించుట గృహస్థునీ ధర్మమని తనకిం దేమాత్రము కోరిక లేదని పల్కెను. ఆ మరునాడే బ్రాహ్మణుడు కాల్చిపోయిన అశ్వశాలలన్నియు బంగారు కట్టడములచే మిలమిల మెఱయుచు ప్రకాశించినవి. కాబట్టి శిబి అతిథికొఱకు తన కుమారుని సైతము అహంకారమును బోనాడి, రాజసమును విడనాడి కుమారుని వధించి భోజనము నిర్వర్తింపజేసెను. ఇట్టివానికి యోగక్షేమ చెడునా? మోక్షమునుబొందుట కాత డర్హుడయ్యేడివాడా? వాని ప్రశ్నమున నారదుడు దిమ్మరబోయెను. ఇక నారదుడు ఇట్టి వన్నియు సమయానుకూలముగ బయటపెట్టి లోపములున్న వారాచరితము మార్చుకొనునట్లు చేయుటకు లోకోపకారముననే యుదయించెనని తలంపవలయును. మాధవి కుమారులు నల్వురు రత్నములవంటివారు. మరణానంతరమున నక్షత్ర రూపమున ఆకాశమున మెఱయుచున్నారు. యయాతి కామ్యలోకములన్నియు తిరుగుచు ఇంద్రలోకమునకు పోయెను. అంత ఇంద్రుడు యయాతి గొప్పతనమునుగూర్చి ప్రశ్నించగా, యయాతి తాను గొప్పవాడననియు, తనకంటె తనకుమారుడు గొప్పవాడనియు సమాధానముచెప్పెను. అపుడు వెంటనే ఇంద్రుడు యయాతిని స్వర్గలోక భ్రష్టుని గావించెను. యయాతి పతనమందుచుండగా దౌహిత్రులాతనిగాంచి ఆగుమనియు, ఎవ

రనియు ప్రశ్నించెను. యయాతి ఉన్నసంగతి వివరించగా వారు యయాతి తమ తాతయని తెలిసి, ఆ నల్వురు తమపుణ్యమున నాల్గవవంతు యయాతి కిచ్చి మరల పైకిపొమ్మనిరి. అపుడు యయాతి తేజశ్శాలియై ఊర్ధ్వలోకమునకు పోయెను. కాబట్టి మాధవి కుమారులు ధర్మసంతాన మందమా? అధర్మసంతాన మందమా? అధర్మసంతానము కాకపోవుటవలననే అట్లు చేయగల్గిరి. కావున ద్రౌపదియు భర్తలు ధర్మనిరతులేకాని అధర్మ మేమాత్రము వారియందు లేదు.

భారతమున రాజ్య మెవరిది? అను ప్రశ్నవచ్చినపుడు నన్నయ భారతమున నున్న ప్రక్షిప్తమో ఏక్షిప్తమో యగు —

ఉ. ఆయము గర్వమున్ విడిచి యన్యపతుల్ పనిసేయ నిట్లు గాం
గేయ భుజాబలంబున నికృత్త విరోధిసమాజుడై కుమా
రాయిత శక్తిశాలి ధృతరాష్ట్రుడు రాజ్యము సేయుచుండె న
త్యాయతకీర్తితో తనకు హస్తిపురం బది రాజధానిగాన్ ॥

అను పద్యమునుబట్టి ధృతరాష్ట్రునిదే యనినిర్ణయింపవలెను. కనుక సంస్కృత భారతమున మాత్రము ధృతరాష్ట్రుడు అంధుడగుటచే రాజ్యార్హత లేదనియు, విదురుడు దాసీపుత్రు డగుటచే నాతడును రాజ్యార్హుడు కాడనియు నిర్ణయమైనది. కనుక పాండురాజే రాజని నిశ్చయమైనది.

శ్లో॥ ధృతరాష్ట్ర స్త్వచక్షుష్ట్వా ద్రాజ్యం న ప్రత్యపద్యత
పౌరవత్వా ద్విదురో రాజా పాండు ర్బభూవహి ॥

ఏవార్థముగల హ అను నవ్యయముతో వ్యాసర్షి పాండురాజే ఆ కులమున రాజని నిర్ధారణ చేసెను. మనుస్మృతిలో చిన్నవాని కుమారుల కన్న పెద్దవాని కుమారులు సమర్థులైనచో రాజ్యార్హత నను నిర్ణయించినది.

ఇక కౌరవ పాండవులలో సమర్థు లెవరను ప్రశ్న యుద్ధమునందే తేల్చ వలసి యున్నది. అదియునుగాక కృష్ణరాయబార సందర్భమున గాంధారి-

శ్లో॥ రాజ్యంతు పాండోరిదమప్రధృష్యం: తస్యాద్యపుత్రాః ప్రభవంతినాన్యే
న్యాయాగతం రాజ్యమిదం చ కృత్స్నం యుధిష్ఠిరశ్శాస్తువై ధర్మపుత్రః॥

అని పాండురాజు కొడుకు యుధిష్ఠిరుడే రాజు కావలయునని పల్కినది దీనినిబట్టి యుధిష్ఠిరుడే రాజు అగునని భావము. ఆమెయే అరణ్యపర్వమున కౌరవులది అధర్మద్యూతమని పల్కినది. పాండురాజు యమలోకమున సభాసారుడుగ నున్నాడనియు ధర్మరాజుతో రాజసూయము చేయుమని చెప్పవలసినదిగా తన్ను బంపెననియు - అట్లయిన దాను మహేంద్రసభకేగెదనని, నారదు డీవిషయము ధర్మరాజుతో చెప్పగా నాలోచించి అజాతశత్రుడు కృష్ణసహాయముతో దానిని నిర్వర్తించి తన తండ్రి నింద్రలోకమున ఇంద్రునితో సమానముగ నుండబంచెను. ధీరశాంతో యుధిష్ఠిర ఏకఏవ—అని ధర్మరాజు ధీరశాంతుడైన నాయకుడుగా నలంకార శాస్త్రములు నొక్కి వక్కాణించుచున్నవి. రామాదులు ధీరోదాత్త నాయకులు. భీమ లక్ష్మణులు ధీరోద్ధత నాయకులు. కృష్ణుడు మొదలైన వారు ధీరలలితులైన నాయకులు. తక్కిన మూడువిధములైన నాయకులింక ననేకు లున్నను మొత్తముమీద అలంకారశాస్త్రములు ధర్మరాజువంటి ధీరశాంతనాయకుడు మఱొకడు లేడని చెప్పుచున్నవి. ధర్మరాజు ధర్మవర్తనుడేగాక యుధిష్ఠిరుడు. ఇతడు జూదమున ఎనిమిది పందెములలో సర్వస్వము నోడిపోయెను. తరువాత నింకను ధనకనక వస్తువాహనాదులను, తమ్ములను, ఎట్టకేలకు భార్యనుగూడ నొడ్డి ఓడిపోయెను. మహాలక్ష్మివంటి ద్రౌపదిని దక్కించుకొనలేక పోయితినని ధర్మపాశబద్ధుడనై జూదమున పణముగా పెట్టుచుంటినని ధర్మజుడు చివరకు విసువుతో పాచికలను పారవైచెను.

ఆ ధర్మరాజు ఏ ధర్మపాశమునకు బద్ధుడై భార్యనొడ్డెనో అది భీష్మాదుల బుద్ధుల కందలేదు. ద్రౌపదిని సభకు దెచ్చుటకు ప్రాతిగామిని

పంపగా నామె ఎవరెట్లు ఓడిరని ప్రశ్నించినది అంతియగాక నీకుదెలియనిచో సభికుల నా విషయము అడిగిరమ్మని వెనుకకు పంపినది ఇంతలో ధర్మరాజు చక్కని తంత్రము నొకదానిని పన్నెను. క్రొవ్వియున్నవారు దుష్టులు చాటున పరాభవించిన లోకవాద మనేకవిధముల పర్వగలదని దుశ్శాసనాదులు వచ్చులోపల ద్రౌపది రజస్వలా వేషధారిణియై వచ్చి అత్తమామల మధ్య సభలో నిలువబడియుండునట్లు చాటుగా కబురంపెను. ఆమె యట్లే ఏకవస్త్రయై వచ్చినిల్చినదేగాని వాస్తవమునకు ద్రౌపది రజస్వల కాదు.ఏలన ద్రౌపదివంటి రాజకన్య రజస్వల అయియున్నచో సభామధ్యమునకు వచ్చుట సాధారణమైన విషయముగాదు. వాస్తవమునకు రజస్వలయగు స్త్రీ చిన్నచెంబుతో నీరు త్రాగరాదు. పుడకతో పండ్లు తోమరాదు. పర్ణమునందు నీరు త్రాగకూడదు. పురుషదర్శనము చేయరాదు. ఇట్టి వ్రతముతోనుండి స్నానముతర్వాత మొదట భర్తనుచూచినపిమ్మట ఇతరులను చూడనగును. ఇట్లున్నవారికి భర్తవంటి కుమారుడు పుట్టగలడు కాని యితరులనుజూచిన అట్టివారే పుట్టుట శాస్త్రవిహితము. ద్రౌపది సభలో నెన్నియో ప్రశ్నలువేసినది. కాని పాండవ వనవాసము, యుద్ధము జరుగక తప్పలేదు. కురుక్షేత్ర సంగ్రామము రాక తప్పదను విషయము ముందేనిర్ణయింపబడినది. ధర్మరాజు రాజసూయము పూర్తియైనపిదప పదమూడవరోజు వ్యాసభగవానుడువచ్చి ధర్మరాజుతో నీ వన్నివిధముల ఉత్తముడవైనను నీకు బంధువిరోధమను ప్రారబ్ధము కలదు. శివునితోనీ విషయము ముచ్చటింప కైలాసమున కేగుచుంటినని వెళ్ళిపోయెను. ఆనాడు రాత్రి శివుడు మిక్కిలి కృద్ధుడై ధర్మరాజుకు కలలోకన్పించిపదమూడేండ్లు గడచిన పిమ్మట, పదునాలుగవయేడు నీ నిమిత్తముగ ప్రజాక్షయము చేయుదునని పల్కెను.

కావున ప్రజాక్షయ మను విషయ మేనాడో నిర్ణయింపబడినది. అంతియగాక తన నిమిత్తత్వము తీసివేయమని ధర్మజుడడుగగా శివుడు

ఈ ప్రజాక్షయమను విషయ మెప్పుడో వ్యాసకృషులచే నీ నిమిత్తముగా నిశ్చయింపబడినది. ఇప్పుడు నేనెట్లు తీసివేయుదునని సూచించెను. ద్రౌపది వివాహానంతరము ద్రుపదునియింట పాండవు లొక సంవత్సరముండిరి. వారితో కృష్ణుడుకూడ నుండెను. ఈ సంగతి ధృతరాష్ట్రునకు తెలిసినది. ఇపుడే పాండవులమీద నెత్తిపోయి బలములేని సమయమున చంపవలెనని కర్ణుడన, భీష్మాదులు పాండవులను హింసించవద్దని సలహా చెప్పి, వారిని పిలిపించుమని సూచించిరి. అది దుర్యోధనుడు కూడ తాను రాజ్యము చేయుచు వారికి ఊరక సువారులో భోజనముమాత్రము పెట్టనెంచి వారి రాహించుట కొప్పుకొనెను. అట్లేయని విదురునిపంపి వారిని పిలిపించిరి. విదురునిమీద భారముతో ద్రుపదుడు తన యల్లుండ్రను, కూతును పంపు టకు నిశ్చయించెను. అట్లు బయలుదేరి పాండవులు వపోధతో తల్లితో హస్తిపురికేగునపుడు మొదటినుండి కౌరవుల దురాగతము నెఱింగిన శ్రీకృష్ణుడు మాత్రము శంకించి ధృష్టద్యుమ్నుని పిలిచి, పాంచాలసైన్య మొక అక్షౌహిణినిగొని వారికి బాసటగా పొమ్మని, తానుకూడ నొక అక్షౌహిణి యాదవసైన్యమునుగొని వెంటబోయెను. వీరిరాకనుచూచిన దుర్యోధనుడు సింహాసనమునుండి దిగరాదనుకొని భావించియు, కృష్ణపరమాత్మను తక్కుంగల పాండవులను జూడగనే వెంటనే దిగిపోయెను.

అపుడు శ్రీకృష్ణుడు ధర్మరాజును సింహాసనముపై ఆసీనుడవు కమ్మని సన్నచేసెను. ధర్మరాజు కూర్చుండగనే కృష్ణుడు, ధృష్టద్యుమ్నుడు వేత్రహస్తులై బరాబరులు చేయుచుండిరి. ఈవిధముగ ధర్మరాజు ఐదేళ్ళ రాజ్యపాలన అత్యంత వైభవముగ సాగించెను. పిమ్మటనొకనాడు భీష్మాదులు తమ్ముకనాశ్రయించి అడుగుధృతరాష్ట్రుని రాజ్యవిషయమై ధర్మరాజును అడుగుమని ప్రబోధించిరి. అట్లేయని ధృతరాష్ట్రు డడుగగ ధర్మరాజు పెత్తండ్రితో నీ యిష్టమువచ్చినంత తీసికొని మిగిలినది నాకు ఇవ్వ

మని సమాధానము చెప్పెను. ఈ మాట అనగనె ధృతరాష్ట్రునకు ప్రాణము మరల వచ్చినట్లైనది. దిమ్మరపోయి మరల తెలివి తెచ్చుకొని ధృతరాష్ట్రుడు తనకు హస్తినాపురమిమ్మనీ, రాజ్యము రెండుభాగములు చేసితినని, అర్ధరాజ్యము నాకిచ్చి అర్ధరాజ్యములో మీరుపోయి తెలివిగలవారు గాన నింకొకచోట రాజధాని నమర్చుకొనుమని పంపెను. అప్పుడు ధర్మరాజు తమ్ములతో, ధృష్టద్యుమ్నునితో, శ్రీకృష్ణునితో అర్ధరాజ్య పరివారముతో ఖాండవప్రస్థమునకు పోయి అచట నగర నిర్మాణమునకు పూనుకొనెను. శ్రీకృష్ణ వ్యాసులు వాస్తుశాస్త్రము నిర్ణయింపగా ఆదను గుణముగా నగరనిర్మాణము జరిగినది. విశ్వకర్మవచ్చి ఈ లోకమున ఇంద్రప్రస్థమును నిర్మించెను. ఇందొక చిత్రము గమనింపవలసియున్నది.

ఈ నగర నిర్మాణమునకు వ్యాసకృష్ణులు కొలతకు దారమును బట్టుకొనిరి. ఆ కొలత ప్రకారము కట్టినచో తప్పక యజమానికి యుద్ధము సంభవించునని విశ్వకర్మ నొక్కి వక్కాణించెను. అపుడు వ్యాసకృష్ణులు యుద్ధము వచ్చుట సరేకాని, జయమెవరిది? అని ప్రశ్నించిరి. అందులకు విశ్వకర్మ జయము ఈ నగరనాయకునికే అని నిర్ణయించెను. అట్లయినచో శీఘ్రముగ నగరనిర్మాణము ప్రారంభింపుము. యుద్ధములులేకుండ చేతులు ముడుచుకొని కూర్చున్న కీర్తి వైభవము లెట్లు వచ్చును? అని విశ్వకర్మకు ఆదేశించి తన్నిర్మాణము పూర్తిగావించిరి. అట్లు నిర్మించి ఇంద్రప్రస్థమున నుండి పాండవులు ఇరువది నాలుగు సంవత్సరములు మహాకీర్తితో మహా వైభవముతో దేవతలకన్న మిన్నయగు సౌఖ్యము లనుభవించిరి. ఈ రాజ్యవిభాగము రాబోవు యుద్ధమునకై శ్రీకృష్ణుడొప్పినది. పిమ్మట రాజసూయము తర్వాత ధర్మరాజు కలలో శివుడు చెప్పుట అంత ధర్మజుడు తమ్ములతో నాలోచించి తన మూలముగ ప్రజాక్షయమగునని శివుడు చెప్పెను. గనుక అరణ్యమునకు పోయెదనని పల్కగా, అర్జునుడు పోవుట కంగీకరింపక, అన్నను రాజ్యపాలన చేయవలసినదిగ ప్రార్థించెను.

అంతియగాక శాంతముగ, ధర్మవర్తనుడై రాజ్యమనుభవించునట్లు తమ్ము లందఱు ప్రార్థించిరి. అపుడే ధర్మరాజు తమ్ములతో పదమూడు విధము లైన ఒడంబడికలు చేసికొనెను. అవి యేవనగా పదునాల్గు సంవత్సరములు పర్యంతము ఎవ్వరేమి చెప్పినను తానుచేసెదననియు, మానాభిమానములు వదలి వర్తింతుననియు అనగా భార్యను సభలో అవమానించినను మిన్న కుందుననియు మొదలగు ప్రతిజ్ఞలు చేసెను. అప్పుడే తమ్ములందఱు ధర్మరాజు అడుగుజాడలలో పదునాలుగేండ్లు నడచుటకు ప్రతినచేసిరి.

ఇట్టి ప్రతినలన్నియు జరిగిన తర్వాతనే పాండవులు జూదమున ఓడిపోవుట జరిగినది. ధర్మరాజు తాను ఓడిపోవుట గూడ ధర్మపాశ బద్ధుడనై యని చెప్పి మిన్నకుండెను. సభలో న్యాయా న్యాయములు ధర్మరాజే చెప్పవలయునని భీష్మదంతటివాడు పల్కెను. అంతియగాదు ధర్మరాజు శాంతికి ముగ్ధుడై పరశురాముడు అరణ్యపర్వమునకై వారము చేసెను. భీముడు, ధర్మరాజు జూదమాడి ఓడినందకు ఆతని చేతులు తగులబెట్టెదనని పల్కగా అర్జునుడు తాము చేసిన ప్రతినలగూర్చి నివ రించి, ఆతని కోపమునుండి విరమింప చేసెను. ఇట్టియెడ గూడ ధర్మ రాజు చలింపక మిన్నకుండుట జూడ నాతని శాంతగుణ మెట్టిదియో వ్యక్తమగుచున్నది.

17

శ్లో॥ నారాయణం నమస్కృత్యం నరంచైవ నరోత్తమం।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ॥

అను ప్రార్థనతో భారతపఠనము ప్రారంభింపవలయును. క్రిందటి ప్రకరణమున ద్రౌపది రజస్వలా వేషముతో సభకు వచ్చినదని భారతకథను చెప్పియుంటిని. అట్లు వచ్చిన ద్రౌపది వలువలూడ్చుమని దుర్యోధనుడు ప్రాతిగామిని పురికొల్పెను. గాని ప్రాతిగామి సందేహించుచుండగా దుశ్శాసనుడు ఆపనిని నిర్వర్తింప నాయెను. అట్టియెడ ధర్మరాజు సత్యమునకు బద్ధుడై మిన్నకుండెను. పరశురాముని యంతటివాడు వచ్చుటయే మాను కొనినాడు. కురువృద్ధులందఱు లోలోన కుందిరేగాని పైకి మాటాడక ఘోరకృత్యమును గాంచుచుండిరి. అయ్యెడ ద్రౌపది మాత్రము తన అభిమాన సంరక్షణకై శ్రీకృష్ణపరమాత్మను హా! నాథ! హా రమానాథ! వ్రజనాథార్తినాశన! కౌరవార్ణవమగ్నాం మా ఉద్ధరస్వ జనార్దన అని ప్రార్థించినది. కాని ద్రౌపది ప్రార్థించిన సమయమున కృష్ణుడు సౌంభకాసురునితో పోరుచుండెను. ఆ యుద్ధమున నా రాక్షసుడు మాయా వసుదేవుని సృష్టించి కృష్ణుడు చూచుచుండగ అతని తండ్రిని సంహరించు చున్నట్లు నటించెను. మరియు కృష్ణుని చేతనయినచో తండ్రిని రక్షించు కొనుమని సవాలుకూడ చేసెను. అంతియగాక ఆ మాయా వసుదేవుడు చేతకాని కొడుకును కంటిననియు విలపించు చుండెను. అపుడా సౌంభకాసురుడు మాయావసుదేవుని రక్తము చిందునట్లు కత్తివ్రేటు వేసెను ఆ రక్తముచూచి భగవంతుడగు కృష్ణునకు మానుషభావము వచ్చి

మూర్ఛ నొందుచుండెను. ఆ సమయమున ద్రౌపది మొరవిని, మూర్ఛ పోకుండనే ప్రపంచమున ఆపన్నులెవరని తాను దివ్యదృష్టితో పరికించెను మరియు ప్రస్తుతమగు ద్రౌపది వస్త్రములు అక్షయమగునట్లు వరమిచ్చెను. ఉగ్రసేనుని సభలో చెక్కుచెదరకున్న తన తండ్రిని జూచి రక్కసు జంపెను. అంత దుశ్శాసనుడు వలువలూడ్వజాలక అలసి యూరకుండెను.

పాండవుల కపుడు కొంచెము ప్రాణము వచ్చినట్లు అయినది. ధృతరాష్ట్రి గాంధారులు మాటాడక మిన్నకుండిరి, అయ్యవసరమున అంతఃపురదాసీలు వచ్చి దుర్యోధనుని శయ్యాగారము తగులబడుట, అంతఃపురమున నక్కలు కూయుట మొదలుగాగల దుర్నిమిత్తముల నెల్ల నెఱింగించిరి. అందులకు ధర్మాత్ములగు పాండవులకు పతివ్రతయగు ద్రౌపదికి పరాభవముచేయుటవలన నేమి యగునోయని ధృతరాష్ట్రుడు భయభ్రాంతుడై కోడలిని దగ్గరకు పిలిచి-నీవు మహాసాధ్వివి. నీకు జరిగిన పరాభవమునకు మమ్ము క్షమించుము. మరియు నేదేని వరము కోరుకొనుము - అని చెప్పెను ద్రౌపది అందుల కియ్యకొని మొదటి వరముగా ధర్మరాజు వారికి దాసుడు కాకుండ శస్త్రాస్త్రములతో సర్వ తంత్ర స్వతంత్రుడై యుండునట్లు కోరినది అందులకు కారణము ధర్మ రాజును దాసత్వమునుండి విముక్తి నొందించుటకు మరియు ధర్మరాజు యొక్క కుమారుని ప్రతివింధ్యుని యువరాజని ప్రజలనుటచే జీతగాని కొడుకు అని ప్రజలనకుండుటకు అట్టి వరము కోరితి ననెను. యాదవ పాంచాలాదులు యువరాజని వాని గౌరవించు భాగ్యమంతరింపకుండుటకు అట్లుకోరినది. ఇక రెండవవరము కోరుకొమ్మనెను. దానికి ద్రౌపది పాండవులందఱు స్వేచ్ఛాచారులై వారి వారిఆయుధములతో కౌరవులకు దాసులు కాకుండ అందరారుట. పిమ్మట నాతడు మూడవవరము కోరు కొమ్మనెను కాని ద్రౌపది రాజకాంత మూడవది కోరరాదని మిన్నకుండి నది. ద్రౌపదియొక్క ధర్మప్రవర్తనకు మిక్కిలి చకితుడై ధృతరాష్ట్రి

ట్లడిగెను ఒకే వరముగా అడుగవలసిన విషయమును రెండుగ అడిగి తివే గాని మూడవ వరము అడుగని దానవు రెండు వరములలో రాజ్య విషయ మెత్తవైతి వేల? అని ద్రౌపది నడిగెను అందులకామె సమాధాన ముగ - పాండవాశ్శస్త్రసంపన్నాస్స్వాని భాగ్యాని భుంజతే - అని పాండ వులు వారి బలపరాక్రమములలో స్వతంత్రముగా నున్న వారి భాగ్యముల ననుభవించగలరని. ఆడుది సంపాదించి పెట్టు రాజ్యమేలువారు కారని ధీరస్వాంతయై పల్కినది. అపుడు ధర్మరాజు లేచి ధృతరాష్ట్రునకు నమ స్కరించి - అన్నిటికి నీవే పెద్దవాడవున్నావు. మమ్మిక నేమి సేయుమని యెదవని ప్రశ్నించెను. అందులకు ధృతరాష్ట్రుడు కొడుకుల తప్పులు క్షమించుమనియు,కొడుకులను కనిపెట్టి చూడుమనీ అర్థించెను. పాండవు లను ఇంద్రప్రస్థమున నుండి మీ రాజ్యము మీరు చేసికొనుడని చెప్పెను. దానికి సమ్మతించి తమ రాజ్యముతో తాము పాండవులు ఇంద్ర ప్రస్థమున కరిగిరి. ధృతరాష్ట్రుడు చేసిన ఈ పనికి దుర్యోధనుడు తండ్రిని అనేక విధముల నిందించి మరల వారిని జూదమునకు పిలుపించుమని ప్రేరే పించెను.

ఈసారి రాజ్యసంబంధము లేకుండ, ఓడినవారు పన్నెండేండ్లు అరణ్యవాసము, ఒకయేడజ్ఞాతవాసము చేయునట్లు నిర్ణయించుకొనిరి ఈ విధముగనైన దుర్యోధనుడు కొంతకాలము రాజ్యమనుభవించవచ్చు నని అభిప్రాయపడెను. మరల జూదమునందు శకుని కనుకట్టు విద్యచే కౌర వులే గెల్చిరి. పాండవులే ఓటమినొంది అడవుల పాలైరి. ధర్మజుడు వారికి సంబంధములేని రాజ్యము వారికియుంచి తానరణ్యమున కేగెను. పాండవులు అరణ్యమునకు పోవునపుడు వారితో లక్షయేబదివేల బ్రాహ్మ ణులు, ఇరువదినాల్గువేల రథములు, ఐదువందల మంది దాసీలు కూడ వెళ్ళిరి. మరియు పరాభవమప్పుడు సభలో కర్ణుడు ద్రౌపదిని—

కం. శ్రీరిచట మగలు నీకును
పేరలు జూదమున నోడి విడిచిరి నిన్నున్
వారిదలోచన! నీపై
కూరిమిగల మగని వెదకికొను మొనుచనడే !!

ఇట్లు ఆక్షేపించెను దానికి దుర్యోధనుడు తనతొడ జూపెను. భీము డీ మాటవిని యుద్ధమున దుర్యోధనుని – చండగదాభిఘాత భగ్నో రుతరోరుజేయుదునని – పల్కెను ఈ ప్రతిజ్ఞను అందఱు వినియు మిన్నకుండిరి. ఉగ్రరణాంతరమున గదతో తొడగొట్టుట ధర్మము కాదని ఎవరైనా అనిరా ? మరియు దుశ్శాసనుని రక్తము త్రావెదననియు పల్కెను. ధర్మజాదులు అరణ్యవాసమునకు పోవునప్పు డొక్కరు ఒక్కొక్క విధముగ పోయిరి. ధర్మజుడు ధర్మాత్ముడు గనుక దీనమగు తనమొగము చూచినవారు నష్టులగుదురేమో యని ముఖము వస్త్రముచే కప్పుకొని పోయెను.

భీముడు కౌరవుల యుద్ధమున చంపెదనన్నట్లు భుజబలము ప్రదర్శించుచు పోయెను. అర్జునుడు యుద్ధమున బాణవర్షము నింతకన్న తఱచుగా కురిపి చెదనన్నట్లు ఇసుక చల్లుకొనుచు పోయెను. నకులుడు అందగాడగుటచే తననెవ్వరు చూడరాదని దుమ్ము పూసికొని పోయెను. ఇట్లే సహదేవుడు తలవంచుకొని పోయెను. ద్రౌపది జుట్టు విరియబోసికొని కౌరవకాంతలును ఇట్లు పోవలయునని సూచించుచు నేడ్చుచు పోయెను. ధౌమ్యుడు రౌద్రయామ్యసామగానము చేయుచుపోయెను. అది పదుమూడు సంవత్సరముల తర్వాత ఈ మంత్రముల దుర్యోధనాదుల కర్మాంతరములకు ఉపయోగింతునని భావము ఇట్లు పాండవులందఱు అరణ్యవాసమునకు పోవుచు భావికార్యమును సూచించుచు పోయిరి. కృష్ణుడు కూడ పాండవులు అడవులకు పోయినగాని తన పనిగాదని యూరకుండెను

ఏలన పాండవులు అరణ్యవాసము చేయుచు అయుధ సంపాదనము చేయ వలసియున్నది అని కృష్ణుని యెత్తుగడ. కావున రామాయణము నందలి రామునివలె పాండవులును పదునాలుగేండ్లు అరణ్యమున పాలై ఆయుధ ముల నార్జించిరి. పాండవులకు తీర్థయాత్రలు చేయించుమని ఇంద్రుడు లోమశునికూడ పంపెను పాండవులు లోమశుని సాయమున తీర్థయాత్రలు చేయుచుండగా అంతర్వేది దగ్గర సముద్రమున నొక వేదిక కన్పించినది. లోమశుడా వేదికను జూచి ధర్మరాజును దానిపై కూర్చుండుమని నిర్దేశించెను. అట్లే యని ధర్మరాజు దానిపై అధిష్ఠింపగనే సమాధిగతుడై వాలఖిల్యాదుల వేదగానమును వినుచుండెను. ఈ సంగతి లోమశునకు తెలియజేయగా అతడెంతయో ధర్మజుని కొనియాడెను. కారణము అది ధర్మవేదిక. ఇతరు లెవ్వరెక్కినను అది నీట మునిగిపోవును.

రాజసూయసందర్భమున ధర్మజునకు తమ్ములందఱును దిక్కులజయించి ధనకనకవస్తువాహనాదుల తెచ్చి అర్పించిరి. వీరిలో సహదేవుడనువాడు దక్షిణ దిగ్విజయమునకై పోయెను. అచట నీలుడను రాజుతో భండన మొనర్చుచుండెను. అయ్యెడ సహదేవసైన్యము అగ్నికాహుతి కాబోయినది. అపుడు సహదేవుడు అగ్నిసూక్తము జపించి అగ్నిదేవుని శాంతింపచేసెను. అట్టియెడ అగ్నిదేవుడు నీలునితో సహదేవుని సైన్యమును దహింపజాలనని చెప్పగా నీలుడు చేయునదిలేక సహదేవునితో రాజీకుదుర్చుకొనెను. ఇట్లే పైంప ద్వీపిదుల గెల్చి సహదేవుడు ధనరాసుల దెచ్చి అర్పించెను మరియు సముద్రపుటొడ్డుచేరి లంకకు ఘటోత్కచుని ద్వారమున తనసంగతి చెప్పిపంపెను ఈ సంగతి వినగనె విభీషణుడు ఐదువందలమంది జనముతో బంగారము, రత్నరాసులను కానుకగా పంపెను. ఇట్లే నకులుడు హూణాదులచే పన్నుకట్టించెను. అర్జునుడు గంధర్వులచే పన్నుకట్టించెను. ఈ విధముగ రాజులందఱును ధర్మజునకు వశమైరి. రాజసూయము దిగ్విజయముగ నెరవేరనున్నది. కాని జరా

సంధుడు అను చక్రవర్తిని గెల్చినగాని రాజసూయము చేయుటకు వీలు లేకున్నది. జరాసంధుడు అజేయపరాక్రముడు. వానికి హంసడిభకులు సేనాపతులు. ఆయుధములతో చావని వరముకలవారు. ఇట్టి హంసడిభకు లకు తమ తండ్రిచే రాజసూయము చేయించవలయునని కోరికపుట్టినది. వారు తమచక్రవర్తియగు జరాసంధుని రాజసూయమునకు ఒప్పించిరేకాని వారికి కృష్ణునిగూర్చి సందేహము వచ్చినది. అందులకు వారు వెనుకాడక జనార్దనుడను బ్రాహ్మణుని పిలిచి కృష్ణుని రాజసూయమునకు రమ్మని, వచ్చునపుడు కొంత యుప్పు తెమ్మని చెప్పిపంపిరి. జనార్దనుడు భక్తుడగు టచే అందులకు లోలోన కుంది చేయునదిలేక పోయి చెప్పెను. ఆ మాట లకు కృష్ణుడు ఆగ్రహోదగ్రుడై సాత్యకితో తాము తలపెట్టిన రాజసూ యము గూర్చి చెప్పుమనియు కాబట్టి తాను రానని యు కబురుపంపెను.

ఇక సాత్యకి పోయి వారితో మిమ్ముచంపి కృష్ణుడు రాజసూయము చేయనున్నాడని పల్కగనే వారు తమ ఉప్పుసంగతి నడిగిరి. అందుల కాతడు సమాధానముగ....యాదవు లుప్పుమోసిన మురారికి సోలలుమోయ కింక పోవచ్చునె—అని పరిహసించి యుద్ధములో మీ యొడళులకైన గాయముల పూడ్చుటకుగా యాదవులు నూరినఉప్పు తెచ్చెదరని కోపముగ బల్కెను. అందులకు వారు కృద్ధులై సాత్యకిని పట్టుకొనబోగా తప్పించు కొని పోయి కృష్ణున కున్నసంగతి నెఱింగించెను. పిమ్మట జరాసంధునకు కృష్ణాదులకు యుద్ధము జరిగినది. హంసడిభకులు ఆయుధములతో చావని వారగుటచే వారి చావునకు కృష్ణుడొక యెత్తుగడ నెత్తెను. డిభకుని దగ్గ రకు వారి స్నేహితునొకని పంపి హంసుడు యుద్ధమున చచ్చినట్టు వార్త పెట్టెను. ఆ మాట విని డిభకుడు చనిపోయెను. వానిని సముద్రమున బడ ద్రోచి, సముద్రమున బడిచచ్చెనని హంసునకు వార్త చెప్పగా వాడును అందుబడి మరణించెను. ఇట్లు కృష్ణుడు తన మాయోపాయముచే హంస డిభకుల ముందు పరిమార్చెను. ఇక మిగిలినది జరాసంధుడు. శ్రీకృష్ణుడు

భీమార్జునులను తీసికొని బ్రాహ్మణవేషధారులై జరాసంధుని నగరమున ప్రవేశించి రాజప్రాసాదమున దొడ్డిదారిగుండ ప్రవేశించిరి. జరాసంధుడు వారు అతిధులని భావించి అర్ఘ్యపాద్యాదు లొసంగి సత్కరించెను. పిమ్మట వారు శత్రువులని భావించి, భీమునితో మల్లయుద్ధమునకు కడంగి వానిచే నిహతుడయ్యెను. ఆ ఉపాయముననే జరాసంధుడు తన కుమారుడగు సహదేవునికి పట్టము కట్టియుండెను. కనుక కృష్ణుడు నీ తండ్రి చేసిన పట్టాభిషేకము చెల్లదని భీమార్జునుల గలుపుకొనివాని నభిషేకించెను. అంతనాతడు కృష్ణభీమార్జునులకు వస్నుకట్టి స్వాధీనమయ్యెను. ఇపుడు ధర్మరాజు యొక్క రాజసూయమునకు అడ్డువచ్చు వారెవ్వరు లేరు. నిర్విఘ్నముగ సాగిపోయినది.

కుంతి సంతానప్రాప్తి చూచిన ఆమె పతివ్రతయేనా ? అను ప్రశ్నము కొందఱకు పొడముచుండును. సామాన్యముగ నేస్త్రీకైనను సంతానము లేకున్నచో దేవరన్యాయముతో సంతానము మనుపటికాలమున పొందవచ్చును. అట్లు స్త్రీ ధర్మసంతానము పొందగోరినప్పుడు విరూపముతో పురుషుని పొందవలయును. మరియు నా పురుషుడు ఒక్కసారి మాత్రమే స్త్రీయందు వీర్యమునుంచిన మాత్రమున సంతానమిచ్చు శక్తిగలవాడుగ నుండవలెను. కాని మాటిమాటికి సంతానము కలిగినదాక వారికి సంసార బంధము ఉండరాదు. కలియుగమున నిట్టి సంప్రదాయములు, శక్తులు, తగ్గిపోయినవి. కాబట్టి సంతానహీనులు దత్తత చేసికొన వలయును. అని శాస్త్రములు విధించుచున్నవి. అస్యాం జాయేత పుత్ర పుత్రస్సమే పుత్రో భవిష్యతి - అని కన్యాదాన సమయమున మంత్రమువఠించినచో పుత్రికా పుత్రుడు వంశకర్త కాగలడు. అట్లుకాకున్న ఆ బిడ్డ దౌహిత్రుడే యగును. ప్రస్తుతము పాండురాజునకు క్షేత్రజ సంతానము కావలసియున్నది. ఏలయన ఆడవియందు పాండురాజు వేటాడుచుండగ ముని దంపతులు మృగములై విహరించుచుండిరి.

ఈ రహస్యమెఱుగని పాండురాజు బాణముతో కొట్టగా అందు మగ జింక చనిపోయినది. అంత ఆతని భార్యయగు ఆడుజింక – వేటన్యాయము తప్పి క్రీడించు మమ్ము బాణముతో కొట్టితివి గాన, నీవును భార్యనంటెనచో నీతల శతధా భిన్నమగునని – పాండురాజును శపించినది. ఈ కారణముచే నాతడు భార్యల తాకరాదు. ఇట్టి శాపోపహతుడైన పాండురాజు తిరిగి నివాసమునకు వచ్చి అందఱను ఇంటికి పొమ్మనియు, తాను తపస్సు చేసి కొనెదనని పల్కెను ఈ మాటలకు కుంతియు పాండురాజుతో తపస్సు చేసి తరించెదనని పల్కినది. మాద్రియు నమెతో పాటైనది ఇక తప్ప దని పాండురాజు తన భార్యలతో కలసి తపస్సు ప్రారంభించెను. రాజ్యము వాని పేరనే విదురాదులు నిర్వర్తించుచున్నారు. ఆతని తపస్సు గట్టిపడి – ఆకాశగమనమున బ్రహ్మలోకమునకు పోవుటకు సంతన కట్టునంతటి మహత్తు కలదియైయున్నది. ఒకప్పుడు బ్రహ్మలోకమునకేగు మునులతో ఇరువురు రాణులతో అట్లుపోవుచు శతశృంగ పర్వతమువరకు ప్రయాణముసాగించెను తదుపరి గమనశక్తి తగ్గుచున్నట్లు తోచెను. అందులకు కారణమేమని యడుగ అపుత్రకుడు బ్రహ్మలోకమునకు పోలేడని ఋషులు చెప్పిరి. అపుడు పాండురాజు చింతాక్రాంతుడు కాగా ఋషులు నీకు దివ్యానుగుక్షేత్రజసంతానము కలుగగలదు. దాని ప్రయత్నము చేసికొను మని వచించిరి. పాండురాజు భార్యతో నాలోచింప అయ్యెడ కుంతి పాండుని మరణానంతరము సన్నిహితుడవై తపశ్శక్తితో సంతానమిమ్మని కోరినది. కాని పాండురాజు సంతానమిప్పుడే కావలయునని కోరగ ఆమె తన చిన్నతనమున దుర్వాసుడిచ్చిన మంత్రప్రభావమునుగూర్చి చెప్పినది అపుడు పాండురాజు నాజ్ఞచే కుంతి ధర్మజ భీమార్జునుల ఇంద్రతేజుల యమవాయు ఇంద్రులవలన కనినది. నకుల సహదేవులు మాద్రి అశ్వినుల వలన కన్న అమరసంతానము.

ఇచట ముగ్గురకంటె నెక్కువగ కుంతి సంతానము కోరలేదు
ఏలయనదేవరన్యాయముతో సంతానమునొందు స్త్రీ ముగ్గురకంటె నెక్కువ
పొందినచో ఆ స్త్రీ పాతివ్రత్యము భంగమగునని వలదని పల్కినది. కాని
తన సవతియగు మాద్రికి సంతానములేకున్న బాగుండదని, మరియు నామె
పోరుపడజాలక ఆమెకును సంతాన మివ్వవలసి వచ్చినది. ఇయ్యెడ కుంతి
తంత్రము గమనింపవలసి యున్నది. ఆమెకు మంత్రోపదేశము చేసినచో
తనకంటె నెక్కువమంది పుత్రులను గనునేమో యని భావించినది.
అందుల కామె తానె మంత్రోచ్చారణము చేయుదుననియు, ఏదేని దేవతను
మనస్సున ధ్యానించుమనియు,మాద్రికి సలహా నిచ్చినది. ఆ మాద్రియు
కొంచెము తెలివికలది యగుటచే నొక్కసారి యిద్దరు దేవతల ధ్యానించి
నది. కాబట్టియే ఆమెకు నకుల సహదేవులు ఇద్దరు జన్మించిరి పిమ్మట
నొకనాడు మాద్రి సర్వాంగసుందరముగ నలంకరించుకొని యుండగా
నామెనుజూచిన పాండురాజు మన్మథపీడితుడై సంగతుడయ్యెను. మరు
క్షణముననే అతడు శాపవశమున మరణించెను. మాద్రియు తన కారణ
మున భర్త మరణించెనని సహగమనముచేసినది కుంతిమాత్రము ఋషులు.
పిల్లలపోషింపకుండ నీకది కూడదని నివారించుటచే జీవించి యుండినది.

18

పాండవులను సుహృద్ద్యూతమని పిలిచి దుర్ద్యూతమాడి కౌరవులు ఓడించి వెడలనడచిరి. పాండవు లరణ్యవాసమునకు పోవునపుడు చాల మంది బ్రాహ్మణులు వారిని వెంబడించిరి. ధర్మరాజు వారిని వలదన్నచో శాపమిచ్చెదమని పల్కగా భయపడి ధర్మజుడు మిన్నకుండెను. ఆ బ్రాహ్మణులందఱు తమ ఆహారమును తామె సంపాదించుకొని ధర్మజునకు జయము చేకూరునట్లు దీవించెదమని వెన్నంటివచ్చిరి. కాని ధర్మరాజు మాత్రము తన కారణముగ వచ్చిన బ్రాహ్మణుల కాహారమెట్లని చింతిల్లుచుండెను. వెళ్ళినరోజు ఉపవాసముండి గంగలో కంఠదఘ్నముగ నీట నిల్చి బ్రాహ్మణుల తిండికై బిట్టు విలపించెను. పిమ్మట ధౌమ్యుని సలహా ననుసరించి సూర్యోపాసనచేసి సూర్యానుగ్రహముచే అక్షయపాత్రను వరముగ నొందెను. ఆ పాత్రమూలమున ద్రౌపది అతిథులకు, అభ్యాగతులకు బ్రాహ్మణులకు, తన భర్తలకు, ఆహారమును సమర్పించి, తాను భుజించి పాత్రము పరిశుభ్రముచేసిన నిక నానాటికి అందు ఆహార ముత్పత్తి కాదు. దర్మరాజు ఇట్లు యజ్ఞయాగాదులచేయుచు నిరతాన్న దానశీలుడై పన్నెండేండ్లు కాలము గడపెను. రాక్షసు లెందరో మాయోపాయములతో పూర్వవైరముల సాధింపవలపడిరి. కాని పాండవులు దుష్టశిక్షణకే అవతరించుటచేసి రాక్షసుల చాలమందిని చంపుచుండిరి. ఇట్లు కొంతకాలము గడువగా శ్రీకృష్ణుడు, సాత్యకి, బలరాముడు వీరిని జూచుటకు వచ్చిరి. కృష్ణుడును పాండవుల శాంతగుణమును జూచి కౌరవులపై మిక్కిలి కోపించెను, ధర్మరాజు మాత్రము కౌరవులను జంపరాదని పల్కుచు వారి చేతులు పట్టుకొనెను. అంతియగాక పదమూడేండ్ల తర్వాత తామే యుద్ధమున కౌరవుల నిహతుల గావించెదమని పల్కెను. కాని ద్రౌపదికి జరిగిన

పరాభవము మాత్రము సహింపరానిదై సమస్త రాజలోకమునకు తల వంపులుగ నుండెను. దుష్ట చతుష్టయము బలమును జూచుకొని దుర్యోధనుడు కుడిచి కూర్చుండజాలక పాండవ పరాభవమునకు తలపెట్టెను.

కాని యిందులకు ప్రత్యక్షముగ ధృతరాష్ట్రి భీష్మాదులు ఒప్పుకొనరు కావున కర్ణశకునుల సాయముచే ఘోషయాత్ర నెపమున పాండవులున్న అరణ్యప్రాంతమున సమస్త పరివారముతో, భార్యాసహితుడై విలాసముగ దుర్యోధనుడు పోవ బయలుదేరెను. కాని ధృతరాష్ట్రుడు ఘోషయాత్రకే వలదని వారించెను. ఎట్టకేలకు అంగీకరించెను. పాండవుల పరిహాసించుటకు కౌరవులు వచ్చిరని తెలిసిన దేవేంద్రుడు చిత్రరథుడను గంధర్వరాజును బంపి దుర్యోధనుని బంధించి తెమ్మని పంపెను అంత నా గంధర్వరాజు దుర్యోధనుని సైన్యసహితముగ యుద్ధమున నోడించి, కర్ణుని రథము నిరుగగొట్టెను. తరువాత చిత్రరథుడు దుర్యోధనుని బంధుమిత్ర పరివార సమేతముగ ఖైదీలచేసి కట్టికొని పోవుచుండెను. ఇక చేయునదిలేక మిగిలిన సైన్యము ధర్మరాజును సమీపించి నీ యనుజ వ్రాతము గావవే కరుణ నిండారంగ రాజోత్తమా ! అని ప్రార్థించిరి. కాని భీముడు మాత్రము తమ శత్రువులైన కౌరవులకు పరాభవము జరుగుచున్నదని సంతసించి-కాగలపని గంధర్వులే తీర్చుచున్నారని గంభీరముగ పల్కెను. అంత ధర్మరాజు భీముని శాంతింపచేసి దుర్యోధనాదుల విడిపింప నాజ్ఞాపించెను. ధర్మరాజ ప్పుడు సద్యస్కందమను యజ్ఞము చేయుచుండుటవలన తాను పోవుటకు వీలులేదనియెను. ధర్మరాజు శాసనము ననుసరించి భీమార్జున నకుల సహదేవులు గంధర్వులతో పోరుటకై పోయిరి.

అర్జునుడు చిత్రరథుని దుర్యోధనాదుల విడువుమని కోరెను. కాని లాభము లేకపోవుటచే వారి దారిని బాణములచే నడ్డగించెను. అపుడు చిత్రరథుడు అర్జునునికి ఇంద్రుని పంపున తాము వచ్చుట నెఱింగించి

అర్జునుని యిష్టానుసారము దుర్యోధనుని ధర్మరాజుకడకు కొంపోయెను. అపుడు ధర్మరాజు వాని బంధముల తొలగించి పొమ్మని చెప్పెను. కాని దుర్యోధనుడు ధర్మరాజుచే రక్షింపబడినందులకు చింతిల్లి ప్రాయోపవేశమునకు పూనుకొన నిశ్చయించెను. ఇంతలో కర్ణుడు వచ్చి దుర్యోధనుడు గెలిచివచ్చెనని భావించి పొగడుచుండెను. అందులకు దుర్యోధను డింకను విచారగ్రస్తుడై యుద్ధమున తానుపొందిన పరాభవమును గూర్చి కర్ణునకు చెప్పుచు-కం॥ పుడమి వివరంబు లేదే ; అడగెద నన్నట్టిదయ్యె నప్పుడు కర్ణా ; అని విలపించెను. ప్రాయోపవేశ సమయమున కర్ణుడు, శకుని యెంతయో చెప్పి చూచిరి కాని లాభము లేకపోయినది. అప్పుడు పాతాళవాసులైన రాక్షసులు తమ అంశావతారుడైన దుర్యోధనుడు నశింపరాదని భావించి, ఒక హోమమును గావించిరి. అందు కృత్య యను రాక్షసి జన్మించి, దుర్యోధనుని పాతాళమునకు తెచ్చిపెట్టినది. అంత రాక్షసులు యుద్ధమున భీష్మాదులు రాక్షసావేశ పూరితులై పాండవుల నిహతుల గావించెదరనియు, తప్పక జయము చేకూరగలదనియు పల్కిరి. ఈ మాటలు వినిన దుర్యోధనుడు సంతసించి కర్ణుని ప్రతినకు ఉత్సాహ పూరితుడై ప్రాయోప వేశమును విరమించి గృహగమనోన్ముఖుడయ్యెను. కాని దుర్యోధనుని పరాభవము సంగతి ఉదయమే ఊరంతయు ప్రాకినది. మొట్టమొదట దుర్యోధనుడు రాజధానియందు అడుగుపెట్టగనే భీష్ముడు జరిగిన సంగతిని గూర్చి ప్రశ్నించెను. జరిగిన సంగతి నెరింగినవాడై పాండవుల మంచితనమును వేనోళ్ళ పొగడెను.

అరణ్యవాసము పదమూడునెలలు గడచిన పిమ్మట ద్రౌపది ఆవేశపూరితురాలై కౌరవులను జంపుమని భర్తల కోరినది. కాని ధర్మరాజు తేనెపూసిన కత్తివంటివాడు. కావుననే సమయభంగ మొనర్పరాదనియు, పదుమూడేండ్లకు పిమ్మటనే కౌరవుల యుద్ధమున చంపవలయుననియు చెప్పెను. మొత్తముమీద ధర్మరాజు అసత్యదోషమునకు పాల్పడలేదు. ద్రౌపది మాత్రము తాను చెప్పినమాట అసత్యదోషపూరితము కానేర

దనియు, ఒకసంవత్సరమునకు ఒకనెల ప్రతిప్రసవము చాలుననియుకాబట్టి సమంజసమే యని పల్కినది. ధర్మరాజు అపుడు కౌరవుల చంపుటకు నెలలక్కరలేదనియు, పదుమూడు ఘడియలే చాలుననియు ధీరముగ పల్కెను. అందులకు ద్రౌపది కాలవిలంబన మోర్వలేనిదై ఆవేశముతో దైవమును దూషించెను. అందులకు ధర్మరాజు దైవనింద చేసిన భార్యను లెక్కసేయక-మేము ధర్మమున నడచుచుండియు నిన్నిపాట్లేల పడవలసి వచ్చెనా ? అని ఎప్పుడు విమర్శించుచుండియు కారణము కనుగొన లేకపోయితిని. ఇప్పుడు విస్పష్టమైనది. ధర్మదూషణ, దైవదూషణము చేయు భార్యవు దొరుకుటవలన మా ధర్మమంతయు నిష్ఫలమై పోయినది అని యెత్తిపొడుపుగమాటాడెను. అపుడు ద్రౌపది భర్తచుట్టు ప్రదక్షిణించి క్షమాభిక్ష నర్థించినది. ధర్మరాజు ద్రౌపదిని పశ్చాత్తప్తవై పొరబాటున పల్కితినంటివి. అది యిదియే మొదటి తప్పిదమగుటచే క్షమించితిననెను. ఆ సమయమున వ్యాసుడు వచ్చి ధర్మరాజును బొగడి శైవయోగముతో పాశుపతాస్త్రము సంపాదింపుమని చెప్పిపోయెను. పిమ్మట ధర్మరాజు నాజ్ఞచే అర్జును డందులకు పూనుకొని తపస్సు నారంభించెను.

ఇట్లు అర్జునుడు సంసిద్ధుడగుట కొక కారణమున్నది. ధర్మరాజు రక్తము చూచువరకే శాంతచిత్తుడు కాని, రక్తము కంటబడినచో వీర విహారము చేయగలవాడు. కాని అర్జునుడు అస్త్రప్రయోగమునందు శాంత స్వభావము, విమర్శము కలవాడగుటచే అతడే ఆయుధ సంపాదనమున కర్హుడని వ్యాసుడు చెప్పిపోయెను. అర్జునుని తపస్సమయమున ఇంద్రుడు పరీక్షింపనెంచి అప్సరసల నంపెను వారి అల్లరికి అర్జునుడు అటు ఇటు కదలలేదు. అందులకు వారి అశక్తతను ఇంద్రునితో చెప్పగా ఇంద్రుడు అర్జునుని తపశ్శక్తికి మెచ్చి వచ్చి శైవయోగము చెప్పిపోయెను. శైవ యోగముతో శివోపాసన ప్రారంభమైనది. శివుని మాయవలన అర్జునుని అక్షయతూణీరములు, బాణములు వట్టిపోయినవి అపుడు అర్జునుడు గాండీవముతో శివుని నెత్తిపై మొత్తగా అదియు శివుడు మాయముచేసెను.

అప్పుడు అర్జునుడు శివునితో కలియబడి పిడికిలితో నెత్తిన మొత్తగా మెచ్చి శివుడు ప్రత్యక్షమయ్యెను. పాశుపతమిచ్చి, మంత్రోపదేశము చేసిపోయెను. ఇంద్రుడు అర్జునుని బలపరాక్రమమునకు మెచ్చి, ఆహ్వానించి అర్ధసింహాసనముపై కూర్చుండబెట్టుకొనెను. తనవద్దనున్న విశేషాయుధముల నిచ్చి పేల్పులందరిచేత సర్వాస్త్రము లిప్పించెను. అర్జునుడు దేవకలోకమునందున్నప్పుడే ఊర్వశి ఇంద్రునాజ్ఞతో అతనిపై కోరికతోవచ్చి నిరాశయై అర్జునుని నపుంసకుడవగుమని శపించినది. అందులకు ఇంద్రుడు ఆతనిని నీ ఇంద్రియజయము కీర్తనీయము తండ్రీ-అని పొగడి, ఈ శాపము అజ్ఞాతవాసము సంవత్సరము మాత్రము అనుభవించిన తీరునని శాపవిమోచనమును ప్రసాదించెను. మరియు దేవతలకోరికపై నివాతకవచులను కాలకేయులను రాక్షసులను విజయుడు సంహరించెను.

ఇట్లు దేవలోకమున ఐదురోజులుండి (భూమిపై ఐదేండ్లు) సంగీతాది విద్యలన్నియు విజయుడు గడించెను. తిరిగి వచ్చిన పిమ్మట ధర్మరాజు అస్త్రముల ప్రదర్శింపుమని యడుగ అర్జునుడు అన్నగారికి ప్రయోగోప సంహారములు జూప, నారదుడు అస్త్రప్రయోగము ఎదురు శాత్రవులు లేకుండ కూడదని చెప్పెను. ధర్మరాజునకు ఈలోపల శివునివలన శక్తిఆయుధము లభించినది. ఒకరోజున పాండవులు వేటకు పోగా ద్రౌపది యొంటరిగా నుండగ సైంధవుడామెను కామించెను. ద్రౌపది అందులకు గినిసి తన భర్తలు అగ్నులవంటివారనియు, చిక్కినచో దహింపగలరనియు బెదరించినది. కాని లాభము లేకపోవుటచే వానిచే బలత్కారముగ రథమెక్కింపబడక తానె రథమెక్కి కూర్చుండి వానిని అనేక విధముల నిందించనది. ఈ సమయముననే వేటకు వెళ్ళిన ధర్మరాజునకు అపశకునములు పొడగట్టుటచే తమ్ములందఱతో తిరిగివచ్చి ద్రౌపదికి జరిగిన పరాభవము తెలిసికొనెను. వెంటనే పాండవులు వానివెన్నంటి పర్విడుచు ద్రౌపది రథము వెంట కాపలాగా దుష్టుని నిందించుచు బోవుచున్న ధౌమ్యులను అపి సైంధవునితో తలపడిరి. అప్పుడు పాండవు

లకు వాని సామంతులతో సేనలతో మహాయుద్ధము జరిగినది. చాలమంది నశించిరి. అంత సైంధవుడు భయపడి ద్రౌపదిని దించి తాను రథముపై శరవేగమున బోవుచుండెను. ద్రౌపదిని గైకొని ధర్మజుడు నకులసహదేవులతో వెనుకకు తిరిగెను. కాని భీమార్జునులంతటితో తృప్తినొందక వాని వెంటనంటిరి. ధర్మరాజు వారితో దుస్సల తలచి వాని నొక్క తప్పునకు గావుడని నుడివెను. సైంధవుడు రథముదిగి పలాయనము చిత్తగించెను. కాని భీమార్జునులు వెన్నంటి వాని పట్టుకొని వచ్చిరి భీముని గ్రుద్దులకు వానికి పై ప్రాణములు పైనపోవుచుండెను అర్జును బోధతో వాని చంపుట చాలించి, తల చెక్కలెగయునట్లు గొరిగి, పాండవదాసుడనని చెప్పుకొనునట్లు ఒప్పించి తెచ్చి ధర్మజుని కాళ్ళపై బడవైచిరి. ధర్మరాజు వాని ఇంద్రియలోలతను, హీనతముడవని నిందించి దయదలచి విడిచిపుచ్చెను.

ఈ పరాభవమును భరింపజాలని సైంధవుడు పాండవులను యుద్ధమున చెలువవలయునని శక్తికై తపస్సు నారంభించెను అంత శివుడు ప్రత్యక్షమై ఒకనాటి యుద్ధమున అర్జునుని తప్ప నల్వురిని గెలువగలవని చెప్పెను. ఇట్లు అరణ్యవాసము పన్నెండు వత్సరములు పాండవులుతపము లాచరించి లోకమునగల ఆయుధములనెల్ల సంపాదించిరి. మునుపే పాండవు లజేయులు. ఈ అరణ్యవాసమున సంపాదించిన అస్త్రశస్త్రాదులతో లోకైకవీరులై నిర్భయముగ కౌరవుల నెదిరింపనుండిరి. ఇట్లు పన్నెండేండ్లు గడువనున్న చివరిదినముల బ్రాహ్మణుని అరణి నొక మృగము అపహరించుటచే తదన్వేషణకై వారు బయలుదేరిరి. మార్గమధ్యమున వారికి దప్పిక యగుటచే జలాశయము కొఱకై చెట్టునెక్కి చూచిరి. అల్లంత దూరమున జలాశయమొండు గన్పట్టుటచే తొలుత సహదేవుడు జలాహరణార్థము పోయెను. కాని అచట నున్న యక్షుని ప్రశ్నలకు సమాధాన మివ్వకుంటచే సహదేవుడు నీరుత్రావి మూర్ఛాగ్రస్తుడయ్యెను. ఇట్లే నకులభీమార్జునులు సమాధానము లివ్వక నీరుత్రాగి గాఢనిద్రలో

మునిగిపోయిరి. కాని అర్జునుడు మాత్రము యక్షప్రశ్నలు వచ్చు శబ్దమును బట్టి శబ్దవేది శరప్రయోగమును గావించెను. గాని లాభములేక తానును మూర్ఛనొందెను. ఎంతకు తమ్ములు రాకుండుట జూచి ధర్మరాజే అచటకి వచ్చెను తమ్ముల దుస్థితికి చింతిల్లెను. ధర్మరాజును కూడ అశరీరవాణి భీమాదులను వలె ప్రశ్నించెను.

అపుడు ధర్మజుడు అశరీరవాణికి నమస్కరించి ప్రత్యక్షమగుమని ప్రార్థించెను. ఆ యశరీరభూతము యక్షరూపమున నగపడి అడుగ యక్ష ప్రశ్నల కన్నింటికి సమాధానమిచ్చెను. అందులకు సంతసించి యక్షుడు పడియున్న తమ్ములలో నొక్కని బ్రదికించెదను. కోరుకొనుమని చెప్పగా ధర్మాత్ముడగు ధర్మరాజు నకులుని బ్రతికింపుమని ప్రార్థించెను. ఇప్పట్ల ధర్మజుని ధార్మికదృష్టి, వినయము స్పష్టమగుచున్నది. మాద్రీసుతుని కోరుట ధర్మరాజు కర్మతంత్రమునకే. కుంతి సంతానములో తానున్నాడు. కాబట్టి మాద్రిసంతతిలో నొక్కని బ్రదికింపగోరెను. దానివలన తన సవతి తల్లికి తృప్తియగునని ధర్మరాజు కనపరచిన ఈ దృష్టికి యక్షుడు మిక్కిలి సంతసిల్లి అందఱను బ్రదికించెను. అంత నా యక్షుడు తాను యముడనని చెప్పి తన రూపము జూపి ధర్మరాజు జ్ఞానమును వేనోళ్ళ పొగడెను. అంతియగాక పాండవులు అజ్ఞాతవాస సమయమున నెట్లున్నను నోటితో చెప్పినగాని ఎవ్వరిచే గుర్తింపబడనట్లు వరమిచ్చెను. మరియు బ్రాహ్మణుని అరణి గైకొనితెచ్చిన మృగము తానె యని చెప్పి తిరిగి యిచ్చిపోయెను. పిమ్మట పాండవులు వారము రోజులలో అరణ్యవాసము ముగించి, అజ్ఞాతవాసమున ప్రవేశించిరి. కాని వారు నాల్గురోజు లరణ్యమున గడుపునపుడు తెలిసియున్న కౌరవులకు చిక్కి యుండెడి వారని తోచుచున్నది. దైవవంచితుల నెవడుబోధింప గలడు ? అయ్యెడ పాండవులు బ్రాహ్మణులను తిరిగి పొమ్మని, ధౌమ్యద్రౌపదులతో రథములపై బయలుదేఱి విరాటనగరమునకు సమీపమున నాగి, రథములను ద్వారకకు

పంపి, దాసజనమును పాంచాలమునకు పంపిరి. ఇక ధౌమ్యునకు తమ అగ్నులనిచ్చి ఇష్టమువచ్చిన దెసకు పొమ్మనిరి. పిమ్మట పాండవులు మత్స్యదేశమునకు పోయిరి. పోవుటకు ముందే ఆయుధముల నన్నింటిని శవముతో బంధించి, అస్త్రదేవతలను ప్రార్థించి వృక్షముపై గట్టిరి. అంత ధర్మరాజు స్నానాదులు నిర్వర్తించి ప్రవాహమునుండియే ధర్మ దేవతను ప్రార్థించి వాని వరమున ఆతడు వెంటనే సన్న్యాసి అయ్యెను. ఇట్లే ధర్మదేవతావర్తములగు అజ్ఞాతవాసమునకు తగిన వేషములు వహించి విరాటనగరము చేరిరి. ఆనాడు విరాటరాజసభ బహిరంగముగ జరుగుచుండెను వీరిని చూచి అచటివారు ఆశ్చర్యపడుచుండిరి. సన్న్యాసి వేషధారియగు ధర్మరాజు విరాటుని సభకు నంతనింత దూరమున నుండగనే అతడు వితర్కించి సభతోగూడ లేచి యెదురువోయి నమస్కరించి వానిని దెచ్చి యున్నతాసనమున నుంచెను.

ఇట్లు దైవసహాయమున సార్వభౌముడగు ధర్మజుడు సామంతు నకు నమస్కరింప కుండ దప్పినది. మొత్తముమీద దైవసంకల్పమున పాండవులు విరాటనగరమున కీచకవధకై ప్రవేశించినట్లు భావింపనగును. విరాటుని ప్రశ్నమునకు ధర్మరాజు తాను ద్విజుడ, గురువిషయజాతుడ, ధర్మరాజు సఖుడనని చెప్పుచు గృహస్థుడననియు ధ్వనింపచేసెను. ఇట్లే భీముడును వలలుడై వంటలవాడుగ చేరెను. భీమునకు ఆకలి యెక్కువ యగుటచే పాకశాల తనదిగా చేసికొనెను. ఇక అర్జునుడు నపుంసకుడే యని పరీక్షవలన తేల్చి, విరాటుడు అంతఃపురమున కన్నియలకు ఆటలు పాటలు చెప్పుటకు చేర్చుకొనెను. ఇక నకులుడు తాను హీనకులుడనని చెప్పికొనెను. హీనకులుడనగా తక్కువకులము వాడనియు, హీ హీం నకులుడనియు అర్థము. ఇట్లే సహదేవుడు గొల్లవాడుగ చేరెను. ద్రౌప దియు సైరంధ్రిగ జేరినది.

19

పాండవులు విరాటనగర ప్రవేశము చేయుసరికి అప్పటికి షుమారు తొంబదియేండ్ల ప్రాయము వారై యుండిరి. ద్రౌపదికి డెబ్బదియేండ్ల వయస్సుండి యుండవచ్చును. విరాటనగరమున నున్నప్పుడు భీముడెంద అనో మల్లులనోడించెను. అచట చేరి పదునొకండు నెలల పదునైదు రోజులైన పిమ్మట సైరంధ్రిగనున్న ద్రౌపదిని కీచకుడు ప్రేమించి తన సోదరియగు సుధేష్ణను ద్రౌపదిని యొప్పించుటకై ప్రార్థించెను. వాడు సుధేష్ణకు సవతితల్లియగు, సూతస్త్రీకొడుకు. సైరంధ్రియందుగల కీచకుని కామభావమును సుదేష్ణ యెంతగనో దూషించి నివారింప జూచినది. కాని లాభములేక సైరంధ్రిని వారుణి నెపమున కీచకునికడ కంపినది. అపుడు కీచకుడు ద్రౌపదిని ప్రత్యక్షముగ బలాత్కరించబోయెను. అందులకు ద్రౌపది కోపించి తన పతుల ప్రాభవమును—దుర్వారోద్యమ బహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర ద్గర్వాంధ ప్రతివీర నిర్మథనవిద్యాపారగుల్ మత్పతుల్-అని హెచ్చరించినది. అంతియగాదు గీర్వాణకృతులగు వారిచే చచ్చెదవనియు హెచ్చరించినది. తరువాత వాని బారినుండి తప్పించుకొని బయటికి వచ్చినది. ఇంతవరకు సుధేష్ణ కీచకుని ఆరాటమునకు అడ్డు కట్టలు వేయుటకు యత్నించినది. కావున నీమె మంచిదే యగుచున్నది. తప్పనిసరిగ పంపవలసివచ్చి పంపుటచే నామెను నిందింపవలసి వచ్చినది. ద్రౌపది తప్పించుకొని విరాటరాజు సభచేయుచున్న రచ్చపట్టునగ్గరకు వచ్చుచుండెను.

ఆ సమయముననే కీచకుడు ఆమె జుట్టు పట్టుకొనగా నామె ప్రారనచే ముందుగనె సూర్యుడు పంపిన అదృశ్యుడగు రాక్షసుని శక్తి వలన

నాతని బడద్రోచి సభలోనికి వచ్చినది. కానిఅవమానములపాలై నకీచకుడు మరల పోక సిగ్గువిడచి అట్లే నిలబడుటకు విరాటరాజు మిక్కిలి చింతించెను. వాడు బలవంతుడగుటచే నేమియుచేయలేక విరాటుడు పొమ్మని బ్రతిమాలెను. ధర్మరాజు, భీముడు ఆ యాపదను జూచిరి. భీమునకు భయంకరమైన కోపమువచ్చినది. ధర్మరాజునకు ముత్యములవంటి చెమట బిందువులు ఫాలస్థలమున నలంకరించినవి. ఆ సమయమున భీముడురచ్చ చెట్టు పెల్లగించి కీచకుని చంపవలయునని భావించెను. కాని అన్నగారి కనుసన్నచే వారింపబడెను. అంతియగాక ధర్మరాజుయొక్క నర్మగర్భ వాక్కులకు కట్టుబడియుండెను. ఆ సమయమున ధర్మజుడు – వలలుడె క్కడ జూచె నొండెడ ససేవ్యక్ష్మాజముల్ పుట్టవే ; ఫలితంబై వర శాఖ లొప్పగ అనల్పప్రీతి సంధించుచున్ ; విలసచ్ఛాయనుపాశ్రితతతికి న్విశ్రాంతి గావింపగా గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపగా జెల్లునే ; అని భీమునితో పల్కెను. విలసితచ్ఛాయతో నున్నట్టి యీ చెట్టును చంపరాదని నివారించుటచే నాగిపోయెను. ఇక విరాటరాజు చేయునది లేక కీచకుని పొమ్మని సైగ చేసెను.

బలవంతుడైన బావమరదిని విరాటు దేమియు చేయజాలక మిన్నకుండెను. ద్రౌపది మాత్రము తనవంటి బలవంతులవు గంధర్వుల ఇల్లాలికిట్టి పరాభవము జరుగగా, నెవని యిల్లాండ్రకిక యాపద రాకుండును అని కోపావేశమున బల్కినది. అందునకు ధర్మజుడు మాత్రము – వారిజాక్షి ; నీ పరాభవ మందఱు చూచినదియే. నీ పరాభవంబున కోపింపజాలరే గంధర్వులకు తరిగాదుగాక ; చనుము నీవు సుదేష్ణ సదనమునకు – అని పల్కగా ద్రౌపది యింకేమియో చెప్పబోయెను. వెంటనే ధర్మజుడు —— గరువతనముగల ఇల్లాలు శైలూషివలె సభల నాటాడవచ్చునా ? అని అజ్ఞాతవాసమున కాపాడు భాషణములు భంగమగునేమోయని గద్దించెను. అందులకు ద్రౌపది కినిసి పరావబాధ నొందియున్నదిగాన కపి నాపుకొన

లేక నా భర్తలవు గంధర్వులేవురలో నొకడు జూదమాడువాడు. ఒకడు నటుడుగాన జూదమాడువాని భార్యకు గరువతనం బెక్కడిది? అంతియగాక నటుని భార్య నటి యగుటలో నాశ్చర్యమేమున్నది అని – ఏ శైలూషిగా ననంగరాదు కంకభట్ట! అని చెప్పి వెళ్ళిపోయినది. అలసిసొలసి చెల్లా చెదురైన యలకలతో వచ్చిన ద్రౌపదిని చూచి సుధేష్ణ యేమిది? అని ప్రశ్నించినది. అందులకు ద్రౌపది నీ వలననే యిట్టి కష్టము వచ్చినదని చెప్పినది. స్నాన భోజనాదుల వర్జించి కీచకవధోపాయ మాలోచించు చుండెను. అందులకు భీముడే తగినవాడని యెంచి పాకశాలకు అర్ధరాత్రి పోయి భీముని తట్టిలేపినది. భీమ దదరిపాటున లేచి–ఏల? ఈ అర్ధరాత్రి నీ రాక? అని పల్క తెలిసియుండియే నీ విట్లడుగుచున్న నేను చెప్పి మాత్ర మేమి ప్రయోజనమని తన వగనంతయు వెళ్ళబోసినది.

మరియు భీమునితో ఉ. నన్ను పరాభవించి సదనంబునకున్ జని కీచకుండు మున్నున్న తెఱంగు తప్పక సుఖోచితశయ్యను నిద్రచేయ నీ కన్నుమొగుడ్చు నూఱటకు కారణమెయ్యది భీమసేన! మీ యన్న పరాక్రమంబు వలదన్ననొకో దయమాలి తక్కటా: అని ద్రౌపది యిట్లు విలపింపసాగినది. అపుడు భీముడు ధర్మజుని గొప్పతనమును, శాంతమును గూర్చి చెప్ప నామెయు నొప్పుకొని యెట్లయినను ప్రస్తుత పరిస్థితినిబట్టి కీచకుడు చావకున్న తానే చచ్చెదనని పట్టుబట్టినది. అపుడు భీముడు కీచక వధోపాయము నాలోచించి ద్రౌపదిని కీచకుని మోహించినట్లు నటించి వాని నొంటరిగ నర్తనశాలకు రమ్మని చెప్పిన రాత్రి విజనమగు నచ్చట వానిని మాటుబెట్టెదననియు చెప్పెను. ఇక ద్రౌపది యట్లే యని తన నివా సమునకు పోయి మామూలుగా నుండ కాముకుడు దుర్విదగ్ధుడుగాన మరు నాడాత దచ్చటికివచ్చి మాటాడజొచ్చిన భీముని వాగ్బలమున నైహికా ముష్మిక భయములేనిదై ద్రౌపది అర్ధరాత్రమున విజనమవున ర్తనాగారము నకు రమ్మని ఒకడనేరమ్మని కట్టడిచేసి పంపెను. అపుడు కీచకుడు విరహ

జ్వర పీడితుడై రాత్రి కొఱకు - మాయరవి యేల క్రుంకదొకో — అని ఉపాలంభనము ప్రారంభించెను. భీముడు సర్వసన్నద్ధుడై వచ్చి సైరంధ్రి నొక్క మూలనుంచి తానొక శయ్యపై పండుకొనెను. అపుడు కీచకుడు — సింగంబున్న గుహానికేతనమునకున్ శీఘ్రంబునన్ వచ్చు మాతంగంబున్ బురుడించుచున్-భీముడున్న యెడకు వచ్చెను. మొదట కీచకుడు భీముని సైరంధ్రియే యని భావించి కీచకుడు తన ప్రాభవమంతయు నేకరువు పెట్టి తాకగా భీముడు కొన్ని మాటలాడి పెడలంకించుకొని వంగదీయ నతండును గంధర్వుడనుకొని యెదిరించి లాగుకొన నిట్లు గూఢనిష్ఠుర్ధనముల కొట్టుకొనుచుండిరి. అజ్ఞాతవాసము చెడునేమోయని భీముడు, వ్యభిచరించు చోట తన్నులు తగిలెనన నామోషియని కీచకుడు చప్పుడులేకుండ బోరిరి. ఇంతలో భీముడు మూర్ఛనొంది లేచి కీచకుడు పోబోగా వానిజుట్టు పట్టి లాగి చంపివేసి పొట్టచించి కాళ్ళుచేతులు దానిలో దూర్చి నేలమీద పెదిపి ముద్దచేసెను.

తర్వాత రహస్యముగ నిప్పుతెచ్చి ఆవెలుగున భీముడు ద్రౌపదికి కీచక శవము చూపించెను. అంత ద్రౌపది భీముని కైవారము చేసినది. భీముడు యథాప్రకారము పాకశాలకుపోయెను. ఇక ద్రౌపది పవలెవరైన వచ్చిన అజ్ఞాతవాసముననున్న భీమాదులెవ్వరు నేమియు చేయరాదని తెల్లవారు లోపల ఉపకీచకులను తుదముట్టించవలయునని చూచినది. తానె కావలి వారల పిలిచి తన భర్తలగు గంధర్వులచేత వీడు చచ్చెనని చెప్పిచూపెను. వారు చెప్పగా కీచకుని తమ్ములు నూటనల్వురు మిక్కిలి దుఃఖించి సైరంధ్రియే యిందులకు కారణమని యామెనుబట్టి తమ అన్నతో దహనము ంచిరి. కీచకుని శవముతో నామెనుకూడ కట్టి శ్మశానమునకు పోవు చుండిరి. ద్రౌపదియప్పుడుశవాసనముపైనున్న చింతామణివలెప్రకాశించినది. అంత నామె కేకలతో నాథులార, గంధర్వ రత్నంబులార: నన్ను నుపకీచకులు తమ అన్న శవముతో గట్టి తీసికొనిపోవుచున్నారు. రక్షింప వేగ

రావలయు మీరు – అని పెద్దగా నేడ్చినది ఆ మాటలతో భీముడులేచి చూచి వారకంటె ముందు కోటగోడమీదుగాదూకి శ్మశానముచేరియుండెను. ఇతనిని చూచిన ఉపకీచకులు భయపడి పరుగెత్తనారంభించిరి. ఉపకీచకు లను భీముడు తుదముట్టించుటయు నైనది.

ద్రౌపది మరునాడు స్నానముచేసి పరిశుద్ధురాలై ఊరిలో ప్రవే శించునప్పుడు ఆమెను చేర జంకి పౌరులెల్లరు నిటునటు పారుట చిత్రముగ నుండెను. ఆమె అర్జునుని పాఠశాలకు పోయినది. అర్జును డామెనుజూచి–

కం॥ ఆ పాపాత్ముల నీచ
వ్యాపారక్రమము వారలందఱు మృత్యు
ప్రాపితులైన తెఱంగును
నీ పలుకుల నెఱుగవలయు నెలతుక చెప్పుమా!

అని జరిగిన సంగతి నెఱింగింపకోరెను. అప్పుడు సైరంధ్రి వానితో తన కృతార్థత్వము సూచించుచు—

గీ॥ కన్నియల కాట గఱుపుచు నున్న నీకు
నకట! సైరంధ్రి యిప్పుడేమయ్యెనేని
ఖేద మొక్కింతయును లేమిగాదె సన్ని
తానసుందవై నన్నిటు లడుగుటెల్ల!!

అని కొంచెము ఎత్తిపొడుపుగా నన్నది. దాని కర్జునుడు నీవు కష్ట పడుటకు నాకెంత దుఃఖముగా నున్నదియో నీవు నైజమెఱుగవు. నేనేమి సేతును అని తన దీనస్థితి నివేదించెను. అందులకు నీ మది నేను కొంత ఎఱుగని దానగాను. నీ విట్లుండుటయే నా కిష్టము, అని సమాధానించు నప్పటి ద్రౌపది మన స్తత్వ వర్ణనము చూచితీరవలయును. ఆమె సుదేష్ణ

దగ్గరకు పోగా జరిగినదంతయు నెఱింగిన ఆమె ద్రౌపదిని - మా పుర మును రాష్ట్రమును వదలిపొమ్మందైనన్ — అని కోపావేశమున పల్కి నది. అంత ద్రౌపది మునుపటివోలె పదమూడు రోజులుమాత్రము నీ యింటనుండుట కొప్పుకొన్న నా భర్త లగపడి మీకు మేలుచేసి నన్ను గొనిపోదురు. అందరకు నప్పటకి సంతసము కాగలదు. అనిన నామె అంగీకరించెను.

ఈ వార్త దేశమంతయు ప్రాకగ పాండవులు విరాటుని కొలువునం దున్నట్లు కౌరవులు దీనిచే పసికట్టిరి. గూఢచారులు వచ్చిరేకాని, పాండ వుల జాడ తెలియజాలక ఎందును లేరని చెప్పిరి. ఇక గత్యంతరములేక దుర్యోధనుడు సభచేసి దుశ్శాసనాదులను పాండవుల జాడగూర్చి ప్రశ్నిం చెను. దుశ్శాసనుడుమాత్రము పాండవులు చచ్చినచోట పూరియున్ మొల వదే యని మడిసిరని మాటనిచ్చెను. అందులకు ద్రోణుడుమాత్రము పాండవులు మరణించలేదని జవాబిచ్చెను. అంతియగాక వారు అమానుష తేజులని చెప్పెను. భీష్ముడు మాత్రము ధర్మజుడున్నయెడ కఱవు కాట కము లుండవు. అట్టి దేశమున పాండవుల నెదుకుమని సమాధానించెను కాని దుర్యోధనుడుమాత్రము కీచకుడు పాండవులచే హతుడయ్యెనని తలచెను. కీచకుని బలమున కోటువడి విరాటుడు పన్ను కట్టకున్నను దుర్యోధనుడు వానిపై నెత్తిపోక ఊరకుండెను. ఇప్పుడా భయము పోయినదిగాన విరాటునిపై నెత్తిపోయిన పాండవు లడ్డమువచ్చిన అజ్ఞాత వాసము చెడినదిగాన మరల అడవికి పొమ్మనవచ్చును. వారు లేకున్న విరాటుని సొమ్మెల్ల చూరగొని కసితీర్చుకొనవచ్చునని తలచెను. దానికిగా ఉత్తర గోగ్రహణ - దక్షిణ గోగ్రహణముల బెట్టించెను. సుశర్మను దక్షిణముగా బంపి, తాను సైన్యముతో ఉత్తరముగాపోవ బయలుదేరెను. అష్టమి నవములు యుద్ధమునకు మంచివి, అని అష్టమినాడు దక్షిణ గోగ్రహణము, నవమినాడు ఉత్తరగోగ్రహణము సాగించెను. అమా

వాస్యనాడే కురుక్షేత్ర సంగ్రామ ప్రారంభమైనది, ఏలన జ్ఞాని అమావాస్య రోజున మరణించిన చంద్రమండలము వేరుగా నుండదుగాన సూర్యమండలము భేదించుకొని పోగలడు. ఇందులకే-ఏమీ తెలియనివాడు ఏకాదశినాడు చస్తే, అన్నీ తెలిసినవాడు అమావాస్యనాడే చస్తాడు- అను సామెత బుట్టినది. ఇట్లు అష్టమినాడు సుశర్మ విరాటుని ఊరికి దక్షిణమున గోవుల బట్టెను.

విరాటుడు వారితో పోరికి పోవుచుండ, ఇక విరాటునివైపు సారధ్యములు తామే చేసికొనుచు ధర్మజ భీమ నకుల సహదేవులు నల్వురు యుద్ధమునకు పోయిరి. మహాయుద్ధము సాగినది. సంధ్య చీకటిలో కొంచెము సేపాగి అర్ధరాత్రమున వెన్నెలలో యుద్ధము మరల చేయుచుండగా సుశర్మాదులు విరాటుని ఓడించి కట్టి తీసికొనిపోవుచుండిరి. విరాటుని సైన్యములెల్ల పారిపోవుచున్నవి. ఇది చూచిన ధర్మరాజు విరాటుని విడిపింపవలయునని తమ్ములతో చెప్పెను ఈనలువురుమాత్రమే శాత్రవులతో తలపడిరి. ఆయుద్ధమున భీముడు రెండువేలు నకులుడు ఏడువందలు, సహదేవుడు ఐదునూర్లు, ధర్మరాజు వేయిరథముల శాత్రవులవి నుగ్గు గావించిరి అట్టిసమయమున భీముడు భీమావేశముతో సుశర్మ రథ్యముల జంపి విరాటుని విడిపించి సుశర్మను. దాను పట్టుకొని బంధించితెచ్చి విరాటుని రథస్తంభమున కంటగట్టెను ఇక సుశర్మ సైన్యములన్నియు కాందిశీకము లయినవి. విరాటుని యావు లొక్కటియుం తప్పిపోకుండ భీమ నకుల సహదేవులు పొదివికొనివచ్చి తమ గోపాలుర కప్పగించిరి. విరాటుడు పాండవులని యెఱుగకయు వారల నలువురకొనియాడ మొదలిడెను. దానివలన సుశర్మ తమ్ము గుర్తించునేమో యని ధర్మజుడు;నీవు మమ్ము గొనియాడవలదు. ఈ సుశర్మను, వీరితరపువారిని విడిచిపుచ్చుమని అట్లు. చేయించి తామా రాత్రిశేష మటనొక నదీపులినమున గడిపి తెల్ల

వారిన తర్వాత జయాటోపముతో నూరిలో ప్రవేశింపదలచి, నిశ్చింతముగా మాటలాడుకొనుచు కాలము గడుపుచుండిరి.

తర్వాత సూర్యోదయసమయమున దుర్యోధనాదులు కౌరవులువచ్చి విరాటునగరమునకు నుత్తరముననున్న గోవుల మందల బట్టుకొని పోవు చుండ, గోపాలకులు గ్రామములోనికివచ్చి విరాటుని చిన్నకొడుకైన ఉత్త రునితో చెప్పిరి. చిన్నవాడుగాన ఉత్తరుడు విచారింపక తనకు సారథి లేదని, ఒక సారథి దొరికిన కౌరవుల గెల్చి పశువుల తేగలనని గప్పాలు కొట్టెను. నన్నుజూచి కౌరవులు అర్జునుడని భయపడునట్లు చేసెదననియు వాడనెను. అదివిని సైరంధ్రి లోలోన కుత్సించుచు అర్జునునివద్దకుపోయి పరిస్థితిచెప్పి అతని యిష్టప్రకారము ఉత్తరచేత ఉత్తరునకు చెప్పించి, ఎట్ట కేలకు బృహన్నల నాతనికి సారథిగ నొప్పించి యుద్ధమునకు పంపెను. అప్పు డుత్తర కౌరవులగెల్చి వారి తలచీరలు తెమ్మని బృహన్నలకు చెప్పెను. ఉత్తరుడు కురుసైన్యముచూచి భయకంపితుడై రథము దిగి కాలికి బుద్ధిచెప్పెను. ఇక బృహన్నల చేయునదిలేక తన కేశములచే పిఱ్ఱ కప్పుకొని ఉత్తరుని వెంటాడి పట్టుకొనివచ్చెను. శత్రువులకు వెన్నుజూపి పోరాదు కాబట్టి బృహన్నల అట్లుచేసెను. ఇక బృహన్నల తానుయుద్ధము చేయుదుననియు, ఉత్తరుని సారథిగ నుండుమని యిష్టములేకున్నను, ఒప్పించి మఱ్ఱిచెట్టుమీద పెట్టిన అస్త్రముల గ్రహించెను. సందర్భానుసార ముగ ఉత్తరుని ధీరునిజేసికొన తాము పాండవులమని తా నర్జునుడనని తన పేళ్ళ నన్నింటని వాడడుగగా చెప్పుచు, పదునొకండవపేరు కృష్ణు డనియు చెప్పెను. వానికి ధైర్యము వచ్చినది. ఈతడర్జునుడైన వీని రథముతోలి నేను పేరు పొందెద ననుకొనెను. అర్జునుడు తలచినప్పుడే శంఖము దేవదత్తము చేతికి వచ్చెను. అట్లే పెట్టక కట్టక మౌళింబుట్టిన క్రియ కిరీటము తలపై వచ్చి నిల్చినది. ఇక నీతని యుద్ధపద్ధతి గమనిం చిన కౌరవులు—బాహుల చాయలుం గమనభంగియు అర్జును నట్లయని

యూహించి, అర్జునుడే యని భావించిరి. ద్రోణు డర్జును గుర్తించి వానికి అజ్ఞాతవాసభంగ మగునేమోయని భయపడి కనుసన్నతో రెండర్థముల మాటలతో భీష్మ నిట్లడిగెను -

శ్లో॥ నదీజలం కేశవనారికేతు
ర్నగాహ్వయో నామ నగారిసూనః
ఏషోంగనా వేషధరః కిరీటీ
జిత్వావయన్నేష్యతి చాద్యగావః

దానికి భీష్మ డెఱుంగని యట్లు శత్రువులకు నిమ్మగుచోటు గడచి వచ్చితిమి ఎవరు వచ్చినను భయపడవలదని దుర్యోధనునకు చెప్పుచు అర్జును నజ్ఞాతవాస కాలము వెళ్ళిపోయినదని ద్రోణునకు సూచించెను. ఆ యర్థము తెలిసికొని ద్రోణుడు నిశ్చయముగా వచ్చుచున్నవా డర్జునుడు మనము వాని గెలుచుట కష్టము. అతడు దేవలోకములను, రాక్షసలోకములను గెలిచినవాడు. శివునితో బాహుయుద్ధము చేసినవాడు. కాన వానిచేత దెబ్బలు తినుటకంటె వానితో ముందుగా రాజీచేసికొనుట మంచిది. అని చెప్పెను. దానికి దుర్యోధనుడు, కర్ణుడు కోపించి యిష్టమువచ్చినట్లు ద్రోణుని తిట్టిరి. అశ్వత్థామయు వారితో వాదులాడి ద్రోణుడు సిగ్గులేక యుద్ధము చేసినను నేను మాత్రము చేయనని గట్టిగా బలికెను. భీష్ముడు వారల నందరిని ప్రతిమాలి దుర్యోధనుని కర్ణుని నిరసించి అర్జునుడు వచ్చుచున్నాడు గాన మనలోమనకు వైరము తగదు అని పలికి అందఱ నేకముఖము చేసెను. దుర్యోధను డడుగ భీష్ముడు పాండవుల అజ్ఞాతవాసము అధికమాసములతో గూడ తిథులలెక్కతో నిన్నటితో వెళ్ళిపోయినది. కాననే తెలివిగలవా డర్జునుడు నేడు బయటబడెనని విస్పష్టముగ అనెను. భీష్ముని మాటలతో అంకిలిదేఱిన ద్రోణుడు కౌరవసైన్యములు నాలుగు భాగములుగ చేసి ఒక భాగము గొని దుర్యోధనుడు ముందు హస్తిపురి

పోవుచుండునట్లును ఒకభాగము సైన్యము విరాటుని పశువులచుట్టు క్రమ్మి కొని తోలుకొనిపోవుచుండునట్లుగాను, మిగిలిన రెండు భాగములు కలసి ఒక వ్యూహము పన్నుకొని వారివెనుక నేగునట్లును అమర్చి, అర్జునుడు వచ్చినప్పుడే సైన్యము యుద్ధముచేయుచుండ రాజు గోవులు ఇంటికి తప్పించుకొని పోవునట్లు నమర్చి, తాను భీష్ముడు, నశ్వత్థామ, కర్ణుడు ఈ సైన్యము నడపించుకొనుచు పోవుచుండిరి.

అంత ఉత్తరం సారధ్యములో అర్జునుడు దేవదత్తము నూదుచు, గాండీవము సారించుచు, ఇంద్రదత్త కిరీటము మెఱయ జెండామీద హనుమంతుడు మ్రోయ వానిచుట్టు భూతములార్వ మహాసంరంభముగా వచ్చి వెనుక సైన్యములో దుర్యోధనుని గానక భీష్మ ద్రోణకృపాచార్యులకు నమస్కార బాణములు వేయుచు, ఆ సేనప్రక్కగా గడచిపోయి పేరు చెప్పి కేకవేసి అదలించి తనరథమును భీష్మాదుల సైన్యమునకు గోవులతో బోవు సైన్యమునకు మధ్యమముగా తోలించి కేకలతో బొబ్బలతో సైన్యము చెదరి తూర్పునకు పారిపోవునట్లుచేసి తానువచ్చిన రథమార్గమున గోవుల బట్టించి గోపాలకుల దోలుకొనిపొమ్మని తానుకాపాడుచు గోవులమరల్చె. అంత నా సైన్యము లన్నియు నొక్కటైనవి. రాజుకూడ మరలివచ్చి వీరితో కలిసెను. అప్పుడన్ని సైన్యములతో నాయకులతో అర్జునకొక్కనికి మహాయుద్ధము సాగినది. చూచుటకు దేవతలు వచ్చి ఆకాశ మలంకరించిరి. అట్టిసమయమున —

మ. బలమెల్లన్ వెఱ రెండుపాయలుగ శుంభద్వేగుడై చొచ్చియా
వలగా నడ్డమువచ్చి నాలుపుగ దుర్వారోద్ధతిం బోయిమూ
లల నానాశకలాకృతిం దొరసి లీలాతూన దుర్దాంతుడై
వలయంబులన్ని చించిచిక్కుపఱచున్ వైకల్యసంపాదియై.

ఇట్లు తుములముగా సైన్యములనెల్ల నాశనముచేసి ప్రత్యేకముగా నాయకు లతో మాటిమాటికి పోరాడి యోడించి పారిపోవు కర్ణుని నిందించి, అతడు చూచుచుండ అతని తమ్ముని జంపి, భీష్ముని మూర్ఛపుచ్చి తక్కు సైన్య ములనెల్ల నఱకి దుర్యోధనునితో పెద్దయుద్ధముచేసి అతడోడి పాఱుచుండ

ఉ. క్షత్రియుడోడునే తగదుకౌరవరాజ! కుఱకండనే వృథాం
పుత్రులలోన చిన్న నిను పోరికి పిల్వగ పోక పాడియే!

అని నా చేతిలో నోడిపోయి యే మొగముతో హస్తిపురి నూరేగెదవు సింహాసనమున నెట్లు కూర్చుండెదవు. యుద్ధములో చచ్చుట మంచిది. ఓడిపోవుటకన్న, జూదమిక్కడ నాడంగరాదు సుమా : "నీ యట్టివాడు నిచ్చి పోయిడిదే యిట్లు పోకు పోకు", మనిన భూనాయకుడు మరలి త్రొక్కబడ్డ యహిగతి గవిసెన్ — అప్పుడున్న నాయకులు మిగిలిన సైన్యములు నొక్కటియై యెదిరించి అర్జును ననేక శస్త్రాస్త్రములతో సందులేకుండ వీరరసావేశమున ప్రహరించుటయు. ఆ అర్జునుడా బాణముల వానలు తనకు సారథికి గుఱ్ఱములకు రథమునకు తగులకుండ కాచికొనుచు నాయకుల నెవరినీ చంపినను తన తోబుట్టువుల ప్రతిజ్ఞలకు భంగము వచ్చునేమోయని వీలయినను జంపక భంగపెట్టి పంపుదమని వారిపై, ఇక గంధర్వాస్త్రము మంత్రించి వేయగ నది సమ్మోహనాస్త్ర మగుటచే నందరును మూర్ఛిల్లిరి.

ఈ సమయముననే అర్జునుడు ఉత్తరుని కౌరవవీరుల తలపాగలు కోయుమని చెప్పెను. ఉత్తరుడట్లు చేయుచుండగ, భీష్మున కా యస్త్రవిశే షము తెలిసియుండుటచే మూర్ఛ నుండి తేరిచూచెను. ఉత్తరుడు చేయు చున్న పనిని చూచి భీష్ముడు – కౌరవవీరుల శిరముల గోయుచున్నాడని భ్రాంతి నొందెను. తానొక్కడు అర్జునునితో యుద్ధముచేసి యోడెను. చేతులు కాళ్ళు నాడక మిక్కిలి ఆశర్యము నొందెను. ఇంతలో అందరు

మూర్ఛతేరి ఏడి అర్జునుడు ? అని ఆయుధముల దాల్చి సన్నద్ధులగుచుండ చూచి భీష్ముడు వారందఱతో.

ఉ. మోహన బాణపాతమున ముందలిచీర లెఱుంగకున్నయీ
బాహుబలంబుతోఁగడగి పార్థుని తాఁకెదుబుద్ధిక్రమ్మరన్
సాహస వృత్తిచేసి యవిచారత పోయితిమేని వాఁడు పూ
ర్ణాహుతిసేయుడే మనలందఱ నొక్కట మార్గణాగ్నికిన్.

అని చెప్పి ఒడలెఱుగక మూర్ఛనొంది నీవల సైనికులుండ కుంతికొడుకు గాన, ధర్మాత్ముడుగాన తలపాగలు మాత్రము కోయించి తృప్తినొందెను. తలలు కొయించిన ఈనాటితోనే పనితీరిపోయెడిది. ఔరా ! వీని కరుణాతిశయము చెప్పశక్యము కానిది. నీకు ఇట్లు పాండవులు దొరికిన ఊరకుందువా ! అతడు మన ప్రాణములమీద ఆశవదలిన మనకు అంత వంతయేల ? అని దుర్యోధనుని వారించెను. అప్పు డందరు దెబ్బలుదినియుండి మేనులు విరవిరపోవుచు చేయునదిలేక యింటిమొగముబట్టి పోవుచుండిరి. కర్ణదుర్యోధనులు నుస్సురనుచు వారివెంట పోవుచుండ నర్జునుడు వెంబడించి కర్ణదుర్యోధనుల కిరీటములలో మణులు మిట్టకోలలతో రాల్చి కర్ణుని వీపు పగులచేసి, భీష్మ ద్రోణ కృపులకు నమస్కారబాణములు వైచి అందఱతో పెద్దకేకవేసి పోయివచ్చెదనని చెప్పి అర్జునుడు ఉత్తరునితో చెప్పి తన రథము మరలించెను.

మరల ధనుర్బాణములు మునుపటి చెట్టుమీద కట్టిపెట్టి దివ్యమహిమగల జెండా, దేవదత్తము మొదలగు సాధనముల ప్రార్థించి అంతర్ధానముచేయించి అర్జునుడు బృహన్నల వేషముతోనె తొట్టిలోనుండి, ఉత్తరుని ధనుర్బాణములు ధరించి రథముపై నుండచేసిపోవుచు గోపాల

కుల పిల్చి ఉత్తరుడే కౌరవసైన్యములగెల్చి గోవుల మరల్చెనని ఊరిలో చెప్పుమని పంపెను. ఇది ఉత్తరగోగ్రహణము.

దక్షిణ గోగ్రహణమున జయించివచ్చిన విరాటు డుత్తరుడు కౌరవ సైన్యములతో ఒక్కడు యుద్ధమునకు పోయెనని విని భయపడి వాని సంగతి ఏమయినదో కనుగొని సైన్యముల వానికి సహాయము పంపుమన్ని మంత్రులతో వ్యగ్రుడై మాటలాడుచుండ నాకబురు వచ్చినది. తనకొడుకు కౌరవసైన్యముల గెలిచి వచ్చుచున్నాడని విన్నంతనే విరాటుడు సంతోష గర్వముతో పలుకుచుండ ధర్మరాజు బృహన్నల సారధిగాన ఉత్తరుడు జయించెననెను. దానికి విరాటుడు కోపించి సారధితెలిసి గుఱ్ఱములు తోలుటకు గాని శస్త్రాస్త్రములతో నెదురించు కౌరవుల గెల్చుటకు నెట్లు ప్రయోగించును. అని అనుచు సమాశము మీద జూదమాడనెంచి ధర్మజుని పిలిచి పలకలాగుకొని ఉద్యుక్తుడగు విరాటునితో - జూదమాడుట యెంత లెస్స. మునుపు ధర్మరాజు జూదమాడి రాజ్యమును, తమ్ములను, పెండ్లా మును, ఓడి బాధపడెను. గాన యిది మంచిది కాదనుచు, చేరి జూదమాడు చుండ మరియు విరాటుడు తన కొడుకును పొగడ - ఉత్తరుడు కౌరవుల గెల్చిన నింతకన్న నాశ్చర్యమేమి కలదు ? బృహన్నలకు యుద్ధము చేయ వలెనని కోరికపుట్టి ఉత్తరుని సారధిగా గొనిపోయి వారలగెల్చి యావుల మరల్చి యుండవచ్చును. కాన పురిలోన బృహన్నల జయము చాటించు మనెను. ధర్మజుని పట్టు అట్టిది.

ఇక విరాటుడు అది సైపక చేతిసారెతో కంకభట్టును గొట్టెను. గంటిపడి నెత్తురు కారుచుండ సైరంధ్రివచ్చి పైట చెరగుతో తుడుచు చుండెను. విరాటుడది యేమన సైరంధ్రి ఉత్తముడగు నీతని రక్తము బొట్టులెన్నిపడిన అన్నియేండ్లు దేశము అనావృష్టితో కఱవనుభవించును. నీ కట్టి యాపద వచ్చుట యిష్టములేక యిట్లు చేసితి ననెను. ఇంతలో

ఉత్తరుడు అర్జునుడు వచ్చిన వారిగౌరవించి, సారధిని పంపి, రధికుడవు కొడుకుతో సభచాలించి విరాటుడంతిపురి కరిగెను. ఉత్తరుడు తండ్రితో ఒక మహాపురుషుని సాయముతో జయమయినదని చెప్పెను. ధర్మరాజు గంటి అర్జునుడు చూడకుండ వస్త్రము కప్పికొనియుండెను. అప్పటికి విరాటుడు నమ్మనున్న ఉత్తరుడు భయపడుచున్న నన్ను నొప్పించి సారధిగా చేసి తానర్జుడనని చెప్పి అప్రతిహతగతితో కౌరవుల మార్గాని గోవుల మరల్చి కౌరవుల పరాభవించిన, ఈబృహన్నల అర్జునుడు. నిన్న కౌరవుల మాటలాడునప్పుడు వారివారి మాటలనుబట్టి నేను నమ్మితిననెను. ఆరాత్రియందఱు పాండవులు, ద్రౌపది, ధర్మరాజు మకాములో చేరి వారి యుద్ధము కబురులు వీరు, వీరియుద్ధము కబురులు వారు చెప్పుకొన్న తర్వాత – అర్జునుడు – ధర్మరాజు నాకు మొగము చూపకుండ వస్త్రము కప్పుకొని యుండెను. నేనేమి తప్పుచేసితిని. అజ్ఞాతవాసము వెళ్ళిపోయి నది గదా! మనల నీ సంవత్సరము పోషించిన వాని గోధనము పోవుచుండ కాపాడుట అవసరముగదా! అని పోయితిని అని చింతింప ధర్మజుడు — ఏమియు లేదు. విరాటుడు కొడుకు జయము కొనియాడ నేను బృహన్నల యుండ ఉత్తరున కేమికొదవ లేదన కోపముతో సారె తీసికొని కొట్టిన నీవు చూడకుండ గంటిని దాచితినని అర్జునునకు ధర్మజుడు చెప్పెను. దాని కందఱు విరాటునిపై కోపించిరి.

20

ధర్మరాజు మాటలతో భీమాదులు శాంతించి విరటునిపై కోపము నుపసంహరించుకొనిరి. ఆ మరునాడు ధర్మజుడు విరాటరాజు సింహాసనముపై కూర్చుండ మిగిలిన వారును ఆ యా ఆసనము లలంకరించిరి. యమధర్మరాజు వరము వలన ధర్మరాజు తన నోటిమీదుగ తాను ధర్మజుడనని చెప్పువరకును అందఱు కంకుభట్టనియే చూచిరి. అట్లు సింహాసనము నలంకరించిన కంకుభట్టును జూచి విరటుడు ఆశ్చర్యకోపములతో నిది యేమి? అని ప్రశ్నించెను. ధర్మజుడు తన యాజ్ఞ సూయాణముగ ప్రజల పాలించినవాడు. సూయాణమనగ గర్భిణీస్త్రీలకు నొప్పులుకామితముతీర్చుట ప్రజలకు కావలసిన విచ్చి కాపాడిన ధర్మవ్రతుడు ధర్మరాజు. ఇతడు దిగ్విజయ మొనరించియు అజాతశత్రుడనిపించుకొన్నవాడు. అని చెప్ప నమ్మక తక్కిన నల్వురు ఏరి? అని విరటుడు మిగిలిన వారి కూర్చి యడిగెను. వారందరును అతనికి తెలియచేయబడిరి.

శకునిని నిన్నటి యుద్ధమున మామా! అని సంబోధించి – ఇవి బాణములు కాని అడ్డసాళులు గావని యెత్తిపొడిచెను. అని యిట్టి మాటలు చెప్ప విరాటుడు దిమ్మెరపోయి ధర్మజు పాదములపై బడెను. భీమార్జున నకుల సహదేవుల కౌగిలించుకొనెను. విరాటుడు తన సర్వస్వము రాజ్యము ధర్మజున కప్పగించి తాను సేవించుకొనెదననెను. ఉత్తరుని పలుకులతో సుశర్మనోడించి ధర్మజాదులు, కౌరవుల నోడించి యర్జునుడు, సంపాదించిన రాజ్యము వారిదె వారికి మనమిచ్చుట యెట్టిది? అనగనె ఉత్తర నిచ్చుట కంగీకరించిరి. కాని అర్జునుడామెను భార్యగా స్వీకరించుట కిష్టపడక కోడలుగ స్వీకరించుట కిష్టపడెను. హరికి మేనల్లుడైన అర్జునపుత్రు

దభిమన్యుడు మహా పరాక్రమశాలి, అందగాడు, చిన్నవాడు. కాని వానికి పిల్లనిచ్చుట, దాన అర్జునుడు వియ్యంకుడగుట విరాటునకు మిక్కిలి ప్రియముగా నుండెను. ఇక సైరంధ్రికాదు. ఆమె మహారాజ్ఞి కనుక ఆమెను గౌరవింపుమని సుధేష్ణకు కబురుచేసిరి. ఆనాడు పాండవులకు విరాటుడు విందుచేసెను. వారు మంచి యుల్లాసమున నుండిరి. ఆ మరు నాటి నుండి విరాటుని సాయముతో పాండవులు తమకు వేరుగా డేరాలు వేయించుకొనిరి. ఆ చోటునకు ఉపప్లావ్యమని పేరుంచిరి తమ పేర ఖర్చు వ్రాయించుచు ఆహారపదార్థముల తెప్పించుకొనుచుండిరి. తమకు రాజ్యము ప్రాప్తించి నప్పుడు బాకీ తీర్చెదమని వారి యభిప్రాయము. ధర్మజుడు విడిగ మరియొక చోట శిబిరములందుండుటచే ప్రజలు కూరలు పెరుగులు మొదలగు పదార్థములు, ధనములు. ధాన్యములు వలసినవెల్ల ధర్మరాజునకు బహుమతిగా నిచ్చుచుండిరి. వానితోనె వారి శిబిరముల యందలి కోశాగార ములు నిండిపోవుచుండెను. ఇక బంధముక్తులగు రాజులు అజ్ఞాతవాసము నుండి బయటపడిన ధర్మజునికి నాప్రితో నిచ్చు ధనముల కంతము లేకుం డెను. ఇట్లుండి ఉత్తరాభిమన్యుల వివాహము సాగించిరి. యాదవ పాంచా లాదులందఱు సర్వస్వము తెచ్చిరి. మహా వైభవముగ వివాహమహోత్స వము నెరవేరినది.

ఇక ఐదవరోజు కృష్ణుడొక సభ నేర్పాటుచేసి పాండవుల రాజ్య ప్రాప్తిని గూర్చి ముచ్చటించి ఒక దూతను బంపి అడిగించిన, వారు రాజ్యమిచ్చిన సరే, కాకున్న రాజులనెల్ల బిలిచి చివరకు మమ్ము బిలువుం డనెను. అందులకు బలరాముడుపాండవులు ధర్మాత్ములయ్యనుపాయముగా నడచుచు చివరకు పొరపాటుపడి తప్పటడుగు వేసిరి. ఏలయన జూద మాడి రాజ్యభ్రష్టులైరి, వారు తెలివిగలవారై గెలిచిరి. కావున కౌరవుల తప్పు లేదు. అని అందుచే పాండవులే దూతనంపి తమ రాజ్యమును దేహి యని సౌమ్యముగా నడుగుట సమంజసమనెను. అందులకు సాత్యకి బల

రాముని ఆక్షేపించెను. ధర్మరాజు వేడుకపట్టి జూదమాడలేదనియు, ఈమాట బలరాము డనరాదనియు త్రాగుబోతు మాటలుకూడ దనియు ఆక్షేపించెను. అంతియగాక దూతనుబుచ్చి ధర్మరాజున కుచితంబుగ కౌరవులు రాజ్య భాగము నిచ్చిన గౌనుట సమంజసమని బల్కెను. దుర్యోధనుడు చక్కగ మార్గమునకు రాకున్న బాణములతో త్రోవకు తెచ్చెదనని సాత్యకి భీకర ముగ బల్క సభవారందఱు, అతని మాటలే సమంజసమనియు బల రాముని మాటలేమి మాటలనియు ఆక్షేపించిరి. అపుడు కృష్ణుడు సభ చాలించి గృహమునకు పోబోయెను. మరియు నెవరినైన ముందు దూతగ బంపి చూచి, పనికాకున్న తరువాత యుద్ధము చూతమనియు ముందుగనే రాజులందఱకు కబురుపెట్టుమనియు, పాండవులకార్యభారమంతయు ద్రుపద మహారాజుదే యనియు చెప్పిపోయెను.

ముందు ద్రుపదపురోహితుని రాయబారిగ పంపనిశ్చయించి యట్లే గావించిరి. ఆతడు కౌరవసభకేగి ప్రత్యేకముగ భీష్మద్రోణుల కట్టుకొని, చివరకు సభతో మాటాడ నుంకించెను. పాండవుల కెట్లయినను తేజోలాభము కలిగి రాజ్యమువచ్చునట్లు చేయుటయే. పురోహితుని కోరికసమ్మతించి పాండవరాజ్యము వారికిచ్చివేయుడనియు. లేకున్న ధృతరాష్ట్రునకు బుద్ధికలుగునట్లు చెప్పుడని పెద్దల కోరియు ద్రుపదుని పురోహితు డెన్నియో పాట్లుపడెను. ఈపురోహితుని భాషణములువిని భీష్ముడు విప్ర స్వాభావికమై కొంచెముతీక్ష్ణముగానున్నను ధర్మనిరూపణముచేయుటయందు సర్వోత్తమమైన మాటలని కమ్మకొని పలికెను. దుర్యోధనుడు పాండ వాజ్ఞాతవాసము పూర్తియైనదా లెక్కచూడుమని భీష్ముని ప్రశ్నింప, ఆత డుత్తరగోగ్రహణమునాడే ఆసంగతి విశదమైనదని తెల్పెను. అవుకు సంవత్సరమునకు మూడువందల అరువది జనపకట్టలుకొను పెద్దమనిషి ఇంకొక నలువదికూడ కొనరాదా? అని అడుగువారి అవివేచాలునని సమాధానము చెప్పగా, అప్పుడప్పుడు తిథుల పెరిగి త్రిద్యుస్పృక్కులని వచ్చు

గదా కొన్ని కట్టలు పెరుగవలసి వచ్చునన అవములువచ్చి కొన్ని తిథులు తగ్గునుగాన సరిపోవుననెను. భీష్ముని, పాండవుల లెక్కయది భీష్ముని మాటవిని నమ్మక దుర్యోధనుడు అజ్ఞాతవాసము కాకముందె అర్జునుడు బయలుపడెనని దీనికి నుచిత మాచరింపుమని ధర్మజునకు కబురుపెట్టెను. ధర్మరాజు లెక్కసరిగా నున్నందున నిండెననుము అని బదులుచెప్పెను. తర్వాత సాత్యకి ద్రుపదులు ఒక్కొక్క అక్షౌహిణి సేనతోవచ్చి పాండవులతో చేరిరి. కృతవర్మ అక్షౌహిణితో దుర్యోధనుని చేరెను. ఇక శల్యుడు నకుల సహదేవుల మేనమామ. ఇతనిని కాషీహోటలు స్నేహముతో తన వైపు త్రిప్పుకొనవలెనని దుర్యోధనుడు తలంచెను. కాన మారువేషములతో తిరుగుచు శల్యుని ప్రయాణమునకు సౌకర్యముల నొదకూర్చుచుండెను. అందులకు సంతసించి శల్యుడు దుర్యోధనునివైపు యుద్ధము చేయుటకు నిశ్చయించెను. అంతటితో నూరకుండక పాండవుల చూచి వచ్చెదనని వెళ్ళి, అవసరముకల్గిన వారికి సాయముచేయగలనని పాండవులకును తాను కర్ణునకు సారథియైనచో అర్జునుని కనిపెట్టి యుండెదనని మాటనిచ్చి వచ్చెను.

ఇక కృష్ణమందిరమున కృష్ణుడు నిద్రించియుండగా ముందు దుర్యోధనుడు, పిమ్మట అర్జునుడును వెళ్ళిరి. దుర్యోధనుడు కృష్ణుని శిరమువైపు సింహాసనము నధిష్ఠించియుండెను. అర్జునుడు వినమ్రుడై పాదములచెంత నిలువబడియుండెను. కృష్ణుడు ముందుగనే యర్జునుని చూచి, యేమికావలయునో ముందుగ్రవానిని కోరుకొనుమని యడిగెను. తర్వాత దుర్యోధనుజూచి యేమిపని యన యుద్ధమునకు సాయముకోరి ముందువచ్చితినిగాన నాకేసాయముచేయుమని కోరెను. పదివేలమంది నారాయణ గోపాలబలము లొకవైపు, యుద్ధము చేయక ఊరకయుండు నేనొక్కడ నొక్కవైపు, ఈ రెంటిలో చిన్నగాన ముందుకోరవలయువాడు అర్జునుడనెను. అర్జునుడు కృష్ణునే కోరుకొనెనుగాని దుర్యోధనుడు

మాత్రము అర్జును తెలివితక్కువవలన కృష్ణుని మాయచేసి గొప్పబలము సంపాదించితినని యుత్సాహముతో బోయెను. ఇక బలరాముడు యుద్ధము చేయదలంపక తీర్థయాత్రలకు పోవనిశ్చయింప కృష్ణ దండులకు సంతసించెను. అర్జునుడు కృష్ణుని యుద్ధముచేయకున్న మంచిదియే సారధిగ నుండుమని కోరెను. పాండవులు అరణ్యావాసమునకుపోవునపుడు ద్రోణుడు వారిని అనుసరింప నిశ్చయించెను. కాని ఆకాశవాణి పాండవ పక్షమున నున్నచో యుద్ధమున ధృష్టద్యుమ్నునకు సర్వసేనాధిపత్యమును, నీకు అంతకంటె తక్కువ ఆధిపత్యమును కల్గునుగాన, నీవు కౌరవపక్షముననే యుండుట మేలని పల్కినది. ఇక ద్రుపదపురోహితుని రాయబారమునకు ధృతరాష్ట్రుడు నీవు పొమ్ము. నేను ఆలోచించి తగినవాని పాండవులవద్ద కంపెదనని బ్రాహ్మణు పంపివేసి, సంజయుని రాయబారమునకు ఉపప్లావ్యమున కంపెను. తరువాత సంజయుడు ధర్మజుని చూచుటకై బయలుదేఱిపోయెను. అపుడు శ్రీకృష్ణుడు అర్జునుడున్న దేరాకుపోయెను. కబురుచెప్పగానే శ్రీకృష్ణుడు లోనికిరమ్మని అంగీకరించెను. సంజయుడు వేషముమార్చి లోనికిపోగా అర్జునుడు పాదపీఠమును సమర్పింప నాతడు దానిపై చేతులుంచి తాను క్రిందకూర్చుండెను. తర్వాత సంజయుడు కార్యము ముచ్చటింపగా అర్జునునికన్న మున్నుగా శ్రీకృష్ణుడు వారి దుర్న యముల నుచ్చరించి వారు చెడువారుగాని, బాగుపడువారు కారనిచెప్పెను. మరునాడు ధర్మజుని నిండుకొలువులో సంజయుడు మాటలాడెను. సంజయుడు భక్తుడు, ధర్మజ్ఞుడుగాన వెలితిలేకుండ పలికెను. కాని పంపినవారు నీవేమైన నిచ్చెదమన్న సంజయుడింక బాగుగ మాటాడువాడు. వారుపాలు పంపని లేకుండ పాండవుల శాంతుల చేసిరమ్మన్న చేయునదిలేక ఈ మూలముగా ధర్మాత్ముదవు అజాతశత్రునిచూచుభాగ్య మబ్బెనని తన్మాత్రముసకే వచ్చెను.

సంజయు నంపినందుకు ధర్మజుడు కొంత చిదిముడిపాటు

నొందెను సంబంధముకలవారి నేరినైన బంపక అస్వతంత్రుడగు సంజయు నంపిరేయని యాతనిబాధ. సరే! ధర్మరాజు తమకు రాజ్యమిచ్చుట న్యాయ మని సంజయునితో చెప్పెను. అందులకు సంజయుడు చిక్కకుండ, దక్క కుండ చెప్పుచుండెను. మరియు కోప ముపసంహరింపుమనియు, బంధువుల చంపి పాపముకట్టుకొనెదవా? నీ యట్టివాడవని పల్కెను ఇక ధర్మజుడు ఆతతాయిలను పాములవలె చంపవచ్చుననియు, అట్లుచేసిన భ్రూణహత్య దోషము పోవుననియు, అసలింతకును భీష్మద్రోణులు మిన్నకుండుటచే! నింతవట్టినదనియు చెప్పెను. మరియు యుద్ధము చేయవలసి వచ్చెనని ధర్మజుడు బాధనొందగా సంజయుడు – ఇంతవరకు మీకు గడువలేదా! ఇప్పుడు మాత్రము గడువదా! కాబట్టి యుద్ధమేల? మీరు శాంతులు గదా! అని సమాధానించెను. కౌరవులు దుష్టులై మీకేమియు నీకున్నను నీవు యుద్ధముచేయుటకంటె భిక్షాన్నముతినుట మంచిదనెను. అందులకు కృష్ణుని కన్నులును ఎఱ్ఱబడినవి. సభలోనున్న రాజులెల్ల కోపించిరి. ధర్మజుడెట్ట కేలకు ఐదుగురికి నైదూళ్ళిచ్చునట్లు చేయుమని సంజయునితో పల్కెను. అందులకు కృష్ణుడును సమ్మతింపలేదు. కారణము కౌరవులతో రాజీబడినచో వారి దుర్మార్గమును సాగనిచ్చినవార మగుదమని భావించి యొప్పుకొనలేదు. కావున సంజయు డున్నవిషయములెల్ల మొగమోటమి లేకుండ నన శ్రీకృ ష్ణుడీ రాజీ కుదురునదికాదు. అయినను నేనైన అచ్చటకువచ్చి భీష్మాదుల తోడుచేసికొని చెప్పిచూచెదను. అట్లయిన కౌరవులు పాపమునకు, చావుకు తప్పి బ్రదుకుదురేమోయని కృష్ణుడు చెప్పి సంజయు నంపెను. సంజయు డారాత్రి హస్తిపురమునకేగి ధృతరాష్ట్రిశీలము మంచిదికాదని నిందించి మరునా డచ్చట జరిగిన విశేషములు చెప్పుదునని యింటికిపోయెను.

21

ఇక నాటిరాత్రి విదురుడు-జూదపుసిరి కానపడంగరాదని చెప్పుచు, ధర్మరాజు అప్రమేయ గుణపూజ్యుడని ధృతరాష్ట్రునితో చెప్పెను. మరియు నీతుల నెన్నింటినో తెలియచేసెను. భగవద్భక్తులలో నుత్తమోత్తములు విదురసంజయులు. సంస్కృతమున నీవిషయమంతయు ప్రజాగరపర్వమను పేరుతో నున్నది. విదురుడు స్మరించి సనత్సుజాతుని రప్పించెను. వీనిచే ధృతరాష్ట్రునకు తత్త్వోపదేశము విదురుడు చేయించెను. సనత్సుజాతుడు విద్య-అవిద్య అను రెండు కలవనియు, విద్యచే నవిద్యను నిరసింపవలెన నియు, రెండక్షరములు సంసారము, మూడక్షరములు మోక్షమనియు నవి- "మమ, నమమ" అనునవి అనియుచెప్పి ఆ ధృతరాష్ట్రుడడిగిన ప్రశ్న ములకెల్ల సమాధానముచెప్పుచు తత్త్వోపదేశముచేసి పోయెను. సంజయుడు తొలుత ధర్మరాజు చెప్పినట్లు పిన్నపెద్దలకు ఆశీర్వచన నమస్కారములు తెలియజేసి, ధర్మరాజురాజ్యము మాయదియని చెప్పినట్లుకూడ వివరించెను.

అసలు వాస్తవము విచారించినచో ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడగుటచే పాండురాజే రాజాయెను. కొడుకులు మైనర్లుగా నుండ పాండురాజు మరణించెను. మైనరు వెళ్ళగానే హస్తిపుర సామ్రాజ్యమున పట్టాభిషిక్తుడై ధర్మరాజు ఐదేండ్లు రాజ్యముచేసిన తర్వాత దుర్యోధన ధృతరాష్ట్రుల దురాలోచనమున పాండవులు కాశీకేగుట, లక్కయిండ్లతో కాల్చుట, అయి పాండవు లజ్ఞాతులై యక్కడక్కడ తిరిగి ద్రౌపదిని వివాహమాడి మరలవచ్చి, హస్తిపుర సామ్రాజ్యము మరల నైదేండ్లు ధర్మరాజు నాధిపత్యముతో చేయుచుండిరి. అప్పటికి రాజ్యము పాండవులది యనితేలినది.

కదా ! కాకున్న ధర్మజునకన్న మున్నుగా దుర్యోధను నేల అభిషేకింప రాదు ? అప్పుడు ధృతరాష్ట్రి మాయోపాయమున రాజ్యము విభక్తమైనది. అప్పటికి అర్ధరాజ్యమైన పాండవులకు కలదుగదా ! వారి పురనిర్మాణము, రాజ్యనిర్వహణము అరువదినాలుగేండ్లు జరిగిన తర్వాత జరాసంధుని చంపి రెండువంతుల రాజ్యము, ఈ యర్ధరాజ్యము కలుపుకొని రాజసూయాదులు చేసి మహావైభవమున నుండ నోర్వలేక పిలిచి జూదమాడి పరాభవించి పిదప ధృతరాష్ట్రుడు ఈ రాజ్యము మీదియే. అది సుహృద్ద్యూతము, అని రాజ్యమునిచ్చి పంపెనుగదా ! పునర్ద్యూత మని పిలిచి రాజ్యముతో సంబంధము లేదు. ఈ పందెమున నోడిన పన్నెండేండ్లు ఆరణ్యవాసము ఒకయే డజ్ఞాతవాసము చేయవలెను. అజ్ఞాతవాసమున కనుగొన్న మరల పదమూడేడులు అట్లు చేయవలెను, ? అని పందెము పెట్టి ఆడిన ద్యూతము ప్రకారమైనను అనుకొన్నట్లు పదమూడేండ్లు నిర్విఘ్నముగ, అరణ్యాజ్ఞాతవాసము లొనరించివచ్చిన వారి రాజ్యభాగము వారికీక కాజేయుటకు దుర్యోధన ధృతరాష్ట్రులకేమి యాధారము కలదు. కాన రాజ్యమంతయు మాయది. తుష్యతు దుర్జనః- అను న్యాయముతో మొదలి రాజ్యము మీదియనిన, మా తండ్రి సంపాదించిన రాజ్యము మాకిండు, కానిచో నదియు మీరే కైకొని మేము ఇంద్రప్రస్థములో నుండి సంపాదించిన మా రాజ్యము మాకిండు? అదియు కాకపోయిన మాకయిదుగురకు ఐదూళ్ళిచ్చి తక్కినదంతయు మీరే గైకొనుడు, అని ధర్మజుడు చెప్పెను. మీరేమి అనెదరనుమని సంజయుడు గట్టిగా చెప్పెను.

దీనినిబట్టి పాండవుల రాజ్యము పెద్దదియని తోచుచున్నది. అందునను రెండువంతులు జరాసంధునిది. ఒకవంతు మాత్రమే పాండవులది యగుచున్నది. కాబట్టి మొత్తముమీద జరాసంధ వధానంతరము రాజ్యము మరింతపెరిగి, రాజసూయమునకు పూర్వమే జరాసంధరాజ్యము కలయుటచే పాండవుల భాగమే పెద్దది యగుచున్నది. ఇది అంతయు నిచ్చుటకు

ఇష్టపడకున్న ఐదూళ్ళయిన నిమ్మనిరని సంజయుడు మొగమాటమిలేకుండ చెప్పెను. దీనివలన సర్వశాంతి యగునని పల్కెను. ఇందులకును కర్ణ దుర్యోధను లంగీకరింపలేదు. నన్నయగారు తన భారతభాగమున దుర్యోధన ధృతరాష్ట్రులు విగతదయాహృదయులని పేర్కొనెను. నన్నయ దుర్యోధనుని ముందు పేర్కొనుటయే ధృతరాష్ట్రుని దౌరాత్మ్యాతిశయము నొడువుచున్నది. రాజ్యమివ్వకున్నచో ధర్మరాజేమి చేయగలడని ధృతరాష్ట్రుడు ప్రశ్నించెను? రాజు లట్టివారలగుటచేతనే — రాజ్యాంతే నరకం ధ్రువమ్ — అని ప్రతిరాజును నరకమునకే పోవలయుట చెప్పబడెను. ఈ శాస్త్రములెల్ల సత్యములా అనవలదు. ఆస్తికులలో నాస్తికులలో-ఆస్తికులే నష్టపడనివారని పెద్దలు చెప్పిరి. శ్లో॥ నాస్తి చేన్నాస్తి నో హాని రస్తిచేన్నాస్తికో హతః-అని శంకరులు సెలవిచ్చిరి. నాస్తికుల మతము నిజమైన ఆస్తికులకు నష్టములేదు. ఆస్తికుల మతమే నిజమగుచో నాస్తికులకు చోటులేకున్నది. కావున రాజ్యాంతమున నరకమున్నది. కాని "యస్మిన్ మహీంశాసతి" అన్నట్లు రాజ్యముచేయు దిలీపాదులకు నరకములేదు. ఏలయన వారు ధర్మప్రభువులు. ఒకసారి దిలీపుడు రాజ్యము చేయుచుండగా బోగముసాని వస్త్రము వాయుదేవునిచే నెగురకొట్టబడెను. ధర్మముతప్పి నడచిన వానిపై దిలీపుడు కోపించి, వాయుదేవుని పట్టుకొని రమ్మని భటుల కాజ్ఞనిచ్చెను. వారు పట్టుకొనిరాగా, అట్లేలచేసితివని దిలీపుడు వాయువును ప్రశ్నించెను. అందులకా వాయుదేవుడు నిజమేయని యొప్పుకొని తనపని గాలి వీవన వేయుట యనియు, కాబట్టి తన తప్పు లేదనియు చెప్పగా, తన మనస్సున కామము లేదని చెప్పుమని దిలీపుడు వాని శిరస్సుపై చేయిపెట్టెను. అందులకు శిక్షింపుమని వాయువు దిలీపుని యడిగెను. ఇదియే నీకు పరాభవమని చెప్పి దిలీపుడు వానిని పొమ్మనెను. కాబట్టి రాజు ధర్మవర్తనుడై యుండవలయును. రాజు లంచమునకు లొంగరాదు.

ధృతరాష్ట్రున కెంతయేని మేలుచేసినవాడు పాండురాజు. ధృత రాష్ట్రునిచే నూరశ్వమేధములు చేయించెనట. సామంతులచే మ్రొక్కించె నట. అట్టిపాండున కెంతయో కీడుచేసినవాడు ధృతరాష్ట్రుడు. కాబట్టి కృతఘ్నుని పీనుగునైన కుక్కలును తాకవని విదురుడు మున్నె చెప్పెను. ధర్మరాజు రాజ్యభాగ మీకున్న యుద్ధమునకు రాగలడని సంజయుడు చెప్పెను. అందులకు దుర్యోధనుడు ఎవరితో రాగలడనియు? ధృతరాష్ట్రు డేమి తీసికొని రాగలడనియు ప్రశ్నించిరి. యుద్ధమునకు అర్జునుడు వచ్చి నచో కృష్ణుడు సారథియగును. కనుక ఆ భగవంతున కెదుటనుండి యుద్ధ మెవ్వరును చేయజాలరని చెప్పెను. ఇంకను వారి ఆయుధములు వారి శక్తిసామర్థ్యములును చెప్పెను. కానిఅట్టివారినిగూడ నెదిర్చి నిలువగలనని కర్ణుడు వల్కెను. అపుడు భీష్ముడు వానిని యుపాలంభించెను. అందులకు కోపించిన కర్ణుడు భీష్మానంతరముగాని తాను ఆయుధమునంటనని శప థము గావించెను. అంతియుగాక తాను అర్జునుని చంపువరకు కాలిగోళ్ళు తీయననియు ప్రతినపట్టెను. ఇట్లు కౌరవులలో పుట్టిన కలకలము పాండవు లకు శుభసూచకమే యైనది.

ఇక ధర్మరాజు కృష్ణుని రాయబారిగ బంపనెంచి తమ్ములతో ద్రౌప దితో శ్రీకృష్ణుని డేరాలోనికిపోయి—

కం॥ ఆపదం గడనం బెట్టగ
నోపి శుభంబైనదాని నొడగూర్పనుమా
కీ పుట్టువునకు పాండు
క్ష్మాపాలుడు నిన్ను జూపి చనియె మహాత్మా ॥

అని ప్రార్థించెను. ధర్మజుని భక్తి స్నేహ విశ్వాసములకు శ్రీకృష్ణుడు దిమ్మెరపోయి నీవేమిచెప్పిన నది నేనవశ్యత చేసెదనని చెప్పెను. దానికి

ధర్మజుడు కౌరవసభకేగి తమ లోపము లేకుండ మాటలాడి సంధికుదుర్చు కొని రమ్మని, మమ్మి ట్లు నిలువబెట్టుమని, బంధువుల చంపనోపనని పలువిధముల చెప్పెను. ఇట్లు ధర్మరాజు భీమార్జును లందఱును వరుసగా తమ తమ సందేశముల విన్పించిరి. కాని వీరందఱును ఏదో ఒకవిధముగ సంధి నభిలషించి చెప్పిరి. సహదేవుడు మాత్రము యుద్ధమే యుక్త మనెను. ఏలన భాగార్హులమగు అన్నదమ్ముల బిడ్డలము మీకు రాజ్యమిచ్చి పోయి మేము పదమూడేండ్లు అరణ్యాజ్ఞాతవాసములు చేసితిమి కదా! అట్లే మాకు రాజ్యమిచ్చిపోయి మీరును పదుమూడేండ్లు విఘ్నేశ్వరుని బొడ్డులో ప్రవేశ్యపెట్టిన వైశ్యులవలె అరణ్యాజ్ఞాతవాసముల సల్పివచ్చిన తర్వాత మీకీవలసిన రాజ్యభాగమును మేమిచ్చెదము. కాకున్నరా అరచేత ప్రాణములు పెట్టుకొని యున్నాడు. మాయలు పన్ను నేర్పులిక చెల్లవనియు పల్కెను.

ఇక పాంచాలదేశమున బుట్టి మహావీరులగు పాండవుల ధర్మ పత్నియై, ప్రతి వింధ్యాదులగన్న వీరమాతయగు ద్రౌపది తాను పరాభవ మందియున్నదిగాన, ఈ రాజీప్రయత్నములు చూచి, విని భగ్నమనో రథయై కనలి కృష్ణునితో గద్గదకంఠయై తన సొద నిట్లు చెప్పు కొనినది. అంతలంతలు పనులుచేసి దాసులకు దొరలు తిండిపెట్టరా? అదియు లేకుండ వెడలనడచి యౌరా! ఇప్పుడు హక్కు ఏమియు లేని మనవంటి సంజయునిచేత చెప్పి రాయబారమా! సారమేమున్నది! ఇచ్చునది, పుచ్చుకొనునది యేమియు లేదుగదా! శాంతింపుడనియా! శాంతింపకేమున్నది. మా పెద్దతండ్రి శాంతింపు మన్నాడు. ఇంకనేమి కావలెనని ఈ కంటినీరు తుడుచు పైపై మాటలకే యుధిష్ఠిరుడు మనసార సంతసించెను. మునుపే శాంతుడగు ఈ అజాతశత్రువునకు శాంతి సాధ నము లెవ్వి సంపాదించుకొనవలెను. యుద్ధమైన నెవరు గెలుతురో? ఎవరోడుదురో? ఓడిన చచ్చుటకన్న కష్టము అని గద- యుధిష్ఠి

రని మాటలు. ఉన్న గౌరవముకూడ పోవునట్లు తమ కీ తక్కువ దనము నేల కొనితెచ్చుకొనవలెను విచారించిన ఈ సంధి వారికి మంచిది గాని మనకు కాదు. తన వారిని కొట్టలేక చేతులాడక ఈ మెత్తబడుట కాని పోరిలో పర్దింపదలచిన కౌరవుల గెల్పు విషయంబున శంకింప బని లేదు జయము మనదే! ఏకీడైన సైపవలెననుటకు వారేమి బ్రాహ్మణులా! వీరు శాంతించినను వారు కోరిన ఐదు ఊళ్ళైన నిచ్చెదరా! ఐనను నేను పరాయిదానగాని, వారు వారు ఒకతెగ గాన వారికి వారంత మాత్రమీకుందురా! దీనికి తార్కాణము, వారు వీరు గలసి నన్ను సభ కీడ్చి జుట్టుపట్టి లాగి గుడ్డలూడ్చి పరాభవించిరిగాని వారి మర్యాదల కేమియు లోపములు లేవుగదా! కృష్ణా! యాజోపయాజుల వరముతో అగ్నికుండమునబుట్టితిని. భరతవంశమునకు పేరు తెచ్చి నిలువబెట్టిన పాండురాజునకు కోడలనైతిని. జనవంద్యులగు భర్తల సేవుర బొందితిని నీతి పరాక్రమముల నారితేరిన కొడుకుల గంటిని. కూ అనిన నొక్క దూకున నగపడు పుట్టింటి అండగలదు.

ఇవి యన్నియు నట్లుండ గుణగరిష్ఠుడవగు నీవు దేవుడవు. నీ చెలియలిని సుభద్రను జూచు ప్రేముడి చూపుకన్న మిన్నయగు గౌరవ ముతో కలిసిన బాంధవముతో సంభావించెదవు నన్ను. ఇట్టి నన్ను ఒక చెప్పరానివాడు వసుధామరుల మంత్రములతో పవిత్రతమములైన వారి ధారలతో రాజసూయావభృదమున పావనతమములైన వెండ్రుకలబట్టి ఈడ్చుచుండ బ్రాహ్మణులకే శాంతియుండదే! క్షత్రియోత్తముల కక్కటా యిట్టి శాంతి ఎక్కడనుండి వచ్చినది. అయినను జూదములో మాటపో యిన వచ్చు నసత్యమున కోర్వక సత్యసంధులు అప్పటి కూరకున్నను అప్పటినుండి యెన్నియోమారులు పదుమూడేండ్లు గడచిన శత్రువద మొనర్చెదము. నీ పరాభవ దుఃఖము పోకార్చెదము అని నను ఊర డించిన మాటలే యేట గలిపిరి. అయిన వారిజాక్షులయెడ అబద్ధము లాడ

వచ్చునని యేకవియైన చెప్పెనేమో? నా యన్నా! యిన్ని యేల? ఆలోచనము కూడ లేనివాడై కోడలిక నంకమువచ్చిన కులమునకెల్ల కలంకమనక నన్ను దాసిగ చేసిపుచ్చిన మహాపురుషుని పాలికి నా పతులు మా పెద్దతండ్రి యని సంధికి పోవుచుండ నేనును తగుదునని యా కొంపలో కోడరికంబు సేయ చెచ్చెర పోవుదునా! అటుగాక వారి దృష్టిలో దాసిని గాన శృంగారపు కట్టగొని యూడ్చిపెట్ట పోవుదునా? ఈ నాగతి నిర్ధారణ చేసి లోకవంద్యా! నీవు సంధికి పొమ్ము. ॥ రక్కసతాల్మితో ఈ పరాభవము నిన్నినాళ్ళ నిప్పునోడిలో ధరించునట్లు లోర్చితిని. ఇప్పుడు కూడ నిది ఆరకున్న నన్ను నిర్ధహింపకుండునా? తేజముగల భర్తలు, సర్వలోక పరిపాలకుడవు, తోబుట్టువగు నీవు కలిగి నన్నీ సొదతోనే చావుమనెదరా?

అన్నా! ఒక్కటి చెప్పెద వినుము. పాండవుల కౌరవుల నొక్కటిగా నుండుమనుము పాండవవీరుల ననికి తేకుము, రాజీమాటలేల? యుద్ధమును కుదుర్చుకొనిరమ్ము. నా పరాభవమును సహింపలేని నా కొడుకులు ఐదుగురు, సుభద్రకొడుకును ముందుపెట్టుకొని యుద్ధమునకు నడచెదరు. చెప్పినమాటవిను కొడుకులతో సైన్యములగొని వృద్ధుడగు మాతండ్రి వీరికి బాసటగా రాగలడు. ఇట్లు నాకసి తీరును అని ద్రౌపది యేడ్చుచు వెండ్రుకలు కృష్ణునిముందు బెట్టి, దేవా! ఆ వెండ్రుకలు బట్టి యీడ్చిన ఆ చేయి ముందు ముక్కలు ముక్కలయిపోయి దానికి మూలమగు తన దుష్కృతమును దలచి యేడ్చిన తర్వాత దుశ్శాసనుడు చావవలెను. తొడలువిఱిగి పడియున్న దుర్యోధను పీనుగును నేను ధర్మజుడు కన్నార జూడకున్న నెవరిపరాక్రమము లెందులకు? అని యేడ్చు ద్రౌపది నూరార్చి దాసీలచే వెండ్రుకలు ముడిపించి, తల్లీ! నీ యేడ్పులవంటివి కాని శత్రువుల పెండ్లాల యేడ్పులువిను సమయము వచ్చెనది. నీవు ఏడ్వనేల? నేను కొంచెము నెమ్మదిగా ఆలోచించి చెప్పిన

మాట మేరువు తిరిగినను నెరవేరకుండదు. శత్రుసంహారముచేసి, నీ పరాభవ మడగించి తేజమునవొప్పు భర్తలకనుగొనెదుగాక ! యముని వాహన మగు దున్నమెడలోని గంటల మ్రోత వినబోవు కౌరవులకు. నా రాజీ మాటలు చెవికెక్కవు. అని అనేకవిధముల ద్రౌపది నూరార్చి పాండవులు మరల మరల చెప్పు నప్పులుకుల నూకొనుచు శ్రీకృష్ణుడు రాజీయైన మంచిదేకదా ! తప్పక అది యగునని నిరుత్సాహముగ నుండకుడు. సైన్యములు, ఆయుధములు సిద్ధముచేసికొని ఎప్పటికప్పుడు సిద్ధముగా నుండుడు. సంధి కాకపోయిన పక్షమున మనము శాంతముగ మాటలాడుట పెద్దల మదికెక్కుట. వారే యుద్ధముకోరిన వారిపగిది వీరెవారిని చంపిన పాపము వారికి సంధించి, నేను పున్నెము మూటగట్టుకొని వచ్చెదను – అని చెప్పి భగవంతుడు హస్తిపురికి రాయబారిగ పోయెను.

22

శ్రీకృష్ణపరమాత్మ పాండవుల రాచకార్యము నిమిత్తము బయలుదేరి ఆ రాత్రి కుశస్థలమున నిలచి బ్రాహ్మణు లాహ్మానించ కొలది పరివారముతో విందుల నారగించుచున్నాడని గూఢచారులు చెప్ప విని, ధృతరాష్ట్రిడారాత్రి ముఖ్యులైనవారితోకొలువిచ్చి దుర్యోధనునితో సర్వలోకములకు అభిగమ్యుడగు భగవంతునకు అభిగమ్యులమైతిమి. ఇంతకన్న ఏమి కావలెను ? మన గృహములెల్ల కస్తురితో అలికించి, కర్పూరముతో ముగ్గులు పెట్టించి. చాందినీలు కట్టించి, పూలపఱపులతో అలంకరింపు

మనెను. ఆ దుర్యోధనుడు మనయిల్లు మనము అలంకరించుకొనుటయే గదా : దీనిలో నష్టమేమియని మనసున తలచి అంగీకరించెను. సంతోషా వేశమును అణచుకొనలేక మఱియు ధృతరాష్ట్రుడు అందరు వినుచుండగ నాయింటిలోగాని, దుర్యోధను నింటిలోగాని, దుశ్శాసను నింటిలోగాని, ఇంకను మనవారి నివాసములలో నేయేవస్తువు శ్రీకృష్ణున కింపునింపునో, అదియెల్ల ఆ దేవునకు నే నొసంగెదనని బిగ్గఱగా చెప్పెను. దానికి విదురుడు నీకు ఉపకారముచేసిన తమ్ముని కొడుకులకు ఐదు ఊళ్ళు ఈయలేని నీకు ఇంతట త్యాగబుద్ధి యెక్కడనుండి వచ్చినది ? నీ తలపు నేను కనుగొంటిని ఏదో ఒకవిధముగ శౌరిని లంచమిచ్చి మోమోటబెట్టి పాండవుల కేమియు లేకుంట ఎగురకొట్ట నెత్తిన యెత్తిదిగా తోచుచున్నది. మేరువంత ధనరాశి నిచ్చినను శ్రీకృష్ణ డర్జును నెడబాయునా ? ఇవి అన్నియు నక్కరలేదు, పాండవుల పనికై విజయముచేయు ఆ దేవుడు చెప్పిన పలుకులు మర్యాదగా విని అంతయో ఇంతయో వారలకిచ్చి సమాధానపడుటయే ఆస్వామి నారాధించుట యగును కాన అపనియందు జాగరూకుడ వగుమనెను.

దుర్యోధనుడదివిని విదురుడు చెప్పినట్టిదియే యగును. యాదవుడు భేదతంత్రమున పాండవులనుండి వేరుపడువాడుగాడు అదిగాక మనము వానికి లంచమిచ్చిన అసమర్థులమై యనుసరించినట్లు తలంపగలడు. కావున ఒకడుగావచ్చిన వానిమనమందఱము కలసి కట్టి కొట్టునబెట్టిన పాండవులు దిక్కులేక పరుల నడవుల కేగుదురు. వారికి సాయమైన సామంతులు కొందిశీకులగుదురు. నే నప్రతిహతముగ రాజ్య రమావిలాసముల ననుభవించెద నిది నామతము, అని తన అభిప్రాయము నెఱుకచేసెను. అదివిని భీష్మాదులెల్ల దిమ్మరపోయి యిట్టి అవినీతులకేమి చేయగలమని దిగ్గున లేచిపోయిరి. ధృతరాష్ట్రుడు అశక్తతతోప కొడుకుతో దేవుడు అఘటన ఘటనా పండితుడు. సర్వలోకైక వీరుడు. జ్ఞాతులమగు మనల గలసి మెల

గుడని చెప్పుటకు దూతగా వచ్చుచున్నాడు. అట్టివాని బాధింపరాదని రాజ నీతి. ఇదిగాక భగవంతుడు ఇంటికివచ్చుట ఇంతటిమేలని చెప్పశక్యమా ? అతండేమి చేసెరా పాపాత్మా ? అని భర్త్సించెను. ఇట్లులా రాత్రి వేగెను. కృష్ణుని మరియాదగా తీసికొనివచ్చుటకు తగినవారి నంపిరి. దేవుడు కాల కృత్యములు తీర్చికొని వీరి అహ్వానముతో వచ్చుచుండ దుర్యోధనాదు లెదురేగిరి.

శ్రీకృష్ణుడు హస్తిపురికివచ్చి మొగసాలవద్ద రథము డిగ్గి సాత్య కియు కృతవర్మయు నిరుపార్శ్వముల రాగా దుర్యోధనాదులు ముందు సందడిబాపుచుండ ధృతరాష్ట్రుని కొలువునకు వచ్చి ఉభయకుశలోపరి, పాండవుల సౌజన్యము విశదమగునట్లు ధర్మజుడు చెప్పినరీతి పెద్దలకు నమస్కారము, సములకు నాలింగనాది గౌరవములు, చిన్నలకు దీవనలు చెప్పి కొంతతడికి దుర్యోధను నింటికి బోయి అచ్చట ముచ్చటలతో దుర్యోధనుడు తాను శ్రీకృష్ణునకు చేయించుచున్న విందును వీనులవిందు జేయ నా దేవుడు మెల్లగా తానావిందు కుడువనొల్లనని చెప్పెను.

దుర్యోధనుడు కర్ణాదుల గలుపుకొని మారాజున కిష్టుడవు, మాకు బంధుడవు మాయింట భుజింపనమటకు తగినకారణము లేదనెను. భగ వంతుడు వాని చేయి చేత తెమల్చుచు నేను ప్రస్తుతము పాండవ కార్యా ర్థిని. దూతను నేను నీయింట భుజించిన తరువాత కార్యము నెరవేర కున్న కృష్ణుడు వారిసొమ్ముతిని మోమోటపడి కార్యము చెఱచెనందురు దూతలు ముందుగా శత్రులింట భుజింపరాదు. వారును వారిం గుడువబెట్ట రాదు. దైవవశమున దేహమున కేతెవులు వచ్చినను అది వారిదుష్కృతి యందురు. మేము శత్రువులమా అందువేమో ? సందేహమా ? నాకు పాండవులు ప్రాణములు. వారినిజూచి సైపనివాడవు నీవు. ప్రాణముల బాధించువారు శాత్రవులే కారా ? నీవు ప్రేమగా పిలిచి పెట్టుటలేదు. నాకా పద యనగా నన్నము పెటువారు లేకపోవుటలేదు. కాన నీయింట నిప్పుడు

కుడువనొల్లను. నీవారల ఇంటను భుజింపను. ఈ యూరిలో విదురు డొక్కఁడు యోగ్యుడని అతని అన్నము తినదగినదని నిర్ణయించితిని. కాన అచటకు పోయెదనని చెప్పి - యొప్పించి లేచిపోవుచుఁడ ముందుగా ఇండ్లకు పోయివచ్చి దారిలో శ్రీకృష్ణుని-మాయిండ్ల కానుక లాయత్తము చేసి వచ్చితిమి మహాత్మా ! విజయముచేసి వానినెల్ల గ్రహింపవలయునని ప్రార్థించు భీష్మద్రోణాదులతో మీ యందఱ యిండ్లకు వచ్చినట్టే మీ కానుకలెల్ల గ్రహించినట్టే యని విదురునితో వాని యింటికేగెను.

భీష్మాదులును మోములు చిన్నబుచ్చుకొని యిండ్లకేగిరి. దీనిలో దేవునియభిప్రాయము—అన్నలు తమ్ములు జూదమాడినను వారిరాజ్యము వీరు, వీరి రాజ్యము వారు లాగుకొనినను మీరు సంబంధము కలిగించుకొన వచ్చును ఊఁగకుండవచ్చును. కాని ఒక మహాసభలో సామాన్యస్త్రీకి పరాభవమగుచున్నను సమర్థులు సైచి చూడరాదు. అందున దేవాంశలో అగ్ని కుండమున జనించిన ప్రసిద్ధయగు రాజ్ఞికి పరాభవము జరుగుచుండ శక్తి కలిగి వారింపకుండుట, అదిచేతగాకున్న లేచిపోకుండ అక్కఁడనే చూచు చుండుట యిది అనుమోదించుట అను నేరమున చేరుచున్నది.

శ్లో॥ కర్తాకారయితా చైవ ప్రేరకశ్చానుమోదకః
సుకృతే దుష్కృతే చైవ చత్వారస్సమభాగినః ॥

అని యున్నదిగాన, మీరపరాధులలో భాగస్థులుగాన మీ కానుక లక్కఱ లేదని దేవుని అభిప్రాయము. అది యెఱిగిన భీష్మాదులు కన్నములో తేలుకుట్టిన దొంగలవలె సరిబుచ్చుకొనిపోయిరి. భగవంతునకు భక్తుడగు విదురుని యింట విందెట్లు జరిగెనో ? అది అవాఙ్మానసగోచరము, అనుభవైకవేద్యము. విదురుడు రాచకార్యము ప్రసంగించి రాత్రి చెప్పిన దుర్యోధను దురభిమానమును వ్యక్తపఱచి ఈరాత్రికి నీవేల వచ్చితివి ? ఇంత టితో బొమ్మనెను. బంధువులలో విరోధమువచ్చి కొట్టుకొనుచుండ

శ్రీకృష్ణు డడ్డమువచ్చి వారింపకపోయెను, అని లోకులు అనుకొనకుండ రాజీకి తగిన ప్రయత్నమంతయు శక్తి వంచనములేకుండ చేసెదను. మంచి పనిచేసి దానివలన పుణ్యము నార్జించెదను కాదనిన దుర్యోధను నెత్తిన ఈపాపమెల్ల గట్టిబోయెదను. వారేమి చేయుదురోయని భయపడవలదు. నేను నిక్కమల్గిన అందు ఒక్కడేనియు బ్రదుకజాలడు అదియును పాండవులకు మేలేయని సమాధానించి నిదురపోయి మరునాడు తగురీతి దుర్యోధన ప్రభృతులాహ్వానింప ధృతరాష్ట్రుని నిండుకొలువున కా స్వతంత్రుడు పోయెను. మునులు భగవంతుని సంధివాక్యచాతుర్యమునువినుటకు విచ్చేసిరి. పౌరులు, జానపదులు,యుద్ధార్థమువచ్చినరాజులు, నిండిన కొలువున శ్రీకృష్ణు బూజించిరి. కృష్ణున కిరుపైపుల సాత్యకి కృతవర్మలు కూర్చుండిరి. వెనుకపీఠమున చేతులుమోపి విదురుడు కూర్చుండెను. తక్కినవారెల్ల నుచిత పీఠముల కూర్చుండిరి. కర్ణ దుర్యోధను లేకాసనమున నుండిరి. అందఱు వింజంబాకిడినభంగి నవశము దాకారితచిత్తవృత్తులై యుండగ, ఆ సర్వవందితుడు సభ్యులనెల్ల ఆదరముగ జూచుచు స్మిత పూర్వముగ ధృతరాష్ట్రు నామంతించి యిట్లు పలికెను.

"భరతవంశము ధర్మమునందు పరాక్రమమునందు పేరుపడసినది. అందు శంతనుడు వంశకర్త. సర్వసమర్థుడగు భీష్ముడు తన తండ్రికై రాజ్యము వదలుటచే వాని ప్రత్యక్షమున సవతితల్లి కొడుకు చిత్రాంగదు తరువాత విచిత్రవీర్యుడు రాజ్యముచేయుచు స్వర్గతుడైనవాని క్షేత్రముల యందు ధర్మముగ క్షేత్రజ సంతానము సంపాదించి భీష్ముడు వంశ మంతరింపకుండ కాపాడెను. అందు నీవు నీతమ్ముడు పాండురాజు ధర్మాత్మురులము నీ యింద్రియ వైకల్యమున పాండురాజు రాజ్యముచేయుచు నిన్నను వర్తించుట లోకవిదితము. వాని కుమారులైదుగురిని వాని యనంతరము మునులు మీకుఅప్పగింప తగురీతి బెంచి వారినిరాజ్యములం దభిషిక్తులచేసి వారివలన తేజోలాభముల నందితివి. వారు దిగ్విజయ మొనరించి రాజ

సూయోధు లొనర్చి మహావైభవముననుండ నీకొడుకు జూదము నెపమున వారి భంగపెట్టి అడవులకు బంపుట లోకవిదితము. వంశక్రమాగతమగు సుచరిత్రక్రమ మిప్పుడు తప్పనేల ? వారి బిలిపించి తగు పదవినిలిపి వంశ ప్రతిష్ఠనిలుపుకొనుము. ఎంతయున్నను చాలకుండునట్టులుండుటస్వభావము: దాని మార్చుకొనజాలినప్పుడే పురుషుని పౌరుషము. కావున మామా . ఆలోచింపుము. మాతండ్రిచెప్పినట్లు అరణ్యవాసము, అజ్ఞాతవాస మట్లొ నర్చివచ్చిన మాకు మాభాగ మీక ఎవ్వారేమి చేయగలరు. ధనకనక వస్తు వాహనాది భోగసమయముల మాపెద్దతండ్రి మమ్మును వెలిబెట్టి తన కొడుకులనే అనుభవింపజేయునా? ఆతడు బ్రతికియున్న నూరేండ్లకుమాకు నాయన కన్న వేరుగా నొరులు రక్షకభటులు లేరు అని పాండవులు చెప్పు మనిరి నీవేమనియెదవో ? అనుము. నీకొడుకుల మదినున్న లోభము మానిచి వారిని నీలోనికి దెచ్చుకొనుము. నీయందలి భక్తితో వారిట్లను చుండిరిగాని వారేమియు ననదుగారు. అవి అన్నియును తలంచుము. నే నా వైపుననుండి వారితో వచ్చుచుండ నాకెదురై మీరు గెలుపుగొనలేరు. నిశ్చయము. నా ప్రార్థన నంగీకరించి వారి నీలోనికిదెచ్చుకొని కీర్తి నొందుము. నీ కొడుకులు నూటయైదుగురునై భీష్మాదులు మేలుగోరుచుండ రాజలోక మెల్ల నీకు భృత్యులై మెలగ అటునిటు యుద్ధమునకు వచ్చినవారెల్ల ఉల్లాసముతో ఇండ్లకేగ జగము మేలెట్లుండునో అటు చూడుము" అని ఈవిధముగా భగవంతుడుచెప్పి,మునులచేచెప్పించి,ఇందు ఎవరికి కీడైనను నీకు దుఃఖము తప్పదు. విమర్శించుకొనుమని చెప్పెను భీష్మాదులును చెప్పిరి.

ఇవి యన్నియు లెక్కసేయక, దుర్యోధనుడు దేవనితో కృష్ణా ! విచారించినచో నావలన నేమియు తప్పులేదు. ధర్మజుడని పేరుగాని జూదపువ్యసనముగల ఆరాజు శకునితో జూదమాడి ఓడిపోయెను అతడు దానిలో తెలివిగలవాడగుటచే గెలిచెను. నామంచితనముతో ఆ శకుని వలన నాకుకొంత సంక్రమింప వచ్చును. ఇంతమాత్రముతో జూద గాండ్ర జూదము వారించుటకుగాని వారు ఓడినధనముల వారికిప్పించుటకు

గాని నాకూచి యేమిగలదు పాండవులు లేనినేరములన్నియు నాపై మోపి పలువుర ద్రోవుచేసికొని నాపై నెత్తి విడిసిరిగదా! ఇదితెల్లము. ఇదంతయు జూచి ఆత్మరక్షణమునకై నాకు తగిన వారల నేనును ద్రోవుచేసికొంటిని. ఇంత అయిన తర్వాత భయమేటికి? అది కాక నా చిన్నతనమున అంధుడైన మాతండ్రి తమ్ముని కొడుకులని పక్షపాతముతో ఏదియైన సంక్రమింపచేసినను న్యాయమునకది యెల్లయెట్లు లొప్పుకొందును? పాండవులకు వాడి సూదిమొన మోపినంత భూమియు నీయను. వారేమి సేయుదురో సేయనిమ్ము వారుగాని మేముగాని సంగ్రామంబునం జయంబుగొని రాజ్యముచేయుట నిశ్చయించితిని. అని వక్కాణించెను అనేకు లనేకవిధములచెప్పిరి. మనవంశములో పెద్దవానికి రాజ్యాధికారము లేదు. ప్రతీపమహారాజునకు మువ్వురుకొడుకులు. వారిలో దేవాపి పెద్దవాడు. వాడు చర్మరోగముగలవాడగుటచే వాని రాజుగా చేసికొనుటకు ప్రజలొల్లరైరి. రెండవవాడు బాహ్లికుడు. మాతామహరాజ్యము నాక్రమించుకొని యుండి ఇది వదలుకొనెను. మూడవవాడు శంతనుడురాజాయెను. శంతనుసంతతిలో నేను రాజ్యము వదలితిని. సత్యవతి కొడుకులగు చిత్రాంగద విచిత్రవీర్యులలో చిన్నవాడు విచిత్రవీర్యుడు రాజయ్యెను. విచిత్రవీర్యుని సంతతిలో ధృతరాష్ట్రుడు గ్రుడ్డివాడగుటవలన రెండవవాడు పాండురాజు రాజాయెను. కనుక నీకు రాజ్యములో పాండవులు దయ దలచి యీకున్న హక్కేమియు లేదనిభీష్ముడు చెప్పెను.

శ్లో॥ మయ్యభాగిని రాజ్యాయ కథం త్వం భాగమిచ్ఛసి
అరాజపుత్రో హ్యస్వామీ పరస్వం హర్తుమిచ్ఛసి॥

నాకు రాజ్యములో భాగములేనిదేనీకు భాగమెట్లువచ్చును? రాజ్యము చేసినవాని కొడుకునకు రాజ్యము వచ్చును. స్వామియైనవాడు సంపాదింపవచ్చును. నివు రాజ్యముచేయనివాని కొడుకువు. పాండవుల కన్న స్వామివికావు. నీవు రాజ్యముగోరుట పరధనము నపహరింపదలచుటయే యని ధృతరాష్ట్రుడనెను.

శ్లో॥ రాజ్యంతు పాండో రిదమప్రధృష్యం
తస్యాద్యపుత్రాః ప్రభవంతి నాన్యే
న్యాయాగతం రాజ్యమిదంచ కృత్స్నం
యుధిష్ఠిరశ్శాస్తువై ధర్మపుత్రః ॥

ఇది పాండురాజు రాజ్యము కాదను వారెవ్వరును లేరు. వాని కొడుకులిప్పుడు సర్వసమర్థులై యున్నారు. కాన మనకు హక్కులేదు. న్యాయముగా ప్రాప్తమైన ఈ రాజ్యమంతయు ధర్మపుత్రుడగు యుధిష్ఠిరుడే పరిపాలింపవలయును—అని గాంధారి చెప్పినది ఇట్లెందరు చెప్పినను వినక దుర్యోధనుడు కొలువుకూటమునుండి దిగ్గున లేచిపోయి, దుష్టచతుష్టయము కలసి శ్రీకృష్ణు బట్టుకొను సన్నాహమున నుండెను. అది కనిపెట్టి సాత్యకి తనవాడగు కృతవర్మతోజెప్పి యాదవ సైన్యములతో బయట వారలనెల్ల నీవు జంపుము. లోపలివారినెల్ల నే జంపెదను, అని ఏర్పాటు చేసివచ్చి శ్రీకృష్ణునితో రహస్యముగ చెప్పెను. శ్రీకృష్ణుడు దీని కింత రహస్యమేల? అందఱకు తెలియునట్లు పెద్దగా చెప్పుమనెను. సాత్యకివారి అశక్తదుర్జనతను సభకు ఎఱుకచేసెను.

అప్పుడు శ్రీకృష్ణుడు ధృతరాష్ట్రునితో మీరుమీరు అన్నలుతమ్ములు కొట్టుకొనిచచ్చుచుండ వలదని మధ్యవర్తిగాచెప్పవచ్చిన నాపైనింతయలుక ఏల? నాపైకి వచ్చిన దుర్యోధనాదులు రెండుదెబ్బలు కొట్టిన నేనొక దెబ్బ యైననుగొట్టి వారిపని చక్కబెట్టి పోఁవచ్చెదను సెలవిమ్మనెను. అప్పుడు గాంధారి ధృతరాష్ట్రులు విదురునిబంపి దుర్యోధను బిలిపించిరి. వాడు మొగము రాజుచుండవచ్చి సభలో గూర్చుండెను. అప్పుడు ధృతరాష్ట్రుడు గాంధారితో నీకొడుకెంత అవినీతుడో చూచితివా? అనెను. గాంధారి—నీ కొడుకు దుర్మార్గుడని యెఱిగి వానివెంటబడి నీవు పోనేల? వాని పెత్తనమేమికలదు? రాజ్యము పాండవులు నీకిచ్చినది. అందులో నీవు వారల కేమి యిచ్చెదవో నీనోటితో ననుము. ఎవ్వరేమి చేయగల రనెను. ధృత

రాష్ట్రుడా విషయమున నోరుమూసికొని భగవంతునితో కృష్ణా ! నాకొడుకు నెట్లయిన మాటలుచెప్పి యొప్పించమని ప్రార్థించెను. శ్రీకృష్ణు డాయా యీ మాటలు చెప్పుచు నేనొకడననియే కట్టివేయుటకు త్రాళ్ళు సంపా దించితివి కాబోలు! ఇంకను చాలత్రాళ్ళు కావలయునని నవ్వి విశ్వరూపము జూప నందరు నిశ్చేష్టులైరి. భీష్మాదులు మునులు ఆనందనిమగ్నులై ఆ రూపము గనుగొనుచుండిరి ధృతరాష్ట్రుడది తెలిసికొని ప్రార్థింప వానికి దివ్యదృష్టి ప్రసాదించిన గాంధారియు కంటిపట్టమువిప్పి దాని తిలకిం చెను. అంత నారూప ముపసంహరించి భగవంతు డూరక సభాభవనము వెలువడెను. వానివెంబడి ధృతరాష్ట్రుని సభయెల్ల వెలువడినది మును లంతర్హితులైరి. వారందరితో భగవంతుడు కుంతియింటికివెళ్ళి మేనత్తను ప్రశంసించి కౌరవసభలోని విశేషములుచెప్పి నీ కొడుకుల కేమిచెప్పె దవో ? చెప్పుము. మా యమ్మ ఏమనినది ? అని వా రడుగుదురుగదా ! అనెను

కుంతి నీ విక్కడకేల వచ్చితివి? జూదమునాడు సత్యము చెల్లించు కొన అడవిపాలైన నా కొడుకుల నేమియు అనలేక ఊరకుంటిని. దాని వలన పాండురాజు తేజమే యశమే అంతరించి పోయినది. ఇప్పుడు దాని నెనుకతెచ్చుకొనవలదా ? నన్ను వీరమాత ననిపించుమని యుధిష్ఠిరు నితో చెప్పుము చేతులబలమితో వచ్చిన కలిమి ననుభవింపుమని వారల ల్లజెప్పుము. విదుల యను వీరమాత చరితము వారలకు జెప్పుము. రాచకార్యములలో నాయంతది ద్రౌపది. దాని యిష్ట ప్రకారము చేయుమని చెప్పుము. దేనికైనను నిర్వాహకుడవు నీవే యున్నావు – అని చెప్పి వచ లెను సెలవు తీసికొని కృష్ణుడు ఉపప్లావ్యమునకు వచ్చెను.

అట్లు ప్రయాణమై పోవుచు కర్ణు నొంటరిగా తీసికొనిపోయి నీవు సూర్యుని వరమువలన కుంతికి పుట్టితివి. కాన నీవును పాండవుడవే ,

సూతపుత్రుడవు కావు. నేనీరహస్యము దెలుప విని నిన్ను పాండవులు చేర్చుకొందురు. వారికి వీరికి ప్రభుడవు నీవు – అని ప్రలోభింపచేసెను. దానికి కర్ణుడు-కృష్ణా ! ఈ విషయము నేనింతో యింతో వినియుంటిని. నీ మాటతో గట్టిగా నమ్మితిని. కాని అతిరహస్యమగు నా జన్మమిపుడు బయటబెట్టనేల ? దానివలన మాకు గౌరవము లేకపోగా అర్జునిన కోడి. వారితో కలిసితినని నాకు, కర్ణునకు భయపడి వాని గలుపుకొనెనని యర్జునునకు లోకాపవాదము కలుగగలదు. ఇంతయేల • నే నన్నని తెలిసిన ధర్మరాజు రాజ్యము నంగీకరింపడు. అట్టి ధర్మాత్ము డీ లోకములు శాశ్వతముగ నేలవలదా? మాబోంట్లెల్ల ఈ మహాసంగ్రామమున దేహములు త్యజించి ఉత్తమలోకముల కేగుదు మింతియసిద్ధాంతమని శ్రీకృష్ణు నొప్పించి వెనుకకు తిరిగి పోయెను. దీనిలో కర్ణుని పట్టుదల ధర్మప్రవృత్తి తేటతెల్లమగుచున్నది శత్రువులలోనైన మంచిని ప్రకటించుట తనవారిలోనైన చెడ్డను వెలిబుచ్చుట కృష్ణస్వామి స్వభావము.

తరువాత కృష్ణుడు హస్తిపురిలో జరిగిన సంభాషణము వృత్తాంతము నెల్ల పూసగ్రుచ్చినట్లు చెప్పి ఇక మీ యిష్టము వచ్చినట్లు చేయుడు. నన్ను గట్ట యత్నించిన వానితో నింక మీ సంధియేమి కుదురునని వేరుగ ఉపాయమేమియు లేమి తిరిగి వచ్చితినని చెప్పెను. ధర్మజుడు ఏమి చేయు మనియెదనని గ్రుచ్చి గ్రుచ్చి అడుగ యుద్ధము కాక వాని వశపఱుచుకొను ఉపాయ మొద్దియు లేదనిచెప్పెను

కృష్ణుని శిబిరమునకు పంపి తనతమ్ముల నేమిచేయుదమని సలహా యడుగ వారందరు ఇందు మనయాలోచన యేమికలదు ? భగవంతుడే అక్కడకుపోయి వారి స్వభావములన్నియు తెలిసికొని సంధికాదని వచ్చి యుద్ధమే కర్తవ్యమని గట్టిగా చెప్పెనుగదా! అదియే కర్తవ్యమనిరి. అయినను ఈదినమెల్ల ఆలోచించి రేపు మీ నిశ్చయము తెలుపుడనెను. మరునాడు వారలట్లే చెప్పిన వినివిని ధర్మజుడు అయిన మీయిష్టము నాచరింపుడనెను.

రెండువైపుల యుద్ధప్రయత్నము లుత్సాహముతో జరుగుచుండెను. కౌరవులు శకునికొడుకు నులూకుని రాయబారిగ పంపిరి. వాడు వచ్చిమీకు మగతనమున్న నడవులకేల పోయెదరు? కృష్ణుడు మిమ్మనెల్ల నొక మూకగ అమర్చి బెదరించి రాజ్యము లాగవలెనని యత్నించెను. అయూపు తప్పినది కదా! ఇకనేమి గతి? చేతనయిన అరచేతులలో ప్రాణములు పెట్టుకొని యుద్ధమునకు తరలుడు. కానిచో మరల అడవులకు పొండు. ఈ భీముడు దుశ్శాసను నెత్తురు త్రావెదనని గప్పాలుకొట్టెనుగదా! ఇంకను త్రావడేమి? దుర్యోధను తొడలు గదతో గొట్టెద ననెనుగదా! మరచి పోయెనా! కర్ణుని చంపెదనన్న అర్జునుని ప్రతిన ఏమి యయ్యెను! పదు మూడేండ్ల నుండి తూపులు త్రుప్పుబట్టెనేమో? ఇన్ని మాటలేల? మీచేత నయిన పనులు చేయుడు మీకు క్షేమిచ్చునది లేదని తెల్లమయినది కదా! భయపడి అయిదూళ్ళు అడిగితిరి. పాపమదియు లభింపదాయె! భీష్మ ద్రోణాదులు మాదిక్కు. మీకు అడియాసలు చెల్లవు అని ఇట్టివియే నోటికి వచ్చినట్లు పలికెను. దానికి రాజులెల్లరు కోపోద్ధతులైరి. దూత గాన వాని శిక్షింపకుండ ధర్మజుడు వస్త్రమాల్యాదు లొసంగెను. కృష్ణుడు వానికి ప్రతిసందేశము చెప్పెను.

ఓరీ దురాత్మా! అనినవి యెల్ల అనినట్లు జరుగగలవు. తొందర గానె అనుభవింపబోవుచు రుచులడుగనేల? నేనక్కడ చెప్పియే వచ్చితిని గదా! కల సర్వపదార్థములు యాచకులకు బంధుమిత్రులకు కొల్లబెట్టుడు అనుభవింపదలచిన కోర్కులెల్ల అనుభవింపుడు. ఆలస్యము లేదుగాన అరచేత ప్రాణము లిడి అనికి నడవుడనియు.

ఉ॥ ఎందును నెవ్వరుంబడని యెంతయు కష్టముపాటు వచ్చినఁ
గొందలమంది పాండువిభు కోడలు దవ్వులనున్న గో

విందుడ! రమ్మటంచుఁ బలవించుట యిూగగరాని యప్పుపో
లెందలపోయ ప్రవేగము చలింపక యున్నది యెప్పుడున్మదిన్॥

అనియు

గీ॥ ఇట్టియే ! దేరు గడవంగ నెందు నుతికి
నెక్కు గాండీవ మెట్టెఅ నెక్కువెట్టి
రెండు దొనలును బూని కిరీటి యనికి
వచ్చు నేడెల్లి యెందుఁ బోవచ్చు వినాశ ॥

అనియు ఇంకను వాగ్వ్యయమేల? ఆయుధముల బలాబలములు చూచుకొనుడు–కౌరవసభలో ఈ చిగురుమాట దుర్యోధనునితో ననుము.

గీ॥ బవరమెల్లియ బిరుదపై బరవసమున
వచ్చి చావును చావక బ్రదుకరాదు
కృష్ణసారధికంబగు జిష్ణురథము
తొడరి నీవెందు చొచ్చిన తోనచొచ్చు ॥

—— అని చెప్పి పంపెను. ఇక ధర్మజుడు సేనాపతి నెవని చేయుదమన– పేయేటికి ధృష్టద్యుమ్నాయత్తము జేయు మీవు సైన్యము లెల్లన్ – అని శ్రీకృష్ణుడు చెప్పెను.

ఈ మధ్యలో వ్యాసుడు ధృతరాష్ట్రుని యొద్దకు వచ్చి కృష్ణుని మాటలు వినక సంధిచేయుచుట ప్రమాదమని చెప్పగా అతడు తనకొడుకుతో చెప్పమనెను. దానికి వ్యాసముని, మైత్రేయుడువచ్చి చెప్పును. వానిమాటల వినుమని చెప్పిపోయెను. తర్వాత మైత్రేయుడు వచ్చి పాండవవీరుల నాజియందు జయించుట కష్టముగాన రాజీ చేసికొనుమని చెప్పగా ఆమునిని వాని మాటలను లెక్కచేయక దుర్యోధనుడు వెకలియై తొడలు చఱచు కొనెను. దానికి అలిగి మైత్రేయముని నన్ను అలక్ష్యము చేసితివిగాన

నీ తొడలు మహాయుద్ధమున భీముని గదతో విఱుగగలవని శపించి, ధృతరాష్ట్రుడు ప్రార్థింప పాండవులతో సంధిచేసికొనిన నా శాపము జరుగదు. యుద్ధమే అయిన నిది తప్పదని చెప్పిపోయెను.

అతిరథ మహారథాది నిర్ణయసమయమున భీష్ముడు కర్ణుని అర్ధరథుడనుటచే కర్ణుడు కనలి భీష్ముని యుద్ధసమయమున తాను యుద్ధము చేయననియు, అతడు గెలిచిన తాను వనవాసి నయ్యెదననియు, భీష్ముడు నచ్చిన తాను పాండవుల జంపి దుర్యోధను అసపత్న రాజ్య మేలించెదననియు ప్రతిజ్ఞ చేసెను. కౌరవసేనలకెల్ల భీష్ముడు సేనానాయకు డయ్యెను. భీష్ముడు మొదటనే శిఖండిని ఆడుది మగవాడైనవాడు గావున వాడు గొట్టినను నేను చూచుచుందును గాని తిరగగొట్టనని, పాండవులగొట్ట చేతులు రావని, తక్కినవారెల్ల నాముమునబడి యేమయ్యెదరో జూడుమని, మీటుగల రాజరథికుల నాటికి వేవుర వధింతుననియు పదిదినములు యుద్ధము చేసెదననియు, నఱుశరముల నన్నుదాకి పడవేయునందాక ప్రతిబలంబు వీరులనెల్ల వేటాడెదననియు, దుర్యోధనునకు బాసయిచ్చెను. ఇట్లు ఉభయ పక్షములవారును సన్నద్ధులై కురుక్షేత్రమునకు నడిచి దృషద్వతి యను నది వొంత పాండవులును, శమంతపంచకమునొద్ద కౌరవులును శిబిరములువేసి నివసించిరి.

తరువాత వ్యూహముల పన్నుకొని రెండువైపులవారు రంగమునకు వచ్చిరి. యుద్ధప్రారంభమునకు మున్ను రథముదిగి వినీతవేషముతో. చేతులు జోడించి ధర్మరాజు భీష్ముదెసకు బోయెను. వాని భావము నెఱుగలేక పాండవ సైనికులెల్ల చిన్నపోయి పలికిరి. కృష్ణుడు మాత్ర మది యెఱిగి తక్కిన పాండవులతోగూడ తాను నట్లే భీష్మునివద్దకు బోయెను భీష్ముడు మొగమటు త్రిప్పుకొని-వచ్చి మంచిపని చేసితివి దాకున్న శపింపదలచితిని. ధనమునకు పురుషులు దాసులు, నేను దుర్యోధనునితో

సర్ధసంబంధము కలవాడ నగుటచే ధర్మప్రధానుడవు, కౌరవంశవర్ధనుడవు అగు నీ కేమాత్ర ముపకారము చేయజాలనైతిని, క్లీబునివలె మాటలాడు చుంటిని, అని ధర్మజుతో తన అభాగ్యమును జెప్పెను. దానికి ధర్మజుడు పితామహా: నీవువానిసొమ్ముతిన్నందున వానిపైపు యుద్ధముచేయుము.మను మడనైనందుకు నన్ను మనసులో దీవింపుమని కోరి, అతని వధోపాయము తర్వాత రమ్ముచెప్పెద ననిపించుకొని పోయెను. ఇట్లే ద్రోణకృపాచార్య శల్యులదర్శించి ముచ్చటించి తక్కువారలకుదుర్నిరీక్ష్యుడై వచ్చి రథమెక్కి కిరీట ధనురాదుల గ్రహించి శత్రుసైన్యములజూచుచు పెద్దగా ఈకౌరవు లలో ఎవరైన మాలో కలియవచ్చిన వారి నా తమ్ములతోపాటు చూచెద నని పలికెను. అదివిని ధృతరాష్ట్రుని వేశ్యాపుత్రుడగు యుయుత్సుడుకౌర వుల దుష్టత్వము నుగ్గడించుచు నీవు ధర్మాత్ముడవగుటవలన నీలోనికి వచ్చితినని తన సైన్యముతో పాండవుల గలిసెను. అతని తనవారి కప్ప గించి ధర్మజుడు నాకు ఐదుగురు తమ్ములు. ఈ యుయుత్సుడు యుద్ధ ములో చచ్చినను నేను బ్రదుకననెను. కాన పాండవపక్షమెల్ల యుయు త్సుని యుద్ధములో కనిపెట్టి యుండవలసివచ్చెను. ధర్మపక్షమున జేరుట, మంచివాడు, పాండవుల పరోక్షమున మహారాజయ్యెను.

23

శ్లో॥ కరకమల నిదర్శి తాత్మ ముద్రః
పరికలితోన్నత బర్హి బర్హచూడః
ఇతరకర గృహీంత వేత్రతోత్రః
మమ హృది సన్నిధి మాతనోతు శౌరిః——

రెండు సైన్యములు సన్నద్ధములై యుండ జూచి దుర్యోధనుడు ద్రోణాచార్యునియొద్దకరిగి ఉభయపక్షములనున్న వీరుల నెన్ని 11 అక్షౌహిణుల మహావీరులతో సన్నద్ధమై భీష్మాభిరక్షితమగు మన సైన్యము తేలికగా కన్పట్టుచున్నది. 7 అక్షౌహిణులసేనతో భీమసేనరక్షితమగు పాండవ సైన్యము సారవత్తరముగా గన్పట్టుచున్నది. ఇదియేమని అడిగెను. అది గ్రహించి భీష్ముడు తనపక్షము దైన్యము దక్కి సయోధులు వినకుండతన శంఖమునూదెను. దానివెంటనే కౌరవపక్ష వీరులెల్ల శంఖములనూదిసింహ నాదములతో రోదసి నింపిరి. వెంటనే పాండవులును అట్లుచేసిరి. వారి నాదమున కౌరవులనాద మడగినట్లుండెను. దేవదత్త పాంచజన్యముల మ్రోతలో సర్వము నడగిపోయెను. అప్పుడు అర్జునునికోరికపై శ్రీకృష్ణుడు రథమును రెండుసైన్యముల మధ్యమున నిలువబెట్టెను. అర్జునుడుపర సైన్యమున నున్న వారలెల్ల తనవారలేనని వారల జంపుటకు సాహసింపక మెతకబడి మూడులోకముల రాజ్యమువచ్చినను నేను వీరలచంపను. భూలోకమాత్ర మేలుటకు ఈ బంధువుల జంపుటకు మనమొప్పకున్నది- అని శస్త్రాస్త్రముల వదలి రథముపై కూలబడెను. శ్రీకృష్ణుడు వాని మాటలెల్లఖండించి క్షత్రియుడవగు నీకు ఇది పథముకాదనెను.

అర్జునుడు కృష్ణా! ఎవరిని పోషించుటకు రాజ్యము ధనము సంపాదింపవలెనో అట్టి గురువులు, తాతలు, జ్ఞాతులు, కొడుకులు, కొమ్మలు నశింపనుండిరి. తర్వాత జయించినమాత్ర మేమి చేయుదుమని కారుణ్యముతో నా చదివిన చదువులెల్ల విస్మృతములైనవి. విజ్ఞాన మడగినది. కాన నే నీకు శిష్యుడనైతిని. నిన్నాశ్రయించిన నన్ను ప్రబుద్ధుజేయమని ప్రార్థించెను. శ్రీకృష్ణస్వామి కిరీట కుండలములతో, నెత్తినధరించిన నెమలిపింఛము ప్రకాశించుచుండ దక్షిణహస్తమున జ్ఞానముద్రనువహించి బెత్తము,కొరడా, పగ్గములు ఎడమచేత దాల్చి అర్జునునకు కర్తవ్యము నుపదేశించెను. అట్టి బోధము అర్జును నిమిత్తముగాగొని సర్వలోకమునకు చేసినబోధము. అధికారి భేదమునుబట్టి భేదవాదములున్నను భగవంతుని బోధము అనగా భగవద్గీత, వేదములు, శాస్త్రములు, స్మృతులు, పురాణములు, ఇతిహాసములు ఏకవాక్య మేకమతమని పదునెనిమిది అధ్యాయములతో సులువుగ బోధించెను. ఈ గీతముగూర్చి మా తండ్రిగారు నేను బ్రదికినంతకాలము చెప్పుచుందును, వినుడు ఆయువు చాలనిచో మరల జన్మించి వచ్చిచెప్పెదనని ఒక సభలో వాక్రుచ్చిరి.

అంత తెలివిలేకున్నను నా ఎఱిగినంతయు ఇచ్చట జెప్ప నవకాశములేదుగాన సంగ్రహించి ప్రస్తావనవశమున అనుచుంటిని. "క్షంతవ్యో మే అపరాధః"

శరీరము కనబడుచున్నది. ఇది జడమ అజ్ఞులకును సులువుగ రుజువు చేయవచ్చును. దీనియందు సర్వప్రకాశమగు తెలివిగలదు. దానినే సంవిత్తు అందురు. ఈ రెంటి భేదము కనుగొనలేనివాడు అజ్ఞుడు. అది ఎఱిగి వ్యవహరించువాడు జ్ఞాని. దేహము పోయినప్పుడు ఆ సంవిద్రూపమగు జీవుడు నశించుటలేదు. దీని నిర్ణయమునకే సాంఖ్యయోగాది శాస్త్రములనేకము లేర్పడినవి. ఎవరెట్లు చెప్పినను జీవుడు - దేవుడు-మాయ-ఈ

మూడింటిమీద సర్వము ఆధారపడియున్నది మాయపోయిన జీవుడు దేవుడు ఒక్కడేయని యుపనిషన్మతము. మాయను తెలిసికొని వదలిన జీవుడు శుద్ధుడగునని సాంఖ్యులమతము. అట్లు శుద్ధుడైన జీవుని మరల మాయ వశముచేసికొనకుండ అన్యుడగు దేవుడుచేయుచుండునని యోగులు చెప్పుదురు. పరమార్థమున సజాతీయ విజాతీయ స్వగత భేదరహితమగు బ్రహ్మ మొక్కటియే సత్యము. ద్వితీయపదార్థమే లేదు. కలవంటి లోకమున వ్యావహారిక పాపపుణ్యములవలన చిద్రూపమున కేమియు మార్పు లేదు దేహము, జీవుడు, ఇంద్రియములు, వాయుచేష్టలు, దైవములు కలసిన వ్యావహారికమున ఏపనియైన నెరవేరును. అట్టి పాపమును గానిపున్నెమునుగాని నే జేసితినని కర్తృత్వము తనపై వైచికొనుటయే అజ్ఞానము. ఇందఱు కల్పసిచేయు వ్యవహారముతో నాకు సంబంధములేదు. నే నంతట నెప్పుడు నుండువాడను ఆకాశమునకు ఇతర భూతగుణములు అంటనట్లు పాపపుణ్యాది అంతఃకరణ గుణములు నన్ను అంటవు అను నిశ్చయముతో సాక్షిగనుండుట జ్ఞానము సంవిద్రూపుడవు జీవుడు చంపువాడు గాడు చచ్చువాడు గాడు. కాన నా బంధువులు, నేను చంపను అనుటెల్ల అజ్ఞానమే. చచ్చునది జడమైన దేహము అది ఎట్లును నిలువదు. చావని జీవుని జంపువాడు లేడు ఇట్లుండ వీరు బంధువులని నేను జంపువాడనని అహంకారము వదలి ప్రవర్తింపుము. నీకు పాపమంటదు. అటుగాక అహంకారముతో నేను యుద్ధముచేయనినన వ్యావహారిక శాస్త్రములబట్టి "క్షత్రియస్య యోద్ధవ్యః" అను స్వధర్మమునువదలి వర్తించు నీ కెట్లును పాపముతప్పదు. "స్వధర్మే నిధనం శ్రేయః" ఇంకొక ధర్మము బాగుగనున్నదని తాను చేయుటకన్న తన ధర్మమున జరుగకున్న చచ్చినను మేలు.

కాన నీకు యుద్ధ మవశ్యకర్తవ్యము. అని తత్త్వజ్ఞాన పురస్సరముగ అర్జును బోధించుచు వాని యడిగిన ప్రశ్నములనెల్ల సమర్థించుచు,

అతడు కోరగ తన విశ్వరూపము ప్రదర్శించి అందు ఈ యోద్ధలెల్ల తన నోటిలో బడి పోవుచున్నట్లు చూపి నీవు చంపకున్నను వీరెట్లును జచ్చువారే; నీవు నిమిత్త మాత్రముగ నుండి కీర్తిగైకొనుము. లెమ్ము. అని అర్జునుని ధీరునొనరించి కృష్ణదేవుడు యుద్ధమునకు ఉద్యుక్తుని చేసెను. అట్లు ప్రారబ్ధమగు యుద్ధమున మొదటినాడు సమానముగా పోరి సాయంకాలము చూచి రెండుపక్షములవారు వారివారి విడిదలలకు పోయిరి. భీష్మాదులు ప్రతిదినము కాల్యములదీర్చి యుద్ధమున కేగునప్పుడు ఆయుధములనంటి పాండవులకు జయమని రంగమున ప్రవేశించి రాక్షసావేశము వచ్చినట్లు యుద్ధము చేయుచుందురు రెండవనాడు సాయంసమయమున పాండవులు చెలరేగుట జయమునొందుట జూచి దుర్యోధనుడు భీష్మునుపాలంభించెను.

మూడవనాడు రెండుజాములవరకు పాండవులకే విజయము మూడవజామున భీష్ముడు విజృంభించెను పాండవసైన్యములు భీష్ముని మీద మొగకట్టలేక కాందిశీకములైనవి కృష్ణార్జునులు బాణపంజరబద్ధులైరి కృష్ణుడు చెప్పినను తాతగారగు భీష్ముని గొట్టుటయందు అర్జునునకు ఉత్సాహము రాలేదు. అప్పుడు కృష్ణుడు మునికోలతో రథమునుండి డిగ్గి భీష్ముని జంపెదనని వాని కెదురుగా బోవుచుండెను. దానికి అర్జునుడును రథము దూకి వెంటనంటి శ్రీకృష్ణుని నడుము రెండుచేతులతో బిగపట్టి నేలకు ఈడిగలబడి పదియడుగులలోపల దేవుని నిలిపి స్వామీ! యుద్ధములో నెంతవారలైన కొంచెము సేపు వెనుబడకుందురా? అంతమాత్రమున నీవు చెలరేగిన మా ప్రతిష్ఠ నశించిపోవునుగదా? దయచేయుము దేవా? నిన్ను నొప్పించిన భీష్ముని పాటు చూచెదరమ్మని వేడుకొని నొగలెక్కించి తానును రథమెక్కి గాండీవముగొని విజృంభించి నాల్గవజామెల్ల కౌరవసైన్యముల పీనుగుపెంటలు గావించెను. భీష్మాదు లెవ్వరును ఎదిరింపలేకపోయిరి. అప్పుడు భీష్ముడు ఆకసము జూచి ద్రోణునితో

గీ॥ కృష్ణసారథ్యమున నొప్పు క్రీడియపుడు
కౌరవానీకముల నెల్ల కసిమసంగె
కృష్ణసారథ్యమున నొప్పు క్రీడియుపుడు
ఎంత సేయంగవలయుఁ దానంత సేసె ! !

అని సూర్యుడు ఎఱ్ఱవారుట జూపి ఆ నెపమున యుద్ధము చాలించి తన సైన్యములతో విడిదల కరిగెను. పాండవులును కృష్ణార్జునుల అతిలోక విక్రమమును పొగడుచు శిబిరముల కరిగిరి. పై పద్యములో ఒక కృష్ణ శబ్దమునకు విరాట్పుతుడగు ఉత్తరు డర్థము. "కృష్ణో విరాట్పుతే" అని నిఘంటువు గలదు. ఉత్తరుడు సారథియగు గోగ్రహణము అంత సేసిన అర్జునుడు కృష్ణస్వామి సారథియైన యిప్పుడు ఎంతచేయవలెనో అంతయు చేసినాడని పద్యార్థము. దీని నెరుగక అచ్చులో సీపద్దెము ననే కులు అనేకవిధములుగ దిద్ది ప్రకటించుచున్నారు.

నాల్గవనాడు భీష్ముడు మకరవ్యూహముబన్ని యుద్ధమునకువచ్చెను. ధర్మరాజు నానతో ధృష్టద్యుమ్నుడు అర్ధచంద్రవ్యూహము పన్నెను. అందు భీష్ముని కెదురుగా అర్జునుని బెట్టి ఒక కొమ్మున భీముడు మఱొకకొమ్మున ధృష్టద్యుమ్నుడు నిలచ తక్కినవారల మధ్య నిలిపిరి. అర్జునుడు తాతగారిని కొట్ట మోమోటపడెను. అదిచూచి ధర్మజుడు ధృష్టద్యుమ్నుని చేతగాని వ్యూహము పన్నితివని ఆక్షేపించెను. వాడు సరిగనె పన్నితిని. దీని లోప మేమి అన ధర్మరాజు అర్జునుని ఆకొమ్మునకు బంపి భీముని దెచ్చి భీష్ముడుని కెదురు నిలువుమనెను. ధృష్టద్యుమ్నుడు వినయముతో రాజాజ్ఞను దెలుప అర్జునుడు నవ్వుచు భీమునిచోటికి పోయెను. భీముడు అట్టి రాజాజ్ఞను విని భీష్మునికి తనరథ మెదురుగా తోలించెను. భీముడు పిడికిలితో కూర్చుండి వేరే ఆయుధము లేకుండ తన రథాశ్వములు భీష్ముని

రథాశ్వముల ముట్టెలు ముట్టెలు కొట్టుకొనుచున్నను తనసారధి నింకను తోలుమని గదిమి తోలించెను. భీష్ముడు చేయునదిలేక తన రథమును తప్పతోలించుకొని తొలగిపోయెను. ఆ సందున భీముడు కౌరవుల మకర వ్యూహములో ప్రవేశించి చేయిపిడికిలితోనే బెదరించుచు వ్యూహము చెడ గొట్టివచ్చి ధర్మజు మెప్పు నొందెను.

కం॥ మకరవ్యూహం బనియెడు
మకరాలయ మపుడు దర్ప మహిమోజ్జ్వలుడై
మకరక్రీడం జండత
మకరాభీలముగ జొచ్చె మారుతి యధిపా!

(తిక్కన)

5–6–7 రోజులు సామాన్యముగ నిరుదెరుగువారు పోరిరి. ఎట్లయినను ప్రతిదినము పాండవులదే జయము 8వ నాడు పాండవుల పరాక్రమ మతిశయము నగుటయు దుర్యోధనుడు భీష్మని సేనాధిపత్యము చాలించుకొను మని కర్ణుని దెచ్చుకొనెదనని నిష్ఠురముగా ననెను. దానికి భీష్ముడు నొచ్చియు రేపు జూడుము నా పరాక్రమమని బాసయిచ్చి 9వ నాడు మూడవజామున పాండవయోధుల సెలకట్టనీక విజృంభించి ఎక్కడ జూచిన తానై రౌద్రావేశము జూపెను. అర్జునుడును మెత్తవడెను. అపుడు శ్రీకృష్ణుడు చక్రముగొని భీష్మని చంపెదనని రథముదూకి పోవు చుండ అర్జునుడు మరల వెంటనంటి రథసుమీదికి ప్రార్థించి తెచ్చెను. కాని ఆ నాల్గవజామునకూడ అర్జునుడు విజృంభింపలేకపోయెను. ఏల యన, దివ్యాస్త్రములతో తాతను జంపుట యుచితముగాదు. సామాన్యబాణ ముల నాయన లెక్కచేయడు. తండ్రిలేని తమ్ము బెంచిన తాత నెట్లు కొట్టనగునని మెత్తబడెను. ఆనాడు మాత్రము ప్రొద్దు చూచుకొని పాండ వులే ముందు యుద్ధము చాలించుకొని పోయిరి.

ఆ రాత్రి సభలో ధర్మరాజు కృష్ణునితో యుద్ధము చాలించి అడవి కేగెదనని సహాయమువచ్చిన రాజులనెల్ల భీష్మున కెరసేయలేనని బెదరించెను. కృష్ణుని మాటలును ధర్మజునకు నచ్చలేదు. చివరకు భీష్మునొద్దకుపోయి సెలవుగొని వచ్చెదనని తగుపరివారముతో తమ్ములు కృష్ణుడు వెంటరాగా భీష్ముని శిబిరమునకు అర్ధరాత్రివేళ పోయెను. ఉభయకుశల ప్రశ్నాచారముల కనంతరము భీష్ముడు – వచ్చినపనిని యేమని యడుగ ధర్మజుడు తాతా! నీవు యుద్ధములో మూడవకన్ను దాచుకొనివచ్చిన రుద్రునివలె దూకెదవు. నిన్ను జయించు ఉపాయమేమి? అని నిన్ను ప్రార్థింప వచ్చితినన, ఆ తాత ఆ మనుమని ఆదరించి రేపు శిఖండిని మధ్యనిలిపి అర్జునుడు తీవ్రముగా గొట్టిన పడిపోయెద నట్లు చేయుడని సెలవిచ్చి పంపెనేగాని తాతగారినట్లు కొట్టుటకు అర్జునుడు ఇష్టపడకపోయెను. కృష్ణు డెన్నియో చెప్పి యెట్టకేలకు బలవంతముగ ఒప్పించెను. 10వ రోజు రెండుజాములు దాటినతర్వాత భీష్ముడు సైన్యముల నురుమాడుచు దారిచేసికొని ధర్మజుడున్న చోటికి పోయి తనకు కాలము వచ్చినదనియు శిఖండినడ్డము పెట్టి అర్జుననిచే గొట్టింపుమనియు, ఇంతియకాక మీరందరు అన్ని ఆయుధముల గొట్టి పడవేయుడనియు చెప్పెను. ధర్మరాజు సెలవీయగా పాండవ సైన్యము లన్నియు నొకపెట్టున శిఖండిని ముందు బెట్టుకొని భీష్ముని దాకెను. అర్జునుడు శిఖండిని కాచుచుండెను. భీష్ముని కాపాడబోవు ద్రోణున కడ్డపడి ధర్మజుడు నకుల సహదేవుల సాయముతో నిలువరించుటయు, తప్పించుకొనిపోలేక ద్రోణుడు తన కొడుకుతో ఇది ప్రాణములు దాచుకాలము గాదు. ధర్మరాజు మొగమున తీవ్రమగు కోపము గానవచ్చుచున్నది. ఈతనిని తప్పించుకొని నేను రాలేక యుంటిని. భీష్మునకు నీవు సాయమై నిలబడుమని చెప్పిపంపెను. శిఖండియు ఉత్సా

హముతో నెదిరించినను వాని బాణములు భీష్మునకు పువ్వులు చల్లి నట్లుండెను.

అపుడు కృష్ణుని ప్రేరణతో తప్పనిపని యిదియని యెంచి అర్జునుడు తన గాండీవమునుండి బాణములు శిఖండి ధనస్సును తాకుచు వాని బాణములవలె పోవునట్లు దృఢముగా వేసెను. ఆ దెబ్బలు భీష్ముడు మెచ్చుకొని అవి అర్జునుబాణములు, శిఖండివికావు. ఒక్కొక్కబాణము ఒడలెల్ల బ్రద్దలు చేయుచున్నది, అని మనుమని పరాక్రమము మెచ్చుకొనుచు విరథుడై విగతాయుధుడై పడిపోయెను. అప్పుడు రెండువైపులవారు ఆయుధములు విడచి ఆ మహాత్ముని దరికి దుఃఖితులై పోయిరి. అర్జునుడు మాత్రము ఆయుధహస్తుడై పోయెను. ఆ తాతకోరగా ఈ మనుమడు మూడుబాణములు మంత్రించి వేచి భీష్ముని తలక్రింద ములుకులు మెత్తగా మోపి పిడులు నేలకాని వేరు వేర నిలుచునట్లు అంపశయ్యకు దగిన దిండు వెట్టెను. ఆ మహాత్ముడు దాహమని అడుగుచుండ నెందరో నీళ్ళు దెచ్చిరి. అవి త్రావననీ తేజోమయాస్త్రవిన్యస్తమగు భూమినుండి వెలువడి వచ్చి తననోట జొచ్చు నీరైన త్రావెదననియు చెప్పి గంగాపుత్రుడు, అట్టివి నీవు తేగలవని అర్జునుని యడుగగా అతడవి సాధించి తాత దప్పిని మాన్పెను. అప్పుడు భీష్ముడు తన మనుమని నీవు నరుడను ముని నారాయణ సహాయార్థమవతరించితివి. అని పెద్దలు చెప్పగా వింటిని. నీ కసాధ్యము లేదు. నేనెంత జెప్పినను నినక దుర్యోధనుడు సంధి సేయక ముప్పు తెచ్చుకొనెను – అని చెప్పెను. అందఱు మాటలాడకుండ భీష్మునికి రక్షణార్థము జనులను నియోగించి ఇరువాగులవారును బోయిరి. ఇక దుర్యోధనుడు కర్ణుని దెచ్చుకొని సర్వసేనాధి పత్యమిచ్చి యుద్ధము చేయనెంచెను గాని కర్ణుడు విజ్ఞుడగుటచే ధనురాచార్యుడు. గురుడుండ అది తనకు తగదని చెప్పి ద్రోణునకా యాధిపత్య మిప్పించెను.

భీష్ముని తర్వాత తనకు సర్వసైన్యాధిపత్యమిచ్చిరని మెచ్చుకొని దుర్యోధనునకు ఇష్టము వచ్చిన వరమిచ్చెదను, కోరుకొనుమనెను. దానికి పొంగి దురోధ్యనుడు-దుష్ట చతుష్టయము ఆలోచించి ధర్మరాజును యుద్ధములో ప్రాణములతో పట్టితెచ్చి తన కప్పజెప్పుమని కోరెను. అందులకు ద్రోణుడు సంతసించి ధర్మజుని అజాత శత్రుత్వ మిప్పటికి సార్థకమైనది. నీవంటి శత్రువుడవు వాని చంపుమనక ప్రాణములతో తెమ్మంటివి. తెచ్చి యిచ్చిన ఏమి చేసెదవు? గెలిచితినని కీర్తిగొని రాజ్యమిచ్చెదవా? అని యడిగెను. వాడు గరువతనము లేనివాడు గాన వెంటనే బయట బడెను. మనము ధర్మజుని జంపిన తక్కిన నలువురు నాలుగూళ్ళు తెమ్మనెదరు. ఐదుగురును మనము శక్తిమంతులమై చంపినను కృష్ణుడు చక్రముతో అందఱ సంహరించి కుంతిచేతనైన రాజ్యము చేయించును గాని నారాజ్యము చేయుట సహింపలేడు. కాన ధర్మజుని ప్రాణములతో దెచ్చిన మరల జూదమాడి అడవికిఐంపిన ఎవరిని నామీదకు రాకుండ అతడే చేయును. నే నప్రతిహతముగా రాజ్యమేలుకొందు ననెను. ద్రోణుడు మనమున కుత్సించి-అర్జునుడు నాకన్న అనేక దివ్యాస్త్రములు శివునివద్ద స్వర్గమునుండి సంపాదించినవాడు. వాడుండ నీ పని సాగనీడు. కాన అర్జునుడు లేని సమయమున ధర్మజుడు పారిపోకుండిన ఎంద రడ్డమైనను చెండి పట్టుకొనివచ్చెదను. పారిపోయిన ఓడినట్లేగదా! అనెను. దుర్యోధనుడు ద్రోణునిచేతిలో ధర్మజుడు పట్టువడుననియే నమ్మి తన శిబిరములంతట ద్రోణప్రతిజ్ఞ చాటింపించెను ధర్మజు డిది వేగులవారివలన తెలిసికొని తమ మీటింగులో అర్జును నిది యెట్లని యడిగెను, దానికి అర్జునుడు—

కం॥ క్షోణీనాయక! నామేఁ
ప్రాణము కలుగంగ నిన్నుబట్టకొనంగా
ద్రోణునకె కాదు సగణ
స్థాణునకైనను వశంబె తలకేమిటికిన్॥

అని చెప్పెను. ఇక ద్రోణాధిపత్యముతో యుద్ధము సాగినది. పది దినముల నుండి యుద్ధముచేయకుండ నుండిన కర్ణుడుగూడ భీష్మదర్శనము చేసి — వచ్చితి రాధేయుడ ! కనువిచ్చి ననుంజూడు భరతవీరాగ్రణీ ! అని ఓడార్చుచుపోయి తనకు, యుద్ధమునకు సెలవిమ్మనెను. అంతనా భీష్ముడు నీవు కౌంతేయుడవు. సంధిప్రయత్నము చేయుమని అందించిన కర్ణుడు యుక్తి యుక్తముగ మాటలాడి ఇంతకు మూలము నేను. ఇప్పుడు నేను వారిలో కలియుట వారికి, నాకును యశస్కరముకాదు. మురరిపుని, పార్థుని తలంకించి పేరుదెచ్చుకొని వీరభోగము ననుభవించెద నట్లు శాసింపుమన భీష్ముడు – ఇంతకు జాలుదువే నెఱుగుదును బొమ్మని యనిచెను.

ఆవిధమున వచ్చి రెండుసేనలు సమముగా పోరెను గాని ద్రోణుడు ధర్మజు బట్టుకొనలేకపోయెను. ఇంటికి పోవునపుడు ద్రోణుడు దుర్యోధనునితో నే జెప్పినది యిట్టిదియేగదా ! అర్జునుడు దగ్గరనుండ వాని బట్టుకొన శక్యముకాదు. రేపు మరొకరంగముబెట్టి వాని తొలగించిన ధర్మజు నేను బట్టెదననెను. దానికి సుశర్మాదులగు సంశప్తకు లా పని మేము చేసెదము. అంతియగాని పారిపోము, అని సంశాపములు పలుకుటచే సంశప్తకులయినవారు మరునాడు అర్జునుని మేము వేరే యుద్ధరంగముబెట్టుకొనుచున్నా మచ్చటికి రమ్ము. రాకున్న నీవు మాకోడినట్లే యని పిలిచిరి. అర్జునుడు యుద్ధమునకు ఎవరు పిలిచినను బోయెదనని ప్రతిన కలవాడగుటచే ధర్మజుని జాగ్రత్తగా నుండుమని భీమాదులతో గలిసి యుద్ధముచేయుచుండుమని సత్యజితుడను పాంచాలకుమారు జూపి యితడు బ్రదికియుండ నిన్ను ద్రోణుడు పట్టలేడు. అంత చిక్కు తటస్థించిన నీవు శిబిరమునకు బొమ్ము, తక్కువవారు యుద్ధము చేయుచుందురని చెప్పి యటుపోయెను.

అక్కడ సంశప్తకులతో అర్జునునకు ఎడతెగని పోరైనది. ఇక్కడ

ద్రోణునితో తక్క పాండవపక్షమునకు తీరనిపోరయినది. అందు మూడు జాములు పోరిపోరి ధర్మజు గాపాడ భారపడిన సత్యజితుని ద్రోణుడు సమయించెను. తక్కిన భీమాది వీరుల దగ్గరకురాకుండ దూర ముగా తోలి వారేమియు చేయలేక చూచుచుండ ద్రోణుడు ధర్మజునిరథము పొదివి పట్టనుంకించుచుండెను. అది సంశప్తకులతో బోరు అర్జునుడు ఆరు క్రోసులదూరమునుండి రథవేగముతో ద్రోణుని సమీపించునంతకు బాణముల సోనలు గురియుచువచ్చి ద్రోణునకు చేతులాడకుండునట్లు చేసి ద్రోణ ధర్మజుల రథములమధ్యమున తన రథమును జొనిపెను. ద్రోణుడు నిరాశుడయ్యెను. ధర్మజు డవ్వలకు తప్పుకొనిపోయెను. అర్జునుడునవ్వుచు మామూలుగ పోరుచుండెను ఇది యద్భుతకర్మము. ఆరుక్రోసులనుండి బాణములు కురియుట - ధర్మజుని గురుని బారికి తప్పించవలెను. గురుని మేన తన బాణముతో గాయముకారాదు. ఆరు క్రోసులనుండి, ఐదు క్రోసులనుండి యిట్లు దగ్గరకువచ్చినను ఎంత యూపుతో లాగిన తన బాణ ములు ద్రోణునిచుట్టు పంజరముగా క్రమ్మకొని కాయముగాయముకాకుండ జేయగలవో ఆ ఫక్కి ఆయనకే తెలియును. ఇంతలో న స్తమయమైనది. ఇరువాగులవారు శిబిరముల కేగిరి. దారిలో ద్రోణుడు దుర్యోధనునితో నెంత శ్రమముపడిననుచేతికిచిక్క వేళ కర్జునుడు రానేవచ్చెను. ఏమి చేయుదుము; రేపు నిల్లే రెండవరంగము బెట్టింపుము. నా ప్రతిన నెర వేర్చుకొన యత్నించెదనని చెప్పెను. ఆ రాత్రి గడవ మూడవనాడు మామూలుగా అర్జునుని సంశప్తకులు బిలిచికొనిపోయిరి. ఇక్కడ ద్రోణుడు కౌరవసేనల పద్మవ్యూహముగ బన్నించెను. ఆ వ్యూహము జూచి పాండవపక్షమువారు దిమ్మరపోయిరి. దాని భేదింపనేరక వారు దూరముగా తమ మోహరము త్రిప్పుకొని పోయి ఆలో చించుచుండిరి. అప్పుడు ధర్మజున కొక ఆలోచనము కలిగినది. ఈ వ్యూహ మర్జునుడు, కృష్ణుడు, ప్రద్యుమ్నుడు, గాక ఒరులు భేదింపలేరు

వారిలోవాడుగాన అభిమన్యుడు చిన్నవాడైనను దారితీయగలడు. వాని ముందుబెట్టుకొని మనమెల్ల వాని గాపాడుచుపోయి యీనాటి భండనము గెలువవలెను. మనమందరము గాపాడుచుండ సహజ విక్రముడగు అభిమన్యునకేమి లోటు అని తోచుటతోనె ధర్మరాజు వాని బిలిచి సాంత్వనముగా చెప్పెను. అభిమన్యుడు నది తనకు కీర్తికరమగు పనియని యొప్పుకొనెను. వాని సారధి యనుమానించుచున్నను వాని బదరి అభిమన్యుడు ద్రోణపాలితమగు పద్మవ్యూహము లెక్కచేయక ఎదిరించి పోయెను.

ఆ॥ మెఱుపు మెఱసినట్లు మెఱయించి యురదంబు
కర్ణికార కేతు కాంతివెలుగ
అంబకముల గురుని నలయించి మించి యిం
ద్రజుని కొడుకు మొగ్గరంబుసొచ్చె॥ (తిక్కన)

అట్లుపోవు అభిమన్యు చుట్టుకొనిపోవు పాండవవీరుల సైనికు లతనికి ప్రాపుకాకుండ ఒక్కనా దర్జునుడు లేనితఱి తక్క పాండవుల గెలుతునన్న శివుని వరమున సైంధవుడు నదికికొండవలె నడ్డమువచ్చెను. కాన నెవ్వరు వానికి తోడులేకపోయిరి

అభిమన్యు డొక్కరుడు పద్మవ్యూహముజొచ్చి చించి చెండాడి మూడుజాములు ఒక్క చేతిమీద కౌరవులనెల్ల నాపి విక్రమించుచుండ వానిచే దెబ్బలుతిని యోడిపారిన కర్ణుడు గురునిచేరి — ఈఅర్జునపుత్రుడు తండ్రినిమించి మన సేనల నేలకు గోలకు తెచ్చుచున్నాడు. అర్జునుతో పోరెరుగుదము కాదే! వాని చేయింత బెట్టిదమ్ము కాదు. వీని నెట్లుగెలువవచ్చునని వాపోయిన నా యాచార్యుడు ధర్మసమరమున వీని జయించుటయరిది. అధర్మమనక పలువురుచేరి మాయ యుద్ధమున చేతిలో ధనువు

విరిచి, తర్వాత చూచుకొందమని యనుటయు, కర్ణుండు అతని కభిముఖముగా పోయి దెబ్బలుతిని పారిపోయినట్లు పోయి ఆవలగా వెనుకకువచ్చి శరవైభవమున నతనివిల్లు నరుకుటయు, భూరిశ్రవుడు వాని గుఱ్ఱముల చదియ మోదెను. తక్కినవీరు లందరు రథమును, సారథిని. సర్వపరికరము నుగ్గునూచ మొనర్చిరి. ఒక్క ధనుస్సుతో గెలిచివచ్చెదనని ద్రోణుని పద్మవ్యూహము సొచ్చిన ఏకవీరు డింకొక విల్లులేమి గదగైకొని ప్రద్యుమ్నుని చెప్పిన విద్యాబలమున ఆకసమున కెగసి నాలుగుగతియలసేపు విహరించి క్రిందికివచ్చి ఒక్కొక్కరి గొట్టుచు పైకిపోవుచు మునుపటి కన్న కౌరవుల కాందిశీకుల నొనరించి అశ్వత్థామ రథముమీద దూకి ఆయన పారిపోగా అందున్న ఆయుధముల నెత్తుకొనిపోయి సూర్యుని చూచుచు ఇంక నిల్లే నాలుగుగడియలు గడిపిన ఇంటికి పోవచ్చునని ప్రతీక్షించుచుండ అప్పుడే సుఖముగ వీరపాణాదులతో తృప్తుడై వచ్చిన దౌశ్శాసని గదగొని, ఆకసమున కెగసి వానితో పోరాడి యిద్దఱు నిలకువచ్చి గదాయుద్ధముచేసి అన్యోన్యఘాతములతో ఇద్దఱును మడిసిరి. ఒక్కని బాలుని అన్యాయముగ నిట్లుచేసిన మీరు రేపు అర్జునుచే నొక్కడును బ్రదుకబోరని ధర్మజుడు పెద్దగా నరచెను. పాండవవీరులు ఆ దినశేషము నట్లే గడిపి, అస్తమయమైన యుద్ధము చాలించి శిబిరముల కతి దుఃఖముతో నరిగిరి. కౌరవులు సంతసముతో బోయిరి. ధర్మజు డింటికిపోయి యభిమన్యునిగూర్చి దుఃఖించుచుండ వ్యాసభట్టారకుడు వచ్చి దుఃఖశాంతిగా చెప్పిన తనదుఃఖము వీసమైన దచ్చిన అభిమన్యునికొఱకు గాదనియు, అర్జును రక్షించుకొనుట కొఱకనియు చెప్ప, అట్లయిన మేలని నీవే జయింతువని చెప్పి అంతర్ధానమునొంది పోయెను.

అర్జునుడు సంశప్తకులతో పోరిపోరి సాయంకాలము తిరిగివచ్చుచు నపశకునముల నాలకించి ధర్మరాజును ద్రోణుడు పట్టుకొనెనేమో? అని శంకించి యడుగగా ధర్మరాజు సుఖముగానే యున్నాడుగాని, మనకు నింక

నేదియో అమంగళము జరిగినట్లు తోచుచున్నది. అని చెప్పు కృష్ణుని మాట లతో మరింత దుఃఖము వొడమ నట్లేవచ్చి యేడ్పు మొగములతో తన కగ బడకుండ తప్పించుకొను పరిజనులజూచి, ధర్మజు డున్నచోటికి వచ్చి, అచ్చట అభిమన్యుడు లేకుండుటకు వగచుచు, నన్ను నడిగి తెలుసుకొని, నేను లేనివేళ నా కొడుకు నొక్కని కాపాడలేకపోయితిరి. మీ రాయుధము లలంకారార్థము దాల్చితిరికాని, అభిమానమునకు కాదని తన యోధుల నిందించి, ధర్మరాజుచెప్పగా అభిమన్యునకు తాతోడుపోకుండశివునివరమున నుదీర్ణుడవు సైందవు డెల్లవారి నానాడాగుట విని కోపించి అట్లయిన రేపు సూర్యు డస్తమింపకమున్నే ఆ సైంధవు తల తరిగెదను. అట్లు చేయలేక పోయిన గాండీవముతో నే నగ్నిలో ప్రవేశించెదనని ప్రతిన సేసెను. దుఃఖము కోపముగా మారినది. దానికి కృష్ణుడు నాతో నాలోచింపకుండ ప్రతిన సేసితివి, ఆ వైపుననున్న ద్రోణాదులు మనను చంపనిచ్చెదరా! ఇది దుర్ఘటమని చెప్పి అర్జునుని డేరాలోని కతని తీసికొనిపోయి శరములు మంత్రించి చుట్టునుబెట్టిన మంటపమునచేర్చి నీవు ప్రతిదినమును చేయు శివపూజ నొనర్పుమనెను. అర్జునుడును కృష్ణుని గూర్చుండబెట్టి శివపూజ చేసెను. వాని నిద్రింపుమని చెప్పి తాను తన డేరాలోనికేగి దారుకుడు పాద సేవ చేయుచుండగా పవ్వళించి నిద్రరాక దారుకునితో వచ్చిన కార్య వ్యతి క్రమమును జెప్పుచు, రేపు నాకు అర్జునునెడగల స్నేహమును లోకము గుర్తింపవలెను. ఎట్టు లేచెదనో చూడుము! దారుకా! నీవీ గుర్తుగ శంఖ మూదినపుడు నీవు మన రథమును వ్యూహములోనికి దేవలెను జుమీ! అని వానిచే వల్లెయనిపించి రాత్రి నిట్లు గడుపుచుండెను. అర్జునునకు ఒక కల వచ్చెను. అందు తానును, కృష్ణుడును ఆకాశగమనమున కైలాసమునకేగి తాను కృష్ణునియందు పూజించిన పూవుల నా శివునినెత్తిన జూచి యచ్చెరు వడి, శివుని ప్రార్థించి, ఆ దేవు నానతితో నొక కొలనులోనున్న శివుని ధనుర్బాణముల దెచ్చి శివాజ్ఞతో నొక కుమారుడు చూపింప, పాశుపతము

ప్రయోగించుపైఖరి క్రొత్తచేసికొని ఆ విభు డుపదేశింప మంత్రాదికము విని తదాశీః ప్రసాదమున ప్రసన్న మనస్కుడై, వచ్చినట్లు తోచెను. అప్పటికి తెల్లవారవచ్చినది. ఆ శుభసూచనమున నా వీటివారెల్ల నుల్లాప ముతో నుండిరి.

ఇక కౌరవుల స్కంధావారములో అర్జునుని ప్రతినవిని అందఱు వ్యగ్రులుగ నుండ సైంధవుడు కంపనపడ్డ కాకివలె నటమటించి దుర్యోధ నునితో నే నొక్కడనే తన కపకారము చేసితినా ! అర్జునుడు నన్ను జంప బూనెనట. వాని ప్రతిజ్ఞకడ్డుపడువారు ముల్లోకముల లేరు. నేను కనబడ కుండ నా దేశమున కేగెదనన, స్వకార్యపరుడగు దుర్యోధనుడు వాని ద్రోణునికడకు గొనిపోయి, పర్యాలోచనము చేయగా నా గురుడు నేనొక వ్యూహమువన్ని నిన్ను అర్జునుడు చేరరాకుండ నాపెదను, యుద్ధరంగము విడిచి పోవలదు. అదిగాక పిల్లలగని పెద్దవాడవై పుణ్యపాపముల నెల్ల ఆరితేరిన నీకు పారిపోవు టుచితమా : చచ్చినను, బ్రతికినను కీర్తి చాల గలదని బోధించెను. ఎట్లయిన అర్జును ప్రతిజ్ఞ చెఱచిన నతడు సులభ ముగ అగ్నిబడి చచ్చును. వానితోగూడ తక్కిన పాండవులు పోదురని ఆ ప్రయత్నమున నుండిరి. కాలకృత్యముల దీర్చుకొని ఇరుగువాగును యుద్ధరంగమునకు నడిచిరి. ద్రోణుడు ముందుపైపున శకటవ్యూహము, వెనుకవైపున అర్ధపద్మవ్యూహము నదుకువేసి, ముందు బండిపోలునుంచి డొలుపుమధ్యమువరకు సూచీవ్యూహము సూదిమాదిరి బారుగా నిలిపి, సూది బెజ్జము బండిడొలుపు మధ్యనుండు మేకు వెనుక పద్మవ్యూహము, మధ్య కర్ణికా నొక్కటిగా ముడిపెట్టి పదిక్రోసులు వెడలుపు, పన్నెండు క్రోసులు పొడవుగా దేవతలకు జూడరాని ఆశ్చర్యకరమగు మహావ్యూహము బన్ని మధ్యమున సైంధవు నునిచి వానిచుట్టు అశ్వత్థామ, కర్ణాదుల పదిరథముల వారి నిలిపి, తాను ద్వారమున నిలిచి అభేద్యముగ యుద్ధము సాగించెను.

ఆ వ్యూహమును జూచి దేవతలు ఆశ్చర్యమగ్నులైరి. అర్జునుడు తనకు తోడువచ్చెదనను సాత్యకిని, ధర్మరాజు గురునిచే పట్టుబడకుండ కాపాడుమని పనిచి, కృష్ణసారథికమగు తన రథమును వ్యూహాభిముఖముగ నడుపుచుండ, దుర్మర్షణుడు గజసేనలతో నటకువచ్చి అర్జును నే నొక్కడనే నేడు నిలిపెదనని ఎదిరించి వానిచే హతసైన్యుడై, దెబ్బలుతిని ద్రోణుని చాటునకు పారిపోయెను. ఇక కృష్ణుడు తన రథమును ద్రోణున కభిముఖముగా నడిపెను. ద్రోణుని జూడగానే అర్జునుడు గురువు నెట్లు కొట్టుదునా! అని మెత్తబడి కృష్ణుననుమతి చేతులు జోడించి భక్తితో పలికెను.

ఉ॥ మేలుదలంపు శోభనము మీకొని చేయుదునాకు పాండుభూ
పాలుని ధర్మనందనుని పంకజనాభుని యట్లకావె? మ
త్పాలన వృత్తికీవు నిను ప్రార్థనచేసి భవత్ప్రసాద లీ
లాలసితుండనై మొనదలంకగ జొచ్చెద భూసురోత్తమా.

అని నన్ను, అశ్వత్థామను ఒక్కవిధముగ జూచి, పెంచి విద్యల శిక్షించితివి. అనఘా! నాకు ద్రోహముచేసిన సైంధవుని గూర్చి చేసిన నా ప్రతిన మెట్లు నెరవేరునో యట్టి యుచితము నాలోచింపు మనెను. ద్రోణుడు నవ్వి, నన్ను గెలువక ఎట్లు వ్యూహముజొచ్చెదవు; యుద్ధము చేసి పొమ్మనెను. ఐనను అర్జునునకు తెంపు గలుగలేదు అట్లయిన మీరు ముందుగా నామీద బాణములు వేయుడు, నేను తర్వాత వేసెదనని, మెల్లగా, యుద్ధమునకు డిగియు, మోమోట మెనయుచున్న కిరీటి నుపలక్షించి కృష్ణుడు ద్రోణునకు ప్రదక్షిణముగా రథము త్రిప్పుచు, వెనుకకు పోయి నప్పుడు ద్రోణుని విడిచి వ్యూహములోనికి రథము తోలెను. ద్రోణుడును అర్జునా! అర్జునా! ఇది యేమి; శత్రువుల గెలువకయే సుప్రతిష్ఠుడవు కాదలచితివా! అని వెనుకనుంచి బాణములుకొట్టుచు, వెంబడిపడెను. నీవు గురుడవుగాని శత్రువవు డవా; నీయొద్ద ఓడినను మాకు ప్రతిష్ఠయే యనుచు ముందుసైన్యముల నటికివేయుచు, కృష్ణుని సారథ్యము నేర్పున, తన శర

లాఘవముతో కొంతదూరమేగిన తర్వాత ద్రోణుడీ సందున నందఱు వ్యూహమున జొచ్చిన ప్రమాదమగునని ద్వారము కాచుకొనబోయెను.

అప్పుడు కృష్ణుడా వ్యూహము పన్నిన గుణని నేర్పు మెచ్చుచు అర్జునా! వ్యూహము చూచితివా? యనెను. అర్జునుడు ఇదియొకవ్యూహము కాదు. ఇచ్చట శకటవ్యూహములో సూచీవ్యూహ నమర్చబడినది. ఇంక ముందుముం దేమే వ్యూహలక్షణముల నదికెనో అక్కడక్కడ తెలిసి కొని జాగ్రత్తగా నడువవలెననెను. అత్యంత వేగముతో నరనారాయణుల ఆ రథము సూచీవ్యూహము, శకటవ్యూహము ఛేదించుకొనుచు, లెక్కలేని వీరాధిపుల నెల్ల సాధనములతో నాశనముజేయుచు పోయి వెనుక నంట వేసిన అర్ధచక్రవ్యూహమును జూచి మెచ్చుచు అచ్చటికి తగిన విధమున ప్రవర్తించుచుండ, అర్జునునితో నారాయణుండు ద్రోణాదులగు వీరుల శర ములు శరీరములని దనాటి గుఱ్ఱములు దప్పినొందియున్నవి. ఇవి వెన్ను మునుగు నీరిలో నాప్యాయన మొనయవలెను అంత జలము లేకున్నను త్రాగుటకైనను నీరులేకున్న నేను నిన్ను గెలిపింపలేవు. అనెను దానికి నవ్వి అర్జునుడు బావా! ఇదిగో జలములు అని చెప్పుచునే అంతలో నొక బాణము నేల బగులగొట్టి ఆ సందున నెగసిన జలధారకు చుట్టు కట్టిపేసి, అది చెరువుచేసి పైన బాణములతో నిల్లుగట్టి చూప కృష్ణుడు గుఱ్ఱములను రథమునుండి విడిచి యా చెరువులోదించి ఒడలిబాణములు పీకి, మాలీసుచేసి, నీర్ద్రావించి, దివ్యాస్త్రముతోవచ్చి జలమువెంబడి నప్పుడే మొలచిన గ్రాసముమేపి, తెచ్చి రథమునకు గట్టెను ఈలోపల అర్జునుడు రథము, లేకుండ ఒక్కడు క్రింద నిలిచియున్నాడు గా యనివానిపై బడిన సైన్యములెల్ల వానిచే నుగ్గునూచమగుచుండెను. అప్పుడుల్లాసభాసుర ముఖుడై యర్జునుడు రథమెక్కెను.

అప్పు డచ్చట రాజులెల్ల శాత్రవుల మహావ్యూహములోనికి ఒక్క రథముతో తోడులేకుండ వచ్చి పైబడు శాత్రవుల లెక్కసేయక, చెఱువు త్రవ్వి గుఱ్ఱములకు మాలిసుచేసి, సారథి మరల రథమునకు గట్టువరకు

సేలనుండి ఎఱుగనట్లు వచ్చిన చతురంగసైన్యముల నుగ్గుసేయుచు, ఈ రథమెక్కిన వీఁడింక నెవరికి సాధ్యుఁడగును ! వీనిచే సైంధవుఁడు చావక బ్రదుకునా. వీరలు శత్రుమధ్యముననున్నట్లులేదు ఆడువారిలో నాటలాడు చున్నట్లున్న దీ మహాయుద్ధము-అనిరి. అట్లు ద్రోచినడచి పద్మవ్యూహము భేదించుకొని కర్ణికవద్దకు పోవునంతకు నచ్చట సైంధవునకుకాపుగానున్న సైన్యములు వెలుకపాఱి విన్నబోయెను. చుట్టునున్న కర్ణాదు లాదరముతో సైంధవు కాచుచుండిరి. ఆ సందున సైంధవు వరాహధ్వజము దూరముగా నున్నట్లు చూచి అర్జునుడు-ఇదుగో వీఁడే సైంధవుఁడు ! అశ్వత్థామ, కర్ణుఁడు, శల్యుఁడు, భూరిశ్రవుఁడు, ముఖ్యులుగా పదిమంది వీరరథికులు పోటుమగలు గాన వీనిచుట్టు కావలియున్నారు. వీరేమి కావగలరు ? ఇంక ఈ సైంధవు డేమి బ్రదుకును ? సైంధవునితల క్రిందపడకముందు సూర్యమండలమును బోనిచ్చెదనా ! అ త యవసరమైన బాణపంజరములో సూర్యుని బిగించి సైంధవుతల నఱికెదననెను. అప్పుడు ఘోరముగా ననేక సైన్యములతో మహావీరులతో కృష్ణునకు, అర్జునునకు చేతులు కాళ్ళు ఆడనియంత మహా హవము సాగెను. ఈ లోపల దుర్యోధనుడు హుటాహుటిగా ద్రోణుని వద్దకువచ్చి గురుడనియుఁజూడక అనరాని మాటలని రాత్రి నమ్మకముగా చెప్పుటబట్టి మేము సైంధవుని యుద్ధరంగమునకు దెచ్చితిమి. లేకున్న నింటంబెట్టి వచ్చువారము. వ్యూహము గట్టిగ బన్నిన నేమి లాభము ? అర్జును వదిలితివి. అతడు వ్యూహమంతయు చెల్లాచెదరుచేసి, సైంధవుని యొద్దకు-చేరినాడు. నీవు పాండవపక్షపాతివి. అర్జునునకు సైంధవు నప్పగించ నింత చేసితివి - అన ద్రోణుడు చిత్తరేగి పాండవుల శరవేదనతో నా యొడలు మండుచుండ నీవు మాటలతో నొప్పించవచ్చితివా ? అర్జును శక్తి యెఱిగి నీవిట్లనవచ్చితివా! ఇంతయగునని నేను భీష్ముడు చెప్పినను వినక సంధి చెఱచి చావుదెచ్చుకొంటిని. పాండవులు మిక్కిలివారు. నీవు తలచినంత సులభమా: వారిని గెలుచుట, నీవు దుష్టుడవు. నీ పక్షములో చేరుటవలన నాశక్తి యడగారి పోయినది పొమ్మని విదిలించిన, అతడు

మెత్తబడి వేడుకొన నొక కవచము నభిమంత్రించి తొడిగి, పోయి అర్జునుతో పోరాడుము. వాని బాణములు నిన్నేమియుం చేయవు. సైంధవు గాపాడుకొనుమని పంపెను. ఆ మదముతో దుర్యోధనుడు అర్జును నెదిరించి నీవు పాండురాజునకు నిజముగా బుట్టిన, పారక నిలువుమని పోరాడ జొచ్చెను. అర్జునుబాణము లా కవచము భగ్నముచేయలేక మిట్టిపడ జొచ్చెను సర్వకవచ విచ్ఛేదిని యను నస్త్రము అర్జునుడు వైచిన సర్వాస్త్ర విచ్ఛేదిని యను అస్త్రమున దానిని అశ్వత్థామ నఱికెను. అప్పుడు అర్జునుకు ఉపాయశాలిగాన కవచములేని అరచేతులలో ప్రకృతి బాణములు జొనుప, వాని ముంజేతులు వాచి, తీపుపుట్టిన దుర్యోధనుడు ఆ కవచము నూడదీసి పారవైచి ద్రోణుని దిట్టుచు వెనుకకొదిగెను

ఇట్టి ఘోరయుద్ధమున అర్జును డేమిచేయుచుండెనో ? ఒక్కరథమే పోయెనని చింతించి ధర్మరాజు పంపగా సాత్యకి, ద్రోణుని దారి యిమ్మని ప్రార్థించి వానిచే నాక్షేపింపబడినవాడై ముఖమున జొరబడలేక ప్రక్కనున్న ఒక సైన్యమును నఱుకుచుబోయి, దారినబడి అర్జునుడు పోయిన త్రోవన సూచీవ్యూహము, శకటవ్యూహమున ననేకుల జంపుచు, దాటి పద్మవ్యూహముననున్న యర్జునునకు దాదాపు దగ్గఱకుపోయెను. ఈలోపల సాత్యకిచే దెబ్బలుతిని యోర్వలేక దుశ్శాసనుడు పారిపోయి ద్రోణుని వెనుక నొదుగ నా ద్రోణుడు-ఏమి! యువరాజ విభునకు సేమమే! సైంధవుని యేమిచేసె నరుడు ? నీవీ సనుజేసుంతో నిటు లేమిటికి తిరిగివచ్చితని-అడుకులు తిన్నప్పుడున్న యానందము కడుపున కుట్టెత్తినప్పుడుండునా? పాండవులు నాడు దయలేక అట్లు పలవితిరి ఇప్పుడొక సాత్యకి చేతనే ఉడిగిమడగవలసివచ్చెను. భీమార్జునుల బారిబడిన నేమయ్యెదవో? ఇంకనైన నన్నుతో నాలోచించి పాండవుల కైదూళ్ళయిన నిప్పింపుము. కానిచో మీ కొఱకు ప్రాణము లఱచేతిలోబెట్టుకొని నీకు సహాయముచేయ వచ్చిన రాజుల వెంటగొని, చావుకుతెగించి వారితో దాకుము — అని నిష్ఠురములు పలికి కుత్సించిన నతడేమియు ననక మరలిపోయి, సాత్యకిచేత

చుము. నీవు గురుడవైన స్వేచ్ఛగా ఇంటికివచ్చిన భోజనము పెట్టెదను కాని, శత్రువునకు జయ మీయవచ్చిన నిన్ను క్షమించెదనా? చూడుమని యొక గదత్రిప్పి విసరివైచిన నది యసాధ్యమని ద్రోణుడు ముసలివా డయ్యు భయమున రథముదుమికి పారిపోయెను. ఆ గదతో ద్రోణుని రథము, గుఱ్ఱములు, సారథిసర్వము నుగ్గునూచమయ్యెను భీముడు వ్యూహా ములోజొచ్చి అర్జునుడు, సాత్యకి నఱుకుకొనుచుపోయిన దారిన రథముతో వేగుచుండ వానికి భయపడి అందఱు దారియిచ్చి తొలగిరి. ఆ విధమున పోవు వానికి యింకొకరథము నమర్చుకొని, ద్రోణుడు సరల నడ్డము వచ్చి తీవ్రముగా కొట్టెను. దానికి కనలి భీముడు నిరాయుధుడై రథము దిగి ద్రోణుని బాణములు లెక్కసేయక పోయి ద్రోణుని రథము నెడమ చేతితో నొగలుపట్టి విసరివైచిన ఆ రథము గుఱ్ఱములతోకూడ కురుక్షేత్ర మెల్ల దాటిపోయి యెక్కడనో పడెను. ద్రోణు డీలోపల నెట్టులో రథము దూకి ప్రాణము దక్కించుకొనిపోయి యింకొకరథమునెక్కి ద్వారభూమికి పోయెను అట్లుపోయినభీముడు సింహనాదము చేసిన గుర్తుతో అర్జున సాత్యకుల క్షేమమును భీముని గెలుపును నెఱిగికొని సంతసించెను.

తరువాత భీమునిచేత పదునొకండు మార్లు ఓడిపోయిన కర్ణుడు పండ్రెండవసారి యెదిరించిన భీముడు తన రథము దిగిపోయి కర్ణుని రథ మెక్కి చూడ నతని కనబడకుండ కర్ణుడు రథము బల్ల క్రిందదూరి ప్రాణము కాపాడుకొని భీముడు పిఱికిపంద ; పోక్కిరి రథము దిగి తన రథమున కేగునంత, తాను విలుగొని భీముని రథము నడ్డి నిరాయుధుడగు వానితో యుద్ధముచేయ నతడు వాని బాణములకు యుద్ధములో తెగిపడియున్న మొండెముల నడ్డముపెట్టి పోరిపోరి, యరియు లేమి నప్పుడును పారిపోక యూరక నిలువబడెను అప్పుడు కర్ణుడు వాని తన ధనుస్సుతో కడుపు పొడుచుచు తిండిపోతా! నీకే యుద్ధమేల? కడుపునిండ తిండితినుచో నింటియొద్దనే యుండుము. అట్లుండలేకపోయిన నీవు తగినవారితో పోరుము. నావంటి వీరులపైకి రాకుము అనెను. భీముడు రోసమున రోజుచు వాని

చేతిలో విల్లు లాగి నిజచివైచి అర్జునుని ప్రతిన తలచి విడచివైచిన బ్రదికితివి పొమ్మని, తానర్జునుని దరికిపోయి కర్ణుడు నన్ను పరాభవించెను. నీ ప్రతిజ్ఞ తలచి వాని నదలితిని. నీవు వాని జంపెదవా? నన్ను వాని జంపుమందునా? అని తీవ్రముగా నడిగెను. అర్జునుడీ ప్రతిజ్ఞ యిట్లు ద నదియు నిప్పు డెట్లు చొప్పడును కొంచె మోర్చుకొనుము అని చెప్పుచు ఎదురైన కర్ణుని విరథునిచేసి యొడలెల్ల చిల్లులు పొడిచిన పారిపోవు కర్ణునితో-పదునొకండు పర్యాయములు భీమునిచేత నోడి పారిన నిన్నెవ్వ రేమనిరి? ఎప్పుడో ఒకసారి వీరులకైన నోటమి వచ్చును. అంతమాత్ర మునకు భీము నేమంటివి. తులువా! నీ కులము, గొనము తోచెం(ప్రజకుర- అని తిట్టి తరిమెను. దానికి భీముడు సింహనాదము చేసెను. ఇంతలో విశోకుడు మఱొక రథము తయారుచేసికొని రాగా భీముడది యెక్కెను. ఇట్లు భీముడు సాత్యకి యటునిటు సహాయము చేయుచుండ నర్జునుడు దశ రథముల వీరులతో పోరుచు సందుచూచి సైంధవుని వరాహధ్వజము నరికి పడవైచెను. దాని కచ్చటి యందరు భయపడి యర్జును గ్రమ్ముకొనిరి.

అప్పుడు కృష్ణుడు అర్జునా! ప్రొద్దు క్రుంక వచ్చుచున్నది. ఈ పది రథములవారు మనకవకాశ మీయకున్నారు. కాన నేనొక మాయచేసి సూర్యుడు కనబడకుండ చేసెదను. అప్పుడు పొంచబాటున కనబడిన సైంధవు తల నరికి ప్రతిన దీర్చుకొనుము. తర్వాత సూర్యుడగపడును అని చెప్పెను. అర్జునుడు-ఇంకను రెండుగడియల ప్రొద్దు కలదు. జెండా నరికితిగదా! వీని తల నింతలో నరికెదను. నా పరాక్రమమునకు అప్ర తిష్ఠ తేకుము అని యనుచుండగనే వినక కృష్ణుడాపని చేసెను. అందరు అర్జునుడిక చచ్చునని పడమర చూచుచుండ దారిలో గొంతెత్తి సూర్యాస్త మయము చూచుచున్న సైంధవు తలను జరికాస్త్రమున నర్జునుడు నఱి కెను. కృష్ణుడు దాని క్రింద బడనీకు మనెను. అర్జును డా తలను బాణము లతో నిలువుగా నడ్డముగా నాకాశమున త్రిప్పుచు కసితో పైబడిన పదిరథ ములవారితో, వారి సైన్యములతో పోరుట అత్యాశ్చర్యముగ నుండెను.

ఇంతలో సూర్యమండలము కనబడెను. పైబడిన సైనికుల పలచనచేసి అశ్వత్థామ కర్ణాది వీరుల నోడించి యర్జునుడు సైంధవు తల నింక నెంత సేపు పైననే త్రిప్పవలెనని యడుగగా కృష్ణుడు వీని తండ్రి వృద్ధ క్షత్రుడు వీనికి రాజ్యమిచ్చి తపమునకు పోవువేళ నాకాశవాణి వీని తల శాత్రవులచే నాకస్మికముగ తునుమబడునని చెప్ప నతడెవడైన వీని తల క్రిందవైచిన వానితల వెంటనే పగులగలదు. అని శపించి పోయెను. కాన అది శమంతపంచకము నొద్ద తపముచేయుచున్నవాని చేతులలో బెట్టిన క్రిందవైచి నశపించినవాడే చచ్చిన మనకు ముందుగూడ ప్రమాదము లేకుండును ఆపని పాశుపతముగాక మరియొక అస్త్రమేదియు జేయలేదు. అపస్మహాస్త్ర ముపయోగింపు మనెను అర్జును డట్లు చేయుటయు ఆ పాశు పతాస్త్రము వానితల బట్టుకొని బాణపరంపరాకారముగ పోయి యర్ఘ్య మిచ్చుచున్న వృద్ధక్షత్రుని దోసిలిలోబెట్ట వాడు చూడక వెంటనే క్రిందబడ వేసి తనతలయు బగిలి చచ్చెను. దానివలన అతడు మరల నింకొక్కశాపము బెట్టునను భయము లేకుండపోయినది. చూచువారెల్ల ఇందరితో యుద్ధముచేయుచు నా శిరమును బంతివలె ఆకాశమున త్రిప్పనేల? చివర కది యెక్కడవైచెను? ఇంత యుద్ధమున వీరులు వానికి లెక్కగా లేదు కృష్ణార్జునులకిది యాటగా నున్నది యని యాశ్చర్యమందిరి అంత భీమా ర్జున కృష్ణ సాత్యకులు పోయి ధర్మజు దర్శించి నమస్కరించి జరిగిన వృత్తాంతము చెప్ప నాత డానంద బాష్పములతో నేను ధన్యాత్ముడనని వారి నందఱ గౌగలించుకొని గౌరవించెను.

ఇక దుర్యోధనుడు ద్రోణునికడకు పోయి యేడ్చుచు దిట్టి నీవు కప్పవలె నటుచు పాముపు నీవలన నష్టపడితిని ధర్మజుని బట్టెదనని యబద్ధమాడితివి. సైంధవు గాచెదనని యర్జునునేకాక వానికి తోడు భీమ సాత్యకులను బుచ్చి దుష్ప్రవేశమగు వ్యూహము పన్నియు లాభము లేకుండ చేసితివి, అని గురుని అనరాని మాటలని ఇతియాగక నీవు యుద్ధము చాలించుకొని పొమ్ము కర్ణునకు సేనాధిపత్యమిచ్చి పాండవుల గెలిచెద ననెను

దానికి ద్రోణుడు నదరిపడి ఎదురేద్చి - ఏమి చేయుదము? పాండవు లట్లు కాననమునకేగి నీవల్ల కష్టపడెనని తమంద రెరిగినదియే. ఆ మరిత మింత చేయకుండునా: అది యటులుంచుము. పాండవుల వ్యూహము నెల్ల నాయొక్క చేతిమీద నాపి ప్రొద్దుకుంకు నంతవఱకు నెడతెరిపిలేకుండ శ్రమపడి పోరియు అగుణజ్ఞుడవగు నీచే మాటపడితిని. వారి యాయుధ ములు శరీరము మండించుచుండ నీవాకవైపున శరీరమే కాక యంతః కరణమును మండించుచుంటివి. అర్జును గెలువశక్యము కాదని మునుపే చెప్పలేదా? ఇంతమందిని రాకుండ నిలిపితినిగదా: వచ్చిన ముగ్గురిని నీ కర్ణుడు నీవు, నీ సైన్యములు గెలువలేకపోయితివి. నా యనంతరము నీపాటు నీవు పడెదవుగాక పొమ్ము. నేనీరాత్రికూడ యుద్ధము చేసె దను, పాంచాలుర నెల్ల జంపినగాని కవచము విడువను. దివిటీలువేయించు యత్నము సేయుమని చెప్పి నాచేత దెగని పాంచాలురున్న వారి నిశ్శే షము సేయుమని నాకొడుకునకు చెప్పుమనెను. ఆమాటలు రుచింపక పోయి కర్ణునితో నిదియంతయు చెప్పి ద్రోణుని చాలించి యిక నీవు సైన్యాధిపత్యము నొంది శత్రువుల సంహరింపు మనెను. అది విని కర్ణుడు దుర్యోధనుని జూచి రాజేంద్రా! సముద్రములో బుట్టువైచిన బుర్రెడు నీళ్ళు వచ్చునుగాని సముద్రపు నీరెల్ల వచ్చునా? అర్జునునంత పరాక్ర మములో నెంతటి వారంతగ నిలువవచ్చునుగాని వాని పరాక్రమమెల్ల నడంగింప నెవ్వరితరము. ఆ కుంతికడుపు చలువ యట్టిది. మనము చిన్న నాటినుండి విషాన్నము బెట్టించి, పాములచే గఱపించి, గంగలో బడవైచి, లక్కయిండ్లలో గాల్చి, కాననమున కేగజేసి యొకనాశమునైన జూడ గలిగితిమా? ఇంకను నట్లగా తలుపనము, ఎట్లయినను మొదలుపెట్టిన పని తుది జూడవలెను.

శ్లో॥ అనారంభో మనుష్యాణాం ప్రథమం బుద్ధిలక్షణం
ఆరబ్ధ స్యాంతగమనం ద్వితీయం బుద్ధిలక్షణం

అని రాజనీతి యనెను. కర్ణుని మాటలు విని అర్జునుని చూచిన పరాక్రమము దలచి దుర్యోధను డంతరమున-

ఉ॥ ద్రోణుడు కర్ణుడుం గృపుడు ద్రోణసుతుండును నేల! వాని గీర్వాణులకైననుం జెనక వచ్చునె! యెవ్వరునాతి గౌరవత్రాణ పరాయణాత్వమున దర్పము సూపగ లేమిదెల్లను క్షీణ పరాక్రముండయిన క్రీడికి నిక్కపుటల్క వచ్చినన్॥

అని దిమ్మరపోయి యూరకుండెను.

ఆ రాత్రి మహాయుద్ధము జరిగినది. కర్ణుడు రేగి యుద్ధము చేయుచుండ కృష్ణుడు ఘటోత్కచుని బిలిచి ఈ రాత్రి కర్ణుని నీవు గాక ఎవరు తలపడలేరు. నీవు వాని జయించి మీ తండ్రుల ఋణము తీర్చుకొనుము- అనెను. వాడు విజృంభించి మాయాయుద్ధము చేయుచుండ కర్ణునకు చేయియాడకుండెను. అప్పు డందరు కర్ణునితో నీకు ఇంద్రు డిచ్చిన శక్తి వీనిపై వైచి మర్యాదకాపాడుకొనుము. అర్జును సంగతి తర్వాత చూచుకొందమనిరి. అప్పటి కింకొక యుపాయము లేక కర్ణుడు శక్తితో వాని సమయించెను. క్రోధ శోకము లతో కర్ణు నెదిరించిపోవు ధర్మజునకు కృష్ణుడు వీడురావణునంత వాడు. మనము లేనినాడు లోక మలోకము చేయును. వీడు కర్ణుని శక్తి కెరయగుటవలన మనమర్జును గాపాడుకొనగలిగితిమి. ఇది వాడు అర్జునునిమీద వేయవలెనని ప్రతిదినము వచ్చుచుండును. వారి వారలెల్ల నిది చెప్పుచుందురు. యుద్ధరంగమునకు రాగానే వాడు మరచునట్లు చేయుచుంటిని. ఇంక నెన్నొకళ్ళు చేయుదుము. ఇది మనకు మేలుకాలముగాని కష్టకాలము గాదని యందఱ దుఃఖము శాంతింపజేసెను. ఆ రాత్రి తెల్లవారినది. కాల్యముల దీర్చికొని రాత్రి నిద్రలేక శరీరములు తూలుచుండ నట్టే పోరాడుచుండిరి. ఐదవనాడు రెండుజాము లయిన తర్వాత భీముడు కళింగసైన్యములతో యుద్ధముచేయుచు వానిగంధగజమును చంపెను. దానిపేరు అశ్వత్థామ. వినరాని మాటవిన్న అప్ర

సన్యాసము చేసెదనను ప్రతినగల ద్రోణుని యొద్దకుపోయి-భీముడు "అశ్వత్థామా హతః"-అని చెప్పెను. ద్రోణుడు కొంచెమాలోచించి శివవరమున బుట్టిన యశ్వత్థామ చావవివాడని తానెరుంగును గాన కళింగసైన్యములతో నింతదనుక పోరిన భీముడు గజమును జంపెనేమోయని యాలోచించి మామూలుగా యుద్ధము చేయుచుండెను. మూడుజాము లయినది. ద్రోణునకు కాలము దగ్గరకు వచ్చినది. కొండలమీదగాని నీటిలోగాని అడ్డు లేకుండపోవు ద్రోణుని రథచక్రము లంటిసలబడి లటుకు లటుకుమని కొట్టుకొనుచు రథవేగము తగ్గిపోయెను. ద్రోణుడు తెలిసికొని ధర్మాత్ములవు పాండవుల కపకారము చేయుటవలన నట్టిదశ తనకు తటస్థించెననియు నిక యుద్ధము చాలించెదననియు తలచుచుండ నాకాశవాణి దాని సమర్థించెను.

ఇన్ని కారణములతో తనచావు తనకు దెలిసిన మహాత్ముడు: వీర ధర్మప్రకారము పాండవసైన్యముల వధించుచున్నట్లు సందుచేసికొని ధర్మజు నున్నెడకు పోయి యడంగుటయు నాతడు కృష్ణ ప్రేరణమున "అశ్వత్థామ హతః", అని పెద్దగానని "కుంజరః" అని మెల్లగా ననెను. అర్జునుడుమాత్ర మన్నతో మొదటినుండి సహజమవు సత్యమును వదలకుము. గురుని నసత్యమున జంపుటకన్న నన్యాయమెద్ది ? రాజధర్మముతో నిలనబడి గురుని చేతిలో చచ్చినను మనకపయశము లేదుసరిగదా: వీర భోగ్యములగు లోకముల చూఱగొందుము. బ్రదికి గెలిచిన రాజ్యమబ్బును. ఎట్లయినను బాధలేదు. అసత్యమాడవలదని గట్టిగా చెప్పుచుండెను. అది వినియు కృష్ణభీముల ప్రేరణతో ధర్మజు డట్లు వలికెను. ఆ "కుంజరః" అను మాట వినబడకుండ సైన్యవాద్య ఘోషాదులన్నియు నడ్డుపడినవి దానితో ద్రోణు డస్త్రసన్యాసముచేసి రథముమీద కూర్చుండి యోగసాధనతో బ్రహ్మరంధ్రము బ్రద్దలుచేసికొనిపోయెను. ద్రోణుని తల నతని వధకై యాజోపయాజుల వరమున ద్రుపదుని యజ్ఞము నగ్నికుండమున బుట్టిన ధృష్టద్యుమ్నుడు, కృష్ణ పాండవాదులెల్ల వలదు వలదని కేకలు

వేయుచున్నను తత్కాలజనితావేశమున కత్తితో నఱకెను. ద్రోణుడు సూర్యమండలము భేదించుకొని సిద్ధసాధ్య వందితమగు గతిగొనెను.

ఇదిగాక ఆతురతో కొడుకుచావును తెలిసికొన దలచివచ్చి అడిగిన ద్రోణుడు ధర్మరాజు ముఖమును జూచి అడుగవలయునుగదా ! "అశ్వత్థామా హతః" అన్నచోట "కుంజరః" అని మెల్లగా అనిన అక్షరస్థానములను బట్టి పెదవులు కదలవలెనుకదా ! అది చూచుచున్న ద్రోణుడు 'హతః' తరువాత పెదవులు కదలుచున్నవి. ఆమాట నాకు వినబడుట లేదు, పెద్దగా జెప్పుము అని యడుగరాదా ! ఇంతమాత్రము చేతగానివాడు పెదకి కొనుచు ధర్మరాజు వద్దకు పోనేల ? ఇదంతయు అనాలోచిత విషయము. ఇంకొక విషయము. స్వర్గారోహణ పర్వమున యోగముతో ఎగసి పోవుచున్న పాండవులు యోగశక్తిచాలక ఒక్కొక్కరే పడిపోవుటయు. భీముడు ధర్మజుని ప్రశ్నింపగా వారివారి యోగములు చెడుటకు కారణములు ధర్మజుడు సమాధానములు చెప్పుటయు కలదు. ఆ ప్రశ్నోత్తర మాలికలో అర్జునుడు పడినపుడు భీముడు ఇతడు కృష్ణునకు ప్రాణ. స్నేహితుడు. బంధువుడు భక్తుడు. ఇంద్రపుత్రుడు పూర్వజన్మలో నరుడను యోగి. ఈజన్మమున అనేక తపస్సులు చేసి శివునితో పోరాడి పాశుపతాస్త్రము తెచ్చుకొని స్వర్గములో ఇంద్రునితో గూడ ఐదుసంవత్సరములు ఇంద్రసింహాసనమున కూర్చుండి వచ్చినాడు. ఇతని యోగము చెడుటకు కారణమేమియు కనబడుట లేదు. అని యడుగగా. ధర్మరాజు యుద్ధప్రారంభమున అర్జునుని పిలిచి నీవొక్కడవు కౌరవసైన్యమును ఎన్ని రోజులలో వధింపగలవు ?

అని ప్రశ్నింపగా నాతో ఆ అర్జునుడు నాకు "కౌరవ సైన్యము లెక్కలేదు. కౌరవులకు మూడులోకములలో దేవదానవాది వీరులందరు సహాయమై వచ్చినను, మన సైన్యము గూడా వారిలో కలిపినను వీరి నందరినీ, అర్ధ నిమేషములో చంపగలను. అని నాతో చెప్పినాడు. అట్లు,

చేయక పదునెనిమిది రోజులు యుద్ధము చేసినాడు. ఆ మాటలో అసత్యము వచ్చినది. కనుక యోగము చెడి శరీరము పడిపోయెను. అని భీమునితో. ధర్మరాజు చెప్పెను

ఈ విషయములో విచారింతము. అర్జునుని అసత్యము పరులకు నష్టము గల్గించునది గాదు. ఏలయన పదునెనిమిది రోజులలో చంపుదు నని జెప్పి అర్థనిమేషములో చంపినయెడల ఆ అసత్యము శత్రువులకు నష్టకరము. పదునెనిమిది రోజులలో మన బలమును చూపింతము గదా ! అనుకొనుచుండ అర్థనిమేషములో జంపిన, శత్రువులకు నష్టము. మఱియు ఈయనకు అనత్య దోషము సిద్ధములే. అట్లుగాక వ్యతిరేకమైనది గనుక ఆయనకు అసత్య దోషము లేదు. ఆ అసత్యము వలన శత్రువులకు నష్టము లేదు. ఇట్లుండ ఈ అసత్యమునకే అర్జునుని యోగము చెడిన యెడల గురువును జంపుటకు "అశ్వత్థామా హతః" అనిన ధర్మరాజు అసత్యము పెద్ద దోషముగదా ! ఆ దోషమునకు ధర్మజుడేల పడిపోలేదు? ఈ అర్జునుడు భీముడు పడిపోయిన తరువాత కూడా ధర్మజుని ఇంద్ర రథ మెక్కించుకొని ఆ శరీముతోనే స్వర్గమునకు తీసుకొని పోయిరి గదా! ధర్మజునకు యమలోకములో తమ్ములు బాధపడు చున్నట్లు చూపిన ఇంద్రుడును. యముడును, ధర్మజుకోపమునకు భయపడుచు నీతమ్ములు స్వర్గముననే యుండిరి. ఇదంతయు నీకు నాటకమే చూపించితిమి. అని మంచిచేసికొని స్వర్గమునకు తీసికొని పోయిరి, అని కలదుగదా ! గురు హత్యకు అబద్ధమాడిన వానియెడ దేవతలకు అంతభయము పక్షపాతము ఏల ? ఈ విధముగా మంచి విమర్శబుద్ధితో విచారించిన ధర్మజు డబద్ధ మాడలేదు. అని భారత సిద్ధాంతము తక్కిన మాటలన్నియు కథలో ఎవరి మాటలు వారు మాట్లాడుదురు. 'అంతమాత్రమున పురాణధోరణి సమన్వ యము చేసికొనుటయందు బుద్ధిమంతులు పొరబడరాదు. ఇది ద్రోణ పర్వ విధము.

ఈ కథలో పెద్ద చర్చలు: గురుని విషయమై ధర్మజుడు అసత్యమాడవచ్చునా? అస్త్రసన్యాసము చేసిన ద్రోణుని శిష్యుడగు ధృష్టద్యుమ్నుడు నరుకుట న్యాయమా? వలదు వలదనిరి గాని యుధిష్ఠిరాదులంత అన్యాయము చేసిన ధృష్టద్యుమ్ను వధించిరా? పోనీ వెడలనడిచిరా? ఇది యంతయు నన్యాయమే యని అపోహలు గలవు. భీముని మాటతో ననుమానము గలిగిన ద్రోణుడేమి చేయవలెను? తన సైన్యములో దండనాయకుడగు కొడుకు చచ్చెనో బ్రదికెనో తనకు తెలియదా? అంత తెలియనివాడు సర్వసైన్యముల నేకముఖముచేసి యెట్లు నడుపగలడు? ఒకవేళ దూరమునుండి తెలియకుండిన నశ్వత్థామను పిలువుమని కాని బ్రదికియున్నాడా? అని కాని అడుగ చెప్పుటకు కౌరవసైన్యములోనెవ్వరు దిక్కులేరా? దండనాయకులు బిలుచుటకు నెవరినెట్లు పిలువవలయునో అట్లు వేర్వేర శంఖధ్వనులు వారలకు గుర్తులుండునుగదా? ఆ పని మరచినాడా? అని ప్రతిప్రశ్నము లున్నవి. రాయబారమప్పుడే భీష్మద్రోణులయందు కృష్ణుడు నేరము విశదీకరించెను. దానికి భీష్ముడుధర్మజు మోముచూచుచు దానివలన తనపాపము పరిహారమగునని సూచించి పడిపోయెను. అట్లే ద్రోణుడును తనవాడు చావనివాడని తెలిసినను తెలిసికొను మార్గము లున్నను ఇదివంకబెట్టి ధర్మరాజును జూచుటకు తన పాపావనోదనమునకు అట్లుపోయియడిగెను. ధర్మజుని "అశ్వత్థామా హతః" అన్న మాటకాక "కుంజరః" అను మాటతో ఆయనకు ప్రయోజనము లేదు. అట్లయిన కుంజరమా? నాకొడుకా? అని యడుగలేడా వినరాని మాట విన్న చచ్చెదనన్న ప్రతిజ్ఞ కదియే చాలునుగాక: అతడట్లు చేసెను. ద్రుపదుని యజ్ఞమున ద్రోణు జంపుటకు పుట్టినవాడు నిమిత్తమాత్రముగా తలగోసినాడనవేల? బ్రాహ్మణవృత్తిమాని క్షత్రవృత్తితో బ్రదికి ద్రోణునికి వృత్తికితగిన సంస్కారమైనగాని ఎంతయోగియైనను సూర్యమండలమును భేదింపలేడు. ఉత్తమలోకములేదుగాన శిష్యుడగు వీరుడీ నెపమున నట్లుధ-

రించెను. ఇది యంతయు భవితవ్యము. దీనిలో ధర్మజుడు కుంజరః అని మెల్లగానన్న దోషమునకు ముందు యమలోకము చూచెను. అంత మాత్రము సందులేకపోయిన నరకము పూర్తిగానే యనుభవింపవలసి యుండు, అని కథాభాగమును బట్టి సారాంశము తోచుచున్నది.

ఆ దినశేషమున అశ్వత్థామ ధర్మజు డసత్యమాడెనని, ధృష్టద్యుమ్నుడు తన తండ్రిని జుట్టుపట్టుకొని శిరము కోసెనని కడుకోపించి కోలాహలముచేసి పాండవ సైన్యమును నేలకు గోలకు దెచ్చి యాగ్నేయాస్త్రము వైచిన నది యర్జును నస్త్రముచే శమించుటయు, నారాయణాస్త్రము ప్రయోగించిన కృష్ణుడు పాండవపక్షమువారి నెల్లరథములు దిగి ఆయుధములు క్రిందబెట్టి నమస్కారము చేయుడని యట్లు చేయించిన నదియు నుపశమించుటయు నాతడు రథము డిగ్గి పారిపోవుచుండ, దారిలో వ్యాసమహర్షి ప్రత్యక్షమై యడిగిన మహాత్మా! నా ఆగ్నేయాస్త్రము అర్జునాస్త్రముచే ప్రతిహతమాయెను. నారాయణాస్త్ర మూరకపోయెను. కృష్ణార్జునులు నాకన్న మిన్నలగుటకు కారణమేమి యని యడిగెను.

నీవు పూర్వజన్మమున శివుని కరచరణాద్యవయవములతో నర్చయందు పూజించివితి. వారు లింగాధిష్ఠానారూఢుని చేసి పూజించిరి. శివుని నర్చయందు పూజించుటకన్న లింగమున పూజించుట యధికఫలము, మీమీ పూజాఫలములు వేరువేరుగా ననుభవింపవలదా? ఇట్లు పోవనేల? నిలచి మొదలుపెట్టిన పని నెరవేర్చుకొని పోయెదవుగాక అని వానిని వ్యాసభట్టారకుడు మరలించెను. అంత నిరువాగువారు నస్తమయమువరకు బోరాడి శిబిరముల కేగిరి. దుర్యోధనుడు కోరికతీర తన కర్ణునకు సర్వసైన్యాధిపత్య పట్టాభిషేక మొనర్చెను.

24

మరునాటి యుద్ధములో నుభయ బలములు పోరాడినవి. అందు పాండవులకే విజయము సిద్ధించెను. వారుల్లాసముతో బోయిరి. కౌరవులు కర్ణాధిపత్యము వచ్చినను జయింపకపోయితిమని యుసురుసు రయిపోయిరి.

ఇక కర్ణుని రెండవనాటి యుద్ధము తీవ్రముగా జరిగినది. కర్ణుడు తెగించి యానాడు తన గజాకారమగు దివ్యధ్వజమును పూజించి తెచ్చుకొనెను. ఆయుధములన్నియు సిద్ధముచేసికొని, వాని యుపాస్య ల నుపాసించుకొని యుద్ధమునకు వచ్చుచు, దుర్యోధనునితో నాకును, నర్జునకును ఆయుధములలో, దివ్యాస్త్రప్రయోగములలో నెచ్చుతగ్గులు లేవు. లాఘవమున నాకన్న నతడు చాల తక్కువ. వానికి విరుగని రథముకలిగినను మనకు చాల రథములు వెంటనుంచుకొని ఒకటిపోయిన నొకటి వాడుకొనవచ్చును. వానికి అక్షయబాణతూణములున్న, మనము నంతకన్నా బాణములు దెచ్చుకొనవచ్చును. కాని కృష్ణుడతనికి సారథియగుటచే మనయూపులన్నియు దప్పించుచున్నాడు. కాన మనల శల్యుడు సారథ్యమున - తెలివితేటలలో కృష్ణునంతవాడు. వానిని నాకు సారథిగా నమర్చిన నేను వారల జయించెదనని చెప్పుకొనెను. దుర్యోధను డాతని బ్రతిమాలి కాదన్నను ఎన్నింటికన్న మాటలుచెప్పి ఎట్టకేలకు కర్ణునికి సారథినిగా జేసెను. అప్పుడు శల్యుడు నేను హితము చెప్పెదను. కర్ణుడు కాదనరాదు. కోపపడరాదు. అట్లయిన మాకు పొందు కుదురునని మొదటనే చెప్పెను. రెండు జాములవరకు ననేక ద్వంద్వయుద్ధములు సాగుచుండెను. సంశప్తకులొకవైపున నర్జునితో నెడతెగకపోరుచుండ, అశ్వత్థామ అపకాండ్ల యెద్దులు లాగలేక లాగుకొనివచ్చు బండ్లపైని బాణములుతెచ్చి యివి యన్నియు కృష్ణార్జునులపై గాక మరియొకరిపైన వైవనని ప్రతినబూని యొకవైపున యుద్ధము చేయుచుండెను. మధ్యాహ్నమున కాబాణములయిపోయిన నాతడు మరలెను. సంశప్తకులను కించిదవశిష్టముగా వధించి

యర్జునుడు తన సైన్యము దరికి వచ్చుసరికి కర్ణుడు ధర్మజుని పరాభవించి తీవ్రముగా పోరుచుండ నిలువలేక ధర్మరాజు శిబిరమునకు పారిపోవు చుండెను.

అయినను విడువక వెంటపడిన, అప్పుడు భీమునిచేతిలో దుర్యోధనునకు చచ్చినంతపని వచ్చెను. దాని నుగ్గడించి శల్యుడు మనరాజు చచ్చిన నీవు ధర్మజు నేమిచేసి యేమి ప్రయోజనము? అని యొప్పించి దుర్యోధను ప్రాణత్రాణమునకు నచ్చుటకు రథము నడిపెను. ధర్మజు డింటికి పోయెను. కర్ణుడు భార్గవాస్త్రము ప్రయోగించి తీవ్రముగా పోరుచుండ వానియెదుట నెవ్వరు నిలువలేకపోయిరి. భీముడు మాత్రము దీకొని సైన్యముల నిలుపుకొని పోరుచుండెను. ఆ యుద్ధతీవ్రత్వముజూచి రాజు కనబడకపోవుటకు చింతించి పోయి భీము నడుగగా రాజుగారు యుద్ధరంగమున లేరు. ఇంటికి బోయెనేమో? యనెను. నీవువెళ్ళి చూచిరమ్మన నేనుపోయిన నోడిపోయితి నందురు. నీవే పోయి చూచిరమ్మనె. నీవు జయించుచుండుము, మేము మీ యన్నసంగతి చూచివచ్చెదమని కృష్ణుడు రథము త్రిప్పెను. అంతకుముందే కర్ణుని తీవ్రతజూచి సంశప్తకులతో, నశ్వత్థామతో యుద్ధముచేసిచేసి అలసివలసివచ్చిన యర్జునుదే-పట్టపగలింటి భాస్కరు వగిది కర్ణుడుగ్రమూర్తియై వెలుగుచున్నవాడు. మాధవా! మన రథము మరలనిమ్మ! అని కర్ణునకు ప్రతిష్ఠతెచ్చెను. అర్జునుడు భీమునితో కర్ణుడు తీవ్రముగా బోరుచున్నాడు. అరుగో సంశప్తకులు మరల సిద్ధమై వచ్చుచున్నారు. అశ్వత్థామయు నిప్పుడే రాగలండు. నేను పోయిన నెట్లు? అనిన భీముడు వీనిని, వారినిగూడ నే నొక్కడన నిలిపి పోరాడగలను, నీవే యింటికి పొమ్మనెను.

ఆ భీమునియూపు లోకాతీతముగా నున్నది. పట్టిపట్టి మాటలేకాక అప్పుడే కర్ణు నెదిరించి పోరాడి మూర్ఛనొందించి వాని రథముమీద నెక్కి ఆనాడు సభలో నన్నమాటలకు నేడు ధర్మజుని పరాభవించినందులకు

వీని నాలుక గోసెదనని కత్తి జళిపించిన, శల్యుడు వానితో నిది చావు గాదు. మూర్ఛ మునిగిన వాని నాలుకగోసిన చచ్చును, అర్జునుడు వీని జంపు ప్రతినపట్టి యున్నవాడు నీవీ పనిచేసిన ఆ సత్యసంధు డగ్నిప్రవేశము చేసిన మీ యింటికి ముప్పురాదా? యని వారించెను. భీముడు సంతోషించి మామా! నీవు చెప్పుటనుంచి మాకు ముప్పుతప్పెను. నీమాట కాదనను, అని రథము దిగిపోయెను. ఇట్లు మహాభీషముగా యుద్ధము సాగుచుండ కృష్ణార్జునులు శిబిరమునకేగి ధర్మజుని దర్శించిన, వారు కర్ణునిజంపి వచ్చినారనుకొని వారి సగ్గించి మాటలవలన కర్ణుడు బ్రదికియుండెనని తెలిసి తాను బాధపడి యుండుటవలన అర్జును నిందించి నీ చేతకాకపోయిన గాండీవము కృష్ణునకిచ్చిన కర్ణు జంపెడువాడనెను. దానికి అర్జునుడు తన యన్నను జంపెదనని కత్తిదూసెను. ఇది యేమన – గాండీవము నింకొకరికి నిమ్మనువాని గొంతుకోయ ప్రతినబూనినవాడ ననెను. కృష్ణుడు వాని బదరి – ధర్మజు దూషింపుము. అది చంపినట్లే యని యట్లు చేయించెను. అర్జునుడు మరల కత్తిదూసి తన తల కోసికొనియెద నన నిదియేమి యని కృష్ణుడు – పూజ్యుడగు నన్నను దూషించినందుల కన్న, నీకు ధర్మము తెలియదు. ఆత్మశ్లాఘ చేసికొనుమర్జునా! అది చచ్చినట్లే యని యట్లు చేయించి, ధర్మజుని కోపపరిహార మగునట్లు ప్రార్థించి, తాను అర్జునుడు వాని పాదముల కెఱగి యుద్ధానుజ్ఞ తీసికొనిపోయిరి. అప్పు డర్జునుడు కర్ణుని చంపకుండ నీరేయి నీ కగపడనని ధర్మజుతో చెప్పి పోయెను.

కృష్ణార్జునులు మరల యుద్ధరంగమునకు వచ్చువేళకు యుద్ధభార మంతయు భీముని చేతిమీదనే యున్నది. ఇంతలో దుశ్శాసనుడువచ్చి తాను మున్నుపెట్టిన బన్నములెల్ల వాక్రుచ్చి తనతో యుద్ధముచేయుమని,సోత్ప్రాసముగా బలికిన భీముడు రేగి వాని విరథునిచేసి, గద విసిరి వాని బడవైచి తాను రథము దిగిపోయి, వాని చుట్టును తిరుగుచు, ఇంకొకరు వానిని రక్షింపరాకుండ పొదివి, ఓరీ దుశ్శాసనా! నీవు నా కగపడితివి. అప్పు డాడిన మాటలుగాక, ఇప్పుడును వెదకికొనుచువచ్చి యిన్నిమాట లాడితివి.

జూదమునాటి ప్రతిన నెరవేర్చుకొనియెదను నీ కిక్కడ నెవ్వరేని చిక్కు గలిగిన బిలుచుకొమ్మని పెద్దగా జెప్పుచు రౌద్రాకారముతో చుట్టును దిరుగుచు అప్రతిష్ఠపాలై పోయెదుగాని, ధృతరాష్ట్రుడేమి సంపాదించెను ? ఆ సభలో ద్రౌపదికి పరాభవము చేయవలదని తానన్న యింత వృత్తమునగా : మీ చేత నీకు భర్తలేరు అనిపించుకొనిన దాని పగటిప్పుడు వచ్చినామురా : మా మగవార లింతపని చేసిరని అప్పుడు విఱ్ఱవీగిన కాంత లిప్పుడు అపకీర్తి దీనత నొందుచుండిరని పలుకుచు ప్రాణముండగనే వక్షస్థలము బ్రద్దలు చేసి నెత్తురు ద్రావి తలకుపోసికొని ఒడలెల్ల రక్తమయమై పికికిలిబిట్టుకొని చుట్టును తిరుగు భీముని పై జూడలేక భీతితో దుర్యోధన, కర్ణ, కృపాశ్వత్థామాదులెల్ల దిమ్మరపోయి చూచిరి. ఇట్లు ప్రతిన దీర్చుకొని, నా రెండు ముఖ్య ప్రతిజ్ఞలలో నొకటి తీరినది. చాటు మాటు కాకుండ దుర్యోధనుడు, కర్ణుడు, కృపుడు, అశ్వత్థామ మొదలగువీరు లేమియు చేయలేక చూచుచుండ, పాండవపత్ని కేశాంబరముల నాకర్షించిన వాని జంపి నెత్తురు ద్రావితిని ఇంక రెండవదికూడ ఇట్లే తీర్చబోవుచున్నానని వాని నొక్క త్రొక్కు త్రొక్కి చంపి, విశోకుడుతెచ్చిన రథమెక్కి కౌరవుల కెదురుగా నడచెను అంతకుముందేవచ్చి భీముని ప్రతిజ్ఞ కడ్డువచ్చువారిని నణచ సిద్ధపడియుండి, ప్రతిన నెరవేరుటకు సంతసించి యర్జునుడును కలిసికొనెను.

ఇక జాము ప్రొద్దున్నది. కర్ణుడు మనసు చెడి తాను జూచుచుండగా నింత ఘోరము జరిగినది. గనుక నింక నా పౌరుష మెన్నటికి అని తెగించి అర్జునుతో నెదుర్కొనెను. రెండు వైపులవారు చూచుచుండిరి. కర్ణార్జునుల ద్వంద్వయుద్ధము సాగినది. కర్ణుడు సర్పముఖాస్త్రము అర్జునుపై ప్రయోగించెను, అది కంఠమునకు సరిగా గురిపెట్టక తొందరచే ఫాలస్థలమునకు సూటిచేయుటచే శల్యుడాక్షేపించెను. మరల గురిపెట్టుమనెను. కర్ణుడొక బాణము రెండుమార్లు గురిపెట్టునా ? యని వాడత్తి వైచెను. అది వచ్చువేళకు కృష్ణుడర్జునుని రథము నాలుగంగుళములు భూమిలోనికి నదిమెను. ఆ యస్త్రము అర్జును కిరీటము నెత్తుకొని పోయి

తల రాలేదని తిరిగి వచ్చుచుండ - అదియేమని అర్జునుడడుగగా-ఇది తక్ష కుని కొడుకగు సర్పరాజము. ఖాండవ దహనమప్పుడు ఇది పారిపోవు చుండ నీవు నడిమికి నరికి అగ్గిలో పడవైచితివి. ఆ తల నాటి నుండి కర్ణునియొద్దనుండి నీమీది పగతో కిరీటమపహరించి అంతతో పోక మరలి వచ్చుచున్నది - అని కృష్ణుడు చెప్పెను. అర్జునుడు దాని నారు బాణము లతో ముక్కలు ముక్కలు చేసెను.

ఇంద్రుడిచ్చిన శక్తి ఘటోత్కచునిపై పోయి సర్పముఖాస్త్ర మిట్లయిన కర్ణు డుస్సురుమనెను. ఇంతలో బ్రాహ్మణ శాపమున కర్ణుని రథచక్రము భూమిలో క్రుంగెను. అది యెత్తుకొనియెదను కొంచెము సేపాగుమని దర్పముగా నడిగెను. దాని కర్జునుడు కొంతసేపు ఆగెను. కృష్ణు డాక్షేపించెను. కర్ణుడు రథమెత్త ఆ రథమును వదలక భూమి యంతయు దానితో లేచివచ్చెను. మరల రథమెక్కిన నింకను క్రుంగెను. మరల నాగుమనిన వాని దుర్మార్గములన్నియు చెప్పి యభిమన్యుని విల్లు చాటుగా నుండి యెట్లు నరికితివని నిరుత్తుజేసి కృష్ణుడు ప్రేరేప అర్జును డొక యస్త్రము మంత్రించివైచి వాని బడవేసెను. కర్ణుడు నేలబడి నంతనే రథము చక్రము పైకివచ్చినది. అట్టి నాయకుడు లేని మోడువడిన రథమును శల్యుడు తోలుకొనిపోయెను. ఇట్లు 17 వ నాటి సాయంకాలము కర్ణరహితులైన దుర్యోధనులు శిబిరముల కేగుట, పాండవులు జూదమున నోడి అడవికి పోవునంతటికన్న దీనముగా నుండెను. కర్ణపర్వము తుది ఫలశ్రుతి వ్రాయబడినది.

చం॥ అనలుడు భాస్కరుండును సుధాంశుడు నధ్వర సంభవ ర్తకుల్
వినుము నరేంద్ర ! యీ క్రతువు విష్ణుమయంబిది నిర్వహించి ర
ర్జునుడును కర్ణుడున్ సమరరూపమునందగ నీ ప్రబంధ ముం
బొనరం బఠించి నన్వినిన నొందు నరుంజిరసౌఖ్యసంపదల్॥

అని తిక్కన వ్రాసెను. ఇక్కడికి వర్ణ్యమయినది. తక్కినది కథావిశే షమునకు ప్రసంగింపబడినది.

18వ దినమున శల్యుని సేనాధిపతిగా చేసికొని కౌరవులు యుద్ధమునకు వచ్చిరి. రెండుజాములలో ధర్మజుడు వాని బడవైచెను. మూడవ జాములో దుర్యోధనుడిక నీవే సేనాపతివి మామా! యని శకునిని మాటతో సేనాపతిని చేసెను వాడు పోరి నకుల సహదేవుల చేతిలో సకుటుంబ సపరివారముగా చచ్చెను. కృపకృతవర్మాశ్వత్థామలు పారి పోయిరి. 1 అక్షౌహిణులు నాయకులు నశించిరి.

క॥ వలవలని మూకలో కా
లిలువక గుఱ్ఱంబు డిగ్గి నీ కొడుకు గదా
కలిత భుజుండై యొక్కడు
తొలగి చనియె నేమి చెప్పుదుం గురునాథా!

అట్లు పోయి దుర్యోధను డొక చెఱువులో జలస్తంభన విద్యతో దాగి యుండెను. అది తెలిసికొని పాండవులు పోయివాని నిష్ఠురములాడి బయటకు రావించి భీమునితో గదా రణము గోరిన వానియిచ్ఛమైనట్లుచేసిరి. ఆ యుద్ధము చూచుటకు బలరాముడును వచ్చెను. బలరాముడు దుర్యోధన పక్షపాతి. కృష్ణుదు పాండవపక్షపాతి యను పేరున్నను స్వపక్ష పరపక్ష నిర్ధూమధాముడు కావుననే దేవుడనవలసి వచ్చినది. భీమ దుర్యోధనుల గదాయుద్ధము సాగినది. కొంతసేపునకు కృష్ణుని యాలోచనమున నర్జునుడు వాని తొడగొట్టుమని భీమునకు సంజ్ఞచేపెను. భీముడు తెలిసికొనియు తొందరపడక తనకు భారమైనను పోరాడుచుండెను. అప్పుడు వట్టికొట్టు దుర్యోధనుని గదాతాకుతో భీముడు మోకాళ్ళనేలమోపి దిమ్మరపోయి కూర్చుండబడెను. ఆసమయమున దుర్యోధనుడు మరల భీముని పైగా వట్టికొట్ట వచ్చుటజూచి ఆ యెగసినప్పుడు కూర్చుండియే వానితొడలకుబట్టించి భీముడు గదవిసరగా నతడు తొడనలిగి క్రిందపడెను. అప్పుడు బలరాముడు గదాయుద్ధమున తొడలు విరుగగొట్టుట భీముడుచేసిన యధర్మమని కృష్ణునితోగూడ నందఱ నిందించెను. దానికి బలరామునితో కృష్ణుడే

మాటలాడెను. దెబ్బతిని మోకరింపబడిన వానిపై పల్లీకొట్టవచ్చునా ? ఆ దిమ్మరపోయినవాని నింకొక్క దెబ్బకొట్టిన చచ్చునుగదా ! ముందు అధర్మము దుర్యోధనుడు చేయుటవలన తన ప్రాణము కాపాడుకొనుటకు ప్రతినతీర్చుకొనుటకు నట్లు కొట్టెను. అదియుగాక మైత్రేయముని శాపమున వాని తొడలు భీముని గదచే విరుగవలసియున్నవి.

ఇవి యన్నియు తెలిసియున్న దుర్యోధనుడు తనతొడల గాపాడుకొనవలదా ? ప్రమాదమన్న ననుభవింప నిమ్ము.

ఉ॥ ధారుణి రాజ్యసంపద మదమ్మున ద్రోపది కృష్ణ నిట్లు రం
ఖోరునిజోరు దేశమున నుండగఁబిల్చిన యిద్దురాత్ముదు
ర్వార మదీయ బాహుపరివర్తిత చండగదాభిఘాత భ
గ్నోరు తరోరు జేయుదు సుయోధను నుగ్రరణాంతరమ్మునన్.

అని భీముడు ప్రతిన చేసెనుగదా ! అది తప్పయిన నుగ్రరణాంతరమ్మున గదతో తొడలెట్లు గొట్టెదవు ? అది యధర్మముగాన ప్రతిన మార్చుకొమ్మని యచ్చటి సభాసారులగు భీష్మాదు లెవరైన ననిరా? భీముడప్పుడే వాని తొడలు విరుగగొట్టవలసినది. ధర్మాత్ముడుగాన నిన్నినాళ్లాగినాడు. ఇది యంతయు నెరిగిన నీవైనను అధర్మమగు ప్రతిన మార్చుకొమ్మని భీమునికి జెప్పియుంటివా? ఇందు భీముని తప్పేమియు లేదనుచుండ బలరాము డౌనౌను, శిఖండి నడ్డము పెట్టి తాతను బడగొట్టిన అర్జును తప్పు లేదు. అసత్యమాడి గురుని జంపించిన ధర్మజుని తప్పులేదు. రధచక్రము క్రుంగినప్పు డర్జునునిచే కర్ణుజంపించిన నీతప్పునులేదు. ఒక తప్పయిన ననవచ్చును. అన్నియు తప్పు లయినప్పుడు దాని విమర్శమిం కేల? అని బలరాముడు తీవ్రముగా మాటలాడెను. దానికి భగవంతుడు అన్నిటికి సమాధానము చెప్పి పాండవుల తప్పు ఇసుమంతయు లేదు కలికాలము రాబోవుచున్నది. ఇట్టి వన్నియు ధర్మములుగానే చెల్లు నని బలరాముని

నవ్వులకు బుచ్చెను. దుర్యోధనుడు "కంసదాసుని పుత్ర! కావుము నీ దురాచారము" అని కృష్ణు నాక్షేపించినవానికి నివి యన్నియు చెప్పి మాటలాడకుండ చేసెను ధర్మరాజు "పాపపుణ్య చింత యింకేమిటికి పద్మనాభా!" అని ధర్మరాజు తమకు నిట్టివియే కొన్ని యప్రతిష్టలు ఎంత ధర్మముగా నడచినను రానేవచ్చినవి–అని విసువుతో ననిన-నిది నాపని. మీకేమియు దోసము లేదు. ఇట్లే ఏకలవ్యుని వ్రేలు కోయించితిని. అట్లే చేయకున్న దుర్యోధనుడు వానిని దెచ్చుకొనిన నాకు సంకటమయ్యేడిది, అని చెప్పెను ద్రోణుకు ఏకలవ్యుని వ్రేలు కోయించుటకూడ తనపనియే యని చెప్పు శ్రీకృష్ణుని ప్రసంగమునుబట్టి తప్పొప్పుల నిర్ణయించు భారమెవ్వరికిని లేదు.

ఇది యిట్లుంగా మహాత్ముల చరితముల తప్పులెన్ను వారికి వారి తప్పులలో భాగము పంచుకొన నేనని పెద్దలు చెప్పుచున్నారు. అర్థగ్రంథములలో నెక్కడ సంధియము కలుగునో అక్కడనే దాని సమాధానము నుండును. సందేహము తీరిన దాకా చదువుచు పెద్దల నడిగి తెలిసికొనుటయే దాని మందని మాతండ్రిగారు చెప్పిరి. ప్రకృత మనుసరింతము.

అంతట పాండవులు కౌరవ శిబిరములకేగి యక్కడి ధనధాన్యాదులు మిగిలిన సైన్యములు లెక్కలు చూచుకొని దాసదాసీజనుల నాదరించి, తమ శిబిరములలో ఒక అక్షౌహిణీ సైన్యము మిగులుగా దాని సేనాధిపతి మొదలగు వారికి జాగ్రత్తగా నుండుమని వారొక్క నది యొడ్డున నారాత్రి గడపిరి. పాండవులైదుగురు కృష్ణసాత్యకులట్లు లేకునికి కృప కృతవర్మాశ్వత్థామలు దుర్యోధను దర్శించి యీ ముగ్గురిమీద నశ్వత్థామను సైన్యాధిపతిగ జేయించుకొని యారాత్రి శిబిరము మీదికిపోయి పాండవుల యక్షౌహిణి సేనను ధృష్టద్యుమ్నుని నిద్రించువారి నెల్ల నటికి కసిదీర్చుకొని పోయి ప్రాణము పోవుచున్న దుర్యోధనునితో చెప్పి పాండవులు లేక

పోవుటచే ఈపరాక్రమము సాగినది. వారున్న శిబిరము మీద పోవుట కుదరినిదే! ఇప్పుడువారు పైనబడకుండ తప్పించుకొనవలెనని పారిపోయిరి కృతవర్మ ద్వారకకేగెను. కృపుడుహస్తినాపురికేగెను.అశ్వత్థామ సన్యసించి గంగయొడ్డునతపముచేసికొనుచుండెను. దానికి దుఃఖించుచుద్రౌపదిప్రేరణతో భీముడు అశ్వత్థామపైబోవుచుండకృష్ణార్జునులును వానికి కాపుగా వెనుకనుండి పోయిరి. భీము డతని నిష్ఠురములాడ అశ్వత్థామ బ్రహ్మశిరోనామాస్త్రము మంత్రించి పాండవేయదార గర్భముల నెల్ల నిదినశింపచేయు ననివేయ అర్జునుడును కృష్ణుని పనుపున బ్రహ్మశిరోస్త్ర మేవేసి దాని నాపెను. ఆ రెండు పోరుచుండ వ్యాసనారదులు వచ్చి యుద్ధమంతయునైన తుదిని నిదియేల ? వీని నుపసంహరింపుడని చెప్పిన విని యర్జునుడు వారి మాటలనాదరించి తన యస్త్రము నుపసంహరించెను. అశ్వత్థామ కది చేతకాలేదు. అట్లు చెప్పిన తనకు నామర్థ్యమని దాని మరింత దీపింప జేసెను. కృష్ణుడు వాని "పాండవేయ దారగర్భములు" అను మాటకు పాండవి అన పాండురాజుభార్య. ఆమె కొడుకులు పాండవేయులు. వారి దారల గర్భములపై నిది ప్రసరించును గదా : అందొక్కటినేను సంరక్షిం చెదను. గర్భములు నిన్నేమిచేసినవి. ఐన నీట్లుజేసిన పాపమనుభవింపుము. మూడువేల సంవత్సరములు దుర్గంధభూషిత శరీరుండవై కుష్ఠరోగము ననుభవింపుమని శపించెను. వ్యాసనారదులు దానిని దృఢ పరిచిరి. ఆ యుద్ధములో పాండవుల దప్పించి నందుకు దుఃఖించి యస్త్రము నుద్దీప్తము చేయ దానిచే నప్పుడు పాండవదార గర్భములన్నియు నశించెను. భగవంతుడు ఉత్తర గర్భమును కాపాడెను, కులము పరిక్షీణ మైనప్పుడు పుట్టెనుగాన పరీక్షిత్తని పేరుపెట్టెను.

తర్వాత ధర్మరాజు చచ్చిన భారత వీరులకెల్ల సంస్కారము లాచరించి, కృష్ణునాజ్ఞచే పట్టాభిషిక్తుడై భీష్ముని వలన ధర్మములు నేర్చుకొనుట వంకపెట్టి శాంత్యానుశాశికపర్వముల ధర్మప్రవచన మిపట్టికి

గల రాజకుమారుల ప్రబోధార్థముగ చెప్పించి తా నశ్వమేధము నొనర్చి గత కల్మషుడై ముప్పదియారేండ్లు రాజ్యము చేసి చివరకు పరీక్షిత్తునకు యౌవరాజ్యమిచ్చి యుయుత్సునకు మహారాజ్యమిచ్చి సుభద్రను పై పెత్తనమున కమర్చి ద్రౌపదితో వారు స్వర్గమున కేగిరి. అందు ధర్మరాజును శరీరముతోనే స్వర్గమునకు తీసికొనిపోయి తమ్ముల చూపు మని యాతడడుగ యమలోకమునకు తీసికొనిపోయి నరకము చూపగా కోపించి యామహాత్ముడు శాపముపెట్టునేమో యను భయముతో నారదు వెంటబంపి, అవసరమైనప్పుదు దేవేంద్రుడు యముడు ప్రత్యక్షమై వాని యడిగిన వానినెల్ల సమర్థించి నా తమ్ముల నేల నరకములో బడవైచితిరి ? వారేమి తప్పు చేసిరి ? అని యడుగ నీ తమ్ములు తప్పు చేయలేదు. నరకమునకు రాలేదు, మహాత్ముడవగు నీవే గురునిమిత్తమున ఆడిన అసత్యలేశమునకు నీకు నరకము చూపవలసి యిట్లు చేసితిమి. నీ తమ్ములు నరకములో నున్నట్లు చూపుట యొక్క నాటకము. మేము కల్పించితిమి, అని ఆయనను స్వర్గమునకు శరీరముతోనే తీసుకొనిపోయి రను గ్రంధమునుబట్టి, పాండవుల తప్పులన్నియు మన మనుకొనుట దక్క నిక్కములు గావని తోచుచున్నది. నిక్కములైన నింద్ర యములు మా నాటకమని యేల చెప్పుదురు ? ఇది యంతయు ప్రసక్తాను ప్రసంగ ముగా వచింపబడినదె కాని – యిచట భారతము నంతయు చెప్పుటకు ప్రారంభింపబడినది కాదు అట్లయిన కొన్ని వత్సరములు పట్టును.

ఈ భారతము సంస్కృతమున హరివంశ, విష్ణు, భవిష్యములతో నూరు పర్వములగును. ఇది త్రిపురాసుర సంహారముతో ముగింపబడినది. అందును శివుడు మూడుసార్లు మూడు పురముల యసురుల నశింపచేసినట్లు న్నది. అందువలననే గచ్ఛద్వ్యాఖ్యాత గ్రంధము నంతను సందేహించి – ఇది చారిత్రాత్మకము గాకున్నను నిందు గ్రహింపదగినది పరమార్థమేయని వచించెను. అది యెట్లన త్రిపురములు స్థూల సూక్ష్మ కారణ శరీరములు.

ఇందు మొదట శివానుగ్రహమున స్థూల శరీరము నందలి రోగాదులుపోగా సాధకుడు ఉపాసనమున కర్హుడగును. శరీరదార్ఢ్యమునుబట్టి సూక్ష్మశరీరమున కామాదులు రేగిన రెండవసారి శివుడు సూక్ష్మమును శుద్ధిచేయుట. శారీరకరుజలు మానసికకామాదులు పోయిన పిమ్మట కారణశరీరమందలి తమముపొంగి జడసమాధి నాపాదించును. మూడవసారి శివానుగ్రహముతో నది పోయిన దేవతలు స్వస్థులైరని దీని భావమనియు తక్కిన భారతము నంతయు నిట్లే సమన్వయించుకొమ్మని యాయన చెప్పెను. ఈ విధముగా విద్యలన్నియు పరంపరగా జ్ఞా చోదనము నకే ఏర్పడెను. వృత్తి హిత స్థితిని కూడ తెలిసికొను సంవిత్తే అనగా చరమవృత్తియే ప్రకృతి. దాని కాశ్రయము బ్రహ్మము. కాన కర్మకాండములో కర్మము లాచరించి యుపాసనవలన ప్రబుద్ధులైయున్నట్టు లుండుటయే ముక్తి కాన వేదాది విద్యలలోనే కథలు చెప్పినను అవి యన్నియు మోక్షసాధకములే. కథలు కూడ బోధము కొఱకే ఏర్పడినవి. దీనికి దత్తాత్రేయమహాత్మ్యమున నొక కథ చూడుడు.

కేవల కర్మప్రధానుడగు నొక సోమయాజి ప్రతిదినము వైశ్వదేవము చేసి బలిదానము చేయుచుండ నా బలిక్రిందపడకుండ మాయమై పోవుచుండెను. అట్లు కొంతకాలము చనిన ఒకనాడు బలి వదలుసరికి ఒక బ్రహ్మరక్షస్సు చేయిపట్టి దానిగొని తినెను. అందులకా దంపతులు భయాశ్చర్యముల నందుచుండ నా రాక్షసు డిట్లనెను. ఈ రావిచెట్టు నందుండి నే నెన్నియో పాపములు చేసితిని. ఎన్ని చేసినను ఆకలిదప్పి తీరుటలేదు. కొంతకాలమునుండి నీ విచ్చు బలి పిడచ తినుట వలన నాకలి దప్పులు తీరి సుఖముగా నుండి ఎవ్వరిజోలికి పోకుండ నుంటిని. కాన మీకేమైనా నుపకారము చేసి కృతార్థుడ గావలెనని కనబడితిని. వర మర్థింపుడనెను. సోమయాజి కేమి కోరవలెనో తెలియలేదు. సోమిదమ్మ వాని కన్న పటుత్వము కలది, దంపతు లిద్దఱు నాలోచించి శ్రీ దత్తాత్రేయ

స్వామి నొకసారి చూపుమని యర్థించిరి ఆ బ్రహ్మరాక్షసుడు మీ రడుగ రాదని యడిగితిరి. ఆ స్వామి యీ యూర నప్పుడప్పుడు తిరుగుచుండును. కాని నా యట్టి వానికి వారికి నెంత దవ్వు ! అయినను మీ యుపకారము నెంచి చూపెదను కాని ఆయన మీకు స్వాధీనుడగుట దుర్లభము కాన మూడుసార్లు చూపెదను. మీ యదృష్టమెట్లున్నదో ? సిద్ధముగ నుండుడు అని చెప్పి యంతర్ధానము నొందెను.

ఒకప్పుడు పచ్చి సోమయాజిని గొనిపోయి మాంసపు దుకాణము వద్ద బేరము చేయుచున్న వానిని దూరముగా నుండి అడుగో దత్తదేవుడు అని చెప్పి రాక్షసుడు చూపుచుండెను. సోమయాజి మాంసపుదుకాణము వద్ద కెట్లు పోవును ఆ మాంసముగొను వాని నెట్లాశ్రయించును? అట్లే చూచుచుండ నల్లదేవు డంతర్ధానము నొందెను. రెండవమారు చండాల వాటిక వద్దనున్న వాని జూపెను. సోమయాజి బాహ్యబోధమున, రాక్షసుని బోధమున వాని యొద్దకు పోయెను. ఆ దేవుడొక పశుశవమును కత్తితో కోసి యా ముక్కలు కాకులు మొదలగు పక్షులకు, కుక్కలకు బెట్టుచుండెను. స్వామి వానిని బెదిరించి కొట్టితిట్టి పంపెను. రాక్షసుడిక నీయన దేవుని కొలువలేదని నిరాశుడై విసువుకొనెను. పతివ్రతయగు సోమిదమ్మయు పతినిక మీరు పోవలదు. దేవునకు మనమీద దయలేదేమో ? మీరు బాధలు పడలేరు - అని యుపచారములు చేసి వాని గాయములు మాన్పెను. సోమయాజి యా యిద్దఱ మాటలను బట్టి స్వామి సమాశ్రయమున పరమార్థము గమనించి ఈతూరి చూడుడు ! నేనును పట్టుపట్టెదను. అని యొక నిశ్చయమున నుండెను. బజారున వారి యింటి ముందుగా పిచ్చివాని వలె పోవుచున్న స్వామిని మూడవసారి రాక్షసుడు చూపెను. ఆయన వెంటబడి సోమయాజి పోవసరికి స్వామి స్మశానసమీపమున కేగెను. వెంటనే పోయి సోమయాజి హఠాత్తుగా సాష్టాంగ ప్రణామము చేయుచు రెండుపాదములు గట్టిగా పట్టెను. స్వామి కొట్టినను తిట్టినను

బెదరించుననను విడువలేదు. ఇక వాని విడిపించుకొన స్వామి చేతకాలేదు. అప్పుడు ప్రసన్నుడై ఏమికావలయునో కోరుకొమ్మనెను. సోమయాజి కేమియు తోచలేదు. రాక్షసుడు కాని, భార్యగాని చెప్పలేదు. అప్పుడేమియు తోచక తాత్కాలిక బుద్ధితో ఈ దినమున మాయింట శ్రాద్ధము, అందు భోక్తగా మిమ్ము నిమంత్రించుచుంటి ననెను. స్వామి చిత్తితుడై యట్లే స్నానము చేసి వచ్చెదను. నీవుపోయి యా ప్రయత్నమున నుండు మనెను.

సోమయాజి యింటికి వచ్చి జరిగిన సంగతి భార్యకు చెప్పి ఏమి కోరవలెనో ? నీవు చెప్పకపోతివి నాకేమియు తోచలేదు. శ్రాద్ధభోక్తగా నిమంత్రించితిని. ఆయనయు వచ్చెదనని యొప్పుకొనెను. పాకము చేయు మనెను. సోమిదమ్మ తమ భాగ్యమునకు పొంగుకొనుచు పాకము సిద్ధము చేసెను. దర్భలు నర్ఘ్యపాత్రలు వగైరా సోమయాజి సిద్ధము చేసెను స్వామి శుద్ధసమాచారుడై వచ్చెను సోమయాజి స్వామికి నర్ఘ్యము, నాస నము నిచ్చెను. స్వామి రెండవ బ్రాహ్మణు డేడి యని యడిగెను. ఈ యానందములో వారు రెండవ బ్రాహ్మణుని పిలువలేదు మఱచి పోయిరి. సోమయాజి చేతులు పిసికికొనుచు భార్యదగ్గఱకు పోయి యా ప్రమాదమును చెప్పెను. ఆమె స్వామి వద్దకు వచ్చి దేవా ! మీ యాజ్ఞ యయిన పిలిచెదననెను. స్వామి పిలువమనెను సోమిదమ్మ వాకిలిలోని కరిగి సూర్యుని జూచి లోకబాంధవా ! కర్మసాక్షి ! శ్రాద్ధమున పితృస్థాన మున భోక్తగా దత్తాత్రేయస్వామి వారు దయచేసినారు విశ్వేదేవస్థాన మున అంతవాడవు నీవుగాక వేరెవరు గలరు. స్వామి సెలవీగా నే ప్రార్థించుచుంటిని అని పిలువ సూర్యుడు నొక బ్రాహ్మణుడుగా మండ లము నుండి దిగి వచ్చెను. సోమయాజి వానికి విశ్వేదేవస్థానమున నాసన మిచ్చి పూజించెను దానికి నచ్చెరువువడుచు దత్తదేవుడు మూడవ బ్రాహ్మ ణుడేడీ విష్ణుస్థానము లేని శ్రాద్ధము వ్యర్థముగదా ! అనెను మరల సోమ

యాజి బిత్తరపోయి దిక్కులు చూచుచుండెను. సోమిదమ్మ గార్హపత్యాగ్ని వద్దకు పోయి ఈ సంగతి యంతయు చెప్పి విష్ణుస్థానమున కాహ్వానించిన నగ్నిదేవుడా కుండము నుండి వెలువడి వచ్చి బ్రాహ్మణరూపమున నర్చితుడై విష్ణుస్థానమున గూర్చుండెను. ఇక సోమయాజి యథావిధిగ శ్రాద్ధము నెరవేర్చెను. శ్రాద్ధానంతరము భోక్తల భోజనపాత్రములాబమ్మ రక్కసి కొసంగుడని దత్తదేవుడు చెప్పెను. అట్లు చేయ తదుచ్ఛిష్టాను భవమున రాక్షసత్వము పోయి దివ్యశరీరముతో వారి కెల్లనమ్రుడై సెలవు దీసికొని విమానారూఢుడై దివ్యలోకముల కేగెను. సూర్యాగ్నులు మెచ్చుకొని కర్తల నాశీర్వదించి పోయిరి. దత్తస్వామి సర్వవిద్యలు సర్వమహిమలు నీ యందు భాసించును. నీవు లోకోద్ధారము చేయుచు నిష్ఠమైనంత కాలము ఇందుండి తర్వాత నీ పత్నితో గూడ బ్రహ్మలోకమున కేగుము. అని యాదేశించి యంతర్ధానము చేసెను. ఇట్లు కర్మకాండము మోక్షోపాయమైనది కదా !

ఇంకను భారతమున సుదర్శనోపాఖ్యానము గృహస్థాశ్రమముననే ముక్తి నొందవచ్చునని చెప్పుచున్నది. దానికి అతిథిపూజ ముఖ్యము, అందు తన దేహము ప్రాణము పత్నిపుత్రాదులు పశుభవనాదులు సర్వము నతిథికొఱకే యను భావముతో పత్ని నతిథి సత్కరించిన సుదర్శను నతిథి యగు ధర్మదేవత మెచ్చి వరములిచ్చి మృత్యువును జయించితివని చెప్పిపోయెను. ఇట్టి ప్రసంగములనేకములు గలవు. కాన కర్మోపాసనాదిక్రములు ముక్తికి పరంపరాకారణములు. స్వరూపజ్ఞానము సాక్షాత్కారణము. కావుననే శ్రీశంకర భగవత్పాదుల వారు వేదములు, స్మృతులు, పురాణములు, నితిహాసములు - ఇవి యన్నియు వాక్యావాంతర వాక్యకలనచే నేకవాక్యతని యనుగ్రహించిరి. స్వరూపజ్ఞానము భాసింపగనే పుణ్యపాపములు లేకుండును. అవి లేకున్న జన్మజరాదులు నడంగును. అదియే బ్రాహ్మియవస్థితి. దాని కనేకమార్గము లున్నను, శ్రోతలు యను గతి శ్రీమద్భగవత్పాదుల వారి దక్షిణామూర్తి స్తవమండలి నాకు తోచిన భావము ననువదిం మ గించెద.

25

శ్లో॥ విశ్వం దర్పణదృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం
పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథానిద్రయా
యస్సాక్షాత్కురుతే ప్రబోధసమయే స్వాత్మానమేవాద్వయం
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణామూర్తయే॥

అద్దమునందు నగపడుచున్న నగరమువలె తనలోనున్న విశ్వమును నిద్రవంటి తన యందలి మాయచేత వెలుపల నునట్లు చూచుచు ప్రబోధ సమయమున సజాతీయ విజాతీయ స్వగతభేదము లేని స్వస్వరూపమును మాత్రమే యనుభవించినట్టి శ్రీమంతుడగు గురురూపమున సాధకుల కుపాసనీయుడగు దక్షిణామూర్తి స్వామికిదె నా నమస్కృతి.

అద్దమునందు ఇంకొక వస్తువు వాస్తవముగ నుండు నవకాశము లేదు. అయినను కనబడుచున్నది కదా ? అదియెట్లు ? అదియే మాయ. మాయయన అసత్యవస్తువు సత్యముగా భాసించుట. లేనివస్తువు భాసించుట ఎట్లు ? నిద్రలో లేని వస్తువులు భాసించుట లేదా ? అవి మెలకువలో లేని వని నిశ్చయింపబడుట లేదా ? అట్లే అజ్ఞాన దశలో అగపడు ఈ ప్రపంచము స్వరూపజ్ఞాన దశయందు భిన్నముగ గన్పట్టుట లేదు. ఇచ్చట మనో జన్యజ్ఞానమును గొని అందఱు జ్ఞానులమనుచున్నారు. ఈ జన్యజ్ఞానము అజ్ఞానమే. దీనికి కారణమగు అఖండ జ్ఞాన స్వరూపమగు వారు జ్ఞానులు. ఆ దశలో "బ్రహ్మసత్యం - జగన్మిథ్యా" అని అనుభవించుచు సాధకులకు అట్టి యజ్ఞానమును దొలగించువాడు గురుమూర్తి. గు-అన అంధకారమని, రు-అన దాని తొలగించు వాడని పెద్దలు అందురు. కాన అజ్ఞానాంధకారము

పోగొట్టి తన స్వానుభవమును శిష్యునందు ప్రకాశింపజేయుశక్తి గలవాడు గురుమూర్తి సగుణబ్రహ్మము, దక్షిణముఖమగు పరమేశ్వర స్వరూపము దానికి నమస్సు. అన ప్రహ్వీభావము. ప్రపంచోన్ముఖమగు ననుభవము బ్రహ్మాభిముఖ మగుటయే ప్రహ్వీభావమున కర్థము.

శ్లో॥ బీజస్యాంతరివాంకురో జగదిదం ప్రాఙ్నిర్వికల్పం పున
ర్మాయా కల్పిత దేశకాలకలనా వైచిత్ర్య చిత్రీకృతం
మాయావీవ విజృంభయత్యపి మహాయోగీవయ స్స్వేచ్ఛయా
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణా మూర్తయే ।

విత్తనము నందలి యంకురమువలె సృష్టికి పూర్వకాలమందు వికల్ప రహితమైనది, యయ్యుతరువాత మాయచేకల్పింపబడిన దేశముయొక్కయు కాలముయొక్కయు భేదవిధములచేతనైన విచిత్రత్వములచేత చిత్రింప బడిన ఈ జగమును గారడివానివలె నే దేవుడు విస్తార జేయుచున్నాడో ? మహాయోగివలె నొక్కడే నానారూపములతో నగపడుచున్నాడో అట్టి శ్రీదక్షిణామూర్తి యని యుపాసింపబడు శ్రీ మన్మహా గురుమూర్తి కొఱ కైన నా నమన మిదె తన్మయత కగునుగాక ?

శ్లో॥ యస్యైవ స్ఫురణం సదాత్మక మసత్కల్పార్థకం భాసతే
సాక్షాత్తత్త్వమసీతి వేదవచసా యోబోధ యత్యాశ్రితాన్
యత్సాక్షాత్కరణాద్భవేన్నపునరావృత్తిర్భవాంభోనిధౌ ।
తస్మై శ్రీగురుమూర్తయే నమ ఇదం శ్రీదక్షిణా మూర్తయే ॥

ఏ గురుమూర్తి యొక్క సద్రూపమగు ప్రకాశము అసత్తైయ వస్తు రూపము గలదిగా భాసించుచున్నదో ఏ దేవుడు తన్నాశ్రయించినవారికి తత్త్వమసి యను వేదవాక్యముచే ప్రత్యక్షముగ స్వరూపమును బోధించు

చున్నాడో ఏ భగవంతుని బోధానుభవము వలన మరల ఈ సంసార సాగరమందు రావలసినపని లేకుండబోవునో అట్టి శ్రీ గురుమూర్తికి శ్రీ దక్షిణామూర్తికి నిదె నమస్సు. ప్రహ్వీభావము.

శ్లో॥ నానాచ్ఛిద్ర ఘటోదరస్థిత మహాదీప ప్రభాభాస్వరం
జ్ఞానం యస్యతు చక్షురాదికరణద్వారా బహిస్స్పందతే
జానామీతి తమేవ భాంతమను భాత్యేతత్స మస్తంజగ
త్తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

చాల చిల్లులుగల కుండలో నున్న పెద్ద దీపపు వెలుతురువలె నెవని స్వరూప జ్ఞానము చక్షురాదింద్రియముల వెంట బయటికి స్రవించుచున్నదో తెలిసికొనుచున్నానను నొకడే విభుడు స్వయముగా భాసించుచుండగా వాని స్ఫురణము ననుసరించి ఈ జగమంతయు భాసించుచున్నదో అట్టి శ్రీకరుడగు గురుమూర్తికి ఆ బీజమును భాసింపజేయువాడగు శ్రీ దక్షిణామూర్తికి, స్వామికి మా మనోవాక్కాయ కర్మముల ప్రహ్వీభావమిది. అనగా నివియన్నియు తత్ప్రవణములగుట. సగుణవిషయమున నమస్కృతి. గుణాతీత భావమున తాద్రూప్యస్థితి.

శ్లో॥ దేహం ప్రాణ మపీంద్రియాణ్యపి మనోబుద్ధించ శూన్యం విదుః
స్త్రీబాలాంధ జడోపమా స్త్వహమితి భ్రాంతా భృశం వాదినః
మాయాశక్తి విలాసకల్పిత మహావ్యామోహ సంహారిణే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణా మూర్తయే ॥

ఆడువారు, బాలురు, గ్రుడ్డివారు, జడులు పోలికగాగల మిక్కిలి భ్రాంతులగు మతవాదులు అహం-నేను అనుచోట తమ్ము తామెరుగక దేహమును గాను ప్రాణమును గాను ఇంద్రియములను గాను మనస్సును గాను బుద్ధిని గాను శూన్యమును గాను చెప్పుచున్నారు. తదర్థమగు సర్వసాక్షి

స్వరూపమును స్ఫురింపచేయుచు మాయాశక్తియొక్క విలాసముల వలన నేర్పడిన వారి వారి వ్యామోహము మొదలంట నశింపజేయనట్టి శ్రీ సద్గురుమూర్తికి దక్షిణామూర్తికి నిదె నమస్సు.

శ్లో॥ రాహుగ్రస్త దివాకరేందు సదృశో మాయా సమాచ్ఛాదనా
త్సన్మాత్రః కరణోప సంహరణతో యోఽ భూత్సుషుప్తః పుమాన్
ప్రాగస్వాప్సమితి ప్రబోధసమయే యః ప్రత్యభిజ్ఞాయతే
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణా మూర్తయే ।

మాయ చక్కగా వ్యాపించుటవలన రాహుచే గ్రహింపబడిన సూర్య చంద్రుల యట్టివాడై సత్తామాత్రుడైన పురుషుడు సుషుప్తినొందినవా డగును. మెలకువ వచ్చినప్పుడు నేనింతదనుక నిద్రించితినని యేసాక్షి తత్కాలమందునుగల తన్ను గుర్తించుచున్నాడో యట్టి శ్రీ గురుమూర్తికి దక్షిణామూర్తికి నిదె నమస్కృతి. గాఢనిద్రలో నింద్రియాదులు పరమించినను తన్ను దనసనుభవింపకున్న మెలకువ వచ్చిన తరువాత గుర్తింపలేడు. అనుభూత విషయమే స్మృతిగోచరమని సిద్ధాంతము. సుషుప్తానుభవమున లేని కరణాదులు అహం శబ్దార్థములు కానేరవు.

శ్లో॥ బాల్యాదిష్వపి జాగ్రదాదిషు తథా సర్వాస్వ వస్థాస్వపి
వ్యావృత్తా స్వనువర్తమాన మహమిత్యంత స్ఫురంతం సదా
స్వాత్మానం ప్రకటీ కరోతి భజతాం యోభద్రయా ముద్రయా
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణా మూర్తయే ।

నేను బాలుడను అనువానికి కొన్నినాళ్ళకు వయస్సు రాగా నేను వయసులో నున్నవాడ ననుకొనునపుడు బాల్యము పోయినను "నేను" పోలేదు. తరువాత నేను వృద్ధుడ నన్నప్పుడు యౌవనము పోయినను "నేను" పోలేదు, అట్లే నేను మేల్కాంటిని. నేను కలగంటిని. నేను గాఢనిద్ర నొందితిని. అనునప్పుడు జాగ్రత్స్వప్న సుషుప్తులు మారుచున్నను నేను మారుట

లేదు. ఇట్లు సర్వావస్థలయందు నహమని లోపల నెల్లపుడు స్ఫురించు చున్న స్వస్వరూపమునే దేవుడు అజ్ఞానమును తొలగించుటచేత భద్రమగు జ్ఞానముద్రచేత భక్తులకు ప్రకటించుచున్నాడో అట్టి శ్రీ గురుమూర్తికి శ్రీ దక్షిణామూర్తికి ఈ ప్రణామము.

శ్లో॥ విశ్వం పశ్యతి కార్యకారణతయా స్వస్వామి సంబంధత

శ్శిష్యా చార్యతయా తథైవ పితృపుత్రాద్యాత్మనా భేదతః

స్వప్నే జాగ్రతివా యఏష పురుషోమాయా పరిభ్రామిత

స్తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ।

ఈ పురుషుడు మాయచే మిక్కిలి విభ్రాంతి నొందింపబడినవాడై మెల కువ యందుగాని కలయందుగాని కార్యకారణ ధర్మముతోను ప్రభు భృత్యసంబంధముతోను గురుశిష్య రూపముతోను అట్లే తండ్రులు బిడ్డలు నను విధముతోను నిట్లే భార్యాభర్తృత్వాది న్యాయముతోను విశ్వమును గనుగొనుచుండెనను మాట యేది కలదో ? అట్టి భ్రాంతిని తొలగించి ఈ విశ్వమును సచ్చిదానంద స్వరూపమగు తన్నుగానే నిద్రా దృష్టాంతమున ననుభవింపజేయు శ్రీ గురుదేవునకు దక్షిణామూర్తిస్వామికి నిదే ప్రణతి.

శ్లో॥ భూరంభాంస్యనలోఽనిలోంబర మహర్నాథో హిమాంశుఃపుమా

నిత్యాభాతి చరాచరాత్మక మిదం యస్యైవమూర్త్యష్టకం

నాన్యత్కించ నవిద్యతే విమృశతో యస్మా త్పరస్మా ద్విభో

స్తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణా మూర్తయే ।

భూమి, జలము, అగ్ని, గాలి, ఆకాశము, సూర్యుడు, చంద్రుడు, చిదా భాసుడు-ప్రతి శరీరములయందు తోచు జీవుడు నను నెవని యెనిమిది రూప ములే ఈ జంగమ స్థావరాత్మకమవు విశ్వముగా దోచుచున్నదో, గురు బోధతో విమర్శించి చూచువానికి ఏ పరాత్పరుడవు విభునికన్న నన్యమగు నది యానంతయు నుండదో, అట్టి దక్షిణామూర్తి రూపుడవు గురు

స్వరూపమున నిదె చేరి యుంటివి అని తొమ్మిది శ్లోకములతో శ్రీ మచ్ఛంకర భగవత్పాదాచార్యులవారు ఒక ప్రకరణమును జూపియున్నారు. ఇదియే మనము ప్రారంభములో చెప్పుకొన్న బ్రహ్మము. భూమము నను తత్త్వమునుండి యవ్యక్తము దానినుండి మహత్తు అద్దానివలన అహంకారము తర్వాత సూక్ష్మభూతములు, పంచీకృత భూతములు నిట్లు క్రమ సృష్టమగు నీ వ్యావహారిక ప్రపంచమున విజ్ఞానమును వదలి జ్ఞానియగు వానికి వ్యవహారము విరామము నొంద నేది మిగులునో యదియే సత్య స్వరూపము, సంవిత్తు, ఆనందము—నని గురుశిష్య దృష్టితో శబ్దింపబడు నపరూపమగు రూపము.

శ్లో॥ అశబ్ద మస్పర్శ మరూప మవ్యయం
తథారసం నిత్య మగంధ వచ్చయత్
అనాద్యనంతం మహతః పరంధ్రువం
నిచాయ్యతం మృత్యుముఖాత్ప్రముచ్యతే ॥

అనియు

శ్లో॥ తదాస్తిమిత గంభీరం
నతేజో నతమస్తతం
అనాఖ్య మనభిప్రఖ్యం
సత్కించిదవ శిష్యతే ॥

అనియు శ్రుతిస్మృతుల ననేకముల జూపి వ్యవహారములో జేయు గురుల బోధమువలన దోచు ప్రకాశము. ఇది యనుభవమునకు వచ్చిన కర్తవ్యము లేదు. మిగిలినది భూమ మొక్కటియే.

ఓమ్

శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ

శ్రీ రామ కథాఽమృత గ్రంథమాల చందోలు వారి ప్రచురణలు

శ్రీ రామకథాఽమృతము గ్రంథకర్త కీర్తిశేషులు

శ్రీ తాడేపల్లి వెంకటప్పయ్య శాస్త్రుల వారు

చందోలు (గుంటూరుజిల్లా)

ద్వితీయ ముద్రణము

ఇయ్యది వాల్మీకి రామాయణమును విడవకుండా అధ్యాత్మరామాయణాను సారముగా గాయత్రీ బీజసంపుటితో 24 వేలు పద్యగద్యరచనా గావింపబడి ఉత్తరకాండతోసహా (7 కాండలు) చక్కాటి కాగితముపై ముద్రించబడి 5 వాల్యూములుగా చక్కని క్యాలికో బైండు చేయబడిన 5 వాల్యూములు లైబ్రరియెడిషన్ ధర రు 150/. ప్రతివారు చదువుకోదగిన గ్రంథరాజము.

మధురావిజయము	రు. 5/-
శంకరవిజయ సారసంగ్రహము	రు. 5/-
కలిగుణ ప్రకాశిక	రు. 2/-
భద్రాయురో పాఖ్యానము అను నాటకము (శివ మహాత్మ్యము)	రు. 6/-
శ్రీ సత్యనారాయణవ్రత మహాత్మ్యము	రు. 5/-
నాకు తోచినమాట వచనకావ్యము	రు. 10/-

ప్రతులకు

కంభంపాటి పురుషోత్తమ శర్మ

పినపాడు, తెనాలి - 522202

లేక

సాధనగ్రంథమండలి, తెనాలి - 522201

నా క [illegible]

ఉపన్యాసకులు:

బ్రహ్మశ్రీ వే॥ తాడేపల్లి రాఘవనారాయణశాస్త్రిగారు

సంకలనం:

శ్రీ నెమ్మాని సీతారామయ్య, ఎం. ఏ.,

...శకులు

 [వెల : రు 10-00